

ఆణిముత్యాలు
2004
కస్తూరి బెహెన్


ఆణిముత్యాలు
2004
కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు
# 2004

కస్తూరీ బెహెన్

సహజమార్గ విధానాన్ని ఆచరణ రీత్యా అవలంబిస్తూ
బాబూజీ ముద్దుబిడ్డగా ఎదిగి పరిపూర్ణత చెంది
సెయింట్ కస్తూరీగా పిలువబడుతూ సహజమార్గ
సాధకులకు ఆధ్యాత్మిక జ్ఞాన భాండాగారమై
ఆ అనంత లక్ష్యానికి చేయూతనందిస్తున్న మన
కస్తూరీ బెహెన్.

ఆణిముత్యాలసరం ఇది

# తపన

ఒక అద్భుతమైన విషయం వెలుగులోకి తీసుకొని వస్తున్నాను. ఒక పిచ్చుక పడిపోతే మనం అది దైవ నిర్ణయం అంటాం. ఒక ఆకు కదలడం కూడా దైవేచ్ఛలేనిదే జరగదని అంటాం. అది యదార్థం కూడా. అయితే భక్తుని "తపన" లేనిదే దైవం కూడా కదలడని నేను చెప్పితే పెద్దలు నా గురించి ఏమనుకుంటారో మరి!

– బాబూజీ

నిజానికి మన కష్టాలు మరింత కష్టంగా మారడానికి కారణం మన ఆలోచనలూ, మన సంకల్పమే. నా దృష్టిలో దీనికి ఒక్కటే పరిష్కారం. మన దృష్టిని కష్టాల మీద నుండి మళ్ళించి, మన ఆలోచనల ద్వారా, సంకల్పం ద్వారా వాటికి శక్తి నివ్వడం మానివేయాలి. అంతే అవి, నీళ్ళులేని మొక్కల్లాగా వాడిపోతాయి. మనల్ని కనుక మాస్టర్‌కు సమర్పించుకుని 'వారి' సంకల్పానికి అన్నీ విడిచిపెట్టినట్లయితే ఇది చాలా సులభమవుతుంది.

– కస్తూరీ చతుర్వేదీ

# ప్రార్థన

మన అంతర్గత అవసరాన్ని నెరవేర్చమని ఎవరిని సంబోధిస్తున్నామో కూడా తెలియకుండా చేసే ఆర్తనాదమే ప్రార్థన.

ఒక పసిపాప ఆకలి వేసినప్పుడు ఏడుస్తుంది. అప్పుడు పాలు ఇవ్వడానికి పాప తల్లి పరుగున వస్తుంది. కాని, తనకు ఆకలి వేస్తోందన్న సంగతి ఆ పసిపాపకు తెలుసా? ఎంత మాత్రమూ తెలియదు.

తనకు తెలియని అవసరం నెరవేరడం కోసం ఆ పసిపాప అంతరంగం నుండి ప్రకృతి చేసే ఆర్తనాదం అది.

ఆ విధంగా, ఆ పసిపాప అస్పష్టంగా వెల్లడించిన అవసరాన్ని తీర్చేందుకు ప్రకృతి, తల్లి రూపంలో వెలుపలి నుండి ప్రతిస్పందిస్తుంది.

కనుక ఆత్మకు కూడా ఎరుకలేని అవసరాన్ని నెరవేర్చడానికి అంతరంగం లోపలి ప్రకృతి, బాహ్యంగా ఉన్న ప్రకృతికి ఇచ్చే పిలుపే ప్రార్థన.

మనకు సంబంధించిన విషయాలతో తగని అనుబంధాన్ని ఏర్పరచుకోవడమే మనకు అసలైన అనర్థం. ఇదే మన బాధలకు ముఖ్యకారణం. వైరాగ్యం అంటే యదార్థానికి భౌతిక విషయాలతో పెనవేసుకోకుండా ఉండడమే కాని విషయజ్ఞానం కలిగి ఉండడం కాదు. వాస్తవానికి వైరాగ్యం అనేది ఒక "స్థితి" లేదా అంతర్ మనస్సు యొక్క పరిస్థితి. ఇది విషయాల యొక్క గుణాల మార్పుదలను పరిశీలింపజేసి – అవగాహన కలిగించి, అట్టి మార్పుగల వాటిపట్ల విరక్తిభావాన్ని కలగజేస్తుంది. అతడి దృష్టి అనుక్షణమూ ఎటువంటి మార్పులేని, శాశ్వతమైన సత్యం మీదనే కేంద్రీకృతమై ఉండగా, ఆకర్షణ వికర్షణ భావాలకు అతీతంగా ఉంటాడు అతడు. ఇదే "వైరాగ్యం" అనే దానికి సరైన అర్థం.

– బాబూజీ

# ఆణిముత్యాలు - 2004

**ప్రశ్న: మన సంస్థ గ్రంథాలు చదివినప్పుడు, విన్నప్పుడు అంతా అర్థమైనట్లుగానే ఉంటుంది. కాని వాటిని వ్యక్తీకరించలేకపోతున్నాము. దాని అర్థం, డివైన్ కనెక్షన్ పోయినట్లు అనుకోవాలా? బాధ కలుగుతుంది. దానికి ఏం చేయాలి?**

**జవాబు:** ఆ విధంగా అనుకోనవసరం లేదు. అది భౌతికమైన జ్ఞాపకశక్తికి చెందినది. దైవాన్ని గురించిన జ్ఞాపకం ఉంటే చాలు. చెప్పలేనంత మాత్రాన అనుభూతి చెందనట్లుగాదు. హృదయపూర్వకంగా, ప్రేమపూర్వకంగా ఒకసారి బాబూజీకి అర్పించుకున్నాక వారే శ్రద్ధ వహిస్తారు. నీవు ఒక రచయితవు అనుకో. నీవు వ్రాసేది మైండ్ నుంచి వచ్చే వాక్ప్రవాహమే అనగా భావోద్వేగమే కాని అనుభూతి కాదు. కాని నీవు ధ్యానంలో అనుభవించిన దానిని గురించి వ్రాస్తున్నావు అంటే ఆ అనుభూతి నీ కళ్ళెదుట ప్రత్యక్షమౌతుంది. అది నీకు ఆనందాన్ని కలిగిస్తుంది. నేను కూడా నా కండిషన్ గురించియే వ్రాశాను. హృదయంలో తపన ఉంటుంది. లక్నో రావాలని మీకు కోరిక ఉంటుంది. కాని ప్రయాణించటానికి ఆరోగ్యం సహకరించని వారి బాధ ఎలా ఉంటుందంటే – శరీరం శక్తి లేదంటుంది. మనస్సు ఆనందం కావాలంటుంది. దానికి వారిలోని తపనయే మూలం, అనుబంధమే అందుకు కారణం. నేను కూడా బాబూజీతో అలాంటి అనుబంధం కలిగి ఉన్నాను. అటువంటి వారిని వారించి నిరాశపరచటం కూడా ఇబ్బందికరమే!

**ప్రశ్న: ఆత్మ ఒకసారి స్త్రీ రూపంలోగాని, పురుష రూపంలోగాని జన్మ తీసుకుంటే మళ్ళీ పరమాత్మలో విలీనమైపోయేంతవరకు అదే రూపంలో కొనసాగుతుందా లేక తారుమారు కావచ్చా?**

**జవాబు:** ఆత్మ జన్మ తీసుకోవటం కాదు, శరీర ధారణ చేస్తుంది. ఒక శరీరం విడిచి మళ్ళీ శరీరం ధరిస్తుంది. మొదట స్త్రీ రూపంగాని పురుష రూపంగాని ధరించటం జరిగితే ముక్తి పొందే పర్యంతం అదే రూపం తీసుకుంటుంది. ప్రకృతి స్వభావ రీత్యా స్త్రీ అధిక శ్రమను ఓర్వలేదు. స్త్రీ పురుషుల అలవాట్లు కూడా వారి వారి జన్మల ప్రకృతి రీత్యానే ఉంటాయి.

డాక్టర్ పార్థసారథిగారిని, అనసూయగారిని ఒకసారి షాజహాన్‌పూర్‌లో బసంత పంచమి సందర్భంగా కలిశాను. బాబూజీ విజయవాడలో డాక్టర్‌గారి ఇంటికి వెళ్ళినప్పుడు ఒక రోగి తీవ్రంగా బాధపడటం చూశారు. అపుడు వారి సేవ యొక్క అవసరాన్ని గుర్తించి, అప్పట్నుంచీ డాక్టర్‌గారిని బసంత పంచమికి రానవసరం లేదని చెప్పారు. వారిని 1964లో బాబూజీ ప్రిసెప్టర్‌గా చేశారు. చారీజీ 1964లో మిషన్‌లో చేరారు. సందర్భవశాత్తు చారీజీకి నేను ఆ విషయం గుర్తు చేశాను. బాబూజీ తయారుచేసిన ప్రిసెప్టర్ దివ్య ప్రాణాహుతితో బాగా కనెక్ట్ అయి ఉంటాడు. అటువంటి వారి ద్వారా ఎక్కువ మందికి ఎక్కువగా ట్రాన్స్‌మిషన్ లభిస్తుంది. బాబూజీ మీద విశ్వాసం, అంకితభావం ఉన్నవారికి ఆ శక్తి గణనీయంగా ఉంటుంది. బాబూజీని విస్మరించి పెడదారిపట్టిన వారెవరైనా ప్రిసెప్టర్లను తయారుచేసినప్పటికీ వారికి అంతగా పవర్ (శక్తి) సమకూరదు. వారు ఇచ్చిన శక్తిలో పటిష్టత లేని కారణంగా దానిని తొలగించవచ్చు. బాబూజీ ఇచ్చిన శక్తిని తొలగించటం అసాధ్యం. అందుచేత ప్రిసెప్టర్ నేరుగా దివ్యపురుషునితోను, దివ్య శక్తితోను అనుసంధానమైన

వారుగా ఉండాలి. బాబూజీని మాస్టర్ అని విశ్వసించిన వారికి డివైన్ కనెక్షన్ ఉంటుంది. తానే మాస్టర్ అనుకునే వారికి ఆ సంబంధం తెగిపోతుంది. వారి శక్తిలో పటుత్వం ఉండదు. నేను బ్రహ్మాండ మండలం, పరబ్రహ్మాండ మండలాల మీద ఆధిపత్యం పొందిన సందర్భంలో బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా చేసే అర్హత పొందినట్లుగా చెప్పారు.

బాబూజీ పుట్టిన రోజు పండుగలు జరపవద్దని ఆదేశించారు. అలా జరిపినట్లయితే ఆశ్రమాల్లో ఆధ్యాత్మిక దృష్టికి ప్రాధాన్యత తగ్గుతుందని, ఆర్థిక భారం పెరుగుతుందని వారి ఉద్దేశ్యం. కాని మా తల్లిగారికి మాత్రం కుటుంబ సభ్యులతో మాత్రమే కలిసి జరుపుకోవటానికి అంగీకరించారు. అది కూడా ఐదు రూపాయల ఖర్చుతోనే. ఒక రోజన 'వారి' జన్మదినం రోజునే బాబూజీ మా ఇంటికి రావటం జరిగింది. అపుడు – మీరు నా జన్మదినం జరుపుతున్నారే కాని నా కుమార్తె జన్మదినం ఎందుకు జరపటంలేదు అని ప్రశ్నించారు. అప్పట్నుంచీ మా కుటుంబం వరకే పరిమితం చేసి జరుపుకుంటున్నాం.

బాబూజీపట్ల ప్రేమ కలిగి, 'వారి' స్మరణ స్థిరంగా నిలుపుకుంటే ప్రిసెప్టర్‌వద్దకు తరచుగా సిట్టింగ్స్‌కు వెళ్ళకపోయినా సరే ఏమీ బాధపడనవసరం లేదు. వారిపై ప్రేమ, వారి స్మరణ ముఖ్యం. వారికి అర్పితమైపోతే వారే బాధ్యత తీసుకుంటారు.

బిడ్డల క్షేమం కోసం, మేలు కోసం పేరెంట్సు బాబూజీని ప్రార్థించుకోవాలి. అలాగే ఇతరుల విషయంలోనైనా వారికి మేలు కలగాలని ప్రార్థించుకోవచ్చు. ఆ ప్రార్థన హృదయ పూర్వకంగాను, ప్రేమ పూర్వకంగానూ ఉండాలి. మనం కోరుకుంటున్న దానికి సత్ఫలితం సత్వరమే జరగాలంటే మనం ఎవరి కోసమైతే ప్రార్థిస్తున్నామో వారిలో కూడా అటువంటి స్పందన, కోరిక ఉండాలి. ఎదుటి వారికి లేకుండా మనం ప్రయత్నించినా ప్రయోజనం అంతగా ఉండదు.

**ప్రశ్న: సాల్వేషన్, ఫ్రీడం ఫ్రమ్ రీబర్త్ మరియు లిబరేషన్ అనగా మోక్షం, పునర్జన్మ రాహిత్యం మరియు ముక్తి – వీటిని వివరించండి.**

**జవాబు:** అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక స్థితినిబట్టి కొంతకాలం పునర్జన్మ లేకుండా నిలిచి ఉండటం **మోక్షం** అనబడుతుంది. అభ్యాసీ బాగా భగవత్ సామీప్యతా స్థితిని పొంది, అందులో మునిగి, ఇంకా లోతుగా మునిగి ఉండటానికే ప్రయత్నించితే, ఆ స్థితిలో లయమైపోతాడు. అపుడు ఆత్మ భగవంతునితో కలవటానికి వివశమైపోతూ ఉంటూ ప్రోగ్రెస్ అవుతూ ఉంటుంది. అలా ఉండి ఆత్మ దైవం యొక్క పాదాలను చేరుతుంది. ఇంక వెనుక చూపు ఉండదు. దీనివల్లనే **పునర్జన రాహిత్యం (జన్మ రాహిత్యం)** పొందినట్లవుతుంది.

తపనతో లక్ష్యం చేరటమే లక్ష్యంగా ఉండి, అహం మరచి పరమాత్మలో ఐక్యమై లేదా మమేకమై లేదా విలీనమైపోయినట్టి స్థితి **ముక్తి** అవుతుంది.

దైవమే దిక్కు, వారే సర్వస్వం, వారికే పూర్తిగా అర్పితమైపోయాను అని అనుకోవటం భావపూరితం (ఊహ) లేదా ఆలోచనాపరమైనదిగా ఉండకూడదు. అది ఆంతరికంగా అనుభూతి చెందినదిగా ఉండాలి. అది పూర్తిగా సమర్పితమైపోతున్న అనుభవ భావం. ఇక్కడ కొంత సెల్ఫ్ అనగా అహం ఉంటుంది. కనుక ఆధ్యాత్మిక స్థితి అనేది ఆలోచనా (ఊహా) పరమైనది కాదు. ఆత్మ సమర్పణయే సరియైనది.

అభ్యాసీ ఒకరు, తాను తింటున్నా, మాట్లాడుతున్నా, ధ్యానం చేస్తున్నా మరియు ఆలోచన చేస్తున్నా అన్నీ బాబూజీయే చేస్తున్నట్లుగా అనుభూతి చెందుతున్నట్లుగా చెప్పాడు. అలా జరిగితే అభ్యాసీ పొందేది ఏం ఉంటుంది? అది ఆలోచనా (ఊహ) పరంగానే కాని అనుభవపూర్వకంగా అనుభూతి (ఫీలింగ్) కాదు. ఇవి నా అనుభూతికి వచ్చినపుడు బాబూజీకి తెలియజేయగా వారు –"నీవు దైవంలో జీవిస్తున్నావు కాని నీ భౌతిక శరీరంతో కాదు" అని వ్రాశారు. కనుక వాస్తవిక స్థితి అనేది ఆంతరికమైన అనుభూతి ద్వారా కలగాలి కాని ఆలోచన ద్వారా కాదు.

**విదేశాలలో డెన్మార్క్ ఆధ్యాత్మిక కేంద్రమనీ, దక్షిణ భారతదేశంలో విజయవాడ కేంద్రం తలమానికం అనీ బాబూజీ అనేకసార్లు చెప్పారు. 'వారి'కి ఇష్టమైన సెంటర్ విజయవాడ. 'వారి' ప్రేమకు చిహ్నంగా బహుమతులు పంపారు. 'వారు' ప్రయాణించలేని పరిస్థితుల్లో నాతో ఏమని చెప్పారంటే, "నీ ఆరోగ్యం అనుకూలించినంతకాలం తప్పనిసరిగా విజయవాడ, నెల్లూరు మరియు తిరుపతి సెంటర్లు వెళ్తూ ఉండాలి" అని చెప్పారు.**

నేను చాలామంది పాత అభ్యాసులను, క్రొత్త అభ్యాసులను చూసాను. కొంతమంది పాత అభ్యాసులు చాలా కేంద్రాల్లో ఉన్నారు. వారు బాబూజీతో బాగా కనెక్ట్ అయి గాఢంగా వారితో సంబంధం కలిగి ఉండటం మూలంగా వారి ముఖాల్లో తేజస్సు కనిపిస్తూన్నది. ఒక్కొక్కసారి కొంతమంది కళ్ళు శూన్యంగా ఉన్నట్లు తోస్తూ ఉన్నాయి. అంటే అవి భౌతికంగా దేనినీ చూడవు. వాటి దృష్టి ఆ దైవంమీదనే తదేకంగా నిలిచి ఉంటుంది. వారి కళ్ళలో దివ్యత్వమే తొణుకుతూ ఉంటుంది. వారి కళ్ళలోకి మనం చూస్తే ఆ దివ్యత్యమే కనిపిస్తుంది. కొంతమంది అభ్యాసులు సక్రమంగా సిట్టింగ్‌కు రాకపోయినప్పటికీ వారి హృదయాలు దివ్యత్వంతో నిండి ఉంటాయి. ఎందుకంటే వారి ఆంతరికం పూర్తిగా 'వారి' సమర్పణలోనే మునిగి ఉంటుంది కనుక. అయినప్పటికీ ధ్యానం కొరకు వారు సిట్టింగ్‌కు రావటం ఎందుకంటే దానివలన వారికి సమృద్ధిగా ఆనందం కలుగుతుంది. బాబూజీతో వారు ఏర్పరచుకొన్న ఆంతరిక సంబంధం మూలంగా వారు ధ్యానంలో కూర్చొనకపోయినప్పటికీ వారి హృదయ స్థితి ఆ దివ్య శక్తిని పొందుతుంది. ఇటువంటి స్థితి ఉన్న వారిని విజయవాడలో కూడా చాలా మందిని చూశాను.

మెల్టింగ్ అనగా కరిగిపోవటం అనే విషయం మన సంస్థలో, మన సిస్టమ్‌లో తప్ప మరెవ్వరూ, ఏ సిస్టమ్ (విధానం) లోనూ చెప్పి ఉండలేదు. అభ్యాసి దైవంతో తన సంబంధాన్ని గాఢంగా నెలకొల్పుకొని వారిని సేవించటంవలన దైవీయ వెచ్చదనం ద్వారా అతను కరిగిపోవటం జరుగుతుంది. దివ్యత్వంలో మునిగిపోవటం జరుగుతుంది. క్రమంగా స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం కరిగిపోతాయి.

ఆధ్యాత్మిక శక్తిని తొలగించడం అనేది ఎవరికీ సాధ్యం కాదు. ఆధ్యాత్మిక సంస్థలలో దైవంతో సంబంధం నెలకొల్పటం ఉంటుందే కాని తొలగించటమంటూ ఉండదు. ప్రేమించటమేకాని ద్వేషించటమంటూ ఉండదు. ఇది (సృష్టి) ప్రకృతి ధర్మం. దైవం అంతటా ఉన్నాడు. దైవానికి దరిచేరవద్దని, సాక్షాత్కరింప చేసుకోవద్దని ఎవరు శాసించగలరు! ఇది దైవ కృప వర్షిస్తున్న యుగం.

ప్రతి గృహమూ ఒక ఆశ్రమం కావాలని బాబూజీ అన్నారంటే అది సేద తీర్చటానికి వసతి గృహం వంటిది కాదు. ఆధ్యాత్మికంగా దివ్య వాతావరణం నెలకొని ఉన్నదై ఉండాలి. అక్కడ ఉన్నవారు కాని, వచ్చిన వారు కాని ప్రశాంతతను, దివ్య భావాలను, దివ్యత్వాన్ని అనుభూతి చెందగలిగినట్లుగా ఉండాలి. బాబూజీ, “నేను ప్రతి ఇంటికీ వెళ్తాను” అని అన్నారంటే ‘వారు’ మనతోనే, మనలోనే ఉన్నప్పుడు మన ఇంటికి వచ్చినట్లే కదా! ఒక సంస్థకు పరిపాలనా బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు ప్రెసిడెంట్ లేదా మేనేజరు కావచ్చును కాని మాస్టర్ కాలేరు. మాస్టర్ ఒకే ఒక్కరు మాత్రమే.

బాబూజీ లఖీంపూర్‌లో మా ఇంటికి వస్తుండేవారు. ‘వారు’ వచ్చినపుడు వెంటనే ఫలహారంగాని, మంచి నీరుగాని ఇవ్వాలనే స్పృహ మాకు ఉండేది కాదు. ‘వారు’ భౌతికంగా నా ఎదుటే ఉన్నా, నాకు ఒక దివ్య పురుషునివలెనే కనిపించేవారు. ఆ తన్మయత్వంలో మైమరచి వారికి మర్యాదలు జరపాలనే ధ్యాస కలిగేది కాదు.

బాబూజీ తమ పుస్తకంలో “దైవానికి మనస్సు (మైండ్) లేదు” అని వ్రాసిన దానిని విమర్శించినవారు ఉన్నారు. ఆ బాబూజీయే తమ పుస్తకంలో సూపర్ కాన్షస్ మైండ్ అనగా విశిష్ట చైతన్యం లేదా అధిచేతనా మనస్సు ఉన్నట్లు వ్రాశారు. మరి దీనిని కూడా పరిశీలించాలి కదా! ఎవ్వరైనా నన్ను ప్రశ్నిస్తే అది నన్ను తాకదు. కాని నా నోరు మాట్లాడుతుంది. అప్పుడు నేను వినగలుగుతాను. అదేమిటో తెలుసుకోగలుగుతాను. ఈ విషయాన్ని నేను బాబూజీకి తెలియజేసినప్పుడు, “ఇప్పుడు నీవు సూపర్ కాన్షస్ మైండ్ (అధిచేతనా మనస్సు) అంటే ఏమిటో అర్థం చేసుకోగలవు” అని వ్రాశారు.

నాకు బాబూజీ ఒక మహనీయునిగా, దివ్యపురుషుడుగా కాకుండా ఒక తండ్రిలాగ, తల్లిలాగా అనుభూతి కలుగుతూ ఉండేది. ఆ విషయమే నేను బాబూజీతో అన్నాను. వారిలోనే అందరూ ఉన్నారు. ‘వారి’ని చూస్తూ ఉంటే అపారమైన ప్రేమానుభూతి కలుగుతుంది. తల్లి ప్రేమ కూడా దానికి ధీటుగా ఉండదు. ప్రేమ వర్షిస్తున్నట్లుగా ఉంటుంది. దీనినిబట్టి ‘వారు’ పరమ పురుషులని, సంపూర్ణ శక్తి సామ్రాట్టులనీ అర్థమౌతుంది.

మీకు సిట్టింగ్ ఇస్తున్న ప్రిసెప్టర్ వేరొకర్ని మాస్టర్‌గా బావించేవారై ఉన్నా, మీకు ట్రాన్స్‌మిషన్ సంతృప్తికరంగా లేకపోయినా బాధపడాల్సిన అవసరం లేదు. మీరు బాబూజీనే స్మరించుకొని, ‘వారి’తోనే కనెక్ట్ అయి ఉన్నామనుకుని ‘వారి’ ఎదుటే కూర్చున్నామనుకొని సిట్టింగ్‌లో కూర్చుంటే ‘వారి’ కృప మీకు నేరుగా లభిస్తూ ఉంటుంది. అటువంటి సందర్భంలో మీకు ఆ ప్రిసెప్టర్‌వలన ఏమీ ప్రయోజనం ఉండదు. అంతేగాకుండా మీరు బాబూజీతో కనెక్ట్ అయి ఉండి ‘వారి’ కృపను, దివ్యత్వాన్ని పొందుతున్నారు కనుక దానితో ఆ ప్రిసెప్టర్, ఇతర అభ్యాసులు కూడా మీమూలంగా లబ్ధి పొందుతారు. ఆ సమయంలో మీరు, ఇతర అభ్యాసులకు కూడా ఆ దివ్యత్వం లభించాలని బాబూజీని కోరుకుంటే వారికి కూడా మేలు కలుగుతుంది. కనుక ప్రిసెప్టర్ మీకు అనుకూలించకపోతే మీరు సిట్టింగ్‌కు వెళ్లకపోయినా పోయేదేమీ ఉండదు. మీరు బాబూజీని ప్రేమతో, విశ్వాసంతో స్మరించుకొని ‘వారి’తో సంబంధం కలిగి ఉంటే అదే మేలు మీకు బాబూజీతో సమకూర్చుతుంది. అటాచ్‌మెంట్ ముఖ్యం. బాబూజీయే మీ బాధ్యత వహిస్తారు. ‘వారు’ అందరికీ దివ్య

సాక్షాత్కారం కలిగించటానికీ, అందరినీ అంతిమం చేర్చటానికే వచ్చారు. బాబూజీ స్వయంగా చెప్పారు– “నేను కస్తూరి వంటి వారిని ఏ ఒక్కరినో అక్కడకు తీసుకు వెళ్ళటానికి రాలేదు, అలాగే అందరినీ తీసుకు వెళ్ళటానికే వచ్చాను” అని. ‘వారు’ అందరినీ తమ జ్ఞాపకంలో ఉంచుకొని ఉద్ధరిస్తారు. మనం ప్రేమ, స్మరణ, భక్తితో మెలగి ‘వారి’తో సహకరించాలి.

ఒకసారి బాబూజీ ఈ విధంగా అన్నారు. “అభ్యాసీలు నన్ను చూడడానికి ఎంతో దూరం నుండి వస్తున్నారు. ఎంతో కష్టపడి, ఎంతో శ్రద్ధతో వస్తున్నారు. నేను కూడా చాలా దూరం (అనగా అనంతమైన దూరం) నుండి వచ్చాను. చాలా వస్తువులను (దివ్య స్థితులు) నాతో తెచ్చాను. ఇవి అన్నీ మీకు ఇచ్చి మిమ్మల్ని అక్కడికి తీసుకొనిపోవటానికి వచ్చాను. కాబట్టి నేను మీ నుండి చిన్న సహకారం (కో–అపరేషన్) కోరుతున్నాను. నేను ఏదైతే తీసుకొని వచ్చానో, దానిని మీరు తీసుకోండి, స్వీకరించండి. నేను మీ నుండి ఆశించే సహకారం ఇదే” అని అన్నారు.

బాబూజీ మహరాజ్ మనకోసం ఎంతో దూరం నుండి వచ్చారు. ‘వారు’ ఎంతటి ప్రేమమూర్తి! ‘వారి’ యొక్క సాక్షాత్కారాన్ని ఎప్పుడు పొందుతాను, అనే క్రేవింగ్ (తపన) మీలో ఉండాలి. ఆ భక్తి, తపన, ప్రేమతో ‘వారి’ వద్దకు వెళ్ళాలి.

సత్సంగ్‌లో నేను గమనించినది ఏమిటంటే, అభ్యాసీలు చాలా మంది ఈ ఫిజికల్ హార్ట్ (భౌతిక హృదయం) మీద దృష్టిపెట్టి ధ్యానం చేస్తారు. హృదయం అంటే పిడికెడు గుండె కాదు. బాబూజీ మహరాజ్ –స్పిరిట్యువల్ హార్ట్ (ఆధ్యాత్మిక హృదయం) అనే మాటను వాడారు. అంటే మీ మొత్తం శరీర వ్యవస్థ (సిస్టమ్) అంతా కూడా హృదయమే అని అర్థం. ఆధ్యాత్మిక హృదయానికి పరిమితి అనేది లేదు. మొత్తం హృదయం అనగా మొత్తం శరీరంలో ప్రతి కణము, ప్రతి అణువు సిస్టమ్ అంతా బాబూజీ ఎదుట తెరచి ఉంచండి. “బాబూజీ! నేను ఎలా ఉన్నా సరే! నేను మీ వాడిని. మీరు నా వారు. మీరు ఎంత అనుకుంటే అంత ఆ దివ్య శక్తిని నాలో నింపండి. మీరు ఏ విధంగా అనుకుంటే ఆ విధంగా నన్ను తయారుచేయండి” అని వారిని ప్రార్థించి ధ్యానం చేయండి. బాబూజీ మనకు ప్రసాదించిన దైవీయ వరదానంలో ప్రతి అభ్యాసీ యొక్క అణువణువు కూడా దివ్యత్వంతో పూర్తిగా నింపబడిందని అన్నారు. అంతేకాని నీ హృదయం దివ్యత్వంతో నింపబడింది అని బాబూజీ అనలేదు. మీ శరీరంలోని ప్రతి అణువు హృదయ భాగమే అని అర్థం. మొత్తం సిస్టమ్ అంతా కూడా హృదయమే అని అర్థం.

నేను మిషన్‌లో చేరి 55 సం॥లు అయిన సందర్భంగా, మన అభ్యాసులందరికి డివైన్ బ్లెస్సింగ్స్‌ను (దివ్య ఆశీస్సులను) ప్రసాదించవలసిందిగా బాబూజీ మహరాజ్‌ను ప్రార్థించాను. అప్పుడు అక్కడి నుండి దివ్య వరదానం అనేది వర్షించింది.

---

# దివ్య వరదానం

**నేడు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ఈ దివ్య వరదానం (డివైన్ బ్లెస్సింగ్స్) సమస్త అభ్యాసీ సోదరీ సోదరుల కొరకు ఇవ్వబడినది. ప్రతి అభ్యాసీ యొక్క అణువణువు, కణకణము కూడా ఈశ్వరీయ శక్తితో పూర్తిగా నింపబడినది. ఇప్పుడు, ఎవ్వరూ ఆధ్యాత్మికత యందు బిచ్చగానిగా లేరు. మనందరికి మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దివ్యద్వారం లభించింది. ఈ దివ్య వరదానం, ఎవరైతే బాబూజీ మహరాజ్ పావన చరణాలను ఆశ్రయించారో, ఇక్కడ ఉన్నా, విదేశాలలో ఉన్నా అభ్యాసులందరి కొరకు, ఎల్లప్పటికి ఇవ్వబడింది.**

**- కస్తూరీ బెహెన్‌జీ**

**లక్నో**
**అక్టోబర్, 2003**

---

ఇప్పుడు, ఈ రోజులలో బాబూజీ యొక్క గ్రేస్ (కృప) అపరిమితంగా, అపారంగా వర్షిస్తున్నదని నేను గత సంవత్సరం నుండి చెప్తూనే ఉన్నాను. అభ్యాసీలు అందరికి 'వారి' దివ్య కృప ఎంతో లభిస్తుందని చెబుతున్నాను. మీరు మీ హృదయాన్ని చూసుకుంటే, అక్కడ మీ హృదయం ఉండదు. దాని స్థానంలో విరాట్ హృదయం, దైవీయ హృదయం ఉంటుంది. విరాట్ అంటే విశాలమైనది, అపరిమితమైనది. విరాట్ హృదయం అంటే విశ్వం అంతా వ్యాపించిన హృదయం అని అర్థం. ఇప్పుడు బాబూజీ ఎంత దివ్యకృపను ప్రసాదిస్తున్నారు అనేది ఊహించలేము.

విజయవాడలో ఒక అభ్యాసీ సోదరి 2, 3 నెలల క్రితం మరణించింది. విజయవాడ ప్రిసెప్టర్ ఈ విషయం నాకు ఫోన్‌లో తెలిపారు. అప్పుడు నాకు ఒక దృశ్యం కనిపించింది. ఆ సోదరి ఒక్కసారిగా ఆ దివ్య వరదానం స్థితి మధ్యలో ఉన్నది. ఆమెలోని అహం యొక్క అవరణలు అన్నీ కూడ, ఎంత వేగంగా అంటే, నేను కనీసం ఊహించను కూడా ఊహించలేదు – అంత త్వరత్వరగా ఆమె నుండి విడిపోయాయి.

దీనివలన మనకు ఏమి తెలుస్తుందంటే, బాబూజీ మహరాజ్ ఏదైతే దివ్య వరదానాన్ని ప్రసాదించారో, అది మనలో నిక్షిప్తం చేయబడింది. ఇప్పుడు మనం ఆ స్థితిని పొందకపోయినాగాని ఈ లోకం నుండి వెళ్ళిపోగానే, వెంటనే ఆ దివ్య వరదానం యొక్క స్థితిని చేరుకుంటాము. ఆ దివ్య వరదానం మీ స్వంతం అయ్యింది. బాబూజీ ఎప్పుడు కూడా మనలోని మంచినిగాని, చెడునుగాని చూడరు. 'వారు' మనలను దివ్య ప్రేమతో చూస్తారు. దివ్య వరదానం అంటే ఏమిటి? మన క్రేమింగ్ (తపన) లేకుండా, మనం అడగకుండానే, మనకు తెలియకుండానే, ఏవైతే డివైన్ బ్లెస్సింగ్స్ (దివ్య ఆశీస్సులు) మన దైవం (బాబూజీ) నుండి లభిస్తాయో, అవే దివ్య వరదానం.

ఒకరోజు రాత్రి షాజహాన్‌పూర్‌లో, మేము అందరం బాబూజీ దగ్గర కూర్చొని ఉన్నాం. ఇంతలో బాబూజీ, "అందరు నిశ్శబ్దంగా ఉండండి, లాలాజీ సాహెబ్ ఏదో చెప్తున్నారు" అని అన్నారు. కొంత సమయం తర్వాత ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! లాలాజీ సాహెబ్ మీకు ఏం చెప్పారు?" అని అడిగారు. అప్పుడు బాబూజీ ఇలా అన్నారు: "నిన్ను అక్కడి నుండి తీసుకొని వచ్చింది నేను. నీవు నన్ను అడగకుండానే, అందరికి దివ్యత్వాన్ని పంచిపెడుతున్నావు. పంచిపెడుతున్నపుడు కనీసం నావైపు కూడ నీవు చూడడంలేదు" అని లాలాజీ నాతో అన్నారు. అప్పుడు నేను "హుజూర్! మీరు అక్కడి నుండి నన్ను దేనికొరకు తీసుకొని వచ్చారు? ఆ అల్టిమేట్ (భూమా) యొక్క ఖజానాను ఇక్కడు ఉన్న అందరికీ పంచిపెట్టమనే కదా! మీరు అక్కడి నుండి నన్ను తీసుకొని వచ్చారు. ఇక్కడ నేను దానినే అందరికీ పంచి పెట్టున్నానని అన్నాను" అని మాతో నవ్వుతూ చెప్పారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! సుషుప్తి స్థితి అంటే ఏమిటి?**

**జవాబు:** నిద్ర నుండి లేచిన తరువాత, మీరు ఎక్కడి నుండో చాలా దూరం నుంచి వచ్చినట్లుగా, ఇది (ఈ ప్రపంచం) వేరే లోకం అన్నట్లుగా అనిపిస్తుంది. మీ మనస్సు సూటిగా, ఎక్కడైతే బాబూజీ ఉన్నారో, అక్కడికే వెళ్ళగా మీరు నిద్రపోయినట్లుగా అనిపిస్తుంది. మెలుకువ వచ్చిన తరువాత కూడ మీరు బాబూజీతోనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. మీరు ఈ ప్రపంచంలో ఉండరు. ఇంటి పనులు, ఆఫీస్ పని ఏది చేసినా కాని, ఈ రోజు ఏమేమి పనులు చేసామని సాయంత్రం గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తే మీకు ఏదీ కూడా గుర్తుకు రాదు. ఇదే సుషుప్తి స్థితి.

**ప్రశ్న: బెహెన్‌జీ! అనంతయాత్ర పుస్తకంలో మీకు కలిగినటువంటి అద్భుతమైన స్థితులను గురించి వర్ణించారు. ఆ స్థితులను పొందనంతకాలం మాకు సాక్షాత్కారం లభించదని అంటారా?**

**జవాబు:** "నేను సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు ఈ భూమి మీద అవతరించాను" అని బాబూజీ మహరాజ్ అన్నారు. అందువలన అనంత యాత్ర పుస్తకంలోని ఆధ్యాత్మిక స్థితులు అనేవి ఒక్క కస్తూరీ కొరకు మాత్రమే కాదు. అవి అందరి కొరకు. బాబూజీ "అనంత యాత్ర" అనే ఈ పుస్తకాన్ని మీ అందరికి ఆధ్యాత్మిక విజ్ఞానం కొరకు ప్రసాదించారు. 'వారు' ఒక అభ్యాసీ (కస్తూరీ)ని తయారు చేసారంటే, మిగిలిన వారంతా కూడా 'వారి' దివ్యకృప వలన అటువంటి స్థితులను పొందగలరు అని తెలుసుకుంటారు. బాబూజీ అన్ని దివ్య స్థితులను మనకు ప్రసాదిస్తూనే ఉన్నారు. దానికి మీరు మీ హృదయాన్ని తెరిచి ఉంచుకోవాలి. అనగా "బాబూజీ! నేను మీ వాణ్ని" అనే ఫీలింగ్‌తో ఆత్మ నివేదన స్థితిలో 'వారి' పావన చరణాలవద్ద ఉండాలి. బాబూజీ మహరాజ్ నా మీద రీసెర్చ్ (ఆధ్యాత్మిక పరిశోధన) చేసి, ప్రారంభం నుండి అంతిమం (భూమా) వరకు ఆధ్యాత్మిక యాత్రలోగల సమస్త బంధనాలను, ఆటంకాలను తొలగించి, అన్ని దివ్య ద్వారాలను నా కొరకే కాకుండా, సమస్త మానవాళికి కూడా శాశ్వతంగా తెరచి ఉంచారు.

ఒకసారి నేను, "బాబూజీ మహరాజ్! ఈశ్వర సాక్షాత్కారం తరువాత సెంట్రల్ రీజియన్ ప్రవేశ ద్వారం సత్యపథ్ వద్దకు మమ్మల్ని ఎవరు తీసుకొని వెళ్ళతారు" అనుకుంటూ దాన్ని గురించే ఆలోచిస్తూ ఉన్నాను. అప్పుడు అకస్మాత్తుగా నా ఎదుట ఒక దృశ్యం ప్రత్యక్షమైంది. సత్యపథ్ వద్ద బాబూజీ మహరాజ్

యొక్క ఒక దివ్యశక్తి ఉన్నట్లుగా కనబడింది. ఆ దివ్యశక్తి నన్ను తనపై అనగా సత్యపథ్ వద్దకు ఆకర్షిస్తూ ఉన్నట్లుగా నేను చూసాను. అందవలన ఎప్పుడు అవసరమైతే అప్పుడు బాబూజీ మహరాజ్ యొక్క దివ్యశక్తియే అభ్యాసీని ముందుకు తీసుకొని వెళ్ళుతుంది.

**ప్రసాదాన్ని చాలా కొద్దిగా, ఇది దైవ ప్రసాదం అనే భావనతో తినాలి. డివైన్ ప్రసాదం అంటే దివ్యత్వం అని అర్థం. ప్రసాదాన్ని తింటూ ఉన్నప్పుడు "నేను దివ్యత్వాన్ని తీసుకుంటున్నాను" అని, దాని రుచిని కాకుండా, మీకు కలిగే ఆ డివైన్ ఫీలింగ్‌ను గమనించాలి. అప్పుడు మీరు చాలా ఆధ్యాత్మిక లాభాన్ని పొందుతారు.**

సహజమార్గంలో కండిషన్ (స్థితి) మరియు ఫీలింగ్ (అనుభూతి) అనేవి చాలా ఉపయోగకరమైనవి. బాబూజీకి సరెండర్ (శరణాగతి) అయ్యామని చాలామంది అభ్యాసీలు అంటారు. ఆ ఫీలింగ్ లేకుండా, ఆ విధంగా నోటితో అనడం వలన లేదా మనస్సులో అనుకోవడంవలన ఎటువంటి ప్రయోజనం లేదు. "బాబూజీ! నేను మీ వాణ్ని" అనే ఫీలింగ్ మీ హృదయంలో ఉండాలి. ఇక్కడ నేను అంటే మొత్తం మీ స్థితి, అస్తిత్వం అంతా 'వారి' పావన చరణాలకు అర్పితం కావాలి. నేను ఆ పనిని చేస్తున్నాను; నేను ఈ పనిని చేస్తున్నాను అని అన్నప్పుడు మీరు చేసే పని యొక్క ఫీలింగ్ అనేది మీకు కనబడకూడదు. "నేను బాబూజీ యొక్క దివ్యచరణాలవద్ద ఉన్నాను" అనే ఫీలింగ్ మాత్రమే మీకు కనబడాలి. "బాబూజీ! నేను మీ వాడ్ని" అనే ఆలోచన ఒకవైపు ఉన్నది. ఇంకొకవైపు దీని ఫీలింగ్ ఏమిటంటే, మీ హృదయం బాబూజీ పావన చరణాలకు సమర్పించబడినది అనే ఫీలింగ్ మీలో రావాలి. ఆధ్యాత్మికత అంటే ఇదే. "బాబూజీ! నా హృదయంలోనే ఉన్నారు. నా ఎదుటనే ఉన్నారు" అని 'వారి' ప్రజెన్స్‌ను ఫీల్ కావాలి. అంతే కాని, బాబూజీయే తింటున్నారు, బాబూజీయే టీవీ చూస్తున్నారు, బాబూజీయే నిద్రపోతున్నారు అని అనుకోవడం చాలా తప్పు. ఎందుకంటే (డివైన్) దైవం మనలాగా, భౌతికమైన / ప్రాపంచికమైన పనులు చేయడు. దైవీయ కార్యాలను మాత్రమే చేస్తాడు. బాబూజీ దైవీయ కార్యనిర్వహణ కొరకు అవతరించారు. అందువలన బాబూజీ ప్రజెన్స్ యొక్క ఫీలింగ్ అనేది ముఖ్యం.

ఈ బయటి ప్రపంచాన్ని చూడడానికి మానవునికి కళ్ళు ఇవ్వబడ్డాయి. లోపల ప్రపంచాన్ని అనగా ఆధ్యాత్మికత కొరకు అతనికి ఆంతరిక దృష్టి ఇవ్వబడింది. భౌతికమైన పనుల కొరకు కర్మేంద్రియాలు, భగవంతుని యొక్క అనుభూతి కొరకు జ్ఞానేంద్రియాలు ఇవ్వబడ్డాయి. జ్ఞానేంద్రియాలలో మరల ఊర్ధ్వముఖ వృత్తి, అధోముఖవృత్తి అని రెండు వృత్తులు ఉన్నాయి. నీలో అధోముఖ వృత్తి అనేది ఎప్పుడూ ఈ ప్రపంచంవైపు చూస్తుంది. ఊర్ధ్వముఖ వృత్తి అనేది ఎప్పుడు డివైన్‌ను చూస్తుంది. ఇది నీకు ఈశ్వరునితో కనెక్షన్ ఉంది అనే ఫీలింగ్‌ను ఎల్లప్పుడు గుర్తు చేస్తుంది. ఈ ప్రపంచంలో జీవిస్తూ కూడా ఆధ్యాత్మికంగా పురోగతిని సాధించాలని ఈశ్వరుడే ఈ విధంగా మనల్ని సృష్టించాడు.

**ప్రశ్న: "మానవుని వెనుక ఉన్న మానవుడే నిజమైన మానవుడు" అని బాబూజీ అన్నారు కదా! దీని అర్థం ఏమిటి?**

**జవాబు:** ఒకసారి నేను, "బాబూజీ! ధ్యానం చేయడానికి కళ్ళు మూసుకోగానే వెంటనే నా లోపల ఎవ్వరో ఇదివరకే ధ్యానావస్థలో మునిగిపోయినట్లుగా అనిపిస్తున్నదని వ్రాశాను. బయట ఉన్న మానవుడు ఈ బయటి

పనులను చూస్తాడు. లోపల ఉన్న మానవుడు అనగా జీవుడు ఆ పరమాత్మతో కనెక్షన్‌ను కలిగి ఉంటాడు. ఎప్పుడైతే మన లోపల, బాబూజీతో మనకు అనుబంధం అధికమవుతుందో అప్పుడు బయటి మానవుడు ఈ ప్రపంచం కొరకు, లోపలి మానవుడు దైవం కొరకు అనేది తెలుస్తుంది. యోగి అంటే ఈ శరీరం కాదు. ఇప్పుడు యోగి అనేది మనస్సు. మానవుని లోపల ఉన్న మానవుడు అనగా మానవుని లోపల ధ్యానంలో మునిగిపోయిన జీవుడే నిజమైన మానవుడు.

బాబూజీ యొక్క డివైన్ విల్ (దివ్య సంకల్పం) వల్లనే నేను అనంత యాత్ర 5 భాగాలు వ్రాయగలిగాను. 50, 55 సం॥ల క్రితం స్థితులు కూడా 'వారు' నా ఎదుట ప్రత్యక్షం చేసేవారు. అందువల్లనే అన్ని స్థితులను స్పష్టంగా, యథాతథంగా వ్రాయగలిగాను. ఎటువంటి డివైన్ పర్సనాలిటీ ఈ భూమి మీద అవతరించారు? అనేది ప్రజలు తెలుసుకోవడానికే 'వారు' నాతో ఈ పుస్తకం వ్రాయించారు. అనంతయాత్ర అనే ఈ పుస్తకం ఒక దైవీయ దర్పణం. ఈ దైవీయ దర్పణం ద్వారా ప్రతి మానవుడు అల్టిమేట్ (భూమా)ను చూడవచ్చు, చేరుకోవచ్చు.

**ప్రశ్న: ధ్యానం ఎప్పటివరకు చేయాలి?**

**జవాబు:** మీ దృష్టిలో కేవలం బాబూజీ తప్ప ఎవరూ కనబడకూడదు. దేనిని స్పర్శించినా, 'వారి' స్పర్శయే అనిపించాలి. మీ జీవనం అనేది దైవీయ జీవన విధానంగా మార్పు చెందాలి. అప్పుడే మీరు పూజ (ధ్యానం) చేయవలసిన అవసరం లేదు అని చెప్పవచ్చు. ధ్యానంలో మనస్సు నిమగ్నం కావడంలేదని అంటున్నారంటే, మీ దృష్టిలో ఇంకా ఈ బాహ్య ప్రపంచం అనేది మిగిలి ఉంది అని అర్థం. నిజమైన అభ్యాసీ స్థితి ఏమిటంటే, ధ్యానంలో మనస్సు నిమగ్నం కావడంలేదని అతడు అనడు. ధ్యానంలో కేవలం బాబూజీయే ఇమిడిపోయారని అంటాడు. ధ్యానం చేసిన కొలది, మనస్సు దివ్యత్వం యొక్క రంగును సంతరించుకొని, మనస్సే ధ్యానం యొక్క రూపంగా మారిపోతుంది. అప్పుడు మనస్సు అనే పదం ఉండదు. మనస్సు అనేది మైనస్ అవుతుంది. అప్పుడు ధ్యానం (దృష్టి)లో కేవలం బాబూజీయే ఉంటారు. అప్పుడు మీరు ధ్యానం చేయలేరు. ఎందుకంటే ధ్యానం అప్పుడు మీ మనస్సును స్పర్శించడం ఉండదు. ధ్యానం కేవలం 'వారి'తోనే నిండిపోతుంది. అందువలన ధ్యానంలో ఆలోచనలు వచ్చినప్పుడు, "నేను డివైన్ (దైవం) యొక్క ధ్యానంలో కూర్చున్నాను; బాబూజీ! నా వారు, నేను మీ వాణ్ణి" అని అనుకోవాలి.

**ప్రశ్న: శిరస్సు మీద అనగా మైండ్ (మనస్సు) మీద ధ్యానం చేయవచ్చా?**

**జవాబు:** ధ్యానం కేవలం హృదయం మీదనే చేయాలి. బాబూజీ యొక్క విరాట్ హృదయంలో ధ్యానం జరుగుతున్నదని భావించాలి. విరాట్ అంటే విశ్వమంతా బాబూజీ మహరాజ్ వ్యాపించి ఉన్నారని అర్థం.

సోదరుడు దేవారామ్‌జీ, షాజహాన్‌పూర్ ఆశ్రమంలో బాబూజీ కాటేజ్‌ను నిర్మిస్తున్నాడు. ఆ సమయంలో నేను నా సోదరునివద్ద, మోడీనగర్‌లో ఉండేదాన్ని. ఒక రోజున దేవారామ్ భాయీ మోడీనగర్‌లోని మా ఇంటికి వచ్చాడు. పూజ అయిన తరువాత నేను, "భాయీ! మీలో ఇంతకు ముందు ఉన్న ఆధ్యాత్మిక స్థితి ఇప్పుడు లేదు. ఇదివరకు ఉన్నటువంటి ప్రేమ, తపనలు ఇప్పుడు మీలో లేవు. ఈ విషయం నాకు చాలా బాధగా ఉంది" అని అతనితో అన్నాను. అతడు ఉలిక్కిపడ్డాడు. మరల నేను అతనితో "మీరు షాజహాన్‌పూర్‌లో

24 గంటలు బాబూజీతోనే ఉంటున్నారు. కాని మీ అటెన్షన్ (దృష్టి) అంతా బాబూజీ మీద కాకుండా, ఆ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ (నిర్మాణం) మీదనే ఉంది. అందువలన ఇదివరకు ఉన్న ఆ ప్రేమ, తపన ఎలా ఉంటాయి?" అని అన్నాను. అందువలన ప్రిసెప్టర్ ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు అభ్యాసీల ప్రోగ్రెస్ కొరకు కృషి చేస్తారు. కాని అదే సమయంలో మీ సాధన, మీ ప్రోగ్రెస్ గురించి కూడా చూసుకోవాలి. బాబూజీ స్మరణలో మునిగిపోయి, ప్రిసెప్టర్ పనిని నిర్వహించాలి. అప్పుడు దాని ఫలితం చాలా చక్కగా ఉంటుంది. నేను ఇక్కడికి వెళ్ళి సిట్టింగ్ ఇవ్వాలి, అక్కడికి వెళ్ళి సిట్టింగ్ ఇవ్వాలి అని ఆ సిట్టింగ్ పనిలో ప్రిసెప్టర్ బిజీగా ఉన్నప్పటికిని, "బాబూజీ! నావారు, నాకు చాలా ఇష్టమైనవారు" అనే కనెక్షన్ మీ హృదయంలో ఉండాలి. అప్పుడు ప్రిసెప్టర్ చేసే పని చాలా ఫలవంతంగా (ఎఫెక్టివ్‌గా) ఉంటుంది. ప్రిసెప్టర్ ఆ పనిని చేస్తూ కూడా, బాబూజీ యొక్క పావన చరణాలవద్ద శరణాగతి భావంతో ఉండాలి. ఈ విషయమే అప్పుడప్పుడు ప్రిసెప్టర్ మరచిపోతాడు. "నీవు నీ ప్రాపంచిక ధర్మాన్ని నిర్వహించుకో! కాని నన్ను జ్ఞాపకంలో ఉంచుకో" అని బాబూజీ అభ్యాసీలకు చెప్పేవారు. ఇదే విధంగా ప్రిసెప్టర్ కూడ అభ్యాసులపట్ల తన విధిని నిర్వహిస్తూ బాబూజీని ఎల్లవేళలా గుర్తుపెట్టుకోవాలి.

కొంతమంది అభ్యాసీలు మేము 20 సం॥ల నుండి సహజమార్గ్ సాధన చేస్తున్నాము. ఇతడు మిషన్‌లో చేరి రెండు సంవత్సరాలే అయ్యింది. ఇతడు మా కంటే చిన్నవాడు అని అంటారు, అనుకుంటారు. మేము గొప్పవాళ్ళం అని సంవత్సరాలతో లెక్క వేసుకుంటారు. నిజమైన ప్రేమ ఉంటే సహజమార్గ్‌లో చేరి 7 రోజులు అయినా సరే, ఇతరులు 17 సం॥లలో పొందని దాని కంటె కూడా ఎక్కువగానే క్రొత్త అభ్యాసీ ప్రోగ్రెస్ అవుతాడు" అని బాబూజీ అనేవారు. ఎందుకంటే ఆ క్రొత్త అభ్యాసీలో "బాబూజీ! నా వారు" అనే ప్రేమ కనెక్షన్ ఉంది. ఆధ్యాత్మికత అనేది సంవత్సరాలతో లెక్కించబడదు. ప్రేమతో లెక్కించబడుతుంది.

బాబూజీ మహరాజ్ జీవిత సమయంలో 'వారు' ఎక్స్, వై, జడ్ మొదలగు సీనియర్ ప్రిసెప్టర్‌లను ఎంతో గాఢంగా ప్రేమించారు. వాళ్ళకు తమ దివ్య ప్రేమను ప్రసాదించారు. కాని ఇప్పుడు వాళ్ళందరు మాస్టర్స్‌గా మారిపోయారు. ఒక నిజమైన సేవకునిగా మారడానికి కావలసిన సంపూర్ణ శరణాగతి (బాబూజీ జీవిత సమయంలో) వాళ్ళలో లోపించింది. ఒకసారి నేను "బాబూజీ! ప్రేమ, భక్తి, శరణాగతి, లయావస్థ అన్నీ కూడా నన్ను విడిచిపెట్టి, అవి మీలో లయమైనట్లుగా అనిపిస్తుంది. అవి మీ డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం)ను చూసిన తరువాత, మీరు లేకుండా జీవించలేమని తెలుసుకొని, అవి అన్నీ నన్ను వదిలిపెట్టి మీలో లయమైనాయి" అని వ్రాసాను. అప్పుడు వారు "బిటియా! నీవు నాలో పూర్తిగా లయమయ్యావు. నీవు లయమైన తరువాత, అవి నీలో ఉండడానికి నీ లోపల స్థలం ఎక్కడ ఉంది?" అని వ్రాశారు. **"అభ్యాసీ లక్ష్యంను గాఢంగా ప్రేమించినపుడే ఆధ్యాత్మికతలో విజయాన్ని సాధించగలడు" అని బాబూజీ అనేకసార్లు చెప్పారు. అదే విధంగా విజయవాడ ప్రిసెప్టర్‌లో బాబూజీపట్ల సంపూర్ణ శరణాగతి, లయావస్థ ఉంది. నిజం చెప్పాలంటే అక్కడ ప్రిసెప్టర్ లేదు; ఆ ప్రిసెప్టర్ స్థానంలో కేవలం బాబూజీ మహరాజే ఉన్నారు.**

**సహజ సహజ సబ్ బోల్‌తే హై, సహజ న ఛీనే కోయీ।**

**జా సహజ హై హరి, జో మిలే సహజ కబీర్॥**

ఏ సాధన వలన అయితే భగవంతుని సామీప్యత యొక్క ఫీలింగ్ మనకు వస్తుందో, అదే సహజమైన సాధన. ఆ సహజ సాధనవల్లనే మనం భగవంతునివైపు ఆకర్షించబడతాము –అని కబీరు చెప్పాడు. వాస్తవానికి సాధన మనం చేయడంలేదు. దేనితో దైవీయ సంతోషం మనకు లభిస్తుందో, అదే మనతో సాధనను చేయిస్తుంది.

ఎవరినైనా చూడగానే మనలను మనం మరచిపోయాము అంటే వారు డివైన్ అని అర్థం; అందువల్లనే బాబూజీని చూడగానే అభ్యాసీ తనను తాను మరచిపోతాడు. ఎందుకంటే డివైన్ (బాబూజీ)లో ఆ సమ్మోహనశక్తి ఉంది. ఈ సృష్టి సృష్టికర్తను చూడగానే తనను తాను మరచిపోతుంది. బాబూజీని చూడగానే మన మనస్సు వారివైపు ఆకర్షింపబడుతుంది. అనగా డివైన్ (బాబూజీ) మనలను తనవైపు ఆకర్షిస్తుందని అర్థం.

కండ్లు తెరచి చూస్తే, ఏదైతే మనలను ఆకర్షించి ఈ బాహ్య ప్రపంచం యొక్క ఆకర్షణలో బంధిస్తుందో, అదే మాయ. కాని మనలోనే ఉన్న డివైన్ (దైవం)ను ఆంతరిక దృష్టితో చూస్తూ, చూస్తూనే ఉంటే, బాహ్య నేత్రాలు ఈ ప్రపంచాన్ని చూస్తున్నా, మీరు ఈ ప్రపంచాన్ని చూస్తున్నారనే ఫీలింగ్ మీకు రాదు, అనగా మాయను చూడరు అంటే మాయకు అతీతంగా వెళ్ళారని అర్థం. కాని ఎవరి నేత్రాలైతే బాబూజీ మహరాజ్‌ను చూస్తుంటాయో ఆ నేత్రాలు కేవలం 'వారి'నే చూస్తాయి. మిగతా ప్రపంచం ఏది కూడా ఆ నేత్రాలకు కనబడదు. "నా నేత్రాల స్థానంలో రాయి పొదగబడింది" అని నేను ఒకసారి బాబూజీకి వ్రాశాను. అంటే ఈ నేత్రాలలో ప్రపంచాన్ని చూసే వెలుతురు లేదు. వాటికి కేవలం డివైన్‌ని చూసే శక్తి మాత్రమే ఉంది. అవి డివైన్‌ను చూశాయి. ఆ కారణంగా ఈ నేత్రాలు మాయవైపు చూడలేవు అని అర్థం. కాని ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఈ నేత్రాలు ప్రపంచాన్ని (మాయను) చూడనప్పుడు, ఇక్కడి పనులన్నీ ఎలా జరుగుతున్నాయి? ఎవరైనా క్రొత్త వ్యక్తి మా ఇంటిలోకి రాగానే, వెంటనే నా కాళ్ళు అప్రయత్నంగానే నన్ను లోపలికి నడిపించుకొని వెళ్ళేవి. ఎవరి మీదనైనా కోపానికి రావలసిన అవసరం ఉంటే, కోపం వచ్చేది, దాని పని అది చేసుకొని మరల వెళ్ళిపోయేది. ఇదే విధంగా ప్రతీదీ అవసరాన్నిబట్టి నాలో ప్రవేశించి, తన పని తాను చేసుకొని అదృశ్యమయ్యేది. వాటికి నాలో ఉండడానికి స్థానం లేదు. ఎందుకంటే అక్కడ కేవలం బాబూజీకి మాత్రమే స్థానం ఉంది. 'వారే' ఉన్నారు.

**ప్రశ్న: కొంతమంది క్లీనింగ్ (నిర్మలీకరణ)కు ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తున్నారు!**

**జవాబు:** అవసరం లేదు. నిరంతర స్మరణ వలన అన్నీ లభిస్తాయి. నిన్ను నీవు క్లీన్ చేసుకోవాలని బాబూజీ ఎప్పుడూ చెప్పలేదు. సాధ్యమైనంతవరకు నిరంతర స్మరణలోనే ఉండండి అని బాబూజీ మనకు చెప్పారు. నిరంతర స్మరణ అనేది చాలా ముఖ్యమైనది. నిరంతర స్మరణ హృదయంతో చేయాలి, స్మరణ అనేది ప్రేమతో కూడుకొని ఉండాలి. బాబూజీ పేరు లేదా బాబూజీ గురించిన ఆలోచనలు మీ సమక్షంలోకి వచ్చినపుడు మీ హృదయం ప్రేమతో ఉప్పొంగాలి. స్మరణ అంటే ఇదే. మీరు బాబూజీ గురించి మాట్లాడుతున్నప్పుడు, 'వారి' ప్రజెన్స్ యొక్క ఫీలింగ్ కూడా ఉంటే, అది నిజమైన నిరంతర స్మరణ.

నిరంతర స్మరణలో ఎలా జీవించడం? దీనికి బాబూజీ చాలా చక్కగా చెప్పారు. నిరంతర స్మరణ అంటే ఏమిటి? స్మరణలో అంతరాయం అనేది ఉండకూడదు. స్మరణ అనేది నిరంతరం ఉండాలి. మీరు

ఏదైనా పని చేస్తున్నారు. మీ మనస్సు పూర్తిగా ఆ పనిలో మునిగిపోయింది. 2,3 గంటల తరువాత బాబూజీ జ్ఞాపకం రాగానే, “అయ్యో! నేను బాబూజీని మరచిపోయాను” అని అనుకోవద్దు. ఆ విధంగా అనుకుంటే నిరంతర స్మరణ అనేది తెగిపోతుంది. బాబూజీ జ్ఞాపకం వచ్చినప్పుడు, నా మనస్సు బిజీగా ఉంది, కాని నా హృదయం ఎల్లవేళలా ‘వారి’తోనే ఉంది. ‘వారి’ స్మరణలోనే మునిగిపోయి ఉంది” అని అనుకోవాలి. ఇప్పుడు నేను నిద్రపోవాలి అనే అలోచన మీలో ఉంటే, మీరు నిజంగానే నిద్రపోతారు. అప్పుడు నిరంతర స్మరణ తెగిపోతుంది. అలా కాకుండా, ఇప్పుడు నా శిరస్సు బాబూజీ పావన చరణాల వద్దనే ఉంది అని అనుకోవాలి. అలా అనుభూతి చెందాలి. “ఆత్మ మేల్కొలుపబడినపుడు ఎవరు కూడా నిద్రపోరు” అని బాబూజీ మహరాజ్ చెప్పారు. ఎప్పుడైతే ఆత్మ మేల్కొలుపబడుతుందో అప్పుడే డివైన్‌పట్ల నిజమైన నిరంతర స్మరణ అనేది ఉంటుంది. కాబట్టి “నేను ఈ పని చేస్తున్నాను, నేను ఆ పనిని చేస్తున్నాను” అనే ఆలోచన మీ మనస్సులోకి రాకూడదు. పని చేస్తూనే, చేసే పనిని (క్రియ) మరచిపోయి వారిని గుర్తుపెట్టుకోవాలి. మీరు ఆఫీస్ పనిలో బిజీగా ఉంటారు. మీకు ఖాళీ సమయం దొరికినపుడు ‘వారి’ని స్మరించండి. మరచిపోయాను అనే మాటను మీ మనసులోకి రానివ్వకండి. “మరచిపోయాను” అనే పదాన్ని మరచిపోండి. అప్పుడు మీకు మరచిన స్థితి (ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్) వస్తుంది. “మిమ్మల్ని మీరు” గుర్తుపెట్టుకుంటే, మరచిన స్థితి అనేది ఎప్పటికి రానే రాదు.

**ప్రశ్న: ధ్యానం యొక్క చివరి స్థితి ఏమిటి?**

**జవాబు:** ఎవరి కోసం అయితే మీరు ధ్యానం చేయడం మొదలుపెట్టారో, ఎప్పుడైతే బాబూజీ మీ లోపల, మీ ఎదుట ఎల్లవేళల కనబడతారో, అప్పుడు మీరు ధ్యానం చేయవలసిన అవసరం లేదు. మీ లోపల మీ ఎదుట అనుక్షణం మీకు కేవలం బాబూజీయే కనబడాలి. మీరు అందరితో ఉన్నప్పటికీ మీకు మనుష్యులు ఎవ్వరు కనపడకూడదు. కేవలం బాబూజీతప్ప ఇంకేదీ కనపడకూడదు. ఇదే ధ్యానం యొక్క చివరి స్థితి.

**ప్రశ్న: బెహెన్‌జీ! సామ్యావస్థ అంటే ఏమిటి?**

**జవాబు:** ఎవరైనా మీ గురించి చెడ్డగా మాట్లాడితే, మిమ్మల్ని దూషించితే మీరు అవి వినగానే చాలా బాధపడతారు. కాని ‘సామ్యావస్థ’ (బ్యాలెన్స్‌డ్ స్టేట్) మొదలు కాగానే, నెమ్మది నెమ్మదిగా మీలో ఆ బ్యాలెన్స్ (సామ్యత) అనేది రావడం వలన ఇతరుల దూషణలను వినగానే కొద్దిగా బాధపడతారు. సామ్యావస్థ ఏర్పడినప్పుడు ఇతరుల దూషణలను మీ చెవి పెద్దగా పట్టించుకోదు. వినినా కాని వెంటనే మరచిపోతారు. కాని సెయింట్‌లీ సామ్యావస్థ అనగా సెయింట్ (యోగి) వలె బ్యాలెన్స్‌డ్ స్టేట్‌ని పొందినప్పుడు కోపం, దుఃఖం, సంతోషం మొదలైనవి అన్నీ కూడా ఎప్పుడు అవసరమైతే అప్పుడు అవి మీలో ప్రవేశించి, తాము చేయవలసిన పనిని చేసి అవి అదృశ్యమైపోతాయి.

**ప్రశ్న: తనకు సాక్షాత్కారం (రియలైజేషన్) అయ్యిందని అభ్యాసీ ఎలా గుర్తించగలడు?**

**జవాబు:** ఒకసారి నేను, “బాబూజీ! ఎవరైనా గాడ్ (ఈశ్వరుని) గురించిగాని, మీ గురించిగాని మాట్లాడినప్పుడు, వాళ్ళు నా గురించే మాట్లాడుకుంటున్నట్లుగా అనిపిస్తుంది” అని వ్రాశాను. అప్పుడు బాబూజీ, “బిటియా! ఈ రోజు నా ఆనందానికి అంతులేదు. ఎందుకుంటే నీవు రియలైజ్‌డ్ సోల్ (సాక్షాత్కారం పొందిన ఆత్మ) అని చెప్పగలిగే హక్కు నాకు లభించింది. లాలాజీ సాహెబ్‌కు నా కృతజ్ఞతలు” అని వ్రాశారు.

ఎవరైనా బాబూజీ లేదా గాడ్ లేదా ఆధ్యాత్మికత గురించిగాని, దేనిని గురించి మాట్లాడుకున్నా, అప్పుడు వాళ్ళు ఆ స్థితి పొందిన మీ గురించే మాట్లాడుతున్నట్లుగా మీకు అనిపిస్తుంది. ఇదే సాక్షాత్కార స్థితి. ఎందుకంటే మీ అస్తిత్వం పూర్తిగా 'వారి'లో లయమైంది. కేవలం 'వారు' మాత్రమే ఉన్నారు.

ఒకసారి నేను, "బాబూజీ! సూర్యుడు, చంద్రుడు మొదలైన వాటిని నేనే సృష్టించినట్లుగా, ఈ భూమి, ఆకాశం కూడా నేనే సృష్టించినట్లుగా నాకు అనిపిస్తోంది" అని వ్రాశాను. సృష్టి అనేది అంతా కూడా ఈశ్వరునికి సంబంధించినది. కాని నేను ఈశ్వరునిలో లయమైపోవడంవలన, నేనే అన్నింటినీ సృష్టించాను అనే ఫీలింగ్ కలిగింది. భగవంతుని చూసిన తరువాత భగవంతునిలాగ మారిపోవడమే సాక్షాత్కారం.

ఎవరైనా ఆధ్యాత్మికతలో అంతిమ సత్యం (అల్టిమేట్)ను చేరుకున్నప్పటికీ, ఒకవేళ అతని క్యారెక్టర్ (సత్ప్రవర్తన), నడవడికలో ఏదైనా లోపం ఉంటే అతడు ఆధ్యాత్మికతను స్పర్శించలేదనే అర్థం –అని లాలాజీ సాహెబ్ అన్నారు. అఖ్‌లాఖ్ (సదాచారం లేదా సత్ప్రవర్తన) యొక్క ముఖ్యమైన స్థితి ఏమంటే, మనలోని అహం (నేను) అనేది బూడిదిగా మారిపోవాలి. అనగా మనలో ఎంత వెదికినా 'అహం' అనేది దొరకకూడదు. అప్పుడు 'నేను' అనే దానికి ఎటువంటి విలువ లేదు. ఎటువంటి అర్థం లేదు. ఇదే దైవీయ సదాచారం (అఖ్‌లాఖ్) యొక్క స్థితి. ఈ స్థితిలో మీ ద్వారా అన్ని పనులు వాటంతట అవే మీకు తెలియకుండానే జరిగిపోతాయి. ఎవరు చేస్తున్నారు, ఏమిటి? అనే స్పృహ (ఎరుక) మీకు ఉండదు. ఒకసారి బాబూజీ ఏదో వస్తువును వెదుకుతున్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! ఇప్పుడు మీరు దేనిని వెదుకుతున్నారు. ఏది పోయింది?" అని అడిగారు. ఆ సమయంలో బాబూజీ చాలా ఉత్సాహంతో ఉన్నారు. "భాయీ! నేను ఏమని చెప్పాలి. నన్నే పోగొట్టుకున్నాను. నన్నే వెదుక్కుంటున్నాను" అని అన్నారు.

"లాలాజీ సాహెబ్ చేతిలో నేను కీలుబొమ్మను" అని బాబూజీ అనేవారు. దైవీయ సదాచారం (అఖ్‌లాఖ్) స్థితిలో రోజంతా పనులన్నీ చేసిన తరువాత, ఈ రోజు ఏ ఏ పనులను చేసామని ఎంత గుర్తు చేసుకున్నా మీకు ఏవీ గుర్తుకు రావు. ఈ స్థితిలో పని చేసేది మీరు కాదు. ఎవరో మీ నుండి పనిని తీసుకుంటున్నారు.

బాబూజీ మహరాజ్ అనగా మన డివైన్ లైట్ (ఈశ్వరీయ ప్రకాశం) ఎప్పుడు కూడా ఆరిపోయే ప్రశ్నే లేదు. ఈ డివైన్ లైట్ (బాబూజీ) అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడు శాశ్వతంగా ప్రకాశిస్తూనే ఉంటుంది. మనమందరం కూడా ఈ డివైన్ లైట్ (ఈశ్వరీయ ప్రకాశం)లో పడి మరణించడానికి అనగా అహంను భస్మం చేసుకోవడానికి తయారుగా ఉన్నాం. అందువలన "బాబూజీ నేను మీ వాణ్ని" అని 'వారి' మీదనే పూర్తిగా ఆధారపడి జీవించాలి. అప్పుడు మీకు కేవలం బాబూజీ తప్ప ఇంక ఎవ్వరూ కనబడరు.

**ప్రశ్న: దశాదేశాలలో, నైతిక జీవితానికి సంబంధించినది ఏదైనా ఒక అదేశాన్ని పాటించచకపోయినా, మేము ప్రోగ్రెస్‌ను పొందగలమా?**

**జవాబు:** కేవలం దశాదేశాల మీదనే ఆధారపడితే మీరు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితులను పొందలేరు. బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు, ముస్లింలు –వాళ్ళకు సద్గురువు లేదు. డివైన్ లైట్ లేదు, తమ స్వశక్తితోనే పురోగమించాలి. అందువలన వాళ్ళ వాళ్ళకు కమాండ్‌మెంట్స్ అనగా ఆదేశాలను పాటించవలసినదిగా

చెప్పబడింది. మనల్ని దశాదేశాలను పాటించమని బాబూజీ ఎప్పుడు కూడా నొక్కి చెప్పలేదు. ప్రేమతో కూడిన నిరంతర స్మరణ అనేది చాలా ముఖ్యమైనది అని బాబూజీ చెప్పారు. దీనికి నేనే ఒక ఉదాహరణ. నేను ఎప్పుడు కూడా దశాదేశాలను పాటించలేదు. నిజానికి దశాదేశాలలో కనీసం ఒక్క ఆదేశం కూడా నాకు జ్ఞాపకం లేదు. కాని నేను దశాదేశాల యొక్క అన్ని స్థితులను గురించి "సహజమార్గంలో దశ నియమాల దివ్య సౌందర్యం" అనే పుస్తకంలో వ్రాసాను. ఆధ్యాత్మికతలో, ఈశ్వరీయ సాక్షాత్కారంలో కమాండ్‌మెంట్స్ (నియమాలు, ఆదేశాలు) అనేవి లేవు. దశాదేశాలు అనేవి ఆదేశాలు కావు. అవి దివ్య స్థితులు; ప్రోగ్రెస్ ఎలా ఉంది అని తెలుసుకోవడానికి. దశాదేశాలు యొక్క స్థితులు మీలో ఏర్పడినవా లేదా అని మిమ్మల్ని మీరు పరిశీలన (జడ్జ్) చేసుకోవడానికి అవి ఇవ్వబడ్డాయి. నేను ఎప్పుడు కూడా దశాదేశాలను అలా ఆచరించలేదు. నేను కేవలం నా బాబూజీ మహరాజ్‌ను మాత్రమే అనుసరించాను. "నా లాలాజీ సాహెబ్‌ను చూసిన తరువాత మరల నేను ఏ సాధన చేయలేదు. దేనిని చూడలేదు" అని బాబూజీ అన్నారు. ఇప్పుడు మీరు ఆచరించవలసినది ఒక్కటే ఆదేశం (కమాండ్‌మెంట్). అది ఏమిటంటే– నిన్ను నీవు మరచిపోవాలి. 'వారి' స్మరణలో మునిగిపోవాలి. అప్పుడు సహజంగానే దివ్య ప్రాణాహుతి శక్తితోపాటుగా దశాదేశాల యొక్క దివ్యస్థితులు కూడా మీలోనికి ప్రవహిస్తాయి.

మనది కర్మ భూమి. గత జన్మల కర్మల యొక్క భోగ్ కొరకే, అనగా అనుభవించడానికే మనం ఈ భూమి మీద జన్మించాము. శ్రీరామచంద్ర మిషన్‌లో చేరిన తరువాత బాబూజీ, అభ్యాసీని అన్ని కర్మ బంధనాల నుండి విముక్తి గావిస్తారు. అందువలన మనకు మరల పునర్జన్మ అనేది లేదు. "బాబూజీ! నేను మీ వాణ్ణి, మీరు నా వారు" అని వారి స్మరణలో మునిగిపోవడమే మీరు చేయవలసిన పని.

మానవుడు భగవంతునిచేత సృష్టించబడ్డాడు. అందువలన సహజంగానే మానవునికి భగవంతునితో కనెక్షన్ ఉంది. కనుక నీవు భగవంతుని సృష్టి నుండి విడిపోలేవు. ఈ సృష్టి అనేది సృష్టికర్త మీద ఆధారపడుతుంది. కాని సృష్టికర్తకు తన సృష్టి మీద ఆధారపడవలసిన అవసరం లేదు, ఆధారపడదు. మానవుని గురించి జ్ఞాపకం వచ్చినప్పుడే, భగవంతుడు అతనిని జ్ఞాపకం చేసుకుంటాడు. ఎందుకంటే భగవంతుడు ఎల్లప్పుడు ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ (మరుపు స్థితి) లోనే ఉంటాడు. కాబట్టి మీరు కూడా మరుపు స్థితులోకి రావాలి.

మన హృదయం అనేది ఆరిపోయిన బొగ్గు ముక్క. డివైన్ లైట్ (ఈశ్వరీయ ప్రకాశం) అనేది మండుతున్న బొగ్గు ముక్క అని అనుకుంటే "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అనే ఫీలింగ్‌లో మునిగిపోవడంవలన, నిరంతర స్మరణవలన, దైవీయ సామీప్యత యొక్క ఫోమెంటేషన్ (వెచ్చదనం) వలన మన హృదయం (ఆరిపోయిన బొగ్గు ముక్క) ఆ ఈశ్వరీయ ప్రకాశం (మండుతున్న బొగ్గు ముక్క) యొక్క నిరంతర స్పర్శను పొంది, ఒక రోజున మన సిస్టమ్ అంతా కూడ ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశిస్తుంది. అప్పుడు నీలోని సెల్ఫ్ (నేను) అనేది డివైన్ లైట్‌గా మారిపోతుంది. నేను సిట్టింగ్ ఇవ్వడానికి ఫలానా ప్రదేశానికి వెళ్ళాలి అనే ఆలోచన రాగానే వెంటనే ఈశ్వరీయ ప్రకాశం ఆ ప్రదేశం వరకు వ్యాపించినట్లు నాకు కనిపించేది. దీని తరువాత నాకు కలిగిన స్థితి ఏమిటంటే, నేను ఫలానా అభ్యాసీ ఇంటికి వెళ్ళాలి అని

అనుకోగానే, ఆ క్షణంలోనే దైవీయ శక్తి, ఇక్కడి నుండి ఆ అభ్యాసీ ఇంటి వరకు వ్యాపించినట్లుగా అనిపించేది. మొదట ఈశ్వరీయ ప్రకాశం వ్యాపించినట్లుగా, ఆ తరువాత డివైన్ పవర్ (దివ్య శక్తి) వ్యాపించినట్లుగా నాకు ఎందుకు అనిపించింది అని నేను ఒకసారి బాబూజీని అడిగాను. "మొదట నీ సెల్ఫ్ (నేను) అనేది డివైన్ లైట్ (ఈశ్వరీయ ప్రకాశం)గా మారింది. అప్పుడు నీలో ఏమి ఉంటుంది? దివ్య ప్రకాశం మాత్రమే ఉంటుంది. తరువాత డివైన్ లైట్ అనేది డివైన్ పవర్ (దివ్య శక్తి)గా మార్పు చెందింది" అని 'వారు' జవాబు చెప్పారు.

ఒకసారి ఒక వ్యక్తి "బాబూజీ! నాకు మీ సహజమార్గ్ గురించి అంతా తెలుసు; మీ సిస్టమ్ చాలా మంచిదని తెలుసు. కాని నేను మిషన్‌లో చేరలేదు. నాకు ధ్యానం చేయడం ఇష్టం లేదు" అని అన్నాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! నీవు గాలిని పీల్చుకుంటున్నానని నీకు తెలుసా! నీ శరీరం జీవించి ఉండడానికి, నీకు తెలియకుండానే నీవు ఆక్సిజన్ (ప్రాణవాయువు)ను పీల్చుకొంటున్నావు. అదే విధంగా నీవు నీకు తెలియకుండానే, నా ప్రాణాహుతి శక్తిని పొందుతున్నావు. కాని ఒకానొక రోజున, సమయం వచ్చినప్పుడు ఈ వాతావరణం అంతా దైవీయ వాతావరణంగా మార్పు చెంది, అది నిన్ను స్పర్శించినపుడు నీ ఆత్మ మేల్కొల్పబడి, ఈశ్వరీయ సాక్షాత్కారం కొరకు ప్రయత్నిస్తుంది" అని అన్నారు. ప్రజలు సహజమార్గ్‌ను అంగీకరించినా, అంగీకరించకపోయినా, ఏదో ఒక రోజున ఈ ప్రపంచంలోని వాళ్ళందరూ కూడ శ్రీరామచంద్ర మిషన్‌లో చేరవలసిందే. ఎందుకంటే సహజమార్గ్ సిస్టమ్ అనేది అందరి కొరకు ఇవ్వబడింది. శ్రీ బాబూజీ మహరాజ్ సమస్త మానవళి యొక్క బాధలను, దుఃఖాలను తమ హృదయంలో దాచుకొని, అందరికీ దైవీయ సంతోషాన్ని ప్రసాదించడానికే అన్నట్లుగా, 'వారు' విశ్వంలోని మానవులందరి కొరకు, ఈ యుగానికే ఒక దైవీయ ఆభరణంగా ఉన్నారు. ఇది నేను ఒక పాటలో కూడా వ్రాశాను.

**ప్రశ్న: సమాజంలో అవినీతి, కరప్షన్ ఎక్కువగా ఉంది కదా!**

**జవాబు:** మీ పని మీరు చేయండి. అవినీతి, కరప్షన్ చేసే వాళ్ళను మీరు చూడకండి. మీరు లంచం తీసుకోవద్దు. "బాబూజీ నా వారు" అనే ఫీలింగ్‌తో, బాబూజీ స్మరణలో మునిగిపోయి, మీ ఆఫీస్ పని మీరు చేయండి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు ఎంతో కష్టపడి మమ్మల్ని లక్ష్యంవద్దకు ఇలా తీసుకొని వెళ్తున్నారు. అలాకాక ఒక్కసారే మమ్మల్ని అక్కడికి చేర్చవచ్చును కదా!" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! నీవు కోరినట్లుగానే, నిన్ను ఒక్కసారిగా అక్కడికి చేర్చుతాను. కాని అక్కడి స్థితి, నీవు ఎవరు, ఏమిటి? ఎక్కడి నుండి వచ్చావు? అని నీ పరిచయం గురించి అడుగుతుంది. ఇంకొక విషయం ఏమిటంటే, ఒక వ్యక్తిని అపరిచితమైన ప్రదేశంలో విడిచిపెట్టినప్పుడు అతడు అక్కడ ఉండటానికి ఇష్టపడడు. అక్కడి నుండి పారిపోతాడు" అని అన్నారు.

**ప్రశ్న: 'డివైన్ కలర్' (దివ్యత్వం యొక్క రంగు) అంటే ఏమిటి?**

**జవాబు:** ఏ రోజున అయితే మీలోని అణువణువు కూడ దివ్య తేజస్సుతో, దివ్య ప్రకాశంతో నిండిపోతుందో, ఆ రోజు నుండి డివైన్ పవర్ (దివ్య శక్తి) మీ స్థితికి రక్షణగా ఉంటుంది. ఏవైనా చెడు ఆలోచనలు వచ్చినా

లేదా వాతావరణంలోనివి అయినా సరే, అవి ఏవీ కూడ మీ ఆధ్యాత్మిక స్థితిని స్పర్శించకుండా ఆ డివైన్ పవర్ కాపాడుతుంది. అనగా డివైన్ కలర్‌తో మీ శరీర వ్యవస్థ (సిస్టమ్) అంతా అలంకరించబడింది అని అర్థం.

అభ్యాసీకి ఇవ్వబడిన శక్తి, అతనిలో త్వరగా లయం కావాలంటే ప్రిసెప్టర్ ఏం చేయాలి? అనే ఒక ఆలోచన నిన్న సిట్టింగ్‌లో నాకు వచ్చింది. ఆ వెంటనే, దానికి జవాబు కూడ దొరికింది. పనిచేసే వాళ్ళు ఉత్సాహంగా ఉంటే, ఇచ్చేవారు (బాబూజీ) ఎంత ఎలర్ట్‌గా ఉంటారో చూడండి! అభ్యాసీ యొక్క సెల్ఫ్ (నేను) అనే దానిని డివినిటీ (దివ్యత్వం)లో మునిగిపోవునట్లుగా చేసి, ఆ సెల్ఫ్ అనేది డివినిటీలోనే స్థిరపడింది అనే సంకల్పంతో ట్రాన్స్‌మిషన్‌ను ఇవ్వాలి. ఎప్పుడైతే నెమ్మది నెమ్మదిగా సెల్ఫ్ (నేను) అనేది డివినిటీగా మార్పు చెందుతుందో, అప్పుడు అభ్యాసీకి ప్రసాదించబడిన శక్తి అంతా కూడ అతనిలో లయమైపోతుంది. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ అనే పదం తప్పు. ఎందుకంటే సెల్ఫ్ (నేను) అనేది ఉన్నప్పుడు కాన్ఫిడెన్స్ (దృఢ విశ్వాసం) అనేది ఏర్పడదు.

డివైన్ పవర్ (దివ్య శక్తి)తోనే కాన్ఫిడెన్స్ (దృఢ విశ్వాసం) అనేది ఏర్పడుతుంది. సెల్ఫ్ అనేది డివినైజ్ అయ్యినప్పుడు అనగా దివ్యత్వంగా మార్పు చెందినప్పుడే అభ్యాసీలో ఒక్కసారిగా కాన్ఫిడెన్స్ అనేది అనగా డివైన్ కాన్ఫిడెన్స్ ఏర్పడుతుంది.

మీరు ఎలర్ట్‌తో అనగా చైతన్యంతో ఎప్పుడైతే ప్రతిక్షణం బాబూజీ మహరాజ్ యొక్క ప్రత్యక్షతను అనుభూతి చెందుతారో, ఆ రోజు నుండి, ఏవైతే అనవసరమైనవో అవి అన్నీ వాటంటత అవే మీలో నుండి వెళ్ళిపోతాయి. మీకు రావలసినవి అప్రయత్నంగానే మీలో ప్రత్యక్షమవుతాయి. అప్పుడే సహజమార్గ్ అనేది ఈశ్వరీయ సాక్షాత్కారానికి సహజమైన మార్గం అనేది మీకు తెలుస్తుంది. ఇప్పుడు మీరు సాధన చేస్తున్నారు. ఆనందాన్ని పొందుతున్నారు. కాని మీరు డివోటీ (భక్తుని)గా మారినప్పుడు, అనగా 24 గంటలు బాబూజీ ప్రజెన్స్‌ను ఫీల్ అయినప్పుడు, అప్పుడే సహజమార్గ్ సిస్టమ్ యొక్క నిజమైన పని మొదలవుతుంది. అప్పుడు మీరు ఒక సహజధారలో, సహజ ప్రవాహంలో మునిగిపోయినట్లుగా, ఎవరో ఎక్కడి నుండో ఆ కృపా వర్షాన్ని కురిపిస్తూన్నట్లుగా, మీరు ఆ దైవీయ వర్షంలో పూర్తిగా తడిసిపోయినట్లుగా మీకు అనిపిస్తుంది.

ఏదైనా మెస్సేజ్ (సందేశం)ను ఇవ్వండి! అని నన్ను అభ్యాసులు అడిగినప్పుడు నేను ఇలా చెప్పాను: బాబూజీ సందేశాన్ని తీసుకొని రాలేదు. 'వారు' (ఇన్విటేషన్) ఆహ్వానాన్ని తీసుకొని వచ్చారు. ఆహ్వాన పత్రిక పంపించలేదు. సమస్త మానవాళిని అల్టిమేట్ (భూమా) వద్దకు తీసుకువెళ్తాను – అనే ఆహ్వానంతో, స్వయంగా వారే మన దగ్గరకు వచ్చారు. 'వారి' ఆహ్వానంవల్లనే మనం అందరం ఇక్కడ సమావేశమయ్యాము. అందరు బాబూజీ గురించి మాట్లాడుకోవాలి. అందరు ప్రోగ్రెస్ కావాలి. అందరు ఉన్నత స్థితికి చేరుకోవాలి. కొంతమంది మేము ధ్యానంలో, సాధనలో ఏమీ అనుభూతి చెందడంలేదని బాధపడతారు; నిరుత్సాహపడతారు. మనమందరం చిన్న పిల్లలం. తల్లి తన పిల్లవానికి నడవడం నేర్పుతున్నప్పుడు, పిల్లవాడు పడిపోతాడు. కాని ఆ పసిపిల్లవాడు తన తల్లినే చూస్తూ ఉంటాడు. బాబూజీ ఈ సహజమార్గ్ సిస్టమ్ ద్వారా మనకు నడిపించడాన్ని నేర్పిస్తున్నారు. అందువలన మనం కూడా మన తల్లిని అనగా బాబూజీని చూస్తూ ఉంటే,

పడిపోయినాగాని మనలో నిరుత్సాహం అనేది ఉండదు. సహజమార్గ్ సిస్టమ్‌లో ఎప్పుడైతే ఎల్లవేళల బాబూజీ మహరాజ్ మీ ఎదుటనే ఉంటారో అప్పుడు, వెనుకకు తిరిగి చూసే సమయం కూడ మీకు ఉండదు. మీరు వెనుకకు చూడాలని అనుకున్నా, బాబూజీ ఎప్పుడు కూడ మిమ్మల్ని వెనుకకు (వెనుకటి కండిషన్) చూడనివ్వరు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతరించారు. కాని నేను ఏమి పొందలేకపోయాను. ఇప్పుడు ఎన్నో యుగాల తరువాత డివైన్ పర్సనాలిటీ (బాబూజీ) అవతరించారు. బాబూజీ అవతరించిన తరువాత కూడా చాలా సంవత్సరాల తరువాత కలుసుకున్నాను. ఎంత సమయం, ఎన్ని జన్మలు వృథా అయ్యాయి అనే బాధ నా మనస్సులో ఉండేది. ఒకరోజు రాత్రి ధ్యానంలో కూర్చోగానే ఒక్కసారిగా ఈ కాలం (సమయం) అనేది నా ఎదుట పూర్తిగా వ్యాపించింది. మరల అది మొత్తం అదృశ్యమయ్యింది. దాని స్థానంలో బాబూజీ మహరాజ్ కనిపించారు. వెంటనే నాకు ఈ విధంగా అనిపించింది. ఎప్పటి నుండి అయితే సృష్టి ప్రారంభమైనదో అప్పటి నుండి కూడ నేను బాబూజీతోనే ఉన్నాను. బాబూజీలోనే ఉంటున్నాను. ఎల్లప్పుడు బాబూజీతోనే ఉంటాను. అనగా అన్ని జన్మలలోను నేను బాబూజీతోనే కనెక్షన్‌ను కలిగి ఉన్నాను అని అర్థమయ్యింది.

**ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! నేను చాలా ముసలివాణ్ణి అయ్యాను. నా వయస్సు అయిపోయింది. నా పరిస్థితి ఏమిటి?"** అని అడిగినప్పుడు, వారు "భాయీ! నీవు నీ వయస్సుతో కనెక్షన్‌ను పెట్టుకున్నావు కాబట్టి నీవు ముసలివానివి అయ్యావు. నేను నా లాలాజీ సాహెబ్‌తో కనెక్షన్‌ను పెట్టుకున్నాను. కాబట్టి నాకు నా వయస్సు గురించి తెలియనే తెలియదు" అని నవ్వుతూ అన్నారు. కాబట్టి ఏ రోజునైతే మనకు బాబూజీ మహరాజ్ లభించారో, ఆ రోజుతో ఆ సమయం అనేది పూర్తి అయ్యింది. బాబూజీకి, మనకు మధ్యనగల కాలం (సమయం) యొక్క గ్యాప్ అనేది సమాప్తమయ్యింది. మనకు బాబూజీ లభించారు; కాబట్టి మనకు సర్వస్వం లభించింది.

ప్రిసెప్టర్ కనుక 'సెంటర్'తో అనగా దైవంతో సంబంధం కలిగి ఉంటే అభ్యాసులందరూ కనెక్ట్ అయినట్లే అని బాబూజీ చెప్పారు. అభ్యాసులు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అనే ఆలోచన అవసరం లేదు. బాబూజీ మహరాజ్ యొక్క ఆశీస్సులు అందుతున్నాయి. గంగోత్రిని ఎవరూ చేరలేకపోయినా గంగలో అందరూ స్నానమాడగలరు. అలాగే గమ్యాన్ని చేరటం ప్రయాసతో కూడినదే అయినా వారి ప్రాణాహుతి ధారలో మునిగిపోయే అవకాశం అభ్యాసులందరికీ దక్కుతుందున్నమాట. అంతిమం నుంచి ప్రవహిస్తున్న ఆ దివ్యత్వాన్ని అందరూ పొందవచ్చు. మీరు సహజమార్గ విధానాన్ని ఆశ్రయించారంటే, ఎవరైనా సాధువు రామాయణం గురించిగాని మరేదైనా అలాంటి కథగాని చెపుతూ ఉంటే, వినడానికి మీరు వెళ్ళినప్పటికీ మీకు ఆ దివ్యత్వమే సమకూరుతూ ఉంటుంది. ఎవరివద్ద అనేది ప్రాముఖ్యం కాదు. మీరు పొందేది దివ్యత్వమే. సహజమార్గ విశిష్టత అదే! ఎందుకంటే, అంతటా 'వారి' దివ్యశక్తి ధారయే ప్రవహిస్తోంది. దానికోసం మీలో తపన ఉండి, దానిని తీసుకోవటాన్నిబట్టి అది దక్కుతుంది.

నేనొక విషయం కూడా గమనించాను. అది ఏమిటంటే, ప్రిసెప్టర్ బాబూజీకి సమర్పితమైపోయినప్పటికీ ఒక్కొక్కసారి అతడికి కోపం కలగవచ్చు. ఆ కోపంలో బాబూజీ హస్తం ఉన్నప్పటికీ అది అంతవరకే పరిమితమవుతుంది కాని అభ్యాసీ యొక్క కండిషన్ (స్థితి) మీద ఎటువంటి ప్రభావమూ చూపదు. అభ్యాసీ

యొక్క స్థితికి అంతరాయం కలగదు. ఇటువంటి పద్ధతి బాబూజీ మహరాజ్‌కుతప్ప మరెవ్వరికి సాధ్యపడుతుంది? నిరంతరాయంగా 'వారి' ఆశీస్సులందుతున్నందుకు 'వారి'కి ధన్యవాదాలు.

ఒక అభ్యాసీ బాబూజీతో "నేను సక్రమంగా ధ్యానం చేయడంలేదు" అని అన్నాడు. అందుకు జవాబుగా బాబూజీ, "నేను మాత్రం క్రమం తప్పకుండా ప్రాణాహుతి నిస్తున్నాను" అని అన్నారు. బాబూజీ మహరాజ్ ప్రేమ ఎలాంటిదో చూడండి. మనకంటే కూడా మన పిల్లలు అనగా భావితరాలవారు ఇంకా అదృష్టవంతులు. ఎందుకంటే, 'వారి' కృపను వారు ఇంకా అధకంగా పొందుతారు కనుక. ప్రతి ఇంట్లోను ఒక సెయింట్ ఉదయిస్తాడని, ఇంటింటా ఒక సెయింట్ దర్శనమిస్తాడని బాబూజీ చెప్పారు. బాబూజీ చెప్పినట్లుగా ఆ సమయం అసన్నమవుతుంది.

స్వామి వివేకానందునితో ఒకరు, ఆరోగ్యమే మహా భాగ్యం అని తాను భావిస్తున్నట్లుగా చెప్పారు. అందుకు ప్రతిగా వివేకానందస్వామి, శూన్యతయే (0 – జీరో) భగవంతుని బహుమతిగా తాను అభిప్రాయపడుతున్నట్లుగా చెప్పారు. సెయింట్స్ యొక్క మాటలతీరు, విలువ అలా ఉంటుంది.

**అనుసరిచటం అంటే ఏమిటి?** మీరు శ్రీరామచంద్ర మిషన్‌లో ప్రవేశం పొందారు, సహజమార్గ విధానాన్ని చేపట్టారు, బాబూజీ మహరాజ్ అడుగుజాడల్లో నడుస్తున్నారు. అంటే ఆచరణలో కూడా, ఇతరులపట్ల ప్రేమతో వ్యవహరించాలి, ఇతరుల గుణదోషాలను ఎంచకుండా ఉండాలి; చిరునగవుతో ఆప్యాయత కలిపి మృదువుగా సంభాషించాలి. ఈ విధంగా ఆచరించినట్లయితే మీరు కూడా ఒక సెయింట్‌లాగా జీవిస్తారు, సెయింట్ యొక్క స్థితిని పొందుతారు. సెయింట్‌గా గుర్తించబడతారు. ఇటువంటి స్థితిని పొందినపుడు – "నా శరీరంలోని ప్రతి అణువూ సమతుల్య స్థితిని పొంది ఉంది" అని శ్రీ బాబూజీ మహరాజ్‌కి వ్రాశాను. కనుక మీరు కూడా ధ్యానమాచరిస్తూ, ఆ విధమైన సెయింట్ జీవితం వంటిది అలవర్చుకుంటే, ఆ స్థితిని త్వరగా పొందగలుగుతారు.

ఇటువంటి సమతుల్య స్థితిలో (బాలన్స్‌డ్ కండిషన్) ఎవరైనా మాట్లాడుతూ ఉంటే వినటం, ఆ సందర్భాన్నిబట్టి కోపగించవలసివస్తే కోపగించటం వంటివి జరిగిపోతాయి కాని అవేమీ ఆ స్థితిని ఆటంకపరచవు. అవన్నీ దైవానికి చెందినవిగానే ఉంటాయి. ఇంతగా మనల్ని ప్రేమించేవారు మరెవ్వరు ఉంటారు! నాకు ఎప్పుడూ మహోన్నతులతో మాట్లాడినట్లు అనిపించదు. ఎందుకంటే బాబూజీ లేకుండా నేను లేను కనుక, నాతో మాట్లాడించే బాబూజీ కంటే మహోన్నతులు ఎవరూ ఉండరు కనుక.

లాలాజీని "మీరు ఈ లోకం వీడి వెళ్ళుతున్నట్లు నా దృష్టికి ఎందుకు రాలేదు?" అని బాబూజీ ప్రశ్నించారు. "నా ఆధ్యాత్మిక సోదరుడు రామేశ్వర్‌జీకు తెలిసేటట్లు చేశారు గదా!" అని కూడా అన్నారు. అందుకు సమాధానంగా "నేను నీలోనే ఉన్నాను. నీ బాల్యం నుంచే నేను నీలో ఉన్నాను, అని నా పుస్తకంలో వ్రాశాను కూడా. నేను లేక నీవు లేవు. నేను లేనని నీవు ఎలా అనగలవు? నేను లేకుండా నీవు జీవించలేవు. అందుచేత నేను ఈ లోకం వదలి వెళ్ళినట్లు నీ దృష్టికి రాలేదు" అని లాలాజీ వివరించారు.

ఒక అభ్యాసీ మహాపార్షద్ స్థితిని గురించి అడగ్గా నేను ఇలా చెప్పాను: "సంస్థ చిహ్నాన్ని బాబూజీయే రచింపజేశారు. **'పార్షద్'** అనేది సెంట్రల్ రీజియన్‌కు ప్రవేశద్వారంవద్ద ఉన్న స్థితి. **మహాపార్షద్:** భూమా 7

వలయాలలో మొదటి వలయంలో ప్రవేశించటానికి ముఖద్వారం వద్ద ఉన్నటువంటి స్థితి. అనగా వలయాలలో యాత్ర ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది" అని.

భగవంతునికి మైండ్ లేదన్నారు. జీవించి ఉన్నవారికి మైండ్ ఉంటుంది కనుక లివింగ్ మాస్టర్ అన్న ఆలోచన చారిగార్కి కలిగి ఉండవచ్చు. ప్రతిదీ సూపర్‌కాన్షస్ మైండ్ అనగా అధిచేతనా మనస్సు నుండి వస్తుంది అని బాబూజీ చారిగారికి ప్రత్యక్షంగా చెప్పారు. నేను ఈ స్థితిని గురించి బాబూజీకి వ్రాశాను. "ఎవరైనా ఏదైనా ప్రశ్నించినపుడు అది నన్ను స్పర్శించటంలేదు. వచ్చిన జవాబూ నాకు తెలియడం లేదు. అనగా వినడం, చెప్పటం రెండూ నావికావు. వాటిని వ్రాసిన తరువాత చదివినప్పుడే నాకు తెలుస్తుంది" అని. కనుక ఆ క్రియ అంతా అధిచేతనా మనస్సు నుంచే జరుగుతుంది. అటువంటి స్థితిని పొందినవారికే అది అనుభూతమవుతుంది.

మహర్షి పతంజలి ముక్తి పొందలేకపోయిన కారణంగానే మళ్ళీ బాబూజీగా జన్మించారని చారీజీ తమ పుస్తకంలో వ్రాశారు. ఈ విషయాన్ని మేమందరం ఉండగా, చారీజీ సమక్షంలోనే బాబూజీ, లాలాజీని ప్రశ్నించారు. "తాము తేజోమండలం (బ్రైటర్ వరల్డ్) అంతా వెదికి చూసినా పతంజలి కనిపించలేదు ఎందుకని?" అని. అందుకు జవాబుగా లాలాజీ బాబూజీతో, తమలోనే వెదకమన్నారు. అసలు విషయం ఏమిటంటే, ముక్తి పొందకుండా తేజోమండలంలోకి చేరటం సంభవం కాదు. అది పొందనివారికి అక్కడకు చేరి చూడటమూ సాధ్యం కాదు. బాబూజీ అన్నింటికీ అతీతుడు. 'మాస్టర్' వారే కనుక అక్కడ వెదికి చెప్పటం వారికే సాధ్యపడింది. మరొక విషయం ఏమిటంటే, సర్వమూ బాబూజీయే కనుక, సమస్తం వారిలోనే ఉన్నాయి; అందరూ వారిలోనే ఉంటారు. లాలాజీ చెప్పిన దానిలోని అంతరార్థం అదే. శ్రీకృష్ణ పరమాత్మ కూడా అర్జునుడికి హితబోధ చేస్తూ సర్వమూ తానే అనీ, రావి చెట్టులోనూ, మరి అంతటా తానే ఉన్నట్లుగా చెప్పి సర్వమూ తనలోనే ఉన్నాయని దర్శింపజేశాడు. బ్రైటర్ వరల్డ్‌కు చేరి అవలోకించగలిగిన సత్తా ఉన్న వారెవరైనా ఈ విషయాన్ని ధృవపరచుకోవచ్చు గదా!

ఒకసారి వరదాచారిగారితో బాబూజీ ఇలా అన్నారు: "నీది చాలా పెద్ద లైబ్రరీ. చాలా పుస్తకాలు ఉన్నాయి. నీవు ఫిలాసఫర్‌వి. చాలా పుస్తకాలు వ్రాశావు. కాని నేనేమీ వ్రాయలేదు." దానికి ప్రతిస్పందించిన వరదాచారిగారు, తాను మేధావిననీ, విద్వత్తు కలవాడిననీ చెప్పారు. అప్పుడు బాబూజీ, "నీవు ఉన్నత స్థితిని పొందలేకపోయావంటే ఈ గ్రంథాలయానికి సేవకుడిగా ఉండిపోవటం వల్లనే. ఇక నేను స్వతంత్రుడను, ఎవ్వరికీ సేవకుడను కాదు" అని అన్నారు.

రాత్రి సమయంలో బాబూజీ ముందు అందరం కూర్చున్నపుడు 'వారు' చాలా విషయాలు చెప్పేవారు. 'వారు' ఒకసారి ఇలా చెప్పారు: "లాలాజీ సాహెబ్ నాతో, నీవు ఎప్పుడూ విస్మృత స్థితి (మరపు స్థితి)లో ఉంటున్నావు. అందుచేత నీకోసం నేను ఎప్పుడూ చైతన్యస్థితిలో ఉంటున్నాను అని అన్నారు. దానికి సమాధానంగా నేను లాలాజీతో –మీ గురించే నేను ఇక్కడ ఉన్నాను. మీరు స్వయంగా విస్మృత స్థితిలో ఉండిపోతే ఈ విశాల విశ్వమే ఉండదు– అని చెప్పాను" అని. బాబూజీ మాటలు ఈ విధంగా చమత్కారంగా ఉంటాయి.

అసలు సమస్య అంతా (ఐ = నేను) అహంతోనే. లోతుగా ఆలోచిస్తే ఉన్నది 'ఐ' (I) అనగా నేను మరియు 'యు' (U) అనగా నీవు (I & You). బాబూజీపైనే దృష్టి నిలిపితే ఉండేది 'యు' మాత్రమే. కనుక 'ఐ' అను ప్రశ్నలోనే జవాబు ఉంది. మన సహజమార్గ విధానంలో మీరు ఉన్నత స్థితులకు చేరుతున్న కొద్దీ అటువంటి అనుభూతి కలుగుతుంది. నేను అలా ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడు, నేను నా శరీరంతో జీవించటం లేదనిపించింది. బాబూజీయే నా ఎదుట ఉన్నారు. నా కళ్ళతో వెదకకుండానే దర్శనం ఇస్తున్నారు. కాని ఒక్కసారిగా నన్ను నేను జ్ఞాపకం చేసుకునేసరికి నేను శరీరంతో ఉన్నట్లనిపించింది. కనుక బాబూజీ అంతటా ఉన్నారు. 'వారి' దివ్యత్వం అంతటా ఉంది. కాని శరీరం మాత్రం అంతటా ఉండదు. దైవం అంతటా ఉంటాడు కాని శరీరం అంతటా ఉండదు. అభ్యాసీ అట్టి ఉన్నత స్థితికి చేరి, జ్ఞాపకం చేసుకున్నప్పుడు బాబూజీ దర్శనం ఇస్తారే కాని శరీరం కనిపించదు.

మన సంస్థ యొక్క చిహ్నం గురించిన వివరణ ఏమిటంటే– దానిలో ఉన్న స్వస్తిక్ మార్క్ ప్రపంచంలోని నాలుగు దిశలా సహజమార్గ విధానం యొక్క వ్యాప్తిని తెలియజేస్తుంది. దీనిని బాబూజీ యొక్క గురువర్యులు, సమర్థ గురు మహాత్మా శ్రీ రామచంద్రజీ (ఫతేఘర్) జ్ఞాపకార్థం బాబూజీచే రచింపబడి వారి పేరు పెట్టటం జరిగింది. ప్రాపంచిక జీవనం నుంచి ఊర్ధ్వముఖంగా మన ప్రయాణం ఇక్కడ నుండే అనగా ఈ స్వస్తిక్ మార్క్ నుంచే ప్రారంభమవుతుంది. ఈ మార్గమే సహజమార్గం అని చెప్పబడింది. దీని ద్వారానే మనకు దైవంతో సంబంధం ఏర్పడుతుంది. ఈ మార్గంలో కష్టాలు, ఆటంకాలు అనబడే కొండలను దాటుతూ చీకటి వెలుగుల మధ్య ప్రయాణిస్తాం. ఆపైన చూపబడిన ఉదయకాంతులు చిమ్మే సూర్యబింబం, సమర్థ గురువు ప్రారంభించిన ఆధ్యాత్మిక నవ్యయుగానికి ప్రతీక. దాని ప్రకాశమే విశ్వాంతరాళ మంతటా వ్యాపించి ఉంటుంది. అది ఆవరించి ఉన్నదే సత్యపథ్ (సత్యపదం). కనుక సహజమార్గం అనే దివ్య మార్గం ద్వారానే ఇక్కడికి చేరటం జరుగుతుంది. ఇది కేంద్ర మండలానికి ముఖద్వారం. సత్యపథ్ చేరేసరికి శక్తి యొక్క అనుభవం కలుగుతుంది. అభ్యాసీ సత్యపథ్‌లో కూర్చుంటాడు కాని అక్కడ శక్తిమీద అతనికి ఆధిపత్యం ఉండదు. దానికి కారణం, మాస్టరే దానికి అధిపతి కనుక. ప్రాపంచిక విషయాలు అక్కడికి చేరవు. ఈ సహజమార్గం ద్వారా బాబూజీ ఆ శక్తి సామ్రాజ్యానికి ద్వారం తెరిచారు. ఇప్పుడు మనం ప్రవేశించవచ్చు. ఇంతకుపూర్వం ఏ ఆధ్యాత్మిక సాహిత్యంలోనూ వీటి ప్రస్తావన జరగలేదు. ఇది కేవలం చిత్రపటమే కాదు, అపారమైన శక్తి కేంద్రం అని బాబూజీ చెప్పారు. మీరు ఆ స్థితికి చేరితే స్వయంగా చూడగలరు. అది ఎటువంటి స్థితి అంటే – సర్వదా, సర్వత్రా బాబూజీయే నెలకొని ఉన్నారు. వారే ప్రత్యక్షమవుతున్నారని గ్రహించగలిగిన స్థితి.

(బాబూజీ వ్రాసిన "సత్యోదయం" పుస్తకంలో ఈ చిహ్నం గురించి వివరించారు. చివరగా 'వారు' ఏమన్నారంటే– ఈ సృష్టికి పూర్వం చీకటి అలుముకుని ఉంది అనుకుంటే చీకటి కానిది వెలుగు అవుతుంది. చీకటి వెలుగులు రెండూ కానిదేమవుతుంది అని ప్రశ్నిస్తే ఏమీ కానిది అంటాము. అనగా ఈ చీకటి వెలుగులకు అతీతమైనది. ఏమీకానిది అనే దానిని మార్పులేనిదిగా, శాశ్వతమైనదిగా అనగా సత్యత్వంగా భావించుకోవచ్చు. దానిని ఈ చిహ్నానికి పైన ఆవరించి ఉన్న దానిని ఓమ్, తత్‌సత్ అని నిర్వచించారు.)

బాబూజీలాగా బోధించేవారు మరెవ్వరూ ఉండరు. నేను ఏ పుస్తకాలూ చదవలేదు. మా తండ్రిగారి ఒత్తిడి మీద ఎనిమిదవ క్లాసు వరకూ అతికష్టం మీద చదివి పాసయ్యాను. ఆ తర్వాత చదువుకు స్వస్తి చెప్పాను. నేను ఒకసారి బాబూజీతో "నేను మీ పుస్తకాలు ఏమీ చదవలేదు, నాకేమీ తెలియదు. నేను ఏ విధంగా పురోగమించగలను?" అని అనేసరికి 'వారు' – "అది చాలా సులభం. నీవు త్వరగానే అర్థం చేసుకుంటావు. నీకు శిక్షణ ఇవ్వటానికి ఏ యూనివర్శిటీ లేదు" అన్నారు. వారిని మనస్ఫూర్తిగా ఆరాధించటంవల్లనే నేను పొందగలుగుతున్నాను అని నేను గ్రహించాను.

నేను బాబూజీ ఎదుట కూర్చుని 'వారి' ముఖారంవిందాన్నే వీక్షిస్తున్నాను. 'వారి' శరీరం ఇక్కడ ఉందే కాని దృష్టి ఎక్కడో ఉంది. అయినా నేను 'వారి' ఎదుట కూర్చున్నపుడు ఆనందానుభూతి పొందాను. ఈ ప్రపంచంలో జీవిస్తూనే ఎవ్వరైనా సరే, కేంద్ర మండలానికి, అక్కడి నుండి అంతిమం చేరవచ్చునని, 'వారు' ఈ విధంగా శిక్షణ ఇస్తున్నారు.

అలా అలా బాబూజీ నేర్పుతున్నారు. నేను ఇలా నేర్చుకుంటున్నాను. ఒక్కొక్కసారి నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే, నాలో అప్పుడు ఆలోచనలుగాని, మాటలుగాని ఉండవు. కాని అదంతా వ్రాయబడిన తరువాత చదివాకగాని అదేమిటో నాకు తెలియదు.

బ్రహ్మవిద్య మాటలతో నేర్చుకోవటం అసాధ్యం. దీనిని నేర్చుకోవడానికి మాటలు ఉండవు. ఇది దైవం యొక్క హృదయం నుంచి ప్రవహిస్తుంది. అలా అందుకోవటం జరుగుతుంది. అందుకే బాబూజీ అన్నారు – అనుభూతియే హృదయ భాష అని. కనుక అనుభూతి ద్వారానే ఏదైనా తెలుసుకోవటం జరుగుతుంది.

బాబూజీ చెప్పినవన్నీ యదార్థమని నిరూపించబడతాయి. తాము మానవాళి కొరకే దిగి వచ్చామని, తాము పొందినది అంతా ఇక్కడే వదలి వెళ్తామని, మానవమాత్రులు దానిని సంగ్రహించుకోవాలని, 'వారు' చెప్పారు. 'వారు' ఇక్కడే ఉండి, బోధించాల్సినవన్నీ బోధిస్తున్నారు. దానిని నేను నేర్చుకుంటున్నాను. ప్రిసెప్టర్లు, అభ్యాసులు కూడా నేర్చుకుంటున్నారు. బ్రహ్మవిద్య అనేది హృదయం నుంచే వస్తుంది అని గ్రహించాలి.

నాకు కొద్ది రోజుల ముందు "దైవం నీలోనే ఉన్నాడు" అనే వాక్యానికి ఋజువు ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం దొరికింది. మొట్టమొదటిగా దైవం అంతటా ఉన్నాడనేది ఒక జవాబు. అది నిజం కూడా. నేను ఉన్నాను, నీతో మాట్లాడేటపుడు నీవు ఇలా ఉన్నావు, అలా ఉన్నావు, నీవు ఇది చేశావు, అది చేశావు అని అంటున్నప్పుడు 'యూ' అనగా 'నీవు' అనేది విశేషంగా (పైచేయిగా) అవుతుంది. ఈ విధంగా ఆలోచించినట్లయితే బాబూజీ చెప్పినట్లు దైవం నీలో ఉన్నాడు అనేది అంగీకారయోగ్యమవుతుంది. ఈ 'నీవు' అనే దానిని మనం నిత్య జీవితంలో అప్రయత్నంగాను, అనాలోచితంగాను అంటూనే ఉంటాం. ఇక్కడ 'నీవు' అనేది వ్యక్తి మాత్రంగా ఉంటుంది. ఆధ్యాత్మికంగా పురోగమిస్తున్నప్పుడు నిన్ను నీవు మరచిపోవటమూ, 'నేను' అనేది బాబూజీతో సంధానమైపోవటం జరుగుతుంది. 'నేను' అనేది బాబూజీకి అర్పితమైపోయింది కనుక, 'నేను' అనిపించినా అది 'నీవు' అనగా దైవమే అవుతుంది. ఇటువంటి స్థితిలో 'నేను' అనే దానిలో అహం ఉండదు. అంతా బాబూజీతోనే సంధానమై ఉంటుంది. అభ్యాసీలో తపన,

'వారి'తో అనుబంధం (అటాచ్‌మెంట్) గాఢంగా ఉండాలి. అవి ఉంటే సంకల్పానికి బలం చేకూరుతుంది. దీనికి నేను ఉదాహరణగా ఉన్నాను. శారీరకంగా శక్తి లేదు. ఇక్కడకు రావాలన్న సంకల్పం ఉంది. అనుమతి కోసం ఉత్తరం వ్రాసింది. అంగీకరించక తప్పలేదు. ఆ విధంగా సంకల్పానికి బలం చేకూరుతుంది. నేను కూడా ఎక్కడికీ వెళ్ళకూడదని అనుకుంటాను. కాని సందర్భాన్నిబట్టి వెళ్ళాలని సంకల్పించినపుడు ప్రయాణం కొనసాగుతుంది. ఎన్ని రోజులు పర్యటించి వచ్చినప్పటికీ అలుపు అనిపించదు. అందుకు శక్తిని బాబూజీయే సమకూరుస్తారు. ఒకసారి మా తల్లిగారు షాజహాన్‌పూర్ వెళ్ళాలనుకున్నారు. డాక్టర్ ఆమె ఆరోగ్యరీత్యా వెళ్ళవద్దని సలహా నిచ్చారు. ఆమె వెళ్ళటానికి నిర్ణయించుకోవటమేగాక మృత్యువుకు కూడా భయపడలేదు. "ఏదో ఒక రోజున పోక తప్పదు. అదే షాజహాన్‌పూర్‌లో జరిగితే అంతకంటే అనందం ఏముంటుంది?" అని తర్కించారు.

అక్కడకు వెళ్ళాక బాబూజీ ఆ విషయమే ప్రస్తావించినపుడు ఆమె "నేను మీకంటె కూడా దృఢంగా ఉన్నాను" అని బదులిచ్చారు. అనగా సంకల్పం యొక్క శక్తి అటువంటిదన్న మాట. సంకల్పం ఆత్మ నుంచి శక్తిని పొందుతుంది. ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందేవారిలో థాట్స్ (ఆలోచనలు) క్రమంగా తగ్గుతూ ఉంటాయని బాబూజీ చెప్పారు. ఒకవేళ వచ్చిన థాట్ ఏదైనా ప్రమాదకరమైనదిగా తోస్తే అపుడు బాబూజీతో "అది మీదే" అని అనుకోవాలి. ఇటువంటిది ప్రకృతి సిద్ధం అని బాబూజీ అన్నారు. అది ప్రమాదకరమైనదైతే బాబూజీ దానిని తొలగిస్తారు. థాట్ మంచిది అని మీకు తోస్తే దానికి శక్తి సమకూరుతుంది.

**ప్రశ్న: శ్రీ లాలాజీ మహరాజ్‌కు ఆది గురు, సద్గురు, సమర్థ గురు – ఈ పేర్లు ఎలా వచ్చాయి?**

**జవాబు:** ఈ పేర్లు ప్రకృతి సిద్ధంగా వచ్చినవే కాని ఎవ్వరూ ఆపాదించినవి కావు. మానవాళికి సాక్షాత్కారం లభ్యం చేయటానికీ ఆదిశక్తిని భూమి మీద అవతరింపజేయటానికి సిసలైన (టెక్నిక్) నిపుణతను ప్రయోగించిన వారు కనుక వారికి "ఆది గురువు" అనే పేరు సార్థకమైంది. 7 నెలల అకుంఠిత తపస్సుతో ఆదిశక్తిని, తమ విన్నపం ఆలోకించేటట్లు చేసి, భూమి మీదకు అవతరింపజేయటంలో సఫలమయ్యారు కనుక "సమర్థ గురువు" ఖ్యాతిని వహించారు. "సద్గురు" అనగా సత్ + గురు దైవానికి దరిచేర్చేవారు. కనుక సద్గురుగా మనకు వందనీయులయ్యారు.

అంతిమశక్తిని పుడమిపై అవతరింపజేయాలని ప్రకృతికి తలంపు కలిగింది. గతంలో ఇది ఎవ్వరికీ సాధ్యపడలేదు. లాలాజీగారి గురుదేవులు కూడా ప్రయత్నించి ఫలితం సాధించలేకపోయారు. ఆ దివ్య కార్యాన్ని లాలాజీకి అప్పగించారు. వారు దానిని సవాలుగా తీసుకొని ఏడు నెలలు అకుంఠిత దీక్షతో తపమాచరించి, శ్రమించి సాధించారు. ఆ కార్య సాధనలో లాలాజీ సాహెబ్ ఒక యోధుడుగా నిలిచారు. దాని ఫలితంగా ఆదిశక్తి తన శక్తి సమేతంగా బాబూజీగా అవని మీద అవతరించింది.

డాక్టర్ వరదాచారిగారు ఒక సందర్భంలో బాబూజీని, "దేవాలయాలు ఎత్తయిన ప్రదేశాలలో ఎందుకు నిర్మించబడ్డాయి?" అని ప్రశ్నించారు. దానికి బాబూజీ ఇలా సమాధానం ఇచ్చారు: "ఆ విధంగా శ్రమకోర్చి పైకి ఎక్కేటప్పుడు మీకు భగవంతుని గూర్చిన ఆలోచన, ధ్యాస కలుగుతాయి. అక్కడకు చేరేసరికి భక్తి, ఆనందమూ కలుగుతాయి. ఒక అనుభూతి నిలిచిపోతుంది. అదే విధంగా సహజమార్గ విధానంలో అంతిమం

కూడా అందరానంత ఎత్తుగా ఉంది. అయినప్పటికీ భగవంతుని యందు ప్రేమ, శ్రద్ధాభక్తులతో అక్కడకు చేరవచ్చు. ఆశాభంగం కలగదు." భగవంతుడు పైన ఉంటే భౌతిక ప్రపంచం దిగువన ఉంది.

ఒక సోదరి నా కోసమై ఇక్కడికి వస్తానంటే నేను నిరాకరించాను. "ఆధ్యాత్మికత కొరకు ఆర్తీ, దైవం కొరకు తపన ఉంటే రావచ్చు. నా కోసమే అయితే వద్దు" అని తెలియజేశాను. ఇక్కడకు వచ్చాక –బాబూజీ నీకు ఇంకా ఇంకా సమీపమవుతున్నారు అనే అనుభూతి కలిగితే ఇక్కడకు వస్తూ ఉండవచ్చు. అలా కానప్పుడు "ఆ రాక నిరుపయోగం; బాబూజీ లేకుండా సిస్టర్‌గా నేను లేను" అని చెప్పాను. మన దృష్టి రెండు కోణాల్లో ఉంటుంది. ఊర్ధ్వముఖంగా అనగా దైవంవైపు సారించబడుతుంది. అథోముఖంగా అంటే ప్రాపంచికంగా అవుతుంది. మానవుల దృష్టి అంతిమంవైపు సారించబడాలి, అనేదే బాబూజీ ఆశయం. సహజమార్గం బోధించేది ఇదే. అంతరంగంలో తపన చెందుతూ అంతిమంలో బాబూజీని చేరటానికి ఆరాటపడేటటువంటి విజయవాడ సోదరిలాంటి వారికి శారీరక బాధలు ఇబ్బందికరం కావు. ఆంతరికంగా బాబూజీలోనే లీనమై ఉంటే భౌతికానుబంధం ఉండదు.

అదే విధంగా ప్రిసెప్టర్ తపన కలిగి బాబూజీకి సమర్పితమైనవారుగా ఉంటే అభ్యాసికి ప్రిసెప్టర్ ద్వారా ప్రాణాహుతి వస్తుంది. ప్రిసెప్టర్ అలా కానట్లయితే ప్రాణాహుతి అభ్యాసీకి మూలం నుండి నేరుగా వస్తుంది. ప్రిసెప్టర్ ప్రాణాహుతిని జీర్ణించుకుని అభ్యాసికి తన ద్వారా ఇవ్వగలిగితే మంచి ఫలితం ఉంటుంది. అభ్యాసీ తన దృష్టిని బాబూజీవైపు గాఢంగా మళ్ళించగలుగుతాడు. ఆ విధంగా ప్రిసెప్టర్ అభ్యాసీకి మంచి సేవ సమకూర్చినట్లవుతుంది. డాక్టరయితే శారీరకమైన సేవ సందిస్తారు. మన డాక్టర్‌గారు రెండు విధాలా సేవ చేస్తున్నారు. మీరు శ్రీరామచంద్ర మిషన్‌లో చేరారు కనుక దైవ సాక్షాత్కారం కోసం ఇంకెక్కడా వెదకనవసరం లేదు.

బాబూజీకి నాకు ఏమీ రాదని తెలుసు. అయినా నన్ను ఫ్రాన్స్ దేశానికి పంపారు. అక్కడివారు – మీ ఇండియాలో ముఖ్యంగా పాప పుణ్యాల ప్రస్తావన ఉంటుంది కదా, అదేమిటి అని అడిగారు. తక్షణమే నాకు జవాబు తట్టింది. **'SIN'**, **'SUN'** అనే పదాలు రెండున్నాయి. ఆ రెండింటిలోను మొదటి అక్షరం, చివరి అక్షరం ఒక్కటే. **'SIN'** లో మధ్యనున్న అక్షరం **'I'**కాగా **"SUN'**లో **'U'** అవుతుంది. ఇందులో **'I'** (అనగా అహం) ప్రాముఖ్యత వహిస్తే అది భౌతిక బంధనమవుతుంది. 'యు' **(U)**కు ప్రాధాన్యతనిస్తే దైవార్పితమవుతుంది. అంతే! బాబూజీ ఇది విని నీవు చాలా తెలివైనదానివి అని అన్నారు. కనుక మనం బాబూజీకే అర్పితమై వారితో సంబంధం కలిగి ఉంటే వారే మన సమస్యలకు సమాధానం స్ఫురింపజేస్తారు. ఆ ప్రశ్న వారినే తాకి, జవాబు అలానే వెలువడవుతుంది.

ఫ్రాన్స్‌లో అడిగిన రెండవ ప్రశ్న భయం, ప్రేమ గురించి. దీని గురించి బాబూజీ తమ పుస్తకంలో వ్రాశారు. ఏదో ఒకటియేగాని రెండూ ఉండటం జరగదు.

ఒకసారి నేను షాజహాన్‌పూర్ వెళ్ళినపుడు బాబూజీ బంధువు మీరా అన్న ఆమె నాతో – అందరూ బాబూజీ సమాధిని దర్శించి వెళ్ళుతున్నారు. మీరు ఎందుకు అలా చేయటంలేదు – అని అడిగింది. అందుకు నేను, బాబూజీ నా ఎదుటే ఉండగా లేరని ఎలా అనుకుంటాను – అని జవాబు చెప్పాను. భౌతికరూపం లేదు కనుక దివ్యపురుషులు లేరనుకోవటం తగదు. భస్మంలో ఏముంటుంది అని బాబూజీ కూడా అనేవారు.

బాబూజీకి మనం ఇవ్వవలసింది ఆధ్యాత్మిక నిధినే కాని ధనం కాదు. ధనాన్ని 'వారు' స్వీకరించరు. ధనం పోగుచేసేచోట ఆధ్యాత్మికత ఉండదు అని బాబూజీ చెప్పారు. ఇప్పుడు ఆధ్యాత్మికతను పంచిపెట్టాల్సిన చోట సంపదకు స్థానం ఇస్తున్నారు. ఆధ్యాత్మికత ధనంతో కొనబడేది కాదు.

మన ఒక ఆశ్రమంలో "గుర్తింపు కోసం బాడ్జికి ప్రాధాన్యమిస్తున్నారు. మిషన్‌కు ప్రాధాన్యత నివ్వవలసిన చోట బాడ్జికి ప్రాధాన్యమిస్తున్నారు" అని విమర్శించాను. బాబూజీ అందరినీ ప్రేమిస్తే ఇక్కడ బాడ్జి (సింబల్)కే విలువ నిస్తున్నారు. ఇలా అనేకసార్లు నేను విమర్శ చేయటం చూసి ఒక అభ్యాసి నాతో "ప్రతిసారీ మేము ఓటమి పాలవుతున్నాం" అని వాపోయాడు.

ఒకసారి ఒక సెంటర్‌లో ధ్యానానికి వెళ్ళినపుడు నా బాడ్జి మరచిపోయాను. దాని కొరకు మళ్ళీ కొంత దూరం వెళ్ళి నా బస నుంచి తెచ్చుకోవాలి. అందుకు తటపటాయించాను. వాలంటీర్ నన్ను లోపలికి ప్రవేశించకుండా అడ్డుకోవటం జరిగింది. "అలాగైతే సరే. హాలు బయటనే కూర్చుంటాను" అని అక్కడే కూర్చుండిపోయాను. ఇంతలో లోపల ఉన్న అభ్యాసీ ఒకరు నన్ను గుర్తించి, లోనికి ప్రవేశం కల్పించారు.

కొన్నిచోట్ల మెంబర్‌షిప్‌కు డబ్బు వసూలు చేస్తున్నారు. బాబూజీ విషయానికి వస్తే, 'వారు' ప్రేమ, ఆధ్యాత్మికతలను పంచుతూ ఉచిత ప్రవేశం కల్పించారు. ఆధ్యాత్మికత సంస్థలలో చందాలు వసూలు చేయటానికి 'వారు' విరుద్ధం. 'వారు' తమ నిఘంటవు (Dictonary) నుంచి 'డొనేషన్' అనే మాటను తొలగించమన్నారు. 'వారి' మాటలు ముత్యాల మూటలు.

ఆధ్యాత్మికత అనేది కొంటే దొరికేది కాదని బాబూజీ చెప్పారు. బాబూజీ అందరి కొరకు వచ్చారు. 'వారు' ఇచ్చే ఆధ్యాత్మికానందాన్ని 'వారి' పాదపద్మాల చెంత ఉండి, మనమందరం పొందుతున్నాం. ఆ విధంగా మనం అదృష్టవంతులం. అలా ఎంతోమంది తపనతో, భక్తితో ప్రోగ్రెస్ అవుతున్నారు. 'వారు' పొందుతున్న దివ్యానందం యొక్క అనుభూతి, దివ్యకృపల కారణంగా వారి శారీరక బాధల్ని తేలికగా భరించగలుగుతున్నారు. ఇటువంటిది పరమ పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ కృపవల్లనే సాధ్యమవుతుంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ప్రత్యేకమైన విధి నిర్వహణ కోసం క్రింది (తక్కువ) శక్తి వలయాల నుంచి వచ్చారు. బాబూజీ మాత్రం అంతిమం నుంచి అందరినీ అంతిమం చేర్చటానికి దిగి వచ్చారు. 'వారి' ప్రేమ అపారం, దివ్యం.

మా తల్లిగారికి, స్వల్పంగా గుండెపోటు వచ్చిన సందర్భంగా ఒకసారి చూడటానికి వచ్చారు బాబూజీ. 'వారు' ఆమెను 'అమ్మా' అని సంబోధించేవారు. వారు – "అమ్మా! నీ గుండె నా గుండె కంటే చాలా బలమైనది" అన్నారు. అపుడు వెంటనే మా తల్లిగారు –"నా గుండె చాలా బలమైనది, అందుకే ఈ గుండె దెబ్బ నాది, నీవు ఇక్కడున్నావు గదా! ఢీకొంటున్నది నేను" అన్నారు. (అనగా ఆమె గుండె బాబూజీ గుండెను అనగా హృదయాన్ని ఢీ కొన్నట్లుగా అంటే హృదయాన్ని దోచుకున్నట్లుగా భావింపవచ్చు). అప్పుడు బాబూజీ– "అమ్మా! నేను ఓడిపోయాను" అని అన్నారు. 'వారి' సంభాషణలో హాస్యం కూడా తొంగి చూస్తూ ఉంటుంది.

బాబూజీ దక్షిణ భారతదేశ పర్యటనకు వెళ్తూ ఉండేవారు. ప్రయాణం రెండున్నర రోజులు ఉండేది. రిజర్వేషన్ ఉండేది కాదు. చాలా రద్దీగా ఉండేది. ఆ సందర్భంగా బాబూజీని మీరెలా పందుకుంటారు అని అడగ్గానే –"నేను మాస్టర్ ఈశ్వర్ సహాయ్ చేతుల్లో తలపెట్టి పందుకుంటాను. ఆయన ప్రక్కన ఉన్న వారి చేతుల్లో తలపెట్టి పందుకుంటారు. ఎందుకంటే ఆయన తల పెద్దది గదా!" అన్నారు. ఆ విధంగా 14 సార్లు పర్యటించి తర్వాత రిజర్వేషన్ చేయించుకోవటం మొదలుపెట్టారు.

బాబూజీ వరండాలో కూర్చుని ఉన్నారు. అంతర్గతంగా ఏదో జరుగుతోంది. అదేదో నాకు అప్పుడు అర్థం కాలేదు. తర్వాత తెలుసుకున్నాను. మధ్య మధ్య బాబూజీ పచార్లు చేస్తున్నారు. భూమి కదుల్తూ ఉంది. బాబూజీ కూర్చుని లేస్తూ ఉన్నారు. బాబూజీ ఆగి ఉన్నప్పుడు భూమి 'వారి' పాదాలవద్ద సమర్పితమైపోతోంది. భూమి 'వారి' పాద స్పర్శతో పులకితమైపోతోందన్న మాట. ఆ అవకాశం కోసమే భూమి ఆరాటపడుతోందని అర్థమయ్యింది. 'వారు' దివ్య పురుషులు అని నిర్ధారించుకోవటానికి ఇదే నిదర్శనం.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ డివైన్ పర్సనాలిటీ అయి ఉండి భూమి మీద ఎందుకు సంచరిస్తున్నారు?**

**జవాబు:** 'వారు' మన కోసమే దిగి వచ్చారు. 'వారు' అందరినీ ప్రేమిస్తారు. మానవజాతి సమస్తమూ 'వారి' హృదయంలో ఉంది. కాని ప్రేమ అనే ప్రత్యేక భావం మాత్రం ఉండదు. ఎందుకంటే, అది యూనివర్సల్ అనగా సార్వత్రికమైనది. సమస్త మానవాళి పురోగమించి అంతిమం చేరాలన్నదే 'వారి' ధ్యేయం కనుక ప్రత్యేకమైన ఫీలింగ్ (అనుభూతి) ఉండదు. డివైన్‌లో స్థూలత్వం ఉండదు. అది మనలోనే ఉంటుంది. రూపం ఉండదు. సామీప్యతానుభూతి ఉంటుంది. మనం 'వారి' దివ్య సంకల్పంలో ఉన్నప్పుడు మన అంతరంగంలో, దివ్యంతో ఉన్న సంబంధం అనుభవమవుతుంది. ప్రేమానుభూతి కలుగుతుంది.

ఒకసారి నేను, బాబూజీ, రామేశ్వర ప్రసాద్‌గారు, మాస్టర్ ఈశ్వర సహాయ్‌గారు కూర్చుని ఉన్నాం. అంతలోనే రామేశ్వరప్రసాద్, "ఓ....బ్రదర్ కడుపులో నొప్పి, నొప్పి" అని అన్నారు. ఈశ్వర సహాయ్‌గారు సంగతి ఏమిటని అడిగారు. అపుడు బాబూజీ అంతర్గతమైన అసలు సంగతి చెప్పారు. "బాధను, అలా ఆర్తితో ఆక్రందించక పోయినట్లయితే అతని (అభ్యాసీ) ప్రార్థన ఆలకించబడదన్న మాట. అంటే అపుడే అతని యొక్క ఆర్తి నన్ను చలింపజేస్తుంది" అని చెప్పారు. అనగా అది దివ్యమైన సహోదరభావం. అనగా బాధలో ప్రార్థన ఉంటేనే వారిని స్పర్శిస్తుంది.

'వారు' అందరినీ ప్రేమిస్తున్నారన్నది వాస్తవం. ప్రతిసారీ, ప్రతి మాటలోను 'వారు' సంపూర్ణ మానవాళి శ్రేయస్సు గురించే చెప్తూ ఉంటారు. 'వారి' అభీష్టం మనం గ్రహిస్తున్నాం. నేను అనుభూతి చెందుతున్నాను.

బాబూజీకి నేను ఒకసారి జాబు వ్రాస్తూ– "నాకు మీ ముఖవర్చస్సులో ఏదో తేడా కనిపిస్తోంది. ఏదో ఇబ్బంది కలుగుతన్నట్లుగా ఉంది. అది ఆస్తమా (ఉబ్బసం) అని నాకు అనిపిస్తోంది" అని వ్రాశాను. ఆ సమయంలో నిజంగా 'వారి'కి ఉన్న బాధ అదే. అప్పుడు 'వారు' "నీవు ఇప్పుడు వాస్తవికతను (రియాలిటీని) అనుభూతి చెందుతున్నావు" అని జవాబు ఇచ్చారు.

ఇలాగే మరోసారి – 'మీకు కడుపులో నొప్పిగా ఉంది, పందుకొని నిద్రపొండి, ఉపశమనం కలుగుతుంది" అని అన్నాను. అపుడు బాబూజీ, "నీవు నా డాక్టరువా!" అని అనగానే, "బాబూజీ! నేను ఎప్పుడూ పేషెంటునే" అని అన్నాను.

ఇలాంటి ఓ సందర్భాన్ని పురస్కరించుకొని ఈశ్వర్ సహాయ్‌గారు అడిగారు, "బాబూజీ! ఎవ్వరైనా బాధపడుతూ ఉంటే మనకు తెలుస్తుందా" –అని. దానికి బదులుగా బాబూజీ, "మన కుటుంబ సభ్యులు ఎవరైనా అయితే ఆ బాధ కొద్దిగానే తెలుస్తుంది. అలా కాకుండా డివైన్ కనెక్షన్ అనగా దివ్య సబంధం ఉన్నట్లయితే బాగా అనుభవానికి వస్తుంది" అన్నారు. అనగా ఆంతరికంగా సంబంధం ఉండాలన్నమాట.

నేను ఇప్పుడు బాబూజీ ముఖారవిందంలో దివ్య సౌందర్యాన్ని చూస్తున్నాను. దానిని చూడటం సాధ్యం కాదు. కాని బాబూజీ ఆ అంతర్‌దృష్టి నిస్తారు. అది భరించడం అసాధ్యం. ఆ ప్రయత్నంలో సర్వం మరచిపోవటమే జరుగుతుంది. **'వారి' ఆ దివ్య సౌందర్యం ముందు ఈ ప్రాపంచిక సౌందర్యం ఒక బిందువు – నలుసు వంటిది మాత్రమే.** నాకు ఇపుడు జ్ఞాపకం వస్తోంది ఏమంటే, నేను ఒకసారి బాబూజీతో – **నేను ధ్యానంలో కుర్చొని ఈ ప్రాపంచిక సౌందర్యాన్నంతటినీ చూస్తాను" అని అన్నాను. అపుడు 'వారు' –"బిటియా! నీవు దివ్య సౌందర్యాన్ని దర్శించు. దీని ముందు ఆ ప్రాపంచిక సౌందర్యం ఒక్క చుక్క మాత్రమే" అని చెప్పారు. ఆ దివ్య సౌందర్యాన్ని వర్ణించటం, వ్రాయటం సాధ్యం కాదు.**

మద్రాసు ఆశ్రమానికి వెళ్తూ ఉండే అభ్యాసీ ఒకరు నా వద్దకు వచ్చాడు. అతడిని అక్కడి ప్రిసెప్టర్ ఒకరు, "ఐయామ్ నథింగ్, ఆయామ్ నథింగ్" అనగా "నేనేమీ కాను, నేనేమీ కాను" (అనగా శూన్యం) అనుకోవటం ప్రాక్టీసు చేయమని చెప్పారట. నన్ను అదేమిటి అని అడిగాడు. దానికి నేను ఇలా చెప్పాను: "నీవు నేనేమీ కాను, (నథింగ్‌నెస్) గురించి పదే పదే స్మరిస్తున్నావంటే ఆ నథింగ్‌నెస్ కండిషన్ అనగా శూన్యతా స్థితిని ఎప్పటికీ పొందలేవు. నిన్ను నీవుగా పదే పదే ఉన్నట్లుగా తలపోస్తూ ఉండగా ఏమీ లేకపోవటం ఎలా అవుతుంది. నీవు ఇక్కడ ఉన్నావనుకుంటూనే లేకపోవటం ఎలా అవుతుంది. నిజంగా ఆ స్థితి కలిగినపుడు నిన్ను నీవు మరచిపోవటం జరుగుతుంది. నేను లేను, నేను లేను అని స్మరించేకంటే దైవం నీలోనే, ఇక్కడే ఉన్నాడని స్మరించుకో" అని చెప్పాను.

సహజమార్గంలో చేరిన అభ్యాసీ మొదటి రోజు నుంచే దైవం తనలోనే ఉన్నాడని భావించుకోవాలి. తన లోపల దివ్యకాంతి ఉందనుకొని, ఆ కాంతిలోనే మునిగి ఉండే ప్రయత్నం చేయాలి. ఆ విధంగా చేస్తే నీలో దైవం, దివ్యకాంతి దర్శనమవుతాయి. చీకటి అనే ప్రస్తావన ఉండకూడదు. ఒకవేళ చీకటి ఉంటే దానిని ఎలా చూడగలం! కనుక **నమ్మకం ఉంచి సాధన చేస్తే ఈ జీవితకాలంలో దివ్యత్వాన్ని పొందకపోవటం అనేది ఉండదు.**

శ్రీరామచంద్ర మిషన్ అనేది ఒక ఆధ్యాత్మిక సంస్థ. ఇందులో బాబూజీ తమ శక్తి నిస్తారు. నేను అర్థం చేసుకున్న దానినిబట్టి దీనిని సంస్థ అనుకోవటం కంటే, ఇది సమస్త మానవాళిని అంతిమం చేర్చి లయింపజేసేదిగా అర్థం చేసుకోవాలి. శ్రీరామచంద్ర మిషన్ యొక్క ధ్యేయం, సంకల్పం ఇదే.

సహజమార్గ విధానంలో చేరామంటే సహజమైన విధానంలో జీవించటం – సహజమైన రీతిలో దైవాన్ని పొందటమే. అంతేగాని ప్రత్యేకమైన విధానం అనేది కాదు. ఒక సహజమైన పద్ధతిలో మనకు దివ్యశక్తి సమకూరుతూ ఉంటుంది. అప్పుడు ఆ విధానం ఏమిటో అర్థమవుతుంది. నీలో దైవాన్ని చూడటం అంటే నీవు బాబూజీ మహరాజ్‌ను చూడటం, బాబూజీ మహరాజ్ నిన్ను చూడటం. ధ్యానంలో మునిగి ఉండటమే నీవు చేయాల్సిన పని. ఏది ఎలా జరుగుతుందో నీకే అర్థమవుతుంది.

బాబూజీ మహరాజ్ ప్రిసెప్టర్‌కు సెంట్రల్ రీజియన్ నుంచి కనెక్షన్ ఇస్తారు. ఎవ్వరైనా స్వప్రయత్నంతో తమ హృదయంలో సంబంధం తప్పించుకోవటానికి ప్రయత్నించినట్లయితే అది క్రమంగా క్షీణించి ఒకానొక సమయంలో ఏమి లేకుండాపోతుంది. **బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమ అద్భుతమైనది, అపారమైనది మరియు అత్యంత శక్తివంతమైనది.** నేను దానిని పొందుతున్నాను. 'వారి' శక్తియే ఈ విశ్వాన్ని పరిపాలిస్తోంది. 'వారి' పాలనలోనే మనం జీవిస్తున్నాం. త్వరలోనే కాలం మార్పుచెంది అందరూ దీన్ని తెలుసుకొనే సమయం ఆసన్నమవుతుంది.

ఒక అభ్యాసీ రెండేళ్ళ తర్వాత ఎప్పుడో వస్తాడు. మార్పు ఉండదు. అయినా 'వారు' ఇస్తూనే ఉంటారు. ఇది మన సిస్టమ్ ప్రత్యేకత. బాబూజీ మహరాజ్ యొక్క కృపా విధానం.

అభ్యాసీ ఒక విపత్కర స్థితిలో ఉంటాడు. బాధ కలిగినపుడు ఒక ప్రక్క తన శరీరం తాకుతుంటాడు. అతని ధ్యానస్థితి మాత్రం అతని బాధను స్పర్శించదు. ఈ విధంగా ఎవరైనా ధ్యానంలో కూర్చుంటే వారు ప్రతి నిమిషమూ ట్రాన్స్‌మిషన్ పొందుతారు. కండిషన్ కూడా దానంతటదే మారిపోతుంది.

అలహాబాద్‌లో మా అంకుల్ బాబూజీని అడిగారు –"మరణ సమయంలో ఎవ్వరైనా మిమ్మల్ని స్మరణలో నిలుపుకొనకపోతే మళ్ళీ జన్మ తీసుకోవలసిందేనా" అని. బాబూజీ చెప్పారు – "నీవు నీ జీవితకాలంలో నాతో కనెక్షన్ (సంబంధం) కలిగి ఉన్నావు. నీవు మరచిపోయినా నేను మరచిపోను, నేను ఎప్పుడూ ఉంటాను" అని.

అభ్యాసీ బాబూజీని జ్ఞాపకం చేసుకున్నపుడు 'వారు' కూడా వెంటనే అభ్యాసీని జ్ఞాపకం చేసుకుంటారు. అలా జరగ్గానే మనం 'వారి'తో సంబంధం కలిగినట్లుగా అనుభూతి చెందుతాం. జ్ఞాపకం చేసుకోవడం అనే మాటనే మరచిపోతాం. ఆ విధంగా అనుబంధం, తపన ఉండాలి.

**సత్సంగ్ అనగా సత్ + సంగ్ అనగా దైవంతోటి కలయిక.** నీవు బాబూజీని ప్రార్థిస్తున్నావు. బాబూజీ అంతిమంతో సంబంధం కలిగి ఉన్నారు. ధ్యానంలో మునిగిపోతే బాబూజీ మహరాజ్‌నే దర్శిస్తావు.

**ధ్యానానికి ఉపక్రమించబోయే ముందు కొందరు "స్టార్ట్ మెడిటేషన్" (ధ్యానం ప్రారంభించు) అంటారు. వాస్తవానికి అభ్యాసీ అయినవారు ధ్యానం అంతకుపూర్వమే ప్రారంభించినవారవుతారు. కనుక తిరిగి ఇప్పుడు ప్రారంభించమని అనటం సబబు కాదు. "సిట్ ఇన్ మెడిటేషన్" అనగా "ధ్యానంలో కూర్చోండి" అని అనటం సరైన పద్ధతి.**

సుబ్బారావుగారి భార్య మరణ సమయంలో ఆమె స్థితి దివ్యాశీస్సులతో ఆవరించబడి ఉంది. 'ఐ'నెస్ అనగా అహం కరిగిపోతోంది. ఆమె ఆ దివ్య ఆవరణలో మునిగిపోతోంది. అప్పుడు ఆమె తలచుకొనకపోయినా బాబూజీ కృప ఆమెపై వర్షించింది.

**ఉన్నత స్థితిని కల్పించినప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోని ఒకరి విషయమై బాబూజీ ఇలా అన్నారు: "నేను ప్రేమతో దాన్ని నీకు ఇచ్చాను. నేను నా బిడ్డకు ఒక అందమైన ఇల్లు ఇచ్చాననుకుంటే అతడు, దానిని ఉపయోగించుకోకుండా పాత స్థలంలోనే, పాత ఇంటిలోనే ఉంటానని, ఉంటున్నట్లుగా ఉంటుంది. అతడు చనిపోయేటపుడు ఆ స్థలం (అంతిమం) గుర్తు చేసుకుంటే సరి! లేకపోతే రెండు, మూడు జన్మలు తీసుకోవాలి."**

లయావస్థ స్థితిలో తపన, భక్తి పరిమితంగా ఉంటాయి. అభ్యాసీ యొక్క స్థితి నిలకడగా ఉంటుంది. దివ్యత్వమే అతడిని అంతిమంకు తీసుకువెళ్ళటానికి దిగి వస్తుంది. నిశ్చలత్వం (నిలకడ) ఉండి ఏ మార్పూ లేనట్లుగా ఉంటుంది. బాబూజీ మహరాజ్‌లో లయావస్థ కలిగే సమయంలో మన తపన, భక్తి, నిర్మలీకరణ అన్నీ కూడా మనల్ని వదిలివేస్తాయి. 'నేను' అనేది కలిసిపోయినట్లవుతుంది. సిస్టర్ తమ గీతంలో వ్రాయబడిన ఆధ్యాత్మిక ఉన్నతస్థితిని గురించి ఇలా వివరించారు:

భగవత్ సాక్షాత్కారం తర్వాత బాబూజీ నన్ను ప్రేమగా చేరదీసినపుడు, బాబూజీ తనను వీడి వెళ్ళుతున్నందుకు, భగవంతుడు విచారగ్రస్తుడైనట్లుగా నేను గమనించాను. ఇది నిజమని ఎప్పుడు తెలిసిందంటే, 'వారు' వెనుదిరిగి చూసినప్పుడు అనగా బాబూజీ భగవంతుణ్ణి ఓదార్చినట్లుగాను, మరొక అభ్యాసీని కూడా తీసుకువెళ్ళటానికి తిరిగి వస్తాను గదా! అన్నట్లుగాను ఉంది.

ఇంకొక విషయం ఏమిటంటే, శతాబ్దాల తరబడి బాబూజీ అవతరణ కోసం వేచి ఉన్న నేను ఇప్పుడు నా దివ్య నివాసానికి తరలిపోవాలి అన్నట్లుగా వినిపించింది. అప్పుడు నా యొక్క స్థితి ఎలా ఉందంటే, 'ం' అనగా ఒక శూన్యవృత్తంలాగా ఉంది. ఆ దృశ్యం చాలా అద్భుతంగా ఉంది. ప్రేమలోనే ఆ జీరో (శూన్యత)కు స్థానం దక్కుతుంది. బాబూజీతోపాటు ముందడుగు వేయటం జరుగుతుంది.

బాబూజీ అడుగుజాడల్లోనే, తమతోనే కలుపుకుని తీసుకు వెళ్ళుతున్నట్లుగా తోచింది. ఎందుకంటే, 'వారి' సహాయం లేకుండా గమనం ఉండదు. అక్కడ ఆనందంగాని, విచారంగాని ఏమీ లేవు. అక్కడ మరేమీ లేకపోయినప్పటికీ బాబూజీ మహరాజ్‌గారు ఉన్న అనుభూతితోనే నేను ముందుకు పోతున్నాను. అప్పుడు 'వారు' ప్రేమ దృష్టితో నా వంక చూస్తున్నట్లుగా తెలుసుకొని నేను ఒంటరిగా లేను అని అనుకున్నాను. అటువంటి ఉన్నతస్థితికి బాబూజీ మహరాజ్ ఏ విధంగా, దేని ద్వారా తీసుకు వెళ్ళతారు అనేది ఎవ్వరు చెప్పగలరు? నేను అక్కడికి చేరుకునే సరికి అక్కడి వాతావరణంలో ఏమీ లేదు. నేను "మై" ("నథింగ్‌నెస్") నెస్ అనేది కూడా లేదు. అప్పుడు నేను అంతిమం యొక్క ద్వారం చేరబోయేముందు బ్రైటర్ వరల్డ్‌ను చూశాను. అనగా బ్రైటర్ వరల్డ్‌ను దాటిన తర్వాతనే అంతిమం యొక్క ద్వారం తటస్థపడింది.

నేను అక్కడకు చేరేసరికి ఈ గీతంలో వ్రాసినటువంటి దాన్ని నా లేఖిని చూసి ఏమని వ్రాయాలా అని విస్తుపోతోంది. అపుడు ఆ దృశ్యం నా కళ్ళ ముందు నిలిచింది. అది ఏమిటంటే--

లాలాజీ సాహెబ్‌తో నేను "నీ కుమారుడు బాబూజీ మహరాజ్ ఎంత మహానుభావుడో కదా!" అని కీర్తిస్తున్నాను. అప్పుడు వెంటనే స్వామి వివేకానందగారి మాటలు నా చెవుల్లో రింగుమన్నాయి – "బాబూజీని నీవు ఇక్కడ లాలాజీ సాహెబ్ కుమారుడు అనకూడదు, 'వారు' ఇక్కడ అంతిమం యొక్క పుత్రునిగానే చెలామణి అవుతున్నారు" అని.

బాబూజీ ఎక్కువగా 'జాత్' అనే శబ్దాన్ని ప్రయోగించేవారు. 'జాత్' అనగా అంతిమం యొక్క శక్తి ప్రభావం. అనగా 'దివ్యతేజస్సు'. దివ్యత్వం మరియు సంపూర్ణ ఆధ్యాత్మికత లయమై ఉన్న స్థితి ఇక్కడ ఉంటుంది. ఇక్కడ నా బాబూజీ మహరాజ్ యొక్క ఆధిపత్యం, శక్తి నడుస్తున్నాయని నేను గ్రహించాను. ఒక్క క్షణంలో 'వారు' నన్ను తమలోకి తీసుకొని అంతిమం యొక్క మండలంలోనికి ప్రవేశపెట్టిన వెంటనే –

“ఓ సంధ్యా! నీవు తిరుగు ప్రయాణం చేయాల్సిన సమయం ఇది” అని పలికిన బాబూజీ వాణి వినిపించింది. ఆ మాటలు విని నాకు ఆశ్చర్యం కలిగింది. నేను అప్పుడు చూసాను – అది, తిరిగి వెళ్ళటానికి బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సంకల్పం అని. ఎందుకంటే, మానవ మాత్రులను అంతిమం చేర్చాలి అనునట్టి ‘వారి’ సంకల్పం నెరవేరింది కనుక. ఆ సమయంలో అభ్యాసీ యొక్క తపన అనేది విలపిస్తూ వెనుదిరగటానికి సంసిద్ధమవుతున్నట్లుగా తోచింది. తపన అనే మాటను ఎందుకు ప్రయోగించానంటే, దానివల్లనే నేను అంతిమం చేరగలిగాను కదా! చేర్చగలిగినవారు బాబూజీ మహరాజ్ మాత్రమే. ఈ దృశ్యం నా ఎదుట ప్రత్యక్షం కాకుండా ఉంటే నేను వ్రాయలేను.

శ్రీ బాబూజీ మహరాజ్‌తో మేము ఎంతో స్వేచ్ఛగా, చనువుగా ఉండి ప్రతి విషయమూ అడిగి తెలుసుకొనేవాళ్ళం. బాబూజీ అంటే దివ్యపురుషుడు (డివైన్ పర్సనాలిటీ), గొప్ప మహాత్ముడు అని చాలామంది చెప్తారు. కాని వాళ్ళు ఎవ్వరూ బాబూజీ మహరాజ్ అనగా డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుని) గురించి ప్రత్యక్షంగా, అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. అందువల్లనే **బాబూజీ నా మీద ఆధ్యాత్మిక పరిశోధన చేసి, ‘వారు’ చెప్పిన ప్రతి మాటను మరియు సమస్త ఆధ్యాత్మిక స్థితులను గురించి వ్రాయవలసిందిగా నన్ను కోరారు. ‘వారు’ కోరిన విధంగానే నేను ఆధ్యాత్మిక యాత్రలోని అన్ని స్థితుల అనుభవాలను గురించి పుస్తకాలలో వ్రాశాను. బాబూజీ అంటే ఎవ్వరు? ఏమిటి? ‘వారి’ దివ్య దర్శనం ఎప్పుడు కలుగుతుంది? అనే తీవ్రమైన తపన, ఆవేదన మీలో ఉన్నప్పుడు మాత్రమే మీరు ‘వారి’ని చూడగలరు.** శ్రీ బాబూజీ మహరాజ్‌ను గురించి తెలుసుకోవడానికి మీరందరు కష్టపడి ఎంతో దూరం నుండి ఇక్కడకి వచ్చారు. ఇటువంటి ఆధ్యాత్మిక సమావేశాలవలన అభ్యాసులలో ప్రేమ, భక్తి మరియు శరణాగతి అనేవి మరింత ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి.

మీరు ఇక్కడికి బ్యాచీలుగా వచ్చిన విధంగానే, అభ్యాసులు బాబూజీని చూడడానికి షాజహాన్‌పూర్‌కు వచ్చినప్పుడు వారు “బిటియా! నన్ను నిజంగా చూడడానికి ఎవ్వరు రావడంలేదు. నా కోసం ఎవ్వరు రావడం లేదు. నీవు ఒక్కదానివి మాత్రమే నాకోసం వస్తున్నావు” అని నాతో అనేవారు. “బాబూజీ! వాళ్ళందరు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు. మీ గురించి తెలుసుకోవడానికే ఇక్కడకు వచ్చారు” అని నేను వారితో అనేదానిని. కాబట్టి ఇప్పుడు మీరు అందరు కూడా ఇక్కడకి బాబూజీ గురించి తెలుసుకోవడానికే వచ్చారు. అందువలన ఇక్కడ మీరు ఉండే ఈ 3,4 రోజులు కూడా ప్రతిక్షణం కేవలం ‘వారి’ ఆలోచనలోనే మునిగిపోవాలి. “మీరు ఎంతో దూరం నుండి వచ్చారు. ‘నేను’ కూడా ఆ అల్టిమేట్ నుండి, అనంతమైన దూరం నుండి ఇక్కడకు వచ్చాను” అని బాబూజీ అనేవారు. బాబూజీ సమస్త మానవాళికి దివ్యత్వాన్ని ప్రసాదించడానికి ఆ ‘భూమా’ నుండి అవతరించారు. అందువలన ‘వారు’ కోరుకునే విధంగా మీరు ఆ దివ్య ప్రసాదాన్ని తీసుకోండి. బాబూజీ కృప వలన ‘వారి’ బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు) వర్షంవలె వర్షిస్తున్నాయి. ప్రతి అభ్యాసీ కూడా బాబూజీ యొక్క కృప, ఆశీస్సులు మరియు ‘వారి’ దివ్య శక్తి యొక్క ప్రవాహంలో పూర్తిగా మునిగిపోవాలని నేను మీ అందరిని కోరుతున్నాను. తథాస్తు. ఎందుకంటే, నా పార్థనలు మీతోనే ఉన్నాయి కాబట్టి.

ఒకసారి బాబూజీ, "డివైన్ గ్రేస్ (దైవీయ కృప) వర్షంవలె వర్షిస్తున్నది కాని కొంతమంది గొడుగును పట్టుకోవడం వలన దానిని ఫీల్ కావడంలేదు. అనుభూతి చెందడంలేదు" అని అన్నారు. అందువలన మీరు మీ హృదయాన్ని బాబూజీ ఎదుట తెరచి ఉంచండి. అనగా మీ హృదయంలోను, మనస్సులోను, మీ ఎదుట, మీ లోపల కూడా బాబూజీయే ఉండాలి. మీ యొక్క ధ్యానం మరియు ప్రతి ఆలోచన, ప్రతి పని కూడా బాబూజీతోనే కనెక్షన్‌ను కలిగి ఉండాలి. ఈ దైవీయ కృప యొక్క వర్షం సందర్భంలో గొడుగు అంటే ఏమిటి? మీరు ఇక్కడికి వచ్చారు కాని బాబూజీ గురించి కాకుండా, ప్రాపంచికమైన విషయాలను గురించి ఆలోచించడం వలన అవి గొడుగులాగా అడ్డం పడతాయి. అందువలన ప్రాపంచికమైన వాటిని గురించి ఆలోచన చేయవద్దు. బాబూజీ యొక్క ప్రేమను గురించి ఆలోచించండి. 'వారు' మన కోసం ఎందుకు ఆ 'భూమా' నుండి అవతరించారు? అనే దానిని గురించి ఆలోచించండి. సాధ్యమైనంతగా కేవలం 'వారి'నే ప్రేమించండి. ప్రేమ అనే పదం కేవలం 'వారి' ఒక్కరితోనే ముడిపడి ఉండాలి. బాబూజీని స్మరించగానే, తలచుకోగానే 'వారి' డివైన్ ప్రజెన్స్ యొక్క ఫీలింగ్‌ను అనుభూతి పొందాలి. అప్పుడే బాబూజీ మీకు చాలా సమీపంలో ఉన్నారు అని అర్థం. బాబూజీ నాకు చాలా ఇష్టమైనవారు; నాలోనే ఉన్నారు; నాలో అణువణువునా వ్యాపించి ఉన్నారు – అని మనస్సులో అనుకోవటం కాదు, హృదయంలో ఆ ఫీలింగ్‌ను అనుభూతి చెందాలి.

**ప్రశ్న: మరణం యొక్క మరణం అంటే ఏమిటి?**

**జవాబు:** మరణం యొక్క భయం తొలగిపోయినపుడు అనగా మృత్యువు గురించి భయం తొలగిపోయినప్పుడు, అదే మరణం యొక్క మరణం అవుతుంది.

**ప్రశ్న: మనిషి చనిపోయిన తరువాత, ముఖ్యంగా బ్రాహ్మణులు, కర్మకాండ చేస్తారు. దానికి ఏదైనా ప్రాముఖ్యత ఉందా?**

**జవాబు:** దానికి ఎటువంటి విలువ కూడా లేదు. ధనం మరియు సమయాన్ని వృథా చేయడం మాత్రమే. ప్రజలను ఆ విధంగా కర్మకాండలు చేయవద్దు అని బాబూజీ ఎప్పుడూ అనలేదు. అవి తక్కువగా చేయాలి. నిజానికి ఆ విధంగా చేయవలసిన అవసరం లేదు. చెయ్యకపోతే, డబ్బులు ఖర్చు అవుతాయని చేయడంలేదని సమాజంలోనివారు విమర్శిస్తారు. ఇప్పుడు చేసే కర్మకాండలకు ఎటువంటి ప్రయోజనం లేదు. పూర్వం ఋషులకు ఆ శక్తి ఉండేది. పిండ ప్రదానం చేసినప్పుడు ఆ పిండం యొక్క జన్మ మూలకారణాన్ని ధ్వంసం చేసి, ఆత్మకు మరల పునర్జన్మ అనేది లేకుండా చేసేవారు. కాని ఇప్పుడు అటువంటి శక్తిగల పురోహితులు ఎక్కడ ఉన్నారు? కాని ఒక నిజమైన అభ్యాసీగా మీరు, మరణించిన ఆ వ్యక్తిని గురించి బాబూజీ మహరాజ్‌ను ప్రార్థించండి. అప్పుడు మీకు ఎటువంటి ఖర్చు లేకుండా, శ్రమ లేకుండా, బాబూజీయే ఆ పనిని అంతా చేస్తారు. **"జీవించి ఉన్న వారికి సేవ చేయాలి, మరణించిన వారికి ప్రార్థన చేయాలి" అని బాబూజీ అనేవారు.** మనవద్ద ప్రార్థన అనే శక్తి ఉంది, కాబట్టి మనం ఈ పనిని చాలా చక్కగా చేయగలం. మా పెద్దనాన్నగారి కుమారునికి ఈ కర్మకాండలు అంటే పూర్తిగా వ్యతిరేకం. మా తాతగారు చనిపోయినపుడు, ఆ ఆత్మ ప్రయాణించడానికి ఒక రిక్షా కావాలి అని పురోహితుడు అడిగాడు. అప్పుడు మా పెద్దనాన్న కుమారుడు, "ముందు నీవు నాకు ఆ దారిని చూపించు. అప్పుడు రిక్షాను తీసుకొని వస్తాను. ఆ రిక్షా కూడా నీవే తొక్కుతూ వెళ్ళాలి" అని పురోహితునితో కోపంగా అన్నాడు. కర్మకాండలు అంటే ఈ విధంగా ఉంటాయి.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ ఆరు రోజుల శిశువుగా ఉన్నప్పుడే లాలాజీ సాహెబ్ ఆ అల్టిమేట్ (భూమా) స్థాయి నుండి ప్రసారం చేసిన దివ్యశక్తిని అంతా తనలో లయం చేసుకున్నారు కదా! మరి బాబూజీ అంత శక్తి ఉండి కూడా అన్ని బాధలు, కష్టాలను ఎందుకు ఎదుర్కొన్నారు?**

**జవాబు:** మనం 'వారి'ని ఈ భౌతికమైన కళ్ళతో చూస్తున్నాం కాబట్టి, మనకు ఆ విధంగా అనిపిస్తుంది. కాని ఎన్నోసార్లు నేను బాబూజీని గమనించాను. కుర్చీలో నా బాబూజీ కూర్చొని ఉన్నారు. 'వారి' శరీరం మాత్రమే ఇక్కడ ఉంది. కాని 'వారు' ఎక్కడో, వేరే లోకంలో ఉన్నట్లుగా అనిపించేది. "నీవు ఈ భూమి మీద జన్మించావు కాబట్టి, ఈ బాధలు, దుఃఖాలను ఈ శరీరం తప్పనిసరిగా అనుభవించవలసినదే" అని బాబూజీ స్పష్టంగా చెప్పారు. ఒకవేళ బాధలు, దుఃఖాలు లేకపోతే, నేను అనుభవించవలసినది ఏమీ లేదు కదా! అని మానవులు అనుకుంటారు. అందువల్లనే బాబూజీ మనకు ఆ విధంగా కనబడేవారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మరియు డివైన్ పర్సనాలిటీ (బాబూజీ) వీరు ప్రపంచంలోని బాధలను, దుఃఖాలను తీసుకొని, వాతావరణంలో వ్యాపించి ఉన్నవాటి ప్రభావాన్ని తీసివేస్తారు. వారు కష్టాలను, దుఃఖాలను మనలాగా అనుభవించాల్సిన అవసరంలేదు. వారు వాటిని తమ సంకల్ప శక్తితో దగ్ధం చేస్తారు. కాబట్టి బాబూజీ బాధలను, దుఃఖాలను అనుభవించలేదు. మన కంటికి ఆ విధంగా కనబడుతుంది, అంతే. బాబూజీ మహరాజ్‌ను తలచుకోగానే మనం శాంతిని, ఆనందాన్ని పొందుతున్నాం. వారి స్మరణ వలన బాధయొక్క ఫీలింగ్ మనకు ఉండదు.

**ప్రశ్న: ఆత్మకు చావులేదు, అగ్నిలో దహించబడదు, శస్త్రాలతో ఛేదించబడదు - అని గీతలో చెప్పబడింది. కాని చనిపోయిన తరువాత ఆత్మ అనేది స్వర్గానికి లేదా నరకానికి వెళ్ళుతుంది, వైతరణి నదిని దాటాలనీ, యమ కింకరులు తీసుకువెళ్తారు- అని అంటారు కదా!**

**జవాబు:** అటువంటిది ఏమీ లేదు. మనలను భయపెట్టడానికే ఆ విధంగా వ్రాశారు. గోదానం చేస్తే పాపం తొలగిపోతుంది; ఇంకొక దానం చేస్తే పాపం పోతుంది అని అంటారు. దానం చేస్తే పాపం అనేది తొలగిపోతే, మరి రోజు రోజుకు పాపం ఎందుకు పెరిగిపోతున్నది?

ఆత్మ అనేది పరమాత్మలోని ఒక అంశ. ఆత్మ ఎప్పుడు కూడా జన్మించదు. కర్మల ఫలితంగా మనిషి పునర్జన్మ ఎత్తినప్పుడు ఈ ఆత్మ అనేది శరీరంలో ప్రవేశిస్తుంది. ఆత్మ అనేది శక్తి. ఆ ఆత్మ యొక్క శక్తివల్లనే మానవుడు నడిపించబడతాడు. కాని మానవునిలో 'నేను' అనే అహం ఏర్పడినప్పుడు ఆత్మ చుట్టూ పొరలు ఏర్పడతాయి. మానవుడు దైవాన్ని మరచిపోవడంవలన ఈ విధంగా జరుగుతుంది. ఎప్పుడైతే మనం బాబూజీ స్మరణలో ఉంటామో, అప్పుడు ఆత్మ చుట్టూ ఉన్న పొరలు అన్నీ కరిగిపోయి ఆత్మ యొక్క శక్తి మన అనుభూతిలోకి వస్తుంది.

ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు 2, 3 సెకండ్లు మాత్రమే అందులో మునిగిపోయినట్లుగా ఫీలింగ్ ఉంటుంది. మరల మరల ఆ ఫీలింగును జ్ఞాపకం చేసుకొని, దానిలో మునిగిపోవాలి. ధ్యానంలో కలిగే స్థితి మన స్వంతం. ఎందుకంటే, అది బాబూజీచేత ఇవ్వబడింది. నిరంతర స్మరణ అనేది తెగిపోకుండా చూసుకోవాలి. అవిచ్ఛిన్నంగా ఉండాలి. మనం ఎన్నో విషయాలను గురించి ఆలోచిస్తూ ఉంటాము. కాబట్టి స్మరణ అనేది నిరంతరం ఉండదు. నా హృదయం బాబూజీ స్మరణలో మునిగిపోయింది - అని మీరు

తేలికగా, ఒత్తిడి లేకుండా, అప్పుడప్పుడు అనుకోవాలి. ఏ ప్రిసెప్టర్‌వద్ద సిట్టింగ్ తీసుకున్నా సరే, ఎదుట బాబూజీ మహరాజ్ కుర్చొని ఉన్నారని, 'వారే' ప్రాణాహుతిని ఇస్తున్నారని భావించాలి. ఆ ప్రిసెప్టర్ సిట్టింగ్‌లో మీరు చాలా లోతుగా వెళ్ళడానికి కృషి చేస్తాడు. మీ మనస్సు ఆ స్థితిని స్పర్శించడంలేదు. కాని ఆ స్థితి మాత్రం మీదే. మీ స్వంతం. మనం చాలా అదృష్టవంతులం. ఎందుకుంటే ఇప్పుడు, ఈ శరీరం విడిచిన తరువాత కూడా మనం 'వారి' పవిత్ర పాదాలవద్దనే ఉంటాము.

బాబూజీ అంతటా వ్యాపించి ఉన్నారు కాబట్టి, ఈ ప్రపంచం అంతా కూడా షాజహాన్‌పూర్ అని చెప్పవచ్చు. సహజమార్గ్‌లో చాలామంది చేరతారు కాని నీవు సహజమార్గంలో నీ చోటును సంపాదించుకోవాలి. ఎప్పుడైతే నీవు అంతటా కూడా బాబూజీ యొక్క డివైన్ ప్రెజెన్స్‌ను ఫీల్ అవుతావో అప్పుడే నీకు సహజమార్గ్‌లో స్థానం లభించినదని అర్థం.

**కుటుంబ సభ్యులు లేదా క్రొత్త వారిని ఎవరినైనా సరే సహజమార్గ్‌లో చేరండి, అని మీరు ఎప్పుడు కూడా చెప్పవద్దు. విగ్రహారాధన లేదా ఇతర పూజలు మానివేయమని కూడా చెప్పకూడదు. సహజమార్గ్‌లో చేరాలని వాళ్ళమీద ఎటువంటి ఒత్తిడి కూడా చేయకూడదు. క్రొత్తవారు ధ్యానంలో చేరాలని, వారిని బాబూజీ పాదాలకు సమర్పించి, ప్రార్థన చేయండి. మీ ప్రవర్తన, నడవడికను చూసి, క్రొత్తవారు ముగ్ధులై సహజమార్గ్ సాధనలోకి ఆకర్షింపబడాలి** – అంతే.

సహజమార్గ్ పద్ధతి చాలా ప్రత్యేకమైనది. ఎందువలన?

**1.** ఈ పద్ధతి మానవ మనస్సుతో తయారుచేయబడలేదు. బాబూజీ మహరాజ్ అవతరించిన తరువాత శ్రీరామచంద్ర మిషన్‌ను రిజిష్టర్ చేసినప్పుడు ఈ సహజమార్గ్ పద్ధతి పైనుండి అనగా ఆధ్యాత్మిక వాతావరణం నుండి సత్యపథ్ స్థితి నుండి అవతరించినదని బాబూజీ చెప్పారు.

**2.** ఇతర పద్ధతులలో సాధకులను ఇది చెయ్యండి, అది చెయ్యండి అని రకరకాల సాధనా క్రియలను గురించి చెప్తుతారు. "ఈశ్వరుడు (గాడ్) నా హృదయంలోనే ఉన్నాడు" అనేది మాత్రమే గుర్తుపెట్టుకోమని బాబూజీ చెప్పారు. "అది చేయాలి, ఇది చేయాలి" అంటూ బాబూజీ ఎప్పుడూ ఏదీ చెప్పలేదు. "దైవం (డివైన్) నా హృదయంలోనే ఉన్నాడు" అని అనుకోవడంవలన, ఆ ఫీలింగ్ వలన మనలో దైవాన్ని గురించి తెలుసుకోవాలనే ఆరాటం, ఈశ్వర ప్రాప్తి కొరకు మనలో తపన (క్రేవింగ్) అనేది ఏర్పడుతుంది. సహజమార్గ్ పద్ధతి డివైన్ (దైవం)తో కనెక్ట్ అయి ఉన్నది.

**3.** వందల సంవత్సరాలు తపస్సు చేసిన తరువాతనే మునులకు, ఋషులకు దైవం యొక్క సహాయం లభించేది. కాని సహజమార్గ్‌లో అభ్యాసీ చేరిన మొట్టమొదటి రోజు నుండే బాబూజీ మహరాజ్ యొక్క దివ్య కృప లభించి, ఆ ఈశ్వరీయ ప్రకాశంలో నివసించడం ప్రారంభిస్తాడు. "ఈశ్వరీయ ప్రకాశం నీ హృదయంలో ఉంది. ఆ ఈశ్వరీయ ప్రకాశం (డివైన్ లైట్)లో నీవు మునిగిపోయి, భగవంతుని గురించి వెదకాలి" అని బాబూజీ, అభ్యాసీకి మొదటి రోజుననే చెప్పేవారు.

**4.** బాబూజీ తమ 'ప్రాణాహుతి' శక్తి సహాయంతో అభ్యాసీలో నిరంతర స్మరణను అభివృద్ధి చేస్తారు. దివ్యత్వం యొక్క స్మరణలో మునిగిపోవడంవలన బంధనాలు అన్నీ కూడా కరిగిపోతాయి. సహజమార్గ్

సాధన అనేది డివైన్ (దైవం)తో కనెక్షన్ కలిగి ఉన్నది. కాబట్టి ఈ సాధన వలన అభ్యాసులు సమస్త బంధనాల నుండి విముక్తిని పొందుతారు.

**5.** సహజమార్గ్ పద్ధతిలో ఈ ప్రత్యేకత చాలా ముఖ్యమైనది. "బాబూజీ! మీరు నా వారు" అని హృదయంలో అనుకోగానే, బాబూజీ మీ ఎదుటనే ఉన్నట్లు 'వారి' ప్రజెన్స్ యొక్క 'ఫీలింగ్' మీకు సహజమార్గ్‌లో చేరిన తొలిరోజు నుండి కలుగుతుంది. ఎందువలన? భగవంతుడు సర్వవ్యాపి అని అంటారు. అదే విధంగా బాబూజీ మహరాజ్ కూడా అంతటా, సమస్తము నందు వ్యాపించి ఉన్నారు అనేదానికి ఇది నిరూపణ.

**6.** భగవాన్ శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఈ భూమి మీద అవతరించడంవలన, ఈ ధరణి గాడ్లీ రీజియన్ (ఈశ్వరీయ క్షేత్రం)తోనే కనెక్షన్‌ను కలిగి ఉన్నది. కాని నేడు శ్రీ బాబూజీ మహరాజ్ ఆ అల్టిమేట్ (భూమా) నుండి ఈ భూమి మీదకు అవతరించడం వలన, ఈ ధరణి ఇప్పుడు అల్టిమేట్ పవర్ (అంతిమ శక్తి)తో కనెక్షన్‌ను కలిగి ఉంది. అందువలన మనమందరం కూడా ఆ 'భూమా' యొక్క నీడలో, బాబూజీ దివ్య శక్తి రక్షణలో నివసిస్తున్నాం. సహజ్‌మార్గ్ యొక్క గొప్పదనం, ప్రత్యేకతల గురించి ఎవ్వరూ కూడా చెప్పలేరు.

**"సహజమార్గ్ సిస్టమ్ అనేది శాశ్వతంగా ఉంటుంది" అని బాబూజీ చెప్పారు.** ఎందుకంటే సహజమార్గ్ అనేది దైవం నుండి అవతరించింది. డివైన్ శాశ్వతం కాబట్టి, ఆ దైవంతో కనెక్షన్ కలిగి ఉన్న ఈ సహజమార్గ్ పద్ధతి కూడా సృష్టిలో శాశ్వతంగా ఉంటుంది. స్పెషల్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) బాబూజీ ఒక్కరు మాత్రమే. విశిష్టులైన 'వారు' ఎంతో ప్రత్యేకత కలవారు. అలాంటి విశిష్ట వ్యక్తులు ఈ సకలసృష్టిలో ఒక్కరే ఉన్నారు.

"బాబూజీ మహరాజ్ ఇప్పుడు మన మధ్యన భౌతికంగా లేరు కదా! మరి మేము ఆ అల్టిమేట్ (అంతిమం) శక్తి యొక్క స్పర్శను ఏ విధంగా పొందగలం" – అని ఒకసారి ఫ్రాన్స్ దేశానికి చెందిన ఒక అభ్యాసీ నన్ను అడిగాడు. బాబూజీ మనకు ఒక లక్ష్యాన్ని, దాని సాధనకై సహజమార్గాన్ని మన ముందు ఉంచారు. 'వారు' ప్రిసెప్టర్‌లను తయారుచేసారు. బాబూజీ వాళ్ళ హృదయాలను ఆ అంతిమ శక్తితో కనెక్ట్ చేసారు. బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పం వలన ఈ విశ్వంలోని వాతావరణం అంతా ఆ 'భూమా'తో కనెక్షన్ కలిగి ఉన్న దివ్య శక్తితో నిండిపోయింది. బాబూజీ యొక్క దివ్య సంకల్పం వలన ఆ భూమా శక్తి ఎల్లప్పుడూ భూమి వాతావరణంలో ఉంటుంది. **ఏ అభ్యాసీ అయినా లేదా ప్రిసెప్టర్ అయినా బాబూజీ స్మరణలో పూర్తిగా మునిగిపోయినట్లయితే, వాళ్ళ పాదస్పర్శ ద్వారా ధరణి కూడా అల్టిమేట్ (భూమా) యొక్క పావన స్పర్శను పొందుతుంది.** మనం బాబూజీ యొక్క బిడ్డలం. కాబట్టి ఆ డివైన్ మాస్టర్ (బాబూజీ) తమ సంకల్పాన్ని పూర్తి చేయడానికి మనం వారితో సహకరించాలి. అంటే మనం బాబూజీతో కనెక్షన్ ఏర్పరచుకోవాలి. "బాబూజీ! మీరు నా వారు. మీరు నా హృదయంలోనే ఉన్నారు" అనే ఫీలింగ్ ద్వారా 'వారి'తో కనెక్షన్ ఏర్పరుచుకోవాలి.

ఒక పాటలో –ఆ మేరా లాల్ – అని వ్రాస్తున్నప్పుడు, ఒక్కసారిగా బాబూజీ నన్ను, "ఓ ముద్దు బిడ్డా! త్వరగా ఇటురా, నావద్దకు రా!" అని పిలిచినట్లుగా ఒక గాఢమైన ఫీలింగ్ కలిగింది. వాతావరణంలో నుండి ఎవరో తల్లి తన ఒడిలోనికి రా, రమ్మని పిలిచినట్లుగా నీవు కూడా వినగలవు. ఎందుకంటే విశ్వంలోని

వాతావరణం అంతా కూడా 'వారి' దివ్య ప్రేమతోనే నిండిపోయి ఉంది. అందువలన అభ్యాసీలు, ప్రిసెప్టర్లు అందరూ 'వారి'ని ప్రేమతో పిలవాలి, స్మరించాలి. అలాంటి స్థితి నాలో 3 రోజులు ఉన్నది. ఆ ఫీలింగ్ ఎంత తీవ్రంగా ఉన్నదంటే, బాబూజీయే ఇక్కడే ఎక్కడో నా సమీపంలోనే ఉండి నన్ను పిలుస్తున్నట్లుగా అనిపించింది. నెమ్మది నెమ్మదిగా ఆ పిలుపు నాలో లయమైన తరువాతనే నాకు విశ్రాంతి లభించింది.

**ప్రశ్న: సిట్టింగ్‌లో కొంత సమయం తరువాత, క్రిందికి జారిపోతున్నట్లుగా, పైకి వెళ్ళలేకపోతున్నట్లుగా ఫీలింగ్ వస్తుంది!**

**జవాబు:** సిట్టింగ్‌లో పైకి వెళ్ళిన తరువాత, మరల క్రిందికి రావడం అనేది ఉండదు. ప్రాపంచికమైన పనులు చేయాలి కాబట్టి, ఆ స్థితి నుండి మనస్సు మాత్రమే క్రిందకు వస్తుంది. కాని మీ ఆంతరిక దృష్టిని మాత్రం, బాబూజీ మిమ్మలను ఎక్కడికైతే తీసుకొని వెళ్ళారో అక్కడే ఉంచండి. 'ఊర్ధ్వముఖ వృత్తి' అనేది డివైన్ (దైవం)తో కనెక్ట్ చేయబడి ఉంటుంది. ధ్యానంలో మనం ఊర్ధ్వముఖ వృత్తి ద్వారా ప్రాణాహుతిని స్పర్శిస్తాము. నీవు క్రిందికి జారిపోయినట్లుగా అనిపిస్తుంది అంటే, నీ అధోముఖ వృత్తి, ప్రాపంచికమైన పనులను నిర్వహించడానికిగాను క్రిందికి వస్తున్నాయి అని అర్థం. **ఎవరైతే ఈ ప్రపంచంవైపు చూడకుండా, కేవలం దైవం వైపుకే ఎల్లవేళలా చూస్తారో, వారికే సాక్షాత్కారం లభిస్తుందని బాబూజీ చెప్పారు. ఒకసారి 'వారి'ని నిజంగా చూసినట్లయితే మరల మీరు ఈ ప్రపంచంవైపు ఆకర్షింపబడరు. అన్ని పనులు ఈ శరీరం ద్వారా వాటంతట అవే జరిగిపోతాయి.** కాని మీ ఊర్ధ్వముఖ వృత్తి మాత్రం డివైన్‌తో కనెక్ట్ చేయబడే ఉంటుంది.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు అల్టిమేట్ (భూమా శక్తి)కి మహరాజ్ కదా! మిమ్మల్ని దర్శించుకోవడానికి వచ్చిన వాళ్ళలో కొంతమందికి మీరు ఎందుకు శక్తిని ఇవ్వడం లేదు?" అని అడిగారు. అప్పుడు బాబూజీ, "భాయీ! నీవు సత్సంగ్‌లో చూస్తున్నావు కదా! నేను అందరికి శక్తిని ఇస్తున్నాను. నీవు ఒక బిందువు, లేదా రెండు బిందువుల శక్తి మాత్రమే తీసుకోవాలని నేను ఎప్పుడు అనుకోను. కాని నా శక్తితో పూర్తిగా నింపివేయడానికి ఖాళీ స్థలంగల హృదయం నాకు కనిపించటంలేదు" అని అన్నారు. 'బాబూజీ నా వారు' అని మీరు భావిస్తే, అప్పుడు బాబూజీవద్ద ఉన్న ఆధ్యాత్మిక సంపద అంతా కూడా మీదే అవుతుంది. కాబట్టి మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. "ఆధ్యాత్మికంగా నేను ఎవరిని కూడా బిచ్చగానిగా ఉంచను" అని బాబూజీ చెప్పారు. 'వారి' దివ్యత్వాన్ని పొందడానికిగాను మీరు అర్హులుగా తయారుకావాలి.

**ప్రశ్న: నేను బాబూజీని చూడలేదు. ధ్యానంలో డివైన్ లైట్ (దివ్య జ్యోతి) మీద నాకు ఏకాగ్రత రావడంలేదు. ఇంతకుపూర్వం రాముడు, కృష్ణుని రూపంమీద ధ్యానం చేసేవాడిని. ఇప్పుడు నేను బాబూజీ రూపం మీద ధ్యానం చేయవచ్చా?**

**జవాబు:** బాబూజీ ఎప్పుడు కూడా రూపం మీద ధ్యానం చేయమని చెప్పలేదు. "రూపం లేదా ఆకారం మీద ధ్యానం చేయవద్దు" అని బాబూజీ చెప్పారు. మీరు బాబూజీని చూడలేదు. పరవాలేదు. "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని అనుకొని బాబూజీ యొక్క ప్రెజెన్స్ మీద దృష్టిని ఉంచండి.

ఒకసారి నేను "బాబూజీ! మీరు డివైన్ లైట్ (ఈశ్వరీయ ప్రకాశం) మీద ధ్యానం చేయమని నాకు చెప్పారు. నేను అదే విధంగా చేస్తున్నాను. కాని ఇప్పుడు ధ్యానంలో, లోపల మీరే కనబడుతున్నారు, మీ రూపం దానంతట అదే ధ్యానంలో నాలోపల కనబడుతున్నది. ఇప్పుడు నేను ఏ విధంగా ధ్యానం చేయాలి?" అని 'వారి'కి వ్రాసాను. అప్పుడు వారు, "బిటియా! మాస్టర్ యొక్క రూపం చూడగానే సరిపోలేదు. ఒకవేళ నా రూపం నీ ఎదుట కనబడితే, నా నుండి నీలోనికి 'డివైన్ ట్రాన్స్‌మిషన్ (దివ్య ప్రాణాహుతి) ప్రవహిస్తున్నది' అని భావించాలి. ఒకవేళ నీ హృదయంలో, నా రూపం ప్రత్యక్షమైతే, 'నీ మొత్తం సిస్టమ్ అంతా అణువణువు కూడా దివ్య ప్రాణాహుతి శక్తితో వ్యాపిస్తూన్నది' అని భావించాలి" అని నాకు ఉత్తరం వ్రాశారు. మనం చూసింది కేవలం 'వారి' భౌతికమైన శరీరాన్ని, రూపాన్ని మాత్రమే. కాని 'వారి' డివైన్ ఫారమ్ (దివ్య రూపం) అనేది శాశ్వతమైనది, అది అంతటా వ్యాపించి ఉన్నది. "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని అనుకొని మీరు ధ్యానం చేస్తే, మొదట మీరు 'వారి' ప్రజెన్స్‌ను ఫీల్ అవుతారు. ఆ తరువాత రియాలిటి (వాస్తవికత) ఏమిటి అనేది మీకు తెలుస్తుంది. భౌతికరూపం మీద ధ్యానం చేయడంవలన బంధనం ఏర్పడుతుంది అని బాబూజీ చాలా స్పష్టంగా తెలిపారు. ఒకవేళ మీరు భౌతిక రూపంమీద ధ్యానం చేసినా, తరువాత అది అదృశ్యమవుతుంది. అప్పుడు మీరు ఏమి చేస్తారు? అందువలన ప్రజెన్స్ అనేది ముఖ్యమైనది. ఎప్పుడైతే దైవీయ రూపం – ఏదైతే విశ్వం అంతటా వ్యాపించి ఉన్నదో బాబూజీ యొక్క ఆ దైవీయ రూపం మీకు వెల్లడైనప్పుడు అది 'వారి' నిజమైన దర్శనం అని అర్థం. భౌతికరూపం కొంతకాలమే ఉంటుంది. తర్వాత అది అదృశ్యమవుతుంది. అందువల్లనే రూపంమీద చేయవద్దని స్పష్టంగా చెప్పి, రూపం వలన మనకు ఎటువంటి బంధనాలు కూడా ఏర్పడకుండా ఉండడానికి, 'వారు' మనల్ని చాలా సురక్షితమైన మార్గంలోకి తీసుకొని వెళ్ళారు. నేను శ్రీరాముడ్ని, శ్రీకృష్ణుడ్ని, శివుడ్ని, దేవతల రూపంమీద ధ్యానం చేసాను అని మీరు అన్నారు, ఆ రూపం అనేది కేవలం మీ ఆలోచన మాత్రమే. ఎందుకంటే, నిజానికి మీరు వాళ్ళను చూడలేదు. వాళ్ళ పేర్లు మీ మనస్సులో ఉన్నాయి కాబట్టి, మీ ఆలోచనయే, మీకు దేవతల రూపంలాగ కనబడినది. అందువల్లనే బాబూజీ (ఫారమ్‌లెస్ ఫారమ్) "రూపంలేని రూపం" అనే పదాన్ని ఉపయోగించారు. డివైన్‌కు రూపంలేని రూపం ఉంది. అనగా డివైన్ (దైవం) విశ్వం అంతటా వ్యాపించి ఉంది; కాబట్టి మీరు "బాబూజీ మహరాజ్ నా హృదయంలోనే ఉన్నారు" అని ధ్యానం చేస్తే మొదట 'వారి' ప్రజెన్స్ ఫీల్ అవుతారు. తరువాత 'వారి' దివ్య శక్తిని ఫీల్ అవుతారు. చివరకు 'వారి' డివైన్ ఫారమ్ (దివ్య రూపం) అనగా రూపంలేని రూపాన్ని దర్శిస్తారు. అప్పుడప్పుడు నేను కష్టాలలో, బాధలలో ఉన్నప్పుడు, ఆకస్మాత్తుగా 'వారి' ప్రజెన్స్‌ను, ఫీల్ అయ్యేదాన్ని. ఎప్పుడైతే 'వారి' పాదాలను స్పర్శించాలనే తీవ్రమైన కోరిక కలుగుతుందో, వెంటనే, "అరే! బాబూజీ అంతటా ఉన్నారు కదా!" అనే ఫీలింగ్ దానంతట అదే వచ్చేది. దీనివలన మనకు ఏమి తెలుస్తుంది అంటే భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, కాని మనం భగవంతుని యొక్క ప్రెజెన్స్‌ను ఫీల్ కావడంలేదు. కాని సమస్తము నందు వ్యాపించి ఉన్న బాబూజీ దైవీయ రూపం యొక్క ప్రెజెన్స్‌ను మాత్రం మనం ఫీల్ అవుతున్నాము. "రూపం (ఫారమ్) అనేది శాశ్వతమైనది కాదు, కేవలం డివైన్ (దైవం) మాత్రమే శాశ్వతం" అని బాబూజీ చెప్పారు. అందువలన దైవం (అనగా

బాబూజీ) మీ హృదయంలో ఉన్నారని, 'వారి' ప్రెజెన్స్ మీద ధ్యానం చేయడం వలన, చివరకు మీరు మీ రూపం కోల్పోయి, మీరు కూడా రూపంలేని రూపాన్ని అనగా మీ నిజమైన రూపాన్ని చూస్తారు. రూపంమీద ధ్యానం చేసినట్లయితే, మీరు రియాలిటీ (సత్యదర్శనం)ను పొందలేరు. ఒకసారి బాబూజీ, "ఇది నేను 30 సం॥ల వయస్సులో ఉన్న ఫోటో. ఇది 40 సం॥ల వయస్సులో ఉన్న నా ఫోటో. ఇక ఇప్పుడు నా ఫోటో మారిపోయింది. నా రూపంమీద ధ్యానం చేయాలి అని అనుకుంటే, నీవు ఏ ఫోటో మీద చేస్తావు?" అని ఒక అభ్యాసీని అడిగారు. వయస్సు పెరిగినకొద్దీ రూపంలో మార్పు వస్తుంది. కాని రియాలిటీలో ఎటువంటి మార్పు లేదు. రియాలిటీ అనేది శాశ్వతం. సహజమార్గ్‌లోని సౌందర్యం ఏమిటంటే, మనం మన ధ్యానంతో, ఈ విధంగా రియాలిటీని చేరుకుంటాము.

"ఎప్పుడైతే నేను లాలాజీ సాహెబ్‌ను చూసానో అప్పటి నుండి మరల నేను ఎవరినీ చూడలేదు" అని బాబూజీ ఒకసారి నాతో చెప్పారు. దీని అర్థం ఏమిటి? ఎప్పుడైతే రియాలిటీ లేదా దివ్యత్వాన్ని ఫీల్ అవుతారో, అప్పుడు మిమ్మల్ని మీరు, మీ శరీరాన్ని మరచిపోతారు. ఎప్పుడైతే మీ శరీరం యొక్క ఎరుకను మీరు మరచిపోతారో అప్పుడే బాబూజీ మహరాజ్ చెప్పిన "నేను లాలాజీ సాహెబ్‌ను తప్ప ఇంకా ఎవరిని చూడలేదు" అనే వాక్యం యొక్క యదార్థత కొద్దిగా అర్థమవుతుంది. ఒకవేళ మీరు శరీరం, రూపం మీద ధ్యానం చేస్తుంటే మీరు పురోగమించలేరు. అక్కడే ఆగిపోతారు. ఎందుకంటే మీరు శరీరం (రూపం)ను విడిచిపెట్టలేరు. బాబూజీ యొక్క పై వాక్యం, శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క రూపంలేని రూపం (ఫారమ్‌లెస్ ఫారమ్)తో కనెక్ట్ అయి ఉంది. అనగా బాబూజీ, లాలాజీ సాహెబ్ యొక్క భౌతిక రూపాన్ని కాకుండా, ఆ దివ్యత్వాన్ని చూసారు. అందువలన 'వారి'కి ఇతరుల శరీరాలు కనబడలేదు.

సహజమార్గ్ సిస్టమ్ అనేది పైనుండి అవతరించింది. అందువల్లనే ప్రార్థనలోని ప్రతి అక్షరం దివ్య శక్తితో ఛార్జ్ చేయబడింది. కనుక ప్రార్థనలో దేనిని కూడా మార్చరాదు. ఒకవేళ ఏదైనా మార్చినట్లయితే, ఆ ప్రార్థనలోని దివ్యశక్తి అదృశ్యమవుతుంది. సహజమార్గ్ పద్ధతిని అనుసరించడం వలన ధ్యానం, క్లీనింగ్ మరియు ప్రార్థన –అవి ఏ దివ్యశక్తితో అయితే ఛార్జి చేయబడ్డాయో, ఆ శక్తిని మనం పొందుతాము. ఎందుకంటే 'వారు' అందరినీ ప్రేమిస్తారు.

**సామీప్యత –** బాబూజీ యొక్క ప్రజెన్స్‌ను ఫీల్ కావడం.

**సాలోక్యత –** నీ గురించి నీకు జ్ఞాపకం వచ్చినప్పుడు, నీవు ఏదో వేరే లోకంలో నుండి వచ్చినట్లుగా ఫీల్ కావడం.

**సారూప్యత –** "నేను అద్దంలో చూసుకొన్న ప్రతిసారి బాబూజీ ముఖం కనబడుతోంది" అని 'వారి'కి వ్రాసాను. "నేను అద్దంలోకి చూడగా నాకు నీ ముఖం కనబడుతోంది" అని బాబూజీ తిరిగి నాకు వ్రాసారు.

**సాయుజ్యత –** బాబూజీని తలచుకోగానే నీవు బాబూజీ లోపలనే ఉన్నట్లుగా ఫీల్ కావడం. బాబూజీ, నీవు – ఇద్దరూ ఉన్నారు. కాని ఇద్దరి మధ్యలో విభాజ్యత (విభజన) లేదు.

**లయావస్థ –** నీవు 'వారి'లో లయం అయిన తరువాత, నీవు ఉండవు. కేవలం బాబూజీ మాత్రమే ఉంటారు.

బాబూజీ రచనలు దైవీయ భాషలో ఉన్నాయి. కాని ఒక అభ్యాసీ భాషలో –

**హార్ట్ రీజియన్ –** బాబూజీ యొక్క హృదయంలో నివసించడం.

**మైండ్ రీజియన్ –** బాబూజీ యొక్క నిరంతర స్మరణలో మునిగిపోవడం.

**సెంట్రల్ రీజియన్ –** బాబూజీ మనల్ని సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళడానికి తయారుచేస్తున్నారు.

సెల్ఫ్ సరెండర్ – సెల్ఫ్ (నేను) అనేదానికి ఎటువంటి రూపంకాని, శరీరంకాని లేదు. బాబూజీ పాదాల వద్ద నీవు శరణాగతిని (ఆత్మ సమర్పణ) పొందినట్లుగా, నీవు, నీ లోపల ఫీల్ కావడం. మన సహజమార్గ్ సిస్టమ్ శక్తివంతమైనది, దైవీయమైనది. మనం దివ్యత్వంవైపు వెళ్ళుతున్నామని అనుకోవాలి, అనుకోవడం కాదు, ఆ విధంగా అనుభూతి చెందాలి. "అభ్యాసీలు నన్ను చూడడానికి వస్తారు. కాని నన్ను చూడకుండా వెళ్ళిపోతారు" అని బాబూజీ ఎప్పుడూ అనేవారు. దీని అర్థం ఏమిటి? కేవలం 'వారి' శరీరం మాత్రమే చూస్తున్నారు. కాని ఆ శరీరంలోపల ఉన్నటువంటి డివైన్‌ను అనగా దివ్యత్వాన్ని చూడడం లేదు –అని.

"సమస్త మానవాళిని అంతిమం (అల్టిమేట్)కు చేర్చాలి" అనేది బాబూజీ యొక్క సంకల్పం. 'వారి'ది దివ్య సంకల్పం. 'వారి' ఈ దివ్య సంకల్పం వలన ఇప్పుడు డివైన్ పవర్ (దివ్య శక్తి) యొక్క పూర్తి కృపాదృష్టి మన అందరి మీద ఉంది. ఇప్పుడు మన అటెన్షన్ (శ్రద్ధా దృష్టి) 'వారి' మీద ఉంచాలి. కో–ఆపరేషన్ (సహకారం) అంటే ఇదే.

మానవమాత్రులలో ఈశ్వర ప్రేమ యొక్క తపనను మేల్కొలుపడానికి ఇంతవరకు ఎవరు రాలేదు. బాబూజీ యొక్క దివ్య సంకల్పం తన దైవీయ కార్యాన్ని తాను పూర్తిచేస్తూ వెళ్ళుతుంది. ఇంతకుముందు సహజమార్గ్ గురించి చెప్పితే ప్రజలు వినీ విననట్లుగా వినేవారు. కాని నేడు మీరు సహజమార్గ్ గురించి చెప్పగానే, వాళ్ళ అంతరంగం ఒక్కసారిగా శ్రద్ధాళువు అవుతూంది. రాబోయే తరంవారు, ఈ డివైన్ పర్సనాలిటీ గురించి మన కంటే ఎక్కువగా తెలుసుకుంటారు, అనడానికి ఇది సంకేతం.

మీరు ఈ అమూల్యమైన సమయాన్ని వృథా చేయవద్దు. బాబూజీ గుణగణాలను గురించి పాడండి. బాబూజీ మీకు చాలా దగ్గరలోనే ఉన్నారని, ఎల్లప్పుడు మీతోనే ఉన్నారని, 'వారు' అందర్నీ ప్రేమిస్తున్నారు అని మీరు అనుభూతి చెందడానికి ప్రయత్నించాలి.

ఇటువంటి డివైన్ పర్సనాలిటీ ఎప్పుడూ రాలేదు, రాబోదు అని లాలాజీ సాహెబ్ కూడా ఒక సంకేతాన్ని ఇచ్చారు. **ఒకసారి లాలాజీ సాహెబ్, "నీవు వేలకొలది రిప్రెజెంటేటివ్స్ (ఆధ్యాత్మిక ప్రతినిధులు)ను తయారు చేయగలవు. నీవు తలుచుకుంటే ఇంకొక భగవంతుని కూడా సృష్టించగలవు. కాని నీలాంటి వ్యక్తిని నీవు మరొకరిని తయారు చేయలేవు. ఎందుకంటే, నీవు ఎవరివి? ఏమిటి? అనేది స్వయంగా నీకే తెలియదు. (నిన్ను నీవు సంపూర్ణంగా మరచిన స్థితిలో ఉన్నావు)" అని బాబూజీతో అన్నారు.**

"నేను (ఫారమ్ వర్షిప్) రూపం మీద పూజ చేయడాన్ని రూపుమాపి, దానిని రియాలిటీ (సత్యతత్వం) మీదకు మార్చడానికే వచ్చాను" అని బాబూజీ అన్నారు. అందువల్లనే బాబూజీ రూపం మీద ధ్యానం చేయడానికి అనుమతిని ఇవ్వలేదు. ప్రారంభం నుండి కూడా మన దృష్టి ఆ రియాలిటీ మీదనే ఉండాలని బాబూజీ చెప్పేవారు.

**ధ్యానం:** "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని గుర్తు పెట్టుకోవడం. "బాబూజీ! నేను ఎలా ఉన్నా మీ వాడినే, మీరు నా వారు" అనే ఫీలింగ్‌లో మునిగిపోవడం.

**క్లీనింగ్:** సాక్షాత్కారానికి ప్రతిబంధకాలుగా ఉన్నవన్నీ బాబూజీ యొక్క డివైన్ పవర్ (దివ్య శక్తి)తో బయటకు త్రోసి వేయబడుతున్నాయని భావించడం.

**ప్రార్థన:** ప్రార్థనా భావంతో మునిగిపోయి ఆత్మ నివేదన స్థితిలో, 'వారి' చరణాలవద్ద ఉండడం. ప్రేమ, భక్తిని కూడా ఇచ్చేవారు బాబూజీయే కదా! మీ హృదయం బాబూజీ మహరాజ్‌ని దైవంగా, దివ్యతామూర్తిగా అంగీకరించినట్లయితే, భక్తి అనేది దానంతట అదే మీలో ఏర్పడుతుంది. బాబూజీని నీ వారిగా నీ హృదయం అనుభూతి (ఫీల్) అయినపుడు భక్తి ఏర్పడుతుంది. మీ పిల్లలను ప్రేమించడానికి మీకు ఎవరూ శిక్షణ ఇవ్వరు కదా! ప్రేమ అనేది సహజంగానే మీలో ఏర్పడుతుంది. హృదయం 'వారి'తో సంబంధాన్ని (కనెక్షన్‌ను) ఏర్పరచుకుంటుంది. అప్పుడు మీ హృదయం 'వారి' చరణాల వద్ద ఒదిగిపోతుంది. అంటే మీ హృదయం భక్తితో 'వారి' దివ్య ప్రేమకు సమర్పితం అవుతుంది. **"నేను సమస్త మానవాళికి ప్రేమతో సమర్పితమై ఉన్నాను" అని బాబూజీ అన్నారు.** ఇప్పుడు మనం చేయవలసినది – బాబూజీని మన 'వారి'గా అంగీకరించి, అనుభూతి చెందడం మాత్రమే.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఇక్కడ ఏ స్థితిలో ఉన్నామో, ఇంటికి వెళ్ళిన తరువాత కూడా అదే విధంగా ఉండాలి అంటే ఏం చేయాలి?**

**జవాబు:** ఇక్కడ మీ మనస్సు కేవలం ఒకే పనిమీద, బాబూజీ మీదనే నిమగ్నమై ఉన్నది. బాబూజీ గురించిన ఫీలింగ్‌లోనే ఉన్నారు. కాని మీరు ఇంటికి వెళ్ళిన తర్వాత రకరకాల పనులవైపు మీ మనస్సు మరలుతుంది. కాని ఆ ఫీలింగ్ అనేది మీ లోపల ఉంటుంది. ఉదయం ధ్యానం నుండి లేచిన తరువాత, "ధ్యానం అయిపోయింది" అని అనుకోకుండా ఆ ధ్యానం యొక్క ధ్యాసలో అన్ని పనులు చేసుకోవాలి. ఒకవేళ మరచిపోయినా గాని, మరల గుర్తుకురాగానే, "బాబూజీని మరచిపోయాను" అని అనుకోకుండా, "ఇప్పటివరకు నేను బాబూజీ చరణాలవద్దనే ఉన్నాను" అని భావించి మరల ఆ సంబంధాన్ని (కనెక్షన్‌ను) ఏర్పరచుకోవాలి.

ఒకసారి ఒక అభ్యాసీ సోదరి, "బాబూజీ! విగ్రహారాధన నన్ను విడిచిపెట్టడం లేదు" అని అనగానే వారు, "విగ్రహారాధన నిన్ను విడిచిపెట్టడం లేదా, లేక నీవే దానిని విడిచిపెట్టడం లేదా?" అని అడిగారు. యథార్థం ఏమిటంటే, మనమే విగ్రహారాధనను విడిచిపెట్టడం లేదు. ఎందుకని? విగ్రహారాధన బాహ్యా పూజల వలన ఒక విధమైన భయం అనేది మనలో ఏర్పడుతుంది. ఒకవేళ పూజ చేయకపోతే "అయ్యో! ఈ రోజు దుర్గామాత పూజ చేయలేదు. ఏం జరుగుతుందో" అనే అందోళన, భయం మనస్సులో ఉంటుంది. కాని బాబూజీ మహరాజ్ యొక్క సహజమార్గ సాధనలో స్వేచ్ఛ అనేది ఉంటుంది. భయం అనే ప్రశ్నేలేదు. బాబూజీ ఎవరిని కూడా దేనినీ విడిచిపెట్టమని చెప్పలేదు; "భగవంతుడు నా హృదయంలోనే ఉన్నాడు" అనే ఒక్క దానినే పట్టుకోమని చెప్పారు. "భగవంతుని పాదాలవద్ద నీ శిరస్సును ఉంచు, మరల వెనుకకు తిరిగి చూడవద్దు" అని చెప్పారు. కాని బాబూజీ ఏదైతే పట్టుకోమని చెప్పారో మనం దానిని పట్టుకోవటం లేదు. "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని మీరు అనుకోవడం వలన, మీరు 'వారి'

ప్రజెన్స్‌ను ఫీల్ కావడం వలన, దైవీయ సామీప్యత యొక్క వెచ్చదనం (ప్రభావం) వలన మీలోని ప్రాపంచికమైన ఆకర్షణలు, బంధనాలు అన్నీ కూడా కరిగిపోతాయి.

బాబూజీ, "ఫర్‌గెట్ యువర్ సెల్ఫ్ (నిన్ను నీవు మరచిపోవాలి)" అని చెప్పారు. ఈ మరచిన స్థితి పొందినపుడు నేను "బాబూజీ! ఈ రోజు అంతా కూడా నేను ఎవరు? నేను ఏమిటి? అనే ఎరుకే లేదు. నేనే దైవం అని అనిపించినది" అని 'వారి'కి లేఖ వ్రాశాను. అప్పుడు బాబూజీ, "బిటియా! నిజమైన భక్తుని స్థితి ఇదే. నిజమైన భక్తుడు తన సెల్ఫ్ (నేను) అనే దానిని మరచిపోయి, కేవలం డివైన్ (దైవం) యొక్క ఎరుకలోనే ఉంటాడు" అని వ్రాశారు. మీరందరు కూడా ఆ నిజమైన భక్తుని స్థితిని పొందడానికి కృషి చేయాలి. "మేము ఇంటి పనులు అన్నీ చేయాలి కదా! ఇది ఏ విధంగా సాధ్యమవుతుంది" అని కొందరు అంటారు. నిజానికి ఈ స్థితి గృహస్థ జీవింతలోనే సాధ్యమవుతుంది. ఎందుకంటే, గృహస్థ జీవితంలో మీరు – తండ్రి, తల్లి, భర్త మీద ఆధారపడతారు. అప్రయత్నంగానే డిపెండెన్సీ (ఆధారపడే) స్థితిలోనే మీరు జీవిస్తారు. అందువలన ఇప్పుడు మీకు బాబూజీ మీద ఆధారపడి జీవించడం అనేది చాలా సులభం అవుతుంది. సన్యాసి ఎప్పుడు కూడా 'అహం' నందు జీవిస్తాడు కాబట్టి అతనికి డిపెండెన్సీ రావడం అనేది కష్టం. అతడు నిజమైన భక్తునిగా మారడం అనేది అసంభవం.

"అభ్యాసులకు సబ్‌మిషన్ (సమర్పణ) అంటే ఏమిటో తెలియదు కాని, 'బాబూజీ! మేము పూర్తిగా మీకు సరెండర్ (శరణు) అయ్యాము' అని నాతో అంటారు" అని బాబూజీ నాకు ఉత్తరంలో వ్రాసారు. సబ్‌మిషన్ అంటే ఆత్మ నివేదన స్థితి. ఎప్పుడైతే ఆత్మ పూర్తిగా కరిగిపోయి, గాడ్లీ రీజియన్‌కు క్రిందనే ఉన్న పరమాత్మ తత్వములో కలసిపోతుందో అప్పుడే ఆత్మ నివేదన (సబ్‌మిషన్) స్థితి పూర్తయి, శరణాగతి (సరెండర్) స్థితి ప్రారంభమవుతుంది.

**ప్రశ్న: ప్రణవనాదం (ఓంకార నాద ధ్యానం) గురించి చెప్పండి.**

**జవాబు:** సహజమార్గ్ సిస్టమ్‌లో ఉన్నవారికి మరొకటి ఏదీ అవసరం లేదు. ధ్యానంలో మీ యొక్క శ్రద్ధా దృష్టి (అటెన్షన్) అనేది (డివైన్) బాబూజీతో అనుసంధానం కావాలి. బాబూజీతో ఈ అనుసంధానం కావాలి. బాబూజీతో ఈ అనుసంధానం అనేది ఒక్కటే మీకు అవసరం. ఇంకా ఏదీ అవసరం లేదు. ప్రజలు రామ, రామ అని నామజపం చేస్తారు. రామునితో మీకు కనెక్షన్ లేనప్పుడు దానివలన ఏ ప్రయోజనమూ ఉండదు. అందువలన మీరు బాబూజీతో కనెక్షన్‌ను ఏర్పరుచుకోవాలి. ఓంకారం వలన పరిమితమైన శాంతి మాత్రమే లభిస్తుందని బాబూజీ చెప్పారు. మీరు అపరిమితంవైపు అనగా అనంతం వైపుకు ప్రయాణించవలసి ఉన్నది. అందువలన మీరు ఆ అనంతం (అల్టిమేట్)తో అనుసంధానాన్ని (కనెక్షన్‌ను) ఏర్పరచుకోవాలి. ఓంకార నాదం (శబ్దం) ఉన్నప్పుడు అక్కడ శాంతి అనేది ఉండదు. శాంతిలో (బ్యాలెన్స్) 'సమతుల్యత' ఉంది. నీలో ఆ ప్రశాంతతా స్థితి ఏర్పడినపుడు నీవు ఊపిరి పీల్చుకోవడం కూడా మరచిపోతావు. శ్వాస యొక్క ఫీలింగ్‌ను (భావాన్ని) కూడా నీవు ఆ స్థితిలో భరించలేవు.

ఒకసారి ఒక అభ్యాసీ సోదరి, "నాకు నథింగ్‌నెస్ (శూన్యతా) స్థితి కావాలి" అని బాబూజీకి ఉత్తరం వ్రాసింది. అప్పుడు బాబూజీ, "నీవు కోరినంత మాత్రాన ఆ స్థితి నీకు లభించదు. సహజమార్గంలో అల్టిమేట్ (భూమా) వద్దకు చేరుకునే ముందు, మార్గంలో కలిగే ఒక స్థితి అది. నీవు కేవలం సాధన ద్వారానే ఆ స్థితిని పొందగలవు" అని ఆ సోదరికి వ్రాసారు.

ప్రిసెప్టర్‌కి అభ్యాసీల యందు ప్రేమ భావన ఉండడం, అభ్యాసీల పురోగతికి చాలా ఉపయుక్తం. ప్రిసెప్టర్‌కి బాబూజీ యందు ప్రేమ వలన, ప్రేమ అనే లంకె (బంధం, Chain of Love) ద్వారా పురోగమిస్తారు. ప్రిసెప్టర్‌కి బాబూజీ మహరాజ్ ప్రసాదించే సర్వస్వం ఈ ప్రేమ బంధం ద్వారా మీ అందరికీ అందుతుంది. అందుకనే, అభ్యాసులు అందరూ కూడా చాలా అదృష్టవంతులు. మిమ్మల్ని ప్రేమించే మీ ప్రిసెప్టర్లతో మీరు ఉన్నారు. వారు ప్రతి ఒక్క అభ్యాసీ అతి తొందరలో ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందాలని ఆకాంక్షిస్తున్నారు. ఇది నాకు చాలా సంతోషాన్ని ఇచ్చే శుభపరిణామం.

విజయవాడలో ఒక అభ్యాసీ సోదరి శరీరాన్ని వదలివెళ్ళారు. బాబూజీ ఆమెను శక్తి మధ్యలో ఉంచడం, ఆమె అందులో కరిగిపోవడం చూశాను. వెంటనే ఆమె దివ్యకాంతిగా మారడమూ గమనించాను.

నేను చూసినది, చెప్పేది ఏమిటంటే, బాబూజీ మహరాజ్ యొక్క కృప అపారంగా ప్రవహిస్తూ ఉంది. ఈ సమయంలో మనందరం మన హృదయాలను తెరచి ఉంచాలి. హృదయం అనేది ఏదో ఒక ప్రదేశంలోనే ఉంటుందని భావించవద్దు. మనం కనులు మూసుకొని ఉన్నప్పుడు మన సంపూర్ణ శరీర వ్యవస్థ (Whole System) హృదయంగా భావించాలి. మీరు ఈ విధంగా కూడా భావించవచ్చు: "నా హృదయం విస్తరించి బాబూజీ మహరాజ్ యొక్క దివ్య చరణాలతో అనుసంధించబడింది" అని. మీ హృదయాలు బాబూజీ దివ్య చరణాలతో అనుసంధించడం వల్లనే మీరు ఇక్కడకు, లక్నోకు వచ్చారు.

ఈ వాతావరణం అంతటిలోను, మీ అందరి గృహాలలో బాబూజీ కృప ఉంది. కాని మనం దానికి దూరంగా ఉన్నాము. ఎప్పుడైతే మనం బాబూజీ మహరాజ్‌ను స్మరణలో తెచ్చుకున్నామో అప్పుడు మనం ఆ శక్తి (కృప)తో అనుసంధింపబడడం మొదలుపెడతాము. అందుకనే బాబూజీ "ప్రేమతో కూడిన నిరంతర స్మరణ అత్యావశ్యకం" అని చెప్పారు. "బాబూజీ ఒక్క హృదయంలోనే కాదు. నాలో పూర్తిగా ఉన్నారు. 'వారి' కృపా ప్రవహంలో నా సంపూర్ణ వ్యవస్థ మునిగి ఉన్నది" అని భావించాలి. అప్పుడే ఫలితం సాధించగలవు.

**ప్రశ్న: నిన్న సాయంత్రం మీరు మాకు మూడు బహుమతులు ప్రసాదించారు. ఒకటి సత్సంగము, రెండు బాబూజీ మీద గీతాలాపన, మూడు భోజనం.**

**జవాబు:** అది భోజనం కాదు, ప్రసాదం. ప్రసాదం అంటే ఏమిటి? దైవం నుంచి ఇవ్వబడినదే ప్రసాదం. దైవం ఎప్పుడూ భోజనం ఇవ్వరు. దివ్యత్వాన్ని మాత్రమే ప్రసాదిస్తారు. ప్రసాదం అంటే అర్థం దివ్యత్వం. మీరు ఇక్కడ ఉన్నప్పుడు భోజనంకాని, నీరుకాని ఏదైనాకాని దాని రుచిని మీరు గ్రహించలేరు. దైవ ప్రసాదాన్ని తప్ప వేరే దేనిని మీరు తీసుకోలేరు. దైవ ప్రసాదం అంటే దివ్యత్వమే.

దీనికి నిరూపణ ఏమంటే– షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు "మేము ఏమి తిన్నామో, ఏమి తీసుకొన్నామో, అసలు ఆహారం, నీళ్ళు తీసుకొన్నామా? లేదా? అనే విషయం మరచిపోయేవాళ్ళం" అని చెప్పేవారు. ఎందుకని? ఎందుకంటే మనం ఆంతరికంగా దివ్యత్వాన్నే పొందుతాము. ఎప్పుడైతే మనం దివ్యత్వాన్ని పొందుతూ ఉంటామో అప్పుడు ఇతర విషయాలను గ్రహించలేము.

ఈ విధంగా మీరు ప్రసాదాన్ని మాత్రమే తీసుకోగలరు. ప్రసాదం అంటే దివ్యత్వమే.

భక్త మీరావలె, కబీర్‌వలె భజనలు పాడడానికి ఆధ్యాత్మిక స్థితిలో ఉండి బాబూజీ మహరాజ్ మీద వ్రాసిన గీతాలను ఆలపించడానికి చాలా తేడా ఉన్నది. ఆ గీతాలు బాబూజీ మహరాజ్ కృపతోనూ. 'వారు'

ప్రసాదించిన స్థితులతోనూ పూర్తిగా నిండి ఉన్నాయి. ఏ విధంగా పుష్పం నా చేతిలో ఉన్నా, దాని సువాసనను మీరు అందరూ గ్రహిస్తున్నారో అదే విధంగా ఆ గీతాలను దివ్య భావనతో, గీతాలలో నిండి ఉన్న స్థితులలో లీనమై పాడితే మీ అందరికీ కూడా ఆ స్థితులు లభిస్తాయి. బాబూజీ మహరాజ్ ఆశీస్సులతో, కృపతో మన హృదయాలు ఆ యొక్క దివ్య పరిమళంతో అనుసంధింపబడ్డాయి.

అభ్యాసీల గృహాలలో వారి స్థితులు ఒక్కొక్కరి గృహంలో ఒక్కొక్క విధంగా ఉండవచ్చు. మేము బాబూజీ మహరాజ్ దగ్గరకు వెళ్ళినప్పుడు, మీరు ఇక్కడికి వచ్చినప్పుడు అందరమూ ఒకే స్థితిలో ఉన్న అనుభూతిని పొందుతాము. ఎందుకంటే దైవ కృపను మీరు వేరు వేరు విధాలుగా అనుభూతి చెందలేరు. మళ్ళీ మీరు మీ గృహాలకు వెళ్ళినప్పుడు మరొక విధంగా ఉన్నట్లు అనుభూతి చెందుతారు. ఎందుకంటే, మీరు చాలా ఉన్నత స్థితులను పొందుతున్నా, ఆ స్థితులలో జీవించలేకపోతున్నారు. బాబూజీ మహరాజ్ కృపను, ఒక్కసారిగా కాకపోయినా, క్రమక్రమంగా మీరు గ్రహించగలరు. అందుకనే లక్నోలో అలా ఉంది, ఇక్కడ ఇలా ఉంది అనే తేడా మీకు కలుగుతుంది. కాని బాబూజీ మహరాజ్‌లో మునిగి ఉన్నప్పుడు 'వారు' ఎంత ప్రసాదిస్తే అంతా కూడా మీకు చెందుతుంది. దానిని వెంటనే గ్రహించడమా లేక నిదానంగా గ్రహించడమా అనేది మీ మీదే ఆధారపడి ఉంటుంది.

బాబూజీ "నేను బిచ్చగాళ్ళను తయారుచేయడం లేదు" అని అన్నారు. మరి 'వారి' కృపలో ఉన్న గొప్పదనం (సౌందర్యం) ఏమిటి? ఆ కృప మనం కోరుకుండానే మనకు లభిస్తూ ఉంది. అందుకనే మనం బిచ్చగాళ్ళం కాదు. మనం 'వారి' పిల్లలం. అందుకనే 'వారు' మనకు ప్రసాదిస్తున్నారు. మనం కోరకుండానే 'వారి' కృప అప్రయత్నంగా లభిస్తున్నది.

"నేను నిద్రలో కూడా మీరు ప్రాణాహుతి ప్రసారాన్ని నాకు ఇస్తున్నట్లు అనుభూతి చెందాను" అని బాబూజీ మహరాజ్‌కు చాలాసార్లు ఉత్తరాలలో వ్రాశాను. "సరిగ్గా అదే తేదీ, అదే సమయానికి నేను నీకు ప్రాణాహుతి ప్రసారాన్ని ఇచ్చాను. నీవు మెలకువ స్థితిలో ఉన్నట్లుగానే గ్రహించగలగడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది" అని బాబూజీ సమాధానం వ్రాశారు.

"నేను నిద్రలోకి వెళ్ళుతున్నాను" అనే ఆలోచన ఉంటే నీవు నిద్రిస్తావు. అప్పుడు నీకు ఎటువంటి ఎరుక (మెలకువ) ఉండదు. "నేను నిద్రలోకి వెళ్ళుతున్నాను" అనే ఆలోచన కాకుండా "నేను బాబూజీ మహరాజ్ దివ్య చరణాల దగ్గర ఉంటున్నాను" అనే భావనతో ఉంటే నీవు నిద్రపోయినా నీ హృదయం 'వారి' దివ్య చరణాల దగ్గర మెలకువగానే ఉంటుంది.

**ప్రశ్న: నేను క్లీనింగ్‌లో కూర్చున్న కొన్ని నిమిషాలలోనే ధ్యానంలోకి వెళ్ళుతున్నాను. ఈ విధంగా కొద్ది సంవత్సరాలుగా జరుగుతోంది. ఇది సరియైనదేనా? లేక నేను తప్పు చేస్తున్నానా?**

**జవాబు:** అది సరియైనదే. ఆ ప్రదేశం శుభ్రంగా ఉంటే దానిని మరల శుభ్రపరచే అవసరం లేదు కదా! ధ్యానంలో మన ఆంతరిక దృష్టి లక్ష్యం మీదనే సరిగా ఉండటం కోసమే మనం క్లీనింగ్‌లో కూర్చుంటున్నాం. మీరు ధ్యానంలో నిమగ్నమై కూర్చోగలిగినప్పుడు క్షాళన అవసరం ఉండదు. అలాంటి స్థితి కలిగినప్పుడు సాయంత్రం క్షాళన సమయంలో కూడా ధ్యానంలో కూర్చోవచ్చు. ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీ మహరాజ్‌ని

ఇలా అడిగాడు: "నేను క్షాళనకు కూర్చున్న ప్రతిసారి ధ్యానం మొదలవుతున్నది. ఆ విధంగా నేను రెండు లేక మూడుసార్లు కుర్చుంటున్నాను."

"పదే పదే ఎందుకు మలినపడతావు; మలినపడినప్పుడే క్షాళన అవసరం అవుతుంది. నీవు పరిశుభ్రంగా ఉంటే క్షాళనకు ఎందుకు ప్రయత్నిస్తావు" అని బాబూజీ అన్నారు.

మనకు ఒక సాధనా విధానం ఉన్నది. అందులో నిరంతర స్మరణ మరియు ధ్యానం ఉన్నాయి. మనం ధ్యానంలో కూర్చొని ఉన్నప్పుడు ఆనందాన్ని, దైవంతో అనుసంధానాన్ని అనుభూతి పొందుతాము. అటువంటి స్థితిలో క్షాళన అవసరం లేదు. ఎందుకంటే, ఈ సాధనా విధానంలో ధ్యానం ద్వారా అన్నింటినీ పొందవచ్చు.

మీరు ధ్యానంలో ఉంటే ఆనందాన్ని, పవిత్రతను, తేలికదనాన్ని అనుభూతి చెందుతారు. మీరు అంటే మీ పూర్ణ వ్యవస్థ (సిస్టమ్ పూర్తిగా), ఆ స్థితిలో లీనమై ఉండడానికి ప్రయత్నిస్తే, మీకు బాబూజీ మహరాజ్ కృప తప్పక లభిస్తుంది. దీని అర్థం మీ పూర్ణ వ్యవస్థ ఆ స్థితిలోను, బాబూజీ మహరాజ్ కృపలోను లీనమై ఉంటుంది. ఇది చాలా ఉపయుక్తం. మనం స్నానం చేశామా? లేదా? దుస్తులను మార్చుకొన్నామా? లేదా? అనే విషయాలు మనకు ఎరుక ఉండవు. ఎందుకంటే, ఆంతరికంగా మనం నూతనత్వాన్ని, ఆనందాన్ని మరియు పవిత్రతను అనుభూతి చెందుతాము. అపరిశుభ్రంగా ఉన్నాను అనే భావనకాని, స్నానం చేయవలసిన అవసరంకాని మీకు కలగదు. మీరు స్నానం చేస్తారు. కాని ఆ బాహ్య స్నానంతో మీ ఆంతరిక దృష్టి (అటెన్షన్)కి ఎటువంటి అనుబంధం ఉండదు.

**ప్రశ్న: ధ్యానంలో కూర్చొని ఉన్నప్పుడు బాబూజీ నుండి నావైపు కాంతి ప్రసరిస్తూ ఉంది. ఆ కాంతిలో ఒక మార్గం కనిపించింది. నేను ఆ మార్గంలో ప్రయాణిస్తున్నాను. ఆ మార్గమే నా గమ్యమా?**

**జవాబు:** ఆ మార్గం బాబూజీతో అనుసంధించబడిన సహజమార్గం. నీవు ఆ మార్గాన్ని చూసినప్పుడు, ఆ మార్గం ఎవరితో అనుసంధింపబడినదో గమనించాలి. కాబట్టి నీవు బాబూజీ మహరాజ్‌తో అనుసంధానం కలిగి ఉండి మార్గం యొక్క ఆలోచనను వదిలివేయాలి. సహజమార్గ విధానంలో మార్గం దివ్యమూర్తిమత్వంతో అనుసంధింపబడినది. అందుకనే సహజమార్గం 'సహజం' (స్వాభావికం) అని చెప్పబడినది. మీరు పురోగతి కూడా సహజంగానే పొందుతారు. బాబూజీ స్మరణలో ఉంటే పురోగతిని తేలికగా పొందవచ్చు. మన స్థితి గురించి మనకు ఏమీ తెలియదు. అయినప్పటికీ మీరు బాబూజీ మహరాజ్ దివ్య చరణాల దగ్గర ఉంటే, పురోగతి మీ చెంతనే ఉంటుంది.

"బాబూజీ నాలోనే ఉన్నారు" అనే భావనతో నిమగ్నమై ఉండండి. మనం కనులు మూసుకొని నిమగ్నతలో ఉంటే మనకు ఏదో ఒక అనుభూతి కలుగుతుంది. మీ ఆలోచనకు 'నేను' అనుసంధానం చేసి, ఆ ఆలోచనతో బాబూజీలో నిమగ్నమై ఉండటానికి ప్రయత్నించండి. ఇక్కడ 'నేను' అంటే 'ఆత్మ' అని అర్థం. మీరు 'భావన'తో మొదలుపెడితే తరువాత సత్యతత్వం అవిష్కృతమవుతుంది. మొదట మీరు 'నేను' నిమగ్నమై (మునిగి) ఉన్నాను అనే ఆలోచన చేస్తారు. తరువాత అప్రయత్నం (ఆటోమాటిక్)గా 'ఆత్మ' నిమగ్నమై (మునిగి) ఉండడం గమనిస్తారు.

**ప్రశ్న: బాబూజీ అభ్యాసీల ఉత్తరాలకు జవాబుగా "మీరు కొన్ని పాయింట్లు లేదా బ్రహ్మాండ మండలం దాటారు" అని వ్రాస్తూ ఉండేవారు. కాని అభ్యాసీలు మాకు ఆ అనుభూతి కలగటంలేదని అనేవారు. ఎందువలన?**

**జవాబు:** అందరు అభ్యాసీలు కారు. "దైవీయ పరిశోధన అంతా నీ ద్వారా చేశాను" అని బాబూజీ నాతోఅన్నారు. నాలో ఆ "దివ్య సంకల్పం" ఉండటంవలన అన్నింటిని అనుభూతి చెంది అన్ని స్థితుల గురించి వ్రాయగలిగాను. ఆ దివ్య సంకల్పం వలన నా అంతరంగం ఎల్లప్పుడు మెలకువగా ఉండేది. అందువలన నేను రాత్రిపూట నిద్రిస్తున్నప్పటి స్థితిలోని అన్ని దివ్యానుభవస్థితులన్నీ వ్రాయగలిగాను. కాబట్టి బాబూజీ చెప్పినది అంతా సత్యం. బాబూజీ నా బంధనాలన్నింటిని ఛేదించారని నా పుస్తకంలో వ్రాశాను. ఇప్పుడు అవి (ఆ బంధనాలు) కాలంతో నిమిత్తం లేకుండా సమస్త మానవాళికి ఛేదింపబడ్డాయి. "ప్రతి ఒక్కరు అనంతం వరకు పురోగతి చెందాలి" అని మానవాళికి దైవం ప్రసాదించిన వరం. పరిశోధన చేసి 'వారు' మనకు ఈ మార్గాన్ని ప్రసాదించారు. అన్ని బంధనాలు ఛేదింపబడడంవలన, ఇప్పుడు మీ పురోగతికి ఎటువంటి అవరోధం ఉండదు. ఇదే ఈ విధానంలోని సౌలభ్యం, సత్యతత్వం మరియు బాబూజీ మహరాజ్ కృప. మీరు ఆనందాన్ని, సామీప్యతను అనుభూతి చెందారు. అంతేకాని ఎక్కడ ఉన్నది తెలియదు. నేను కూడా బాబూజీకి రెండవ బిందువు లేదా మూడవ బిందువు దగ్గర ఉన్నానని ఎప్పుడూ వ్రాయలేదు. బాబూజీ పరిశోధన చేశారు కాబట్టి 'వారే' వాటి గురించి వ్రాసేవారు. నేను ఎప్పుడూ అనుభూతి చెందిన స్థితుల గురించియే వ్రాసేదాన్ని. బాబూజీ ఆ స్థితులు ఏ బిందువుకు చెందినవో వ్రాసేవారు. ప్రతిబిందువు కూడా 'వారి' దైవీయ మనస్సులో ఉండేది. బంధనాలన్నీ ఛేదింపబడడంవలన మీరు ఎటువంటి అవరోధం లేకుండా అనంతయాత్రలో నిరంతరంగా ముందుకు వెళ్ళతారు. నాకు తెలిసింది, నేను చేసింది, అభ్యాసీ చేయవలసిన ప్రయత్నం ఏమిటంటే, బాబూజీ మహరాజ్‌తో జీవించడం, తరువాత బాబూజీ మహరాజ్‌లో జీవించడం. ఈ రెండు అత్యావశ్యకాలు. అప్పుడు మీరు సమస్తమూ పొందుతారు.

నేను ఏ ఆధ్యాత్మిక గ్రంథాలను చదవలేదు. ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రతి భక్తుడు శరణాగతి, ప్రేమ, భక్తి ఇంకా అనేక విధాలుగా పరిశ్రమించవలసి ఉండేది. ఇప్పుడు అది అనంతం అయినటువంటి బాబూజీ మహరాజ్ మన స్మరణలో ఉంటే చాలు. మనం బాబూజీ మహరాజ్‌ను స్మరిస్తూ, 'వారి' సామీప్యతను అనుభూతి చెందుతూ, 'వారి'లో జీవిస్తూ ఉండడం మనకు చాలా ఉపయుక్తం.

మనకు కొన్ని చెడు అలవాట్లు ఉండవచ్చు. కాని బాబూజీకి అవి తెలుసు. వారే చూసుకుంటారు అని చెప్పడం చాలా తప్పు. ప్రార్థన ద్వారా, బాబూజీ కృపవలన మనం ఆ చెడు అలవాట్లను తొలగించుకోవాలి. నీవు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నప్పుడు ఆధ్యాత్మిక నడవడిని పాటించాలి. కొంతమంది పిల్లలను తీవ్రంగా శిక్షిస్తూ అంతా బాబూజీ చూసుకుంటారు అని చాలా తేలికగా అంటారు. అది చాలా తప్పు. ఇతరులకు శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసీగా పరిచయం చేసుకోవాలంటే మీరు చక్కని నడవడికతో ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వ్యక్తిగా ఉండడానికి ప్రయత్నించండి.

**ప్రశ్న: బాబూజీ దేవతల మీద, ముక్తాత్మల మీద ధ్యానం చేయవద్దు అని అన్నారు. ఆ ముక్తాత్మలు ఎవరు?**
**జవాబు:** లాలాజీ సాహెబ్, దివ్య మూర్తిమత్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ భూమిపై అవతరించినప్పుడు అంతకుముందు ఉన్న అవతార పురుషుని (శ్రీకృష్ణుడు) అవసరం ఇక ఉండదు. ఎందుకంటే, ఇప్పుడు ఉన్న దివ్యమూర్తిమత్వం సమస్త విశ్వం కొరకు పనిచేస్తూ ఉన్నారు. ఇంతకుముందు వచ్చి ఉన్న అవతార పురుషులు వారు ఎక్కడ నుండి అవతరించారో ఆ క్షేత్రంలో లయమయ్యారు. ఇది ప్రకృతి ధర్మం.
**ప్రశ్న: బెహెన్‌జీ! దయచేసి శ్రీ వివేకానందుని గురించి తెలియజేయండి.**
**జవాబు:** వారు ఉన్న క్షేత్రానికి, స్థితులకు వారు మాస్టర్. వారు కావాలని అనుకుంటే దివ్యమూర్తిమత్వంతో కలిసి పని చేయవచ్చు. ఇప్పుడు సమస్తమూ ప్రస్తుత దివ్యమూర్తిమత్వమైన శ్రీ బాబూజీ మహరాజ్‌తో అనుసంధింపబడి ఉన్నది. సహజమార్గ విధానంలో తప్ప వేరే ఏ ఆధ్యాత్మిక మార్గమూ, దివ్యశక్తి, దివ్య ప్రాణాహుతి ప్రసారాలను కలిగి లేదు. శ్రీరాముడు, శ్రీకృష్ణ భగవానుల కాలంలో వారిని గురించి తెలిసిన వారు, వారిని ఎదిరించిన వారు మాత్రమే వారితో సంబంధం కలిగి ఉన్నారు. కాని ఎక్కువ మందికి వారు అవతార పురుషులని తెలియదు. ఎందుకంటే, వారు ఋషుల ప్రార్థనల వలన దుఃఖాలను తొలగించడానికి అవతరించారు. వారు నిర్వర్తించవలసిన కార్యం పరిమితం. కాని దివ్యమూర్తిమత్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ అవతరించినప్పుడు సమస్త మానవాళికి దైవం యొక్క శక్తి కాదు, దైవమే మనలో ఉన్నారన్న స్ఫురణ కలిగి, ఆ దైవంతో అనుబంధం కలుగుతుంది. ఇది సమస్త విశ్వానికి చెందిన కార్యం.

నది మన ముందరే ఉన్నది. మొదట మనకు అందులో స్నానం చేయాలనే ఆలోచన కలుగుతుంది. మనం ఆ నదిలో స్నానం చేస్తాం. దీనంతటికీ కారణం ఆలోచన. ఆలోచన గనక లేకపోతే నది మన ఎదుట ఉన్నా కూడా మనం స్నానం చేయం. మీరు ధ్యానంలో కూర్చున్నప్పుడు ఆనందాన్ని కాని, తేలికదనాన్ని కాని అనుభూతి చెందుతారు. ఆ అనుభూతిని బాబూజీ మహరాజ్ కృపగా భావించి, "నేను నా సంపూర్ణ వ్యవస్థ (సిస్టమ్) అంతా ఆ కృపలో, ఆ స్థితిలో మునుగుతున్నాను" అనే ఆలోచన చేయండి. మొదట అది ఆలోచనగానే ఉంటుంది. తరువాత మీరు మునిగిన అనుభూతి చెందుతారు. మొదట స్నానం చేయాలనే ఆలోచన కలిగి మీరు నదిలో మునకలు వేస్తారు. అప్పుడు మీరు తాజాదనం, స్వచ్ఛత అనుభూతి చెందుతారు. అదే విధంగా మీరు బాబూజీ మహరాజ్ కృపలో (దివ్యత్వంలో) మునిగి ఉంటే, మీ వ్యవస్థ (సిస్టమ్) కూడా తాజాదనాన్ని సంతరించుకుంటుంది. మన శరీరాన్ని స్నానంతో శుభ్రపరచుకోవచ్చు. కాని అంతరంగాన్ని శుభ్రపరచుకోవడానికి ప్రాణాహుతి ప్రసారం వలన ఆ దివ్యత్వంలో స్నానమాచరించాలని బాబూజీ అన్నారు. ఇది అభ్యాసీలు మాత్రమే ఆచరించగలరు. దేనికైనా మొదట మనం ఆలోచనతో మొదలుపెడితే తరువాత ఫలితాన్ని అనుభూతి చెందుతాము. మీరు ధ్యాన సమయంలో ఆంతరికంగా ఏ అనుభూతి చెందుతారో ధ్యానం అయిన తరువాత కూడా అదే భావనలో మునిగి ఉండడానికి ప్రయత్నించండి. ఆ విధంగా అంతరంగంలో దృష్టి ఉంచి అదే భావనలో ఉంటే, మీ హృదయం చాలా పవిత్రంగా ఉంటుంది. బాబూజీ మహరాజ్ కృపలో మునిగి ఉంటే మనం నిరంతర స్మరణ, నిరంతర ధ్యానం, నిరంతర సామీప్యత పొందుతాము. ఆత్మ నదులలోను, సముద్రాలలోను మునగదు. ఆత్మ ఎప్పుడూ ప్రాణాహుతి అనే నదిలో

మాత్రమే మునుగుతుంది. ధ్యానం చేసినా, చేయకపోయినా దైవం మనలోనే ఉన్నారు అనే భావన కలిగి ఉండండి. "బాబూజీ మహరాజ్ నా దైవం. వారు నాలోనే ఉన్నారు" అని భావించండి. ఈ భావనలో ఉంటే అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్‌తో జీవించడానికి ప్రయత్నించవచ్చు.

కొందరు వ్యక్తులు నా దగ్గరకు "మేము కె. సి. నారాయణగారి అభ్యాసులం" అని వచ్చారు. "నాకు మీరుగాని, కె. సి. నారాయణగారు కాని తెలియదు. నాకు ఒక్క బాబూజీ మహరాజ్ మాత్రమే తెలుసు. మీరు బాబూజీని గురించి అడిగితే నేను చెప్పగలను" అని సమాధానం ఇచ్చాను. మరికొందరు బుద్ధుని గురించి, ఇతర సంస్థల గురించి అడగ్గా వారికి కూడా నాకు బాబూజీ మహరాజ్ గురించి, సహజమార్గ విధానం గురించి మాత్రమే తెలుసునని చెప్పాను.

**ప్రశ్న: సునిశిత గ్రహణశక్తి (సెన్సిటివిటీ)ని పెంపొందించుకోవటం ఎలా?**

**జవాబు:** సహజమార్గ విధానంలో అన్నీ నిరంతర స్మరణవల్లనే సహజంగా లభిస్తాయి. పురోగతికి అవసరమైన వన్నీ అప్రయత్నంగా (ఆటోమేటిక్‌గా) మీకు సమకూరుతాయి. మీరు భోజనం చేస్తున్నప్పుడు నేను ఈ పదార్థాన్ని తింటున్నాను అనే ఎరుకతో తింటే ఆ పదార్థపు రుచి మీకు తెలుస్తుంది. కాని మీ మనస్సు వేరే ఆలోచనలలో నిమగ్నమై ఉంటే మీకు ఏ రుచి తెలియదు. అదే విధంగా సాక్షాత్కారం కొరకు మీరు తపన (దాహార్తి)తో ప్రయత్నం చేస్తే దాని అనుభూతి (రుచి) మీకు కలుగుతుంది. "బాబూజీ నా వారు" అని మీరు నోటితో అంటారు. ఎప్పుడైతే ఆ భావనను మీరు అనుభూతి చెందుతారో అప్పుడు మీ హృదయం 'వారి' దివ్యచరణాలమీద వ్రాలి ఉండడం మీరు గ్రహిస్తారు. ప్రతి వాక్యం కూడా ఒక స్థితిలో మునిగి ఉంటుంది.

మన సాధనా విధానంలో "బాబూజీ (మాస్టర్)లో జీవించడం" అనేది రెండవ దశ. "దైవం నాలో ఉన్నారు" అనేది మొదటి దశ. ఈ స్థితికి వచ్చినప్పుడు మీరు ఆ స్థితిలో అంటే "దైవం నాలో ఉన్నారు" అనే స్థితిలో మునిగి ఉంటారు. మీ ఆలోచన (ఎరుక) ఎల్లప్పుడూ ఆ స్థితిలోనే మునిగి ఉంటుంది. అప్పుడు మీరు "నేను దైవంలో ఉన్నాను" అని అనుభూతి చెందుతారు. ఎందుకంటే, మిమ్మల్ని మీరు మరచిపోతారు. సహజమార్గ సాధనా విధానంలో శరీరానికి ఎటువంటి సంబంధం లేదు. కాని శరీరం అనేక మార్పులు చెందడం మీరు చూస్తారు. దైవంలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదు. దైవాన్ని మీరు జ్ఞాపకం చేసుకున్నప్పుడు మీరు మార్పు చెందడం గమనిస్తారు. కాని దైవంలో ఎటువంటి మార్పు లేదు.

**ప్రశ్న: "మాస్టర్‌లో జీవించటం", లయావస్థ ఒక్కటేనా?**

**జవాబు:** కాదు. "దైవం మనలోనే ఉన్నారు", "బాబూజీ మనలోనే ఉన్నారు" అనేది మొదటి దశ. రెండవ దశ మొదలైతే మీ పూర్తి దృష్టి బాబూజీతో అనుసంధించబడి ఉంటుంది. మిమ్మల్ని మీరు పూర్తిగా మరచిపోయే స్థితి ప్రారంభమవుతుంది. తరువాత ఒక్క బాబూజీ మహరాజ్ మాత్రమే ఉంటారు. ఇదే "బాబూజీలో జీవించటం", "మాస్టర్‌లో జీవించడటం" అనే రెండవ దశ. ఈ దశ తప్పకుండా వస్తుంది.

"హృదయం పవిత్రంగా ఉండాలి" అంటే ఏమిటి? బాబూజీ ఈ సందర్భంగా చక్కటి విషయం చెప్పారు. ఒక్కొక్కసారి ఎవ్వరైనా అభ్యాసీ సిట్టింగ్ తీసుకోవడానికి వచ్చినపుడు, సిట్టింగ్ ఇవ్వాలని అనిపించదు.

ఇంకొకసారి అభ్యాసీ అడగకుండానే హృదయం ప్రాణాహుతి ప్రసారం ఇస్తుంది. ఇలా అభ్యాసీల హృదయం యొక్క పవిత్రతవలన జరగుతుంది. పవిత్రత అంటే బాబూజీ మహరాజ్ యొక్క ఛాయ. అందువలన ఆకర్షణ ఉంటుంది.

**క్రోధం:** క్రోధం యొక్క అవసరం మనకు ఉన్నప్పుడు అది మనతో సంబంధం కలిగి ఉంటుంది. దాని అవసరం (పని) తీరిన తరువాత మనం క్రోధం నుండి విముక్తులం అవుతాము.

**మమత:** "మా సోదరి మరణించిన తరువాత ఆమె ముగ్గురు పిల్లలు మాతో ఉండేవారు. నేను ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె గుర్తుకు వచ్చేవారు కాదు. కాని నేను కుటుంబ సభ్యులు అందరితో ఉన్నప్పుడు ఆవిడ గుర్తుకువచ్చి విచారం కలిగేది" అని నేను (కస్తూరి) బాబూజీకి వ్రాశాను. "నీవు ఒక ఆధ్యాత్మిక కుటుంబంలోని వ్యక్తిగా జీవిస్తున్నందుకు చాలా సంతోషం. ఎటువంటి భావనా లేకుండా, విచారపడవలసిన సమయంలో నీకు దుఃఖం వస్తుంది. కాని నీవు ఒంటరిగా ఉన్నప్పుడు ఇవి గుర్తుకు రావు. అందుకనే విచారం కలగదు" అని బాబూజీ అన్నారు. నేను చాలా పరిస్థితులను అధిగమించవలసి వచ్చింది. మా తండ్రిగారు మరణించినప్పుడు బాబూజీ మా వద్దకు శ్రీ రయిజాదా, శ్రీ కాశీరామ్‌లను సహాయంగా పంపించారు. మా అమ్మగారిని ఓదార్చుటకు ప్రక్క ఇంటి ఆడవారు వచ్చినప్పుడు నేను కూడా దుఃఖించాను. వారు తిరిగి వెళ్ళి బాబూజీతో "మీరు ఆవిడను (సిస్టర్ కస్తూరిజీ) ఆధ్యాత్మికంగా తయారు చేసారు అని చెప్పారు. కాని ఆవిడ చెప్పలేనంతగా దుఃఖిస్తున్నారు" అని అన్నారు. 'వారు' ఆ మాటలను విని మౌనంగా ఉన్నారు. మన ఇంట్లో ఎవ్వరైనా అనారోగ్యంగా ఉంటే మనం స్పందించడం సహజం. మన ప్రక్క ఇంట్లో వాళ్ళు అనారోగ్యంగా ఉన్నట్లు తెలిస్తే మనం బాధపడతాము. కాని స్పందన ఉండదు. ఎందుకంటే అక్కడ బంధం అనేది లేదు. మన మందరం సోదర భావంతో ఉన్నప్పుడే ఏ అభ్యాసీ అయినా బాధపడితే ఆ స్పందన మనకు తగులుతుంది. అప్పుడు అ అభ్యాసీ గురించి మనం ప్రార్థిస్తాము. ఇదే మన సంస్థలోని సోదర భావానికి అర్థం. మనలో స్పందన ఉంటేనే మన ప్రార్థన ఫలిస్తుంది. లేకపోతే ఆ ప్రార్థనకు ఎటువంటి ఫలితం ఉండదు.

**ప్రశ్న: బెహెన్‌జీ! ప్రేమను పెంపొందించుకోవడం ఎలా?**

**జవాబు:** మనం ఏదైనా (సృష్టి చేస్తే) తయారుచేస్తే దానిని పెంపొందించుకోవచ్చు. కాని ఏదైతే సహజంగా ఉన్నదో దానిని మీరు పెంపొందించుకోలేరు. డివైన్ పర్సనాలిటీ అయిన బాబూజీ మహరాజ్‌తో అభ్యాసీల కనెక్షన్ చాలా సహజమైనది. ఎప్పుడైతే మీ హృదయం బాబూజీ మహరాజ్‌తో ఎటాచ్ అయి ఉంటుందో అప్పుడు ప్రేమ వృద్ధి చెందడం మొదలవుతుంది. మీరు మీ ప్రయత్నంతో వృద్ధిపరుచుకోలేరు. మీకు ఇద్దరు కుమారులు ఉంటే ఒకరిని ఎక్కువగాను, మరొకరిని తక్కువగాను ప్రేమించలేరు. ఇద్దరిని సమానంగా ప్రేమిస్తారు. ఇది ప్రకృతి ధర్మం.

**ప్రశ్న: దయచేసి ప్రేమ, విధేయత గురించి చెప్పండి.**

**జవాబు:** "నీవు చాలా విధేయత కలదానివని నేను భావిస్తున్నాను" అని ఒక ఉత్తరంలో బాబూజీ నాకు వ్రాశారు. అప్పుడు దాని అర్థం నాకు తెలియలేదు. ఎందుకంటే ఏది విధేయత, ఏది కాదో నాకు తెలియదు. ఇప్పుడు నాకు విధేయత అంటే ఏమిటో దాని అర్థం బోధపడింది. బాబూజీకి టీ త్రాగాలనే కోరిక కలిగినప్పుడు

'వారు' చెప్పకుండానే నీవు తెలుసుకొని టీ ఇవ్వడం అనేది విధేయత. మనం నౌకరుకు చెబితే అతను పని చేస్తాడు కాని మాస్టర్ చెప్పకుండానే 'వారి' అభిమతం తెలుసుకొని దాని ప్రకారం నడుచుకోవడమే ఆధ్యాత్మికతలో విధేయత యొక్క అర్థం. బాబూజీ గురుభాయి శ్రీ కృష్ణన్‌లాల్ ఈ విధంగా ఉండేవారని బాబూజీ వ్రాశారు. ప్రాపంచిక పరమైన అర్థంలో చూస్తే నౌకరు కూడా మనం చెప్పిన పనులన్నింటినీ చేస్తాడు. కాబట్టి అతను కూడా విధేయత కలవాడే.

**ప్రశ్న: క్రమశిక్షణ తరువాత విధేయత మొదలవుతుందా?**

**జవాబు:** ఇప్పుడు క్రమశిక్షణ యొక్క అర్థాన్ని తప్పుగా ఉపయోగిస్తున్నారు. ఆధ్యాత్మిక సంస్థలో మిలటరీ క్రమశిక్షణ ఉండదు. మీరు ఇలా నడుచుకోండి, అలా నడచుకోండి అని చెప్పము. ప్రతివాళ్ళు బాబూజీని చూడాలని 'వారి' దగ్గరగా కూర్చోవాలని అనుకుంటారు. అందుకని మీరు ఇక్కడ కూర్చోండి. అక్కడ కూర్చోండి అని చెప్పకూడదు. మాట్లాడేటప్పుడు స్వరంలో కఠినత్వం ఉండడం మంచిది కాదు. కఠినత్వం వలన ఎదుటివారిపై ఒత్తిడి కలుగుతుంది. ఎటువంటి వత్తిడి లేకుండానే మనం అన్ని పనులు నిర్వర్తించగలగాలి. ఒక అభ్యాసీ తన పిల్లవాడితో వచ్చి సిస్టర్ కాళ్ళకు నమస్కరించాలని ఆ పిల్లవాడిని బలవంతం చేస్తే వాడు ఏడుస్తాడు. ఎందుకంటే వాడు ఒత్తిడిని తట్టుకోలేడు. బాబూజీ మన జీవన విధానం చాలా సహజంగా ఉండాలని చెప్పారు. సహజమార్గ పద్ధతి అంటే కొన్ని నియమాలన్నీ పాటించటం కాదు. అది ఒక జీవన విధానం. మనం ఆధ్యాత్మిక సంస్థలో చేరాము అంటే మన జీవన విధానం నేర్చుకోవడం కోసమే.

**ప్రశ్న: బాధ, తపన రెండు ఒక్కటేనా?**

**జవాబు:** బాధను బాహ్యంగాను, తపనను ఆంతరికంగాను అనుభూతి చెందుతాము. దీనికి ఒక ఉదాహరణ నిస్తాను. నేను అభ్యాసీగా చేరిన క్రొత్తలో షాజహాన్‌పూర్ వెళ్ళుతూ ఉండేదానిని. తిరిగి ప్రయాణమైన రోజున బాబూజీని లోలోపల ఇలా ప్రార్థించేదాన్ని: "బాబూజీ! నా ప్రయాణాన్ని ఆపండి. ఇంకా కొన్ని రోజులు నన్ను ఇక్కడే ఉండమనండి" అని. కాని బాబూజీ ఎప్పుడూ అలా చెప్పలేదు. ఈ విధంగా మూడు సంవత్సరాలు గడిచాయి. తరువాత ఒకసారి మేము షాజహాన్‌పూర్ నుండి బయలుదేరే సమయానికి బాబూజీ నా ప్రయాణాన్ని ఆపాలనే భావన నాకు కలగలేదు. కాని బాబూజీ నన్ను ఇంకా రెండు రోజులు అక్కడ ఉండమని కోరారు. లఖీమ్‌పూర్ ఖేరి చేరిన తరువాత "బాబూజీ! నేను ఇంకా కొన్ని రోజులు మీ దగ్గర ఉండాలని నా హృదయం కోరినప్పుడు ఆ విధంగా అనలేదు. కాని ఇప్పుడు ఉండమని అంటున్నారు" అని ఉత్తరం వ్రాశాను.

దానికి "అప్పుడు నా నుంచి దూరమవుతున్నాననే బాధ నీలో ఉంది. ఇప్పుడు ఒక బంధం (లింక్) ఉంది. అందుకనే అలా అన్నాను" అని బాబూజీ సమాధానం ఇచ్చారు. బాబూజీతో కనెక్షన్‌తోపాటు 'వారి' సాక్షాత్కారం పొందాలనే తపన కూడా నాలో ఉంది.

బాధ– షాజహాన్‌పూర్‌లో ఉన్న బాబూజీని చూడడానికి, తపన– బాబూజీని అంతరంగంలో సాక్షాత్కరించుకోవటానికి కలుగుతుంది.

"భగవంతునితో బంధం ఏర్పరచుకొంటే 'అతని' దగ్గర నుంచి ప్రేమ మనకు వస్తుంది" అని బాబూజీ చెప్పారు. మనంతట మనం భగవంతుని ప్రేమించలేము. మనం 'అతని'తో బంధం ఏర్పరచుకోవాలి. ప్రేమ భగవంతుని దగ్గర నుంచి వస్తుంది.

**డివైన్ పర్సనాలిటీ (బాబూజీ)కి మనం చేసే గొప్ప సేవ ఏమిటంటే, 'వారి'కి మన సహకారాన్ని (కో–అపరేషన్) ఇవ్వడమే. బాబూజీ దివ్యత్వాన్ని మనకు ప్రసాదిస్తున్నారు. దాన్ని మనం తీసుకొనకపోతే 'వారు' చాలా నిరుత్సాహపడతారు; బాధపడతారు. 'వారు' దివ్య కృపను మనకు ఇస్తున్నారు; మనం తీసుకుంటున్నాము. సహకారం అంటే ఇదే. 'వారు' ప్రసాదించే దాన్ని తీసుకోవడమే సహకారం. (కో–ఆపరేషన్).**

ధ్యానంలో కలిగిన ఫీలింగ్‌ను మరల మరల జ్ఞాపకం చేసుకొని, అదే ఫీలింగ్‌లోనే రోజంతా మునిగిపోవడానికి కృషి చేయాలి. ధ్యానం అయిపోయిన తరువాత, వేరే పనులు చేసుకుంటున్నప్పటికీ మీ అటెన్షన్ (శ్రద్ధా దృష్టి)ని లోపలికి మరల్చి, సిస్టమ్ అంతా బాబూజీ మహరాజ్ దివ్య కృపలో మునిగిపోయినది, పవిత్రమవుతున్నది అనే అనుభూతి (ఫీలింగ్)లో ఉండాలి. దీనివలన నిరంతర స్మరణ, నిరంతర ధ్యానం మరియు నిరంతర సామీప్యత ఈ మూడు మీకు లభిస్తాయి.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! మాలో నిరంతర స్మరణ ఏర్పడినదని మాకు ఎప్పుడు, ఎలా తెలుస్తుంది?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! ఎప్పుడైతే నిన్ను నీవు మరచిపోతావో, అప్పుడే నీవు నిరంతర స్మరణలో ఉన్నావని గుర్తు" అని అన్నారు. ఇప్పుడు మనం చేసేది నిరంతర స్మరణ కాదు. ఎప్పుడైతే అభ్యాసీ బాబూజీ స్మరణలో మునిగిపోయి, తనను తాను మరచిపోతాడో అప్పుడే నిరంతర స్మరణ అనేది ప్రారంభమవుతుంది. మనం ఈ ప్రపంచంలోని అన్ని పనులు చేస్తాము. కాని మన దృష్టి (అటెన్షన్) ఎల్లప్పుడు కూడా మన లోపలనే ఉన్నటువంటి బాబూజీ మహరాజ్ మీదనే నిలిచి ఉంటుంది.

ఎప్పుడైతే మన అటెన్షన్ పూర్తిగా 'వారి'తోనే కనెక్ట్ అయి ఉంటుందో, అప్పుడు నిరంతర స్మరణ అనేది దానంతట అదే ఏర్పడుతుంది. ఈ ప్రాపంచిక జీవితంలో మనకు ఎన్నో కష్టాలు, సమస్యలు ఉంటాయి. కాని 24 గంటలు మనం ఈ సమస్యల గురించే ఆలోచించవలసిన అవసరం లేదు. ఏదైనా బాధ, కష్టం ఉంటే దానిని ప్రార్థన ద్వారా బాబూజీకి నివేదించుకొని, మరల ఆ తరువాత బాబూజీ స్మరణలో మునిగిపోవాలి. ఈ మానవ జన్మ మనకు ఎందుకు ఇవ్వబడింది? ఈ భూమి మీదకు మనం ఎందుకు వచ్చాము? మన జీవిత లక్ష్యం ఏమిటి? అని ఒకసారి ఆలోచిస్తే మనకు ఆ భగవంతుని సాక్షాత్కారమే చాలా ముఖ్యమైనది అని తెలుస్తుంది. మనకు బాబూజీ లభించారు. మన అటెన్షన్ (దృష్టి)ని ఎల్లవేళలా 'వారి' మీదనే ఉంచాలి.

"బాబూజీ! మీరు నా లోపలనే ఉన్నారు; నేను మీ వాణ్ణి; మీరు మా వారు" అనే ఫిలింగ్‌లో 'వారి' స్మరణలో మునిగిపోతే, అప్పుడు నిన్ను నీవు మరచిపోతావు. కాని నిన్న నీవు మరచిపోవాలని మాత్రమే సాధన చేస్తే, నిన్ను నీవు మరచిపోలేవు. ఎందుకంటే అక్కడ నీవు మరియు సాధన రెండూ ఉన్నాయి. బాబూజీతో కనెక్షన్ పెట్టుకొని, 'వారి' స్మరణలోనే మునిగిపోతే, అప్పుడు సెల్ఫ్ (నేను) అనేది అందులో

మునిగిపోతుంది. 'వారి' ఆశీస్సులు, వరదాన్ మనకు ఎల్లప్పుడు ఉన్నాయి. కాని మొదట మీరు అభ్యాసీగా మారాలి. ఆ ఆశీస్సులను పొందడానికి తగిన అర్హతను పెంపొందించుకోవాలి. దానికే ఈ సాధన.

మన మిషన్ గురించి ప్రచారం చేసేవారు రెండు రకాలు. మాది శ్రీరామచంద్ర మిషన్, మా మాస్టర్ బాబూజీ మహరాజ్, బాబూజీ ఇలా ఉంటారు, గొప్ప గొప్ప పనులను చేస్తారు, అని చెప్పేవారు మొదటి రకంవారు. రెండవ రకంవారు, ఈ విధంగా పైకి ప్రచారం చేయరు. వాళ్ళ లోపల ఒక క్రేవింగ్ (తపన) అనేది ఉంటుంది – "బాబూజీ! మీరు వీళ్ళను స్వీకరించండి. మీ చరణాల వద్ద ఉండే విధంగా వీరిని యోగ్యులుగా చేయండి" –అనే తపన కొంతమంది ప్రిసెప్టర్స్‌లలో ఉంది. మొదటిరకం ప్రచారకులలో సోదరభావం అనేది లేదు. వాళ్ళు మిషన్ గురించి నోటితో అందరికి చెబుతారు. కాని రెండవ రకంవారు, బాబూజీని గురించి ఇతరులకు చెప్పినప్పుడు, క్రొత్తవారికి కూడా బాబూజీ కృప తప్పక లభించాలనే తపన వీరిలో ఉంటుంది. వీళ్ళు సోదరభావంతో, నిజమైన సేవకునివలె బాబూజీని గురించి (ప్రచారపు ఆర్భాటం చేయకుండానే) ఇతరులకు చెబుతారు. నిజానికి శ్రీరామచంద్ర మిషన్‌కి ప్రచారం అవసరం లేదు అని బాబూజీ చెప్పారు. ఎందుకంటే సమస్త మానవాళి అల్టిమేట్ (భూమా) వద్దకు తీసుకొని వెళ్ళాలని ఏ దివ్య సంకల్పంతో అయితే పని చేసారో, అది అంతా కూడా వాతావరణంలో ఉన్నది. 'నేను ఈ శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత కూడా ఆ దివ్య సంకల్పం (డివైన్ విల్) వాతావరణంలో ఉండి అదే పని చేస్తుంది" అని బాబూజీ తెలిపారు.

"షాజహాన్‌పూర్‌లో నాకు దగ్గర ఉండే వాళ్ళందరు కూడా మేము బాబూజీ దగ్గరనే కూర్చొని ఉన్నాము. మాకు అన్నీ (గ్రేస్, ట్రాన్స్‌మిషన్) లభిస్తున్నాయి అని అనుకుంటారు. కాని వాళ్ళలో క్రేవింగ్ (తపన) అనేది లేదు. అందువలన వాళ్ళకు ఏదీ లభించదు. నాకు దూరంగా ఉన్న వాళ్ళలోనే క్రేవింగ్ (తపన) ఎక్కువగా ఉంది" అని బాబూజీ అనేవారు. ఒకసారి బాబూజీ, "బిటియా! చాలామంది షాజహాన్‌పూర్‌కు విశ్రాంతి కొరకు వస్తారు" అని నాతో అన్నారు. కాని నాకు అప్పుడు అర్థం కాలేదు. దీని అర్థం ఏమిటంటే, అభ్యాసీ ఇక్కడకు వచ్చి ఊరకనే కళ్ళు మూసుకొని కూర్చొంటాడు. "బాబూజీ నా లోపల ఉన్నారు. నేను 'వారి' ధ్యానంలో ఉన్నాను. నా దృష్టిని 'వారి'వైపు మరల్చాలి" అనే దాని ధ్యాసలో వాళ్ళు ఆలోచన చేయరు. నాలోని ప్రతి అణువు, కణకణం మొత్తం సిస్టమ్ అంతా కూడా బాబూజీ వ్యాపించి ఉన్నారు అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి. ఆధ్యాత్మికత కొరకు ధైర్యవంతులు కావాలి. పిరికివాళ్ళు అవసరం లేదు. ఈశ్వరప్రాప్తి కొరకు ఎవరైతే ప్రతిక్షణం ఎలర్ట్ (సావధానం)గా ఉంటారో, ఎవరైతే ఒక్క క్షణం కూడా వృథా చేయరో, వాళ్ళే ధైర్యవంతులు.

ఒకసారి నేను "బాబూజీ! పైనుండి ఎవ్వరో ఒక కస్తూరీ చూస్తున్నట్లుగా ఉంది. క్రింద ఉన్న మరో కస్తూరీ భూమి మీద నడుస్తూ ఉన్నది. కాని ఈమె పాదాలు భూమిని స్పర్శించడం లేదు. కాని ధరణియే ఆమె పాదాలను స్పర్శిస్తున్నట్లుగా ఉన్నా కాని ఆ ఫీలింగ్ కూడా లేదు" అని వ్రాశాను. దానికి వారు, "ఆ స్థితిలో ఈ శరీర నిర్వహణకు ఎంతయితే జీవశక్తి అవసరమో అంతే అభ్యాసీలో ఉంటుంది" అని బాబూజీ తెలిపారు.

ఒకసారి లాలాజీ సాహెబ్ ఒక పని చేయవలసిందిగా బాబూజీకి చెప్పారు. లాలాజీ అనుకున్నట్లుగా ఆ పనిని చేసారు. కాని లాలాజీ కోరుకున్న విధంగా ఆ పని స్వల్పంగా అవ్వలేదు. అప్పుడు లాలాజీ, బాబూజీ మీద కొంచెం చిరుకోపంతో ఉన్నట్లుగా, బాబూజీకి అనిపించింది. వెంటనే బాబూజీ, "హుజూర్! నేను అన్నీ భరిస్తాను. కాని ఒక్క సెకండ్ అయినా మీరు నామీద కోపాన్ని చూపితే నేను జీవించలేను. నా ప్రాణం పోతుంది" అని అన్నారు. అనగా ఒక్క సెకండ్ అయినా బాబూజీ లాలాజీ యొక్క ప్రేమ నుండి దూరమైతే, బాబూజీ ఉండరు. వారిద్దరి మధ్యన గల ఆ దివ్య ప్రేమ యొక్క సంబంధాన్ని అర్థం చేసుకోవడం మనకు అసంభవం.

**(7.10.2004: లక్నోలో సోదరి కస్తూరీజీతో అభ్యాసులు సత్‌సంగ్‌లో పాల్గొనగా ఆమె ప్రవచించినవి.)**

ధ్యానంలో లోతుగా వెళ్ళండి. మీకు ధ్యానంలో ఏవేవో అనుభూతులు కలుగుతాయి. ఆ అనుభూతిలో మన 'సిస్టమ్' అంతా (శరీర వ్యవస్థ – తల నుండి పాదం వరకు) పూర్తిగా మునిగిపోయి, దానిలోనే ఉండేలా ప్రయత్నం చేయాలి. అప్పుడే మీరు ధ్యానంలో లోతుగా వెళ్ళగలరని శ్రీ బాబూజీ అన్నారు.

మనం శ్రీ బాబూజీని ప్రేమిస్తున్నామన్న భావన నిరంతర స్మరణ కాదు. మీకు కలిగిన అనుభూతిని ఎంతగా గుర్తుంచుకుంటారో, ఎంతగా దానిలో మునిగి ఉంటారో అంతగా అభివృద్ధి సాధ్యం.

మీరు నదిలో స్నానం చేస్తారు. ఎప్పుడు పూర్తిగా తడవడం జరుగుతుంది? పూర్తిగా మునిగినప్పుడే కదా! అలా పూర్తిగా మునిగి అనుభూతి పొందినప్పుడు ఇంకొక స్థితి కలిగినా, పొందినా తెలుస్తుంది. ఇలా గ్రహించగలిగినప్పుడు మనలో చురుకైన సున్నితత్వం (సెన్సిటివిటి) పెరుగుతుంది. ఈ విధంగా శ్రీ బాబూజీ మహరాజ్, తమ ప్రాణాహుతితో మనలను ముందుకు తీసుకువెళ్ళతారు. ఒకవేళ ఈ విధంగా మునిగి అనుభూతి పొందకపోయినా మనం ముందుకు వెళ్ళవచ్చునేమోగాని, 'ఆనందం' పొందలేము. అందుకని, ముందు "నీవు దివ్య ప్రకాశంలో మునిగి ఉండు" అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు. ఇలా చెప్పినప్పుడు ఒక ధ్యాస, స్మరణ కలుగుతుంది. పూర్తిగా 'సిస్టమ్' అంతా దివ్య ప్రకాశంలో మునిగిపోయి ఉంటుంది. అప్పుడు మన అంతర్నేత్రానికి దివ్యత్వం ఎలా ఉన్నదో తెలుస్తుంది. ఒక ప్రక్క 'వారి'చేత ఇవ్వబడిన దానిని ఆహ్వానిస్తాం. రెండవది దానిలో పూర్తిగా మునిగి ఉంటాము. ఈ విధంగా మనం అనుభూతిలో పూర్తిగా మునిగిపోవడం వలన శ్రీ బాబూజీ మహరాజ్ ఎందుకు వచ్చారో, ఏ సంకల్పంతో వచ్చారో, ఆ సంకల్పం పూర్తి చేసినట్లవుతుంది. 'వారు' సంతోషిస్తారు. ఇలా ధ్యానంలో లోతుగా వెళ్ళినట్లయితే సున్నితత్వం (సెన్సిటివిటి) పెరుగుతుంది.

మనకు కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. పంచేంద్రియాలే కర్మేంద్రియాలు. వాటి వలన మనం పని చేస్తుంటాము. అంటే తింటున్నప్పుడు రుచి తెలుస్తుంది. ఇలా కర్మేంద్రియాల వలన మనకు కొన్ని తెలుస్తుంటాయి. రెండవది హృదయం. మనం ధ్యానంలో ఉన్నప్పుడు పొందే దానికి సంబంధించిన జ్ఞానం. మనం ఆ జ్ఞానంలో మునిగి ఉంటే మన అంతరంగం (హృదయం) గ్రహిస్తుంది. దాని సమాచారం లేదా రహస్యం తెలుసుకుంటుంది. ఈ విధంగా హృదయం జ్ఞానాన్ని గ్రహిస్తుంది. కనుక అది జ్ఞానేంద్రియం. ఆ దివ్యత్వాన్ని గ్రహించడానికే ఈ జ్ఞానేంద్రియం అంటే హృదయం ఇవ్వబడింది.

ధ్యానంలో ఏ అనుభూతి కలగటంలేదని కొందరు అంటారు. కారణం ధ్యానం చేయడం కాదు, ధ్యానంలో ఉండాలి. కనుక "ధ్యానం చెయ్యి" అనకూడదు. "ధ్యానంలో ఉండు" అనాలి. దివ్యత్వం మన హృదయంలో ఉంది. దానిలో మునిగి ఉండాలి. అనుభూతి తప్పక కలుగుతుంది. ధ్యానంలో ఎప్పుడూ ఉండడానికి ప్రయత్నించాలి. కాని ధ్యానంలో ఉండడం ఎప్పుడు జరుగుతుంది? ధ్యానంపై ధ్యాస కలగ్గానే కళ్ళు మూసుకొని దివ్య ప్రాణాహుతి గ్రహిస్తూ దివ్య ప్రకాశంలో మునిగి అనుభూతి పొందుతూ ఉంటాము. అంటే ధ్యానావస్థలో ఉన్నామని అర్థం. ఆ స్థితిని పొందడానికి ప్రయత్నించకూడదు. మనం ధ్యానం చేస్తున్నామని భావిస్తే (అనుభూతికి) దూరమవుతాము. మునిగిపోవడం జరుగదు. అంటే కళ్ళు తెరిస్తే మన ఇల్లు. కళ్ళు మూస్తే అంతరంగంలో శ్రీ బాబూజీగారి ఇల్లు. అది 'వారి'ది. మనం 'వారి' దగ్గర ఉన్నాము. అంటే ఇది సామీప్యత యొక్క అనుభూతి. అప్పుడు మనకు తత్పరత, ప్రేమ ఏర్పడుతుంది. అందువల్లనే 'వారు' మనకు ఇచ్చిన దాని సమాచారం తెలుస్తుంది. అందుకే ధ్యానంలో ఉండు; దానిలో మునిగిపోవాలి. దివ్యత్వం నీలోనే ఉంది; దానితో సంబంధం ఏర్పడుతుంది. కళ్ళు మూసుకొని ఉండు; శ్రీ బాబూజీ మహరాజ్ అంతరంగంలో ఉన్నారన్న అనుభూతి కలుగుతుంది. ఈ విధంగా ధ్యానంలో ఉండడం వలన మన ధ్యాస దానిలోనే ఉంటుంది. దీనిని గ్రహించడానికే జ్ఞానేంద్రియం ఇవ్వబడింది. దానికి ఆ జ్ఞానం అందుతుంది. ఆ అనుభూతిలో, ఆ రసంలో మునిగి ఉంటాము. దాని నుండి బయటకు రాము. ఏవేవో పనులు చేస్తూ ఉంటాము కాని ఆ ధ్యానం నుండి బయటకు రావడం జరుగదు.

దివ్యత్వం మనలో ఉన్నదని శ్రీ బాబూజీ మహరాజ్ అన్నారు. ఆ దివ్యత్వం ఏమిటి? దివ్యత్వం నీలో ఉన్నది అంటే "నేను (శ్రీ బాబూజీ) నీలో ఉన్నాను" అనే సంకేతం ఇస్తున్నారు. మనలో 'వారు' ఉన్నారు. మనకు బాహ్యంగా సంతోషం ఉంటుంది. మన ధ్యాస 'వారి'పై అనగా అంతరంగంలోని దివ్యత్వంపై ధ్యాస ఉంటే ఎప్పుడైనా మనకు చాలా బాగుంటుంది. ఎందుకంటే 'వారు' మనలో ఉన్నారు కాబట్టి. శ్రీ బాబూజీ మహరాజ్ ఈ విధంగా "నేను మీలో ఉన్నాను" అనే సంకేతం ఇచ్చారు. కనుక ఆ ఆనందం దివ్యత్వపు అనుభూతి ద్వారా పొందాలి. అప్పుడు మన సిస్టమ్ అంతా ఆనందమయమై పోతుంది. ఈ విధంగా మనం లాభం పొందాలి.

కొంతమంది అభ్యాసీలు "మేము కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చున్నాము, కాని మాకు ఏమీ కనిపించడం లేదు" అని అంటారు. శ్రీ బాబూజీ మహరాజ్ "నేను ఉన్నాను మీలో" అని చెప్పినప్పుడు మనం కళ్ళు మూసుకొని 'వారి' సామీప్యతానందాన్ని హృదయంలో నింపుకోవాలి. 'వారు' ఉన్నారు. సామీప్యత ఉన్నది. 'వారి' ప్రేమ ఉన్నది. ఈ విధమైన అనుభూతి ధ్యానంలో ఇలా ఉండడమనేది జరిగినప్పుడు తప్పక కలుగుతుంది.

ఒకసారి బాబూజీకి, ''మీ సామీప్యతానుభూతి, ఆ వెచ్చదనం కలిగింది'' అని వ్రాశాను. ఈ సామీప్యతానుభూతి, వెచ్చదనం యొక్క శ్రేష్ఠత ఏమిటంటే, మనలో ఉన్న 'నేను' (అహం, Self) అనేది కరిగిపోతుంది. ఎప్పుడైతే 'నేను' (అహం, Self) అనేది కరిగిపోతుందో అప్పుడు నీవు భక్తుడివని అనిపించుకుంటావు. అప్పుడే నీవు అభ్యాసీవి. అంతవరకు నీవు అభ్యాసం చేస్తున్నా, నీవు సంపూర్ణమైన

అభ్యాసీవి కాదు. భక్తుడు అంటే ఎవరు? 'నేను' (అహం, Self) అనేది కరిగిపోయిన వారే భక్తులు. ఎప్పుడు అవకాశం దొరికితే అప్పుడు 5 నిమిషాలైనా సరే కన్నులు మూసుకొని అంతరంగంలో 'వారి' సామీప్యతానందాన్ని హృదయంలో నింపుకోవాలి. అప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఈ వెచ్చదనం 'అహం' (Self)ని కరిగించి వేస్తుంది. ఈ సాధన వలన మనలో భక్తుని స్థితి ఏర్పడుతుంది. అది ఏమిటి? భక్తి అంటే నీవు దివ్యత్వపు సముద్రంలో మునిగిపోవడం. మరల తిరిగి పైకి తేలడం ఉండదు. ఎప్పుడైతే భక్తుడిగా మారిపోయావో దివ్యత్వంలో కలిసిపోవడానికి ఆటంకం ఏమీ ఉండదు. ఆ దివ్య సముద్రంతో అనుబంధం ఏర్పరచుకుంటే 'అహం' (Self) మునిగి, కరిగిపోతుంది. ఇంక మిగిలేది ఏమిటి? దివ్యత్వపు సముద్రమే!

ఎప్పటివరకు మనకు అనుభూతి అనేది కలగదో అప్పటివరకు సహజమార్గం కష్టమనిపిస్తుంది. ఇది ఎంత సక్రమ పద్ధతి అంటే దీనిలో మనం సాధనచేస్తూ ఉంటే సిస్టమ్ అంతా ముందుకుపోతూ ఉంటుంది. శ్రీ బాబూజీ – "దివ్యత్వం నీలో ఉన్నది, నేను నీలో ఉన్నాను" అని అన్నప్పుడు, మన కర్తవ్యం ఏమిటి? మన కన్నులు 'వారి'ని చూడటమే. మన ధ్యాస 'వారి'ని దర్శించడానికే. సదా ఈ విధంగా మన ధ్యాస, శ్రద్ధ 'వారి'పై ఉంటే ఏ పని అయినా చక్కగా జరిగిపోతుంది.

"భక్తితో భగవంతుడు లభిస్తాడు" అనే నానుడి (మాట) అందరూ అంటుంటారు. ఇది అందరికీ తెలుసు. మనం జాగ్రత్తగా ధ్యాసపెడితే ఎప్పుడు, ఎక్కడ చెప్పబడిందోనని ఆలోచిస్తే, దాని అర్థం ఎంత బాగుంటుందో అర్థమవుతుంది. కొందరు "నాకు భగవంతుడు దొరకలేదు" అని అంటారు. కాని "భక్తితో భగవంతుడు లభిస్తాడు." భక్తి అంటే భక్తుడు –మరియు భగవంతుడు. అంటే ఈ రెండిటిలో లేనిది ఎవరంటే 'నేను' అనేది. 'నేను' అనేది మాయమైపోతే భగవంతుడు తప్పక లభిస్తాడు. భక్తితో భగవంతుడు లభిస్తాడన్న మాట ఎంత సత్యశీలమైనదో, ఎంత ప్రభావవంతమైనదో, దానిని అనుభవంతోనే పొందాలి.

శ్రీ లాలాజీ సాహెబ్ గురించిన ఉదాహరణ మన ముందు ఉన్నది. తమ గురువుగారి ద్వారా 'వారు' చేయవలసిన పనిని తెలుసుకున్నారు. అది ఏమిటంటే, ప్రకృతి ఏమి కోరుకుంటుందంటే, అంతిమం నుండి, అంటే ఈ సృష్టి జరిగిన స్థితి నుండి అంతిమశక్తిని ఈ జగత్తులోకి తీసుకురాగలిగితే, ఈ జగత్తు లేదా సృష్టి అంతా భగవత్ ప్రాప్తిని పొందగలుగుతుంది. కనుక లాలాజీగారి లక్ష్యం ఆ అంతిమంతో సంబంధం ఏర్పరచుకొనుటమే అయ్యింది. శ్రీ బాబూజీ గారు అప్పుడప్పుడు– "7 నెలలు శ్రీ లాలాజీ సాహెబ్ ఈ భౌతిక జగత్తుతోను, తనతోనే తనకు సంబంధం లేనట్లుగా లక్ష్యం కొరకై తీవ్ర ప్రయత్నం చేసారు" అని అంటూ ఉండేవారు. అప్పుడు ఆ అంతిమంతో సంబంధం ఏర్పడింది. ఎప్పుడైతే 'వారి'కి ఇది తెలిసిందో అప్పుడే 'వారి' కోరిక, సంకల్పాన్ని ఆ అంతిమం వద్దకు చేర్చగలిగారు. వెంటనే ఆ అంతిమంలో, ఆ దివ్యత్వంలో సంకల్పం ఏర్పడింది. ఒక దివ్యమూర్తిమత్వం ఈ జగత్తులో అవతరించనున్నదని తెలిసింది. శ్రీ బాబూజీ మహరాజ్ సంకల్పం ఎంత సరళమంటే 'వారు' ఎక్కడకు తీసుకు వెళ్ళితే మనం అక్కడకు వెళ్ళడమే మన పని. మనం 'వారి' పాదాలు పట్టుకొని ఉండటమే! అంటే భౌతికంగా పాదాలు పట్టుకొని ఉండడం కాదు. 'వారి'తో అనుబంధం ఏర్పరచుకోగలిగితే 'వారే' మనల్ని తీసుకొని వెళ్ళతారు.

మనకు ఏ విధంగా అర్థమవుతుందో ఆ విధంగానే అర్థవంతంగా చెయ్యాలి. ఒకే ఒక సంకల్పం. అదే మనోభావంతో ఆ అంతిమంలో స్పందన కలిగించారు. అందుకే శ్రీ బాబూజీగారిలో మునిగి ఉండాలి. 'వారు' ఇచ్చే ఆ ప్రాణాహుతితో దేనినైనా సాధించవచ్చు. అది ఎంత ప్రభావవంతమైనదో తెలుస్తుంది. ఇలా మునిగి ఉండడం వలన ప్రిసెప్టర్ యొక్క శక్తి కూడా పెరుగుతుంది. ఈ విషయం శ్రీ బాబూజీ 'డాక్టర్' గారికి వ్రాసి ఉన్నారు. వారి పని ఎంత వేగంగా జరుగుతూ ఉందంటే, దానివల్లనే మనలో ఇంత మార్పు ఏర్పడుతున్నది. ప్రిసెప్టర్ ఈ భావంతో పనిచేస్తే అది దానంతట అదే వస్తుంది.

ఒక ప్రిసెప్టర్ వచ్చారు. ఆయనకు వ్యాపారంలో నష్టం వచ్చింది. ప్రాణాహుతి ఇవ్వమని అడిగారు. దాని వలన లాభం పొందాలని వారి ఆశ. 6 నెలల తర్వాత వచ్చి ఏమీ లాభం జరగలేదని వాపోయారు. మనం 'జాగ్రఫి' నేర్చుకోవాలని సంకల్పించి 'హిస్టరి' పుస్తకం తెచ్చుకుంటే లాభం ఉంటుందా? శ్రీ బాబూజీగారి ప్రాణాహుతి ఆధ్యాత్మికాభివృద్ధికే గాని ఇంకొకదానికి ఎలా ఉపకరిస్తుంది? ఈ విధంగా భావిస్తే 7 జన్మలైనా లాభం ఉండదు. అతడు 'వారి' పని చెయ్యటం లేదు. మనకు ప్రాపంచిక సమస్యలు ఉంటే ప్రార్థన చెయ్యమని చెప్పారు. ప్రార్థన చెయ్యవచ్చు. దాని శక్తితో కొంత ఉపయోగం ఉంటుంది.

**ప్రశ్న: శ్రీ బాబూజీ మహరాజ్ మన హృదయంలో ఉన్నారని ధ్యానంలో భావించమన్నారు. మరి మనం శ్రీ బాబూజీ మహరాజ్‌లో ఎప్పుడు ఉంటాము? రెండిటికి భేదం ఏమిటి?**

**జవాబు:** మంచి ప్రశ్న. మన సాధనలో 'వారి' సామీప్యతానుభవంతో అంటే 'వారు' మనలో ఉన్నారన్న అనుభూతితో సాధన చేస్తుంటాము. అప్పుడు మనలో ఉన్న 'నేను' (అహం, Self) అనేది కరిగిపోతుంది. ఆ తరువాత ఉండే స్థితి ఏమంటే మనం 'వారి'లో ఉన్నట్లు అవగతమవుతుంది. మొదట ఉన్న స్థితి దివ్యత్వం మనలో ఉన్నది అనేది. రెండవ స్థితి "లివ్ ఇన్ మాస్టర్" అంటే 'వారి'లో మనం ఉన్నాము అని. అప్పుడు నెమ్మది నెమ్మదిగా 'అహం' (Self) పూర్తిగా కరిగిపోతుంది. అప్పుడు మనం 'వారి'లో ఉన్నామన్న అనుభూతి కలుగుతుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! మనం శ్రీ బాబూజీ రూపంపై ధ్యానం చేయరాదని చెప్పారు. ఎందుకని?**

**జవాబు:** మనం శ్రీ బాబూజీ మహరాజ్‌ని 'వారి' విధానాలతోనే ప్రేమించాలి. 'వారి'ని చూడాలి, ప్రయత్నించాలి. అక్కడ 'వారు' మాత్రమే ఉన్నారు. మనం లేము. ఈ అభ్యాసం ఒక్కసారిగా అలవడదు. మనం మన సెల్ఫ్‌ను 'వారి'కి అర్పితం చేయాలి. ఇదే మన సహజమార్గ విధానం.

**ప్రశ్న: మనం దివ్యత్వపు వెచ్చదనంలో ఉన్నామని ఎలా గ్రహించగలం?**

**జవాబు:** ఎప్పుడైతే మనం 'వారి'తో అనుబంధం ఏర్పరచుకొని 'వారి' సామీప్యతను అనుభూతి పొందడం ప్రారంభిస్తామో అప్పుడు ఆ వెచ్చదనం ప్రారంభమవుతుంది. ఇక్కడ ఆలోచన కాదు అనుభూతి మాత్రమే రావాలి. ఆలోచన లేకుండానే అనుభూతి కలిగినప్పుడు ఈ దివ్యతా వెచ్చదనం ఆరంభమవుతుంది.

'నేను' చెబుతున్నదేమంటే అభ్యాసీ ధ్యానం చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే, బాబూజీతో అనుబంధం ఏర్పడలేదు కదా! ఆలోచనైతే ఉన్నది ధ్యానం చెయ్యాలి అని. ఎప్పుడైతే 'వారు' మన అంతరంగంలో ఉన్నారన్న అనుభూతి కలిగిందో అప్పుడు ఆనందంతో 'వారు' మనవారని చెబుతాము. ఆ ఆనందానుభూతి

లేనప్పుడు అనుబంధం ఉందని ఎలా చెప్పగలం? మనస్సు పెట్టడానికి ప్రయత్నం చేస్తారు. ఎన్నిసార్లు ప్రయత్నిస్తారు? ఐతే ప్రతిసారి ప్రాణాహుతి వస్తుంది. కాని అనుభూతి రాదు. ఆనందం లభ్యం కాదు.

**ప్రశ్న: ఇదంతా ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** 'వారు' మనలో ఉన్నారని భావించి ధ్యానంలో ఉంటున్నాము. అలాంటప్పుడు ఎందుకు తెలియదు? తప్పక తెలుస్తుంది. మీకు శరీరంలో ఎక్కడైనా నొప్పి కలిగితే తెలుస్తుంది కదా! ఇది కూడా అలాగే అనుభూతికి వస్తుందని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు.

దివ్యత్వం నీలో ఉన్నది, అని 'వారు' అన్నారు. ఇక దాని సంకేతం 'నేను' (దైవం) 'నీలో' ఉన్నాను అంటే 'నేను' వచ్చాను, అవతరించాను అని. కనుక 'వారు' నా వారైతే, నాలోనే ఉన్నారన్న భావనతో అంతరంగంలో అనుబంధం ఏర్పరచుకుంటే ఎంత గొప్పగా ఉంటుందో అనుభూతిలో తెలుస్తుంది.

నేను ఇలాంటి వాణ్ణి, అలాంటి వాణ్ణి అనే భావన లేకుండా 'వారి'కి మనల్ని అర్పించుకుంటే, 'వారి'నే చూస్తూ ఉంటే చాలు! మనం ఎలాంటి వాళ్ళమైనా అనవసరం. అవన్నీ మరచిపొండి. 'వారు' వచ్చారు. మనలను ప్రేమిస్తున్నారు. అదే ఆలోచనతో ఉండాలి. మనస్ఫూర్తిగా అర్పించుకుంటే –అంటే నిజాయితీగానన్న మాట! పురోగతి సాధ్యమే.

ధ్యానం అంటే 'వారి' ధ్యాసలో మునిగిపోవాలి. ఇతర విషయాలు వద్దు. 'వారు' అంతరంగంలో ఉన్నారన్న అనుభూతినీ, ప్రాణాహుతి, ప్రేమలలో మునిగిపోవడమూ మనం చేయవలసింది. అంతే, ఆనందం కలుగుతుంది; ఉన్నతీ కలుగుతుంది.

శాంతిని కోరుకునే ముందు మన ఇంటిలో శాంతిని నెలకొల్పాలి. శాంతియుత వాతావరణం తీసుకురండి. ఎవరైనా మన ఇంటికి వస్తే ప్రశాంతంగా, హాయిగా ఉన్నదన్న అనుభూతి కలగాలి. అప్పుడు వారు "ఇక్కడ పూజ, ధ్యానం చేయడంవల్లనే ఈ ప్రశాంతత నెలకొన్నది" అని భావిస్తారు. అది ధ్యానం యొక్క ప్రభావం అని ఒకసారి చెప్పారు శ్రీ బాబూజీ. కనుక శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినవన్నీ విని ఆచరించాలి.

శ్రీ బాబూజీ మహరాజ్ సహజమార్గ్ గురించి ప్రచారం చేయమని ఎప్పుడూ, ఎక్కడా చెప్పలేదు. 'వారు' కూడా ప్రచారం చేయలేదు. "నేను ప్రచారకులను తయారుచేయడం లేదు. ఆచరణాశీలురను తయారుచేస్తున్నాను" అని చెప్పారు. అంతా అనుభవం ద్వారానే తెలియ చెప్పబడుతుంది. సహజమార్గం అనుభవపూర్వకమైంది. అనుభూతిని కలిగించేది.

కొంతమంది ప్రిసెప్టర్లు ప్రచారకులుగానే ఉండిపోతారు. వారి సంగతి మనకు అవసరం లేదు. ఎప్పుడైతే మన ఆలోచనా ధారలో శ్రీ బాబూజీని నిలుపుకుంటామో, అప్పుడు నెమ్మది నెమ్మదిగా శ్రీ బాబూజీ మహరాజ్ మన హృదయంలో ఉన్నారన్న అనుభూతి కలుగుతుంది. 'వారి' తలంపులో 'వారి' ప్రేమలో మనం ఎంతగా మునిగిపోయామో మన అనుభవానికి వస్తుంది.

చాలామంది సాధువులు "మా గురువులు ఇంత గొప్పవారు, అంత గొప్పవారు" అని అంటూ ఉంటారు. కాని మనం శ్రీ బాబూజీ మహరాజ్ ప్రేమలో ఎంతగా మునిగిపోతామంటే మనం దేశాలు, ఎల్లలు మరచిపోతాము. వీరు అంటే ఈ అభ్యాసీలు ఇండియా వాళ్ళు, వీళ్ళు డెన్మార్క్ వాళ్ళు అన్న సంగతే మరచిపోతాము. విజయవాడ నుండి, హైదరాబాదు నుండి వచ్చారు అన్న భావన ఉండదు. మన అందరిది ప్రేమ దేశం. మనం ఎక్కడ గమనించినా 'వారి' దివ్య సౌందర్యాన్నే అనుభూతి పొందుతాము.

ప్రిసెప్టర్‌గా చేసినప్పుడు ఎలా పని చెయ్యాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది. మొదట్లో వాళ్ళ మీద వాళ్ళకు నమ్మకం ఉండకపోవచ్చు. నెమ్మదిగా శ్రీ బాబూజీ సామీప్యతానుభవం పెరిగినకొద్ది నమ్మకం పెరుగుతుంది. ఎవరిమీద అంటే తనపై తనకు కాదు. శ్రీ బాబూజీ మహరాజ్‌పై నమ్మకం పెరుగుతుంది. 'వారు' ఇచ్చే శక్తిని తాము (ప్రిసెప్టర్లు) అభ్యాసీలకు మళ్ళించగలుగుతున్నామన్న విశ్వాసం పెరుగుతుంది. 'వారు' ఇస్తున్నారు. మనం అందచేస్తున్నామన్న విశ్వాసం పెరుగుతుంది. ఆపై పని బాగా జరుగుతుంది.

మన ధ్యానంలో 'వారి' సామీప్యతను, ప్రేమను ఎప్పుడు పొందగలుగుతామో అప్పుడు ఒక్కొక్కసారి 'వారి' భౌతికరూపం కనిపించవచ్చు. అది సహజమైనది కాదు. కాని అంతమాత్రన 'వారి' భౌతికరూపం మీద ధ్యానం చెయ్యం. సహజమార్గంలో అది చెప్పబడలేదు. మనం 'వారి'ని ఎంతగా ప్రేమిస్తామో 'వారి' సామీప్యతను అంతగా పొందగలం.

శ్రీ బాబూజీ ఈ యుగాన్ని సంభాళించడానికి వచ్చిన దివ్యపురుషులు – డివైన్ పర్సనాలిటీ. ఈ యుగంలో ప్రాణి మాత్రులందరి కోసం, ప్రాణిమాత్రులందరికి భగవత్ ప్రాప్తి కలిగించాలన్న సంకల్పంతో వచ్చారు. ఆ సంకల్పం పరిపూర్ణమయ్యే వరకు ఇది 'వారి' యుగమే. ఒకసారి నేను (కస్తూరి) "బాబూజీ! మీరు ఈ సంకల్పం తీసుకొని వచ్చారన్న సంగతి మాకు ఎలా తెలుస్తుంది? శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతారాలని అంటుంటారు. మరి మీ గురించీ, మీ సంకల్పం సంగతి ఎలా తెలుస్తుంది?" అని అడిగాను. దానికి 'వారు' ఈ విధంగా సమాధానం ఇచ్చారు: "మంచిది. శ్రీరామునితో, శ్రీకృష్ణునితో మీరు సంబంధం పెట్టుకుంటున్నారు. కాని నేను ఆ సంకల్పంతో (అందరిని అంతిమం వద్దకు చేర్చాలని) వచ్చాను. మీరు సాధన చెయ్యండి, చెయ్యకపోండి కాని నన్ను అంగీకరిస్తే నా పని జరిగిపోతుంది. మీరు ఇతరత్రా సహకారం ఇచ్చినా, ఇవ్వకపోయినా ఫరవాలేదు. మీరు నన్ను అంగీకరిస్తే చాలు. మిగితా పని 'నాదే'. అందరిని అక్కడకు తీసుకొని వెళ్ళడానికే వచ్చాను. ఈసారి సంకల్పం 'నా' వైపు నుండే వచ్చింది. మీ వైపు నుండి కాదు. మీరు సంబంధం ఏర్పరచుకోవడం కాదు. నా పనే అది కూడా. అందరిలో నేను ఉంటాను. అది మీరు అంగీకరిస్తే చాలు" అని. పని ఎంత సులువుగా ఉందో, ఎంత సరళంగా ఉందో చూడండి. ఇది అంతా మీ అనుభవానికి తప్పకవస్తుంది.

శ్రీ బాబూజీ మహరాజ్ సర్వవ్యాపి అనడానికి మన దగ్గర ఉదాహరణ ఉంది. ఇది అందరికి అనుభవంలోకి వస్తుంది. శ్రీ బాబూజీ మహరాజ్ భౌతికంగా దూరమైపోయిన తర్వాత వారి సమాధి నిర్మించారు. అక్కడ పూలు ఉంచారు. పూజ చేశారు. అలా చాలామంది చేశారు. కాని నేను (కస్తూరి) అక్కడకు వెళ్ళలేదు. పూలు సమర్పించలేదు. అలాంటి ఒక సమయంలో శ్రీ చారీజీ "బెహెన్‌జీ! మీరు శ్రీ బాబూజీని ఎంతగానో ప్రేమించారు. 'వారు' కూడా

మిమ్మల్ని ఎంతో అభిమానించారు. మరి మీరు ఎందుకు సమాధి దగ్గరకు రాలేదు? నమస్కరించ లేదు?" అని నన్ను అడిగారు. అప్పుడు నేను (కస్తూరి) అన్నాను కదా "సమాధి చనిపోయిన వారికి ఏర్పాటు చేస్తారు. మీరు మీ తండ్రిగారు చనిపోయిన తర్వాత సమాధి ఏర్పాటు చేశారు. అభ్యాసీలు శ్రీ బాబూజీ మహరాజ్ చనిపోయారనుకొని సమాధి దగ్గరకు వచ్చారు. ఒకవేళ మీరూ (చారీజీ) మీ మాస్టర్ చనిపోయారనుకొని సమాధి దగ్గరకు వెళ్ళి ఉండవచ్చు. కాని నాకు 'వారు' అంటే శ్రీ బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కనిపిస్తున్నారు. నా అనుభూతిలోనూ అదే ఉన్నది. కనుక చనిపోయారనుకోవడం ఎలా? చనిపోయిన వారికి కదా సమాధి ఏర్పాటు చేస్తారు! నా బాబూజీ నా ఎదుటనే ఉన్నారు. అలాంటప్పుడు సమాధి అన్న ప్రసక్తే రాదు. ఈ మధ్య ఎవరు చనిపోయినా సమాధి ఏర్పాటు చేస్తున్నారు. ఇది చాలా ఇబ్బందికరమైనది. ఇది నా ఒక్క దానికే ఉన్న అనుభూతి కాదు. అందరికీ కలుగుతోంది." ఎక్కడో ఉన్న శ్రీరాముడు, శ్రీకృష్ణునితో సంబంధం పెట్టుకోవాలని అనుకుంటున్నాము. కాని ఒక్కసారి శ్రీ బాబూజీ మహరాజ్‌ని తలచుకోగానే మన అంతరంగంలో 'వారు' ఉన్న అనుభూతి కలుగుతుంది. ఆ సంకల్పంతోనే 'వారు' వచ్చారు. సర్వప్రాణికోటికి భగవత్ ప్రాప్తి కలిగించడానికి వచ్చారు. ఆ పని జరిగిన తర్వాత 'వారి' సంకల్పం మరి సమాప్తమవుతుంది. కాబట్టి వారిని తలచుకోగానే దివ్యానుభూతి కలుగుతుంది. మరి వారు ఎలా దూరమవుతారు? 'వారు' సర్వవ్యాపి కనుకనే ఎప్పటికీ దూరమవ్వరు.

'వారు' ఏమిచెప్పినా అది అనుభవపూర్వకంగా ఉన్నదే, అనుభూతికి వచ్చేదే. 'వారు' మనకు లక్ష్యం కల్పించారు. ఏమిటది? 'అంతిమం చేరాలి' అని. శ్రీ బాబూజీ మహరాజ్ అక్కడి నుండే వచ్చారు. కాని మన సహజమార్గం దివ్యత్వం నీలో ఉన్నదని చెబుతున్నది. దివ్య ప్రకాశం ఉంది. దానివలన శరీర వ్యవస్థ (సిస్టమ్) అంతా ప్రకాశిస్తుంది. కాబట్టి భౌతికత అన్నది మరచిపో, దివ్య ప్రకాశం ఉన్నదని భావించి అనుభూతి పొందాలి. అభ్యాసం ఆరంభించినప్పటి నుండి మన అంతరంగంలో ఆ దివ్యత్వంతో అనుబంధం ఏర్పరచు కొంటున్నాము. మన సంబంధం ఆ అనంతంతో ఏర్పడుతుంది. దివ్య ప్రకాశమూ అనంతమైనది. హద్దు లేనిది. ఎప్పుడైతే దానితో సంబంధం ఏర్పరచుకుంటామో మన 'సిస్టమ్' అంతా అపుదు దానితో అనగా దివ్య ప్రకాశంతో, అనంతంతో ముడిపెట్టుకున్నట్లు అవుతుంది. ఇక రెండవ విషయం – నిర్మలీకరణ: మనలో ఉన్న అనవసరమైనవన్నీ తొలగిపోవడమనేది మన శక్తితో కాదు 'వారి' శక్తితోనే బయటకు పోతున్నాయని భావించాలి. ఇక ప్రార్థన: ఇందులోని ప్రతి పదం ఛార్జ్ చెయ్యబడినది. ప్రార్థన ప్రతిసారి చెప్పుకో నవసరంలేదు. మనం ఆ ధ్యాసలో ఉంటే చాలు. ఆ భావనలో ఉంటే చాలు; ఆ అనంతంతో అనుబంధం ఏర్పడుతుంది. కాబట్టి ప్రతి విషయం అనుభూతికి వచ్చేదే. శ్రీ బాబూజీ ఎంత సహాయం చేస్తున్నారో! 'వారు' మనందరి కోసం తయారుగా, సిద్ధంగా ఉన్నారు.

మన ధ్యానం ప్రతి నిమిషం 'వారి'తో అనుబంధం ఏర్పాటు చేసుకొని ఉన్నట్లయితే ఇక ప్రార్థన అవసరం గాని, క్షాళన అవసరంగాని ఉండదు. 'వారు' మనతోటే ఉంటే, మన ధ్యాస అంతా 'వారి'పై ఉంటే ఇంక క్షాళన అవసరం ఏముంది? 'వారు' మన అంతరంగంలోనే ఉన్నారన్న అనుభూతి వచ్చిన తర్వాత ఇంక ప్రార్థనగాని, క్షాళనగాని అవసరం ఉండదు. సదా 'వారు' మనలో ఉన్నారన్న అనుభూతి మనల్ని ముందుకు నడిపిస్తుంది.

పెళ్ళికాని వధువును వివాహం జరిగాక 'సుహాగన్' అంటారు. ఏ వరునితో పెళ్ళి కావాలని కోరుకుంటుందో అతనితో వివాహం జరిగింది కాబట్టి ఆవిడను 'సుహాగన్' అంటారు. అలాగే మనం కూడా ఏ దివ్యత్వాన్ని కోరుకుంటున్నామో ఆ అనంత తత్వం మన హృదయంలో ఆవిర్భావమైతే మనం కూడా ఆ స్థితిని (సుహాగన్) పొందినట్లే. 'వారు' సంకల్పంతో వచ్చి మనలో ఉపస్థితమైనప్పుడు (కొలువు తీరినప్పుడు) మనం కూడా ఆ వరం (సుహాగన్) పొందినట్లే.

సహజమార్గ విధానంలో చేరి ఎన్నో సంవత్సరాలైనా కాని ఇంకా శ్రీ బాబూజీ మహరాజ్ ఒక్కొక్క విషయం అర్థమయ్యేలా చెబుతూనే ఉన్నారు. 'వారి' పుస్తకాలు చదివి, అర్థం చేసుకునే శక్తి లేని కారణంగా వాటిని నేను చదువలేదు. కాని అంతరంగంలో ఒక్కొక్క విషయం అనుభూతికి వస్తున్నకొద్దీ 'వారు' చెప్పిన విషయాలు ఎంత సత్యపూరితాలో అర్థం అవుతుంది. ఒకసారి 'వారి' సామీప్యతను అనుభూతికి తెచ్చుకోగలిగినప్పుడు 'నేను పాపిని, చెడ్డవాడిని, ఎలా మరి' అనే భావన అవసరం లేదు. 'వారు' ఉన్నారు. దివ్యత్వం ఉన్నది. అంతకన్నా పవిత్రత ఏముంది! అపవిత్రతకు చోటెక్కడ ఉంది. మనం 'వారి'ని అంగీకరిస్తే ఇంక అపవిత్రతకు తావు లేనేలేదు. లోపల దివ్య ప్రకాశం ఉంది. అపవిత్రతకు చోటే లేదు. అవన్నీ కొట్టుకుపోతాయి. ఐతే దివ్య ప్రకాశం ఉన్నది అన్నది ఎలా తెలుస్తుంది? ప్రాణాహుతితో అనుభవం ద్వారా తెలుస్తుంది. 'వారు' సంకల్పంతో వచ్చారు. మనం అంగీకరించాము. మనలను అనంతం వద్దకు తీసుకొని వెళ్ళేంతవరకు 'వారు' మనలోనే ఉంటారు. కనుక ఏ ఇతర ఆలోచనలు వద్దు. అన్నీ 'వారే నేర్పిస్తుంటారు.

ఈ మధ్య హైదరాబాద్ వచ్చినప్పుడు "ఒకచోట 4 గురు ప్రిసెప్టర్లను తీసేసారు. ఇంకొకచోట 22 మంది అభ్యాసీలను తొలగించారు" అనే మాటలు వినిపించాయి. ఒకసారి శ్రీ బాబూజీ అన్నారు, "నేను ఇచ్చినటువంటి శక్తిని నేను కూడా తొలగించలేను. ఎందువలన? ఒకసారి అభ్యాసీని ప్రిసెప్టర్‌గా చేసినప్పుడు, ప్రాణాహుతి ప్రసారం ఎక్కడ నుండి అంటే మూలం నుండి వస్తుందో ఆ చోటుతో ప్రిసెప్టర్‌కు అనుబంధం ఏర్పరచటం జరుగుతుంది. ప్రిసెప్టర్ కూడా ఆ మూలం నుండి ప్రాణాహుతి ప్రసారం జరుగుతుందన్న భావంతో అభ్యాసీల అంతరంగాన్ని శుభ్రపరుస్తారు. వారిలో ప్రేమ, భక్తి విశ్వాస భావాలను నింపుతారు. ప్రాణాహుతిని గ్రహించి పని చేయడం కొరకు ప్రిసెప్టర్లను చేస్తారు. కనుక వచ్చేది మూలం నుండి కాబట్టి 'నేను' కూడా వారిని ఆ శక్తి గ్రహించడం అన్నదాని నుండి తొలగించలేను. ఎప్పటికి జరుగదు" అని.

అభ్యాసీలు అతడి నుండి లేదా ఇతడి నుండి ప్రాణాహుతి వస్తుందని భావిస్తే ఏమీ ఉపయోగం ఉండదు. అది మూలం నుండి వస్తుంది. కనుక ఎవరు ప్రిసెప్టర్‌ని చేసినా వారు, ఆ మూలం నుంచి వస్తుందని, నేను శ్రీరామచంద్ర మిషన్‌కు సంబంధించిన వారినని, అభ్యాసీలకు ప్రాణాహుతి ఇవ్వడం జరుగుతోందని భావిస్తే వారికి శ్రీ బాబూజీ మహరాజ్‌తో అనుబంధం ఉన్నట్లే పని చేయగలుగుతారు. ఈ చేత్తో ప్రిసెప్టర్లను చేసాము, ఆ చేత్తో తీసేసాము అనుకుంటే జరిగేది ఏమీ లేదు. కాని ప్రిసెప్టర్లు వేరెవరి నుండో ప్రాణాహుతి వస్తుందనుకుంటే లాభం లేదు. వారు మూలం నుండి వస్తుందని భావిస్తేనే పని సహజంగా జరిగిపోతుంది. అంతే!

శ్రీ బాబూజీ మహరాజ్ ఉత్తరాలు ఎంతో ప్రేమతో చక్కని భాషతో ఉంటాయి. ఒకసారి నాకు (కస్తూరిగారు) వ్రాసిన ఉత్తరంలో, “గురు అనే పదం గొప్పదని, చాలామంది పొగుడుతారు. కాని నా దృష్టిలో ‘గురు’ అంటే గుడ్లగూబ అని అర్థం. అది చెట్టుపై వాలితే చెట్టు నాశనం, ఇంట్లో చేరితే ఇల్లు పాడుపెడతారు. అపశకునంగా భావిస్తారు” అని వ్రాశారు. ఆ పదం ‘వారి’కి ఇష్టం ఉండదు.

“మంత్రాలు ఉపదేశించే గురువును కాను నేను” అని అంటారు శ్రీ బాబూజీ మహరాజ్. సహజంగా గురువులు మంత్రాన్ని ఉపదేశిస్తారు. ఆ మంత్రం ఇంకొకరికి చెప్పకూడదని నియమం విధిస్తారు. చెబితే ఫలితం పోతుందంటారు. అందుకని ఎవ్వరూ చెప్పరు. అయినా ఒకసారి ఆ అందరూ దాన్ని వివరించగా తేలిందేమంటే అందరికి ఒకే మంత్రం ‘రామ’ నామజపం చెయ్యండి అని. దానికై ఒకరి దగ్గర 5 వేలు, వేరొకరి దగ్గర 25 వేలు, మరొకరి దగ్గర లక్ష తీసుకున్నారు. ఉపదేశం తీసుకున్న వారి ఆర్థిక యోగ్యతను బట్టి డబ్బు గ్రహించారు. కాని అందరికి ఒకే ‘రామ’ మంత్రం చెప్పారు.

ఋషుల విషయంలో ఈ మంత్రం ఇంకొక విధంగా పనిచేస్తుంది. వారు అంటే ఋషులు ఒక సంకల్ప శక్తితో మంత్రాన్ని ఉచ్చరిస్తారు. కనుక దానికి కొంత ఫలితం ఉంటుంది. అంటే ఆ మంత్రం ఆ సంకల్ప శక్తిచేత పూరితం చెయ్యబడిందన్న మాట.

దీనికి ఒక ఉదాహరణ ఉన్నది. శ్రీ బాబూజీ మహరాజ్‌గారి కుమార్తె ‘మాయ’ గాయత్రి మంత్రం జపిస్తూ ఉండేవారు. ఒకసారి నాకు (కస్తూరి) బాగా జ్వరం వచ్చింది. ఆమె తండ్రి (బాబూజీ) కోర్టు నుండి వచ్చి కస్తూరికి జ్వరం వచ్చింది చూద్దాం రండని తీసుకువచ్చారు. అప్పుడు ఆమె (మాయ) జ్వరం తగ్గాలన్న సంకల్పంతో గాయత్రి మంత్రం జపించారు కొంతసేపు. 106 డిగ్రీల ఉన్న జ్వరం 102 డిగ్రీల వరకు తగ్గింది. ఆ సమయంలో మరికొంతసేపు గాయత్రి మంత్రం జపించినా ఇంకా తగ్గలేదు. “ఆ సంకల్ప శక్తి ప్రభావం అంతే” అని శ్రీ బాబూజీ మహరాజ్ అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ అనంతం నుండి అనంత శక్తితో అందరిని అనంతం వద్దకు చేర్చాలనే సంకల్ప శక్తితో వచ్చారు. కనుక ఆ మూలంతో సంబంధం ఏర్పరచుకొని అంటే శ్రీ బాబూజీ మహరాజ్‌తో అనుబంధం ఏర్పరచుకొని ‘వారి’లో లీనమై ప్రిసెప్టర్ అభ్యాసీకి ప్రాణాహుతి నిచ్చినట్లయితే ఆ పని ఎంతో సఫలమవుతుంది. ప్రేమ, భక్తి అభ్యాసీలలో పెంపొందాలనే సంకల్పంతో ప్రాణాహుతి నిస్తే అభ్యాసీల అభివృద్ధికి అది ఎంతో తోడ్పడుతుంది. అది అనంతమైన సంకల్పం, శక్తితో ముడిపడి ఉన్నది. కనుక సహజమార్గం యొక్క అభివృద్ధి శ్రీ బాబూజీ మహరాజ్‌గారి సంకల్పంతో, శక్తితో ముడిపడి ఉన్నది. ‘వారి’తో ప్రిసెప్టర్ ఎంత లోతుగా అనుబంధం ఏర్పరచుకుంటే అంతగా శక్తిమంతమై అభ్యాసీకి ఉపయుక్తమవుతుంది.

ఈ సహజమార్గం ఎలాంటిదంటే, శ్రీ బాబూజీ మహరాజ్ ధ్యాసలో మునిగిపోతే మరల బయటకు రాలేము. ఒకవేళ రావాలనుకొని ప్రయత్నించినకొద్ది ఇంకా లోతుగా వెళ్ళటం జరుగుతుంది. ఇది ఈ విధానంలో ఉన్న విశిష్టత.

మనం శ్రీ బాబూజీ మహరాజ్ కొరకు 'వారి' దగ్గరకు వెళ్ళినప్పుడు మన ఇంటిని అంటే మన సమస్యలను తీసుకుని వెళ్ళకూడదు. అలా జరిగితే అంటే మన కోపాలు, ఇబ్బందులు వాటితో నిండిన మనస్సుతో వెళ్ళితే పశ్చాత్తాప పడవలసి వస్తుంది.

మనం ఇక్కడికి శ్రీ బాబూజీ మహరాజ్ కోసం వచ్చాము. మనకు ఇంక ఇంటిని గురించిన చింత అవసరం లేదు. మనం శ్రీ బాబూజీ మహరాజ్‌పట్ల ఎంతో ప్రేమతో, భక్తితో వస్తాము. ఇంక ఏమీ గుర్తుండదు. ఇక్కడ శ్రీ బాబూజీ మహరాజ్ 'కూర్చున్నారు', 'వారు' బయటకు వచ్చారు. ఇలా అనుకుంటూ మనస్సు నిండా 'వారి' భావనలతో ఉండేవాళ్ళం. ఒకవేళ మన సమస్య 'వారి'కి నివేదింపవలసి వస్తే నివేదించండి. 'వారి' కంటె మనలను ప్రేమించేవారు ఎవ్వరున్నారు? కాని మనం ఒకసారి విన్నవించిన తర్వాత 'వారి'కే అంతా వదలివేయాలి. అలాకాక దానిని గూర్చి పదే పదే తలచుకుంటుంటే ఉపయోగం ఉండదు.

ప్రిసెప్టర్లు కూడా 'వారి' ధ్యాసలో మునిగి "బాబూజీ! మీరు ఎంతగా అభ్యాసీలకు ప్రదానం చెయ్యాలనుకున్నారో అంతా అభ్యాసీ హృదయంలో నింపండి" అనే భావంతో ప్రాణాహుతి ప్రసారం చేస్తే బాగుంటుందని అభ్యాసీలకు ఉపయోగంగా ఉంటుందని చెప్పడం జరిగింది. అయితే అభ్యాసీలు కూడా అర్పణతో 'వారి' సంకల్పం నెరవేరేందుకు సహకరించాలి. దానివలన అభ్యాసీలకు ఎంతో లాభం చేకూరుతుంది.

అభ్యాసీలలో రెండు రకాల వాళ్ళుంటారు. ఒకరు లక్ష్యం మాత్రమే దృష్టిలో ఉంచుకొని సాధన చేసేవారు. రెండవ రకం వారు – గుంపులో గోవిందా! అనే విధంగా ఉంటారు. వెళ్ళాము! అది చూసాము, ఇది తింటాము, అలా అలా భావించేవాళ్ళు. మనం ఏ లక్ష్యం కొరకు ఈ సెంటర్ నుండి వచ్చామో అది దృష్టిలో ఉంచుకొని 'వారు' మన కొరకు వచ్చారు, మనలను తీసుకొని వెళ్ళడానికి వచ్చారు, అనే 'వారి' ధ్యాసలో మునిగి, 'వారు' ఎప్పుడు ఏ స్థితి ఇవ్వాలనుకున్నా తయారుగా 'వారి' ముందు ఉండాలి. 'వారు' మన కొరకే వచ్చారు; 'వారి'తోపాటు ఆనందం, 'వారి' ప్రేమ మనతో ఉన్నాయి. 'వారి' ప్రేమ, 'వారి'తో అనుబంధం మీకు ఇక్కడ ఉన్నంతవరకు మాత్రమే కాకుండా మీ ఊరు వెళ్ళిన తర్వాత కూడా మీతో ఉండాలని 'వారి'ని ప్రార్థిస్తున్నాను.

అదే విధంగా "బాబూజీ ! మీ గురించిన ధ్యాసలో సదా మేము మునిగా ఉండాలని కోరుకుంటున్నాము" అని భావించాలి. నిజమైన అభ్యాసీ అదే విధంగా ఉండాలి. ఇంకా, నిజమైన అభ్యాసీ అంటే శ్రీ బాబూజీ మనలను గుర్తుకు తెచ్చుకోగానే 'వారి' ఎదుట మనం సిద్ధంగా ఉండాలి. కాని అక్కడక్కడ ఒకరిద్దరు 'వారి' హృదయమైతే శ్రీ బాబూజీ కోసం వేచి ఉండేలా ఉంచినా, వారి ఆలోచనా ధారను బాబూజీతో ముడిపెట్టలేకపోతున్నారు. కనుక ఆలోచన కూడా 'వారి'తో అనుసంధానం కావాలి. మన ఆలోచనలో మన హృదయం 'వారి' కోసం తెరచి ఉంచామన్న భావన బలంగా ఉండాలి. బాబూజీకి నా ప్రార్థన ఏమిటంటే, "మీ చరణాల దగ్గరకు వచ్చిన ప్రతివారు పరిపూర్ణులై వెళ్ళాలి" అని. ప్రతి ఒక్కరు అదే భావనతో వారి ప్రతి అణువు బాబూజీలో మునిగిపోవాలి అనేదే నా భావన. హృదయంలో 'వారి' కోసం ఎదురుచూడాలి. ఆలోచనలు కూడా ఆవైపే సాగాలి. కాని హృదయం కోరుకుంటూ ఉండగా ఆలోచనలు ఇంకొక మార్గాన సంచరిస్తున్నాయి. పూజలో మామూలుగా ఉన్నాగాని మనస్సులోను, ధ్యానంలోను అటెన్షన్ (సావధానం)గా ఉండాలి. శ్రీ బాబూజీ

మహారాజ్, అటెన్షన్ (సావధానత) గురించి చక్కని అర్థం చెప్పారు. శ్రీ బాబూజీ మహారాజ్ ఎప్పుడు మనలను తలచుకుంటే అప్పుడు మనం సిద్ధంగా ఉంటే మనం పూర్తిగా లాభాన్ని పొందుతాము. మాటల్లోనే కాకుండా హృదయపూర్వకంగా "ఓ బాబూజీ! మేము మీ వెంటనే ఉన్నాము" అన్న భావన, తత్పరత సంపూర్ణంగా ఉండాలి. మనం 'లక్నో' వచ్చాము కాబట్టి ధ్యానంలో ఈ జాగ్రత్త వహించి ఉండాలని కాదు. ఎక్కడకు వెళ్ళినా, ఏ పని చేసినా మన లక్ష్యంపట్ల సచేతనంగా ఉండాలి.

ఈ రెండు రోజులలో మీరు పొందిన ఆనందం మీరు నిలుపుకోవాలి. మీరు ఇతర పనులలో మునిగి దీనిని మరచిపోరాదు. ఎంత పొందినా తరగనిది ఈ ఆనందం. ఎందుకంటే, అది అనంతం కాబట్టి. కనుక హృదయంలో 'వారి' సామీప్యతను పొందినకొద్ది ఈ ఆనందం లభిస్తుంది. ఎంత పొందినా, ఇంకా పొందడానికి మిగిలే ఉంటుంది. ఎందుకంటే, అది అనంతం కనుక. ప్రతి అభ్యాసీ 'వారి' చరణాలు గట్టిగా పట్టుకోవాలి. నిజమైన అభ్యాసీ 'వారి' చరణాలను గట్టిగా తప్పక పట్టుకొని ఉంటాడు. 'వారి' సహాయత ఎల్లప్పుడు ఉంటుంది. అయినా మనం సచేతనంగా ఉండాలి. ఏదో ఈ నాలుగు రోజులు సచేతనంగానో, ఆనందంగానో ఉండటం కాదు. మీరు ఇతర పనులలో మునిగినా, మీ స్వభావరీత్యా మునిగినా కూడా ఈ విధంగా ఇక్కడ ఉన్నట్లు సచేతనంగా ఉండాలి. ఇంట్లోగాని, ఎక్కడైనాగాని ఉన్నా మన లక్ష్యాన్ని గుర్తుంచుకొని, 'వారి'ని గుర్తుంచుకొని, 'వారు' ఏ లక్ష్యంతో వచ్చారో, ఏ సంకల్పంతో వచ్చారో దానిని మనం పూర్తిచేసి 'వారి'కి సంతోషం కలగచేయాలి.

ఇప్పటికీ మేము అభ్యాసీల నుండి, ప్రిసెప్టర్ల నుండి నేర్చుకుంటూనే ఉంటాము. ఎల్లప్పుడు అభ్యాసీలకు సేవచేస్తూ 'వారు' సర్వోత్తములుగా తయారుకావాలని కోరుకుంటాము. ఉదాహరణగా ప్రిసెప్టర్‌గా చేయబడిన ఒకరు ఈ మధ్యనే ఇక్కడకు వచ్చి వెళ్ళారు. వారు ఇప్పటివరకు శ్రీ బాబూజీ మహారాజ్‌కు పూర్తిగా అర్పితం కాకపోయినా, "ఓ బాబూజీ! మీ పాదాలవద్దకు వచ్చాము. మీ ఛాయలో ఉన్నాము, మనస్ఫూర్తిగా మీకు అర్పించుకోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను" అని ధ్యానంలో కూర్చోగానే ఆ అనంతశక్తి మూర్తి అయిన శ్రీ బాబూజీ మహారాజ్ 'వారి' కృపతో ఒక్కసారిగా అతని అహం (Self) అంతా తుడిచిపెట్టుకొని పోయింది. ఇది నేను గమనించాను. అంటే ఇప్పటికీ 'నేను' నేర్చుకుంటూనే ఉన్నాను. ప్రతి అభ్యాసీ ఇలానే చేయాలి, పొందాలి.

ఒక్కొక్కసారి శ్రీ బాబూజీ మహారాజ్, "భాయీ! నేను చేయలేని పనులు నా ప్రిసెప్టర్లు బాగా చేస్తున్నారు" అంటూ ఉండేవారు. దాని అర్థం– ఆ అనంత శక్తి మూర్తి మన స్థితికి దిగివచ్చి నేర్పడం కష్టం. అయినా 'వారు' ఇస్తారు. కాబట్టి బోధించడం అంటే – ఎలా పని చేయాలి అనేది చెప్పడం, అభ్యాసీ ఎలా లక్ష్యాన్ని ఒడిసి పట్టుకోవాలో నేర్పేది మన ప్రిసెప్టర్లు. 'వారు' ఇస్తారు; పొందడం ఎలాగో మనం (ప్రిసెప్టర్లం) నేర్పాలి. సరైన, నిజమైన అభ్యాసీగా తయారు కావడం ఎలాగో మనం నేర్పాలి. మనపై ప్రేమతో ఇలా నేర్పుతారు 'వారు'. అంటే ఈ క్రింది స్థాయికి అనగా మన స్థితికి దిగివచ్చి ఇలా నేర్పుతారు. ఇంతలా అమ్మయినా నేర్పగలదా! ఇంతకంటె ఎవరైనా మనలను ప్రేమించగలరా! మనకు సమయం ఎక్కువగా లేదు. అయినా 'వారి' సంకల్పం ఉన్నది. అందరికోసం వచ్చానని 'వారు' చెబుతున్నారు. కాకపోతే అదే మనం అనుభూతి చెందవలసి ఉంది అంతే.

ఒక్కొక్కచోట ఒక్కొక్క వాతావరణం ఉంటుంది. శ్రీ బాబూజీ మహరాజ్ మన హృదయంలో కొలువుతీరి (ఉపస్థితమై) ఉన్నారన్న అనుభూతి మరియు 'వారి' గృహంలో (అనంతంలో) ఉన్న వాతావరణం మనం అనుభూతి పొందితే, మన హృదయం 'వారి' గృహమైతే ఎటువంటి వాతావరణానికైనా మనం ప్రభావితం కాము. 'వారి' కృపతో జీవిస్తున్నాం. 'వారి' సహాయంతో జీవిస్తున్నాం. 'వారి' గృహ వాతావరణంతో మనం బ్రతికి ఉన్నామన్న సంగతి ప్రపంచానికి అంతా వినబడేలా చెబుతున్నాం. ఎమని అంటే, “బాబూజీ మేము మీ వారము. 'మీ' ఇల్లు మాది. మీ వాతావరణంతో మేము శ్వాస తీసుకొంటున్నాము” అని. ఇలాంటి ఈ భావన, అనుభూతి లేకపోతే ఫలితం లేదు. ఆనందం లేదు. మన ఇల్లు శ్రీ బాబూజీయే. 'వారు' మన హృదయంలో ఉన్నారు. మనం ఎక్కడకు వెళ్ళినా 'వారు' మనతో ఉంటారు. ఆ పవిత్రత మనతో ఉంటుంది. ఎక్కడైనా ఇదే వాతావరణం ఉంటుంది. మనం వెళ్ళినచోట ఆ యొక్క వాతావరణ ప్రభావం మనపై ఉండదు. 'వారి'ని అంగీకరించాము. 'వారి'ని మన హృదయంలో నింపుకుంటూ ఆ అనంత వాతావరణం నుండే మనం శ్వాస తీసుకుంటాము.

మనలో శ్రీ బాబూజీ ఉన్నారు, అని భావిస్తాము. అదే అనుభూతి చెందాలి. 'వారి'లో మనం ఉన్నామో, లేదో అనేది తెలియదు. మనం 'వారి' దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ అనుభూతి లేదంటే, 'వారు' మనలో ఉన్నారన్న భావం ఉంది కాని దివ్యానుభూతి లేదన్నమాట. అందువలన ఆనందం పొందలేము. కనుక అనుభూతి ముఖ్యం. మనల్ని మనం తయారు చేసుకోవాలి. 'వారి' ముందర మనం హాజరై “నేను మీ వాడిని” అని చెప్పుకోగలిగి ఉండాలి. అలా మనలను మనం ప్రత్యక్షం చేసుకోవాలి. ఇలా చాలాసార్లు అభ్యాసీలతో అంటూ ఉండేవారు బాబూజీ.

శ్రీ బాబూజీ యొక్క ఈ మాటలను శ్రీ ఈశ్వరసహాయ్‌గారు ఇలా వివరించేవారు: “దివ్యత్వం మీలో ఉంది. నిజమే. మనం ఆలోచనల్లోను, అనుభూతిలోను దానిని పొందాలి. ఒకసారి మనం 'వారి'లో ఉన్నామన్న అనుభూతి కలిగితే మనలను విడదీసేవారు ఎవ్వరూ ఉండరు” అని అనేవారు. అభ్యాసం చేయాలి. నిరంతరం 'వారి' ఆలోచనా ధారలో మునిగి ఉండాలి. అలా ఉంటే ఇంకో ఆలోచన మనకు ఇష్టం ఉండదు. మన ఆలోచన 'వారి'తో జోడించబడి ఉన్నదన్న దానికి అర్థం ఏమంటే, 'వారి' ప్రేమలో మునిగి ఉంది అని. మన అనుబంధం ఎంతగా బలపడుతుందో అంతగా అవగాహనకు వస్తుంది. ప్రపంచంలో ఏయే పనులు చేస్తూ ఉన్నాము, ఎలా జరుగుతున్నాయన్న తలంపు నెమ్మదిగా కరిగిపోతుంది. కాకపోతే పనులన్నీ సజావుగా, చక్కగా జరుగుతాయి. భౌతికమైన ఈ పనులు మనం ఎంత ఏకాగ్రతతో చేసినా, ఎంత జాగ్రత్తపడినా ఎంతో కొంత అటు, ఇటు జరగవచ్చు. కాని మన దృష్టి 'వారి'పై ఉండి 'వారి' అనుగ్రహంతో 'వారి' ధ్యాసతో పనిచేస్తే అన్ని సక్రమంగా జరిగిపోతాయి. మనలను మనం మరచిపోతాము. అంతా 'వారే' చేయిస్తారు. ఇదే అసలు రహస్యం.

ఈ మధ్య ఒక అభ్యాసీ ఒక ఉత్తరంలో “బెహెన్‌జీ! శ్రీ లాలాజీ సాహెబ్ పునర్జన్మ పొంది మానవరూపంలో ఉన్నారట కదా! ఎక్కడ ఉన్నారో మీకు తెలుసా?” అని అడిగాడు. జవాబుగా “అదేమో నాకు తెలియదు” అని వ్రాశాను. ఈమధ్య కొందరి ఆలోచనలు ఎంత పెడమార్గంలో పయనిస్తున్నాయో దీని వలన తెలుస్తోంది.

అంతటి దివ్యమూర్తిమత్వం మరల పునర్జన్మ పొందితే ఇంక ఆ అభ్యాసీ సంగతి ఏమిటి. ఇలాంటి ఉత్తరాలు వస్తుంటాయి. వారికి ఏమని సమాధానాలు వ్రాస్తాము.

మద్రాసు నుండి ఇక్కడకు ఎవరైనా వస్తే మనం కాదనం. కాని వాళ్ళు ఇక్కడ (లక్నో) నుండి అక్కడకు రాకూడదని ఆంక్షలు విధిస్తారు. అది సరైనదే. ఎందుకంటే అపమార్గం నుండి అంటే అక్కడి నుండి సవ్యమైన మార్గానికి అంటే ఇక్కడకు రావచ్చు. అది వారికి అభ్యంతరం లేదు. కాని ఇక్కడి నుండి అక్కడకు ఎవరూ వెళ్ళరాదు అని అంటున్నారు. సరైన మార్గం నుండి అపమార్గానికి పోరాదు కదా! వాళ్ళు సరిగ్గానే చెప్పారు.

నిరంతర స్మరణ మనకు ఎంతైనా అవసరం. దాని స్పర్శతో శ్రీ బాబూజీ మనలను ఎంత ముందుకైనా తీసుకు వెళ్ళతారు. చెడు ఆలోచనలు, అల్పమైనవి ఎప్పుడూ ఉపయోగపడవు. 'వారి'ని స్పృశింపవు.

అందుకే శ్రీ బాబూజీ మహరాజ్ మన హృదయంలో ఉన్నారు, అన్న అనుభూతి అవసరం. మన సెల్ఫ్ (అహం) కరిగిపోతుంది. 'వారే' అంటే దివ్యత్వం మనదవుతుంది. మనలో ఉపస్థితమవుతుంది, ఉండిపోతుంది. నేను చేస్తున్నాను, నేను మాట్లాడుతున్నాను అన్న పదాలలోని 'నేను' అన్నది 'వారి'కే అనుసంధానమై ఉందన్న అనుభూతి కలుగుతుంది. ఈ విధంగా 'వారి'ని హృదయంలో నింపుకొని అనుభూతి పొందుతూ సాధన చేయాలి.

"దివ్య స్మరణ ఎంత శక్తిమంతమైనదో తెలుసా? దివ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నంతనే సెల్ఫ్ (అహం)ను మరచిపోతాము; అదే మరపుస్థితి (ఫరగెట్‌ఫుల్ స్టేట్). దాని అర్థం ఇదే. 'వారి'ని పిలిచినా మిమ్మల్ని పిలిచినట్లు అనిపిస్తుంది. మీ స్థానంలో 'వారే' కనిపిస్తారు. 'బాబూజీ' నాలో అంతా మీరే ఉన్నారన్న భావనతో సాధనచేస్తే ఈ అనుభూతి లభిస్తుంది. 'వారే' దర్శనమిస్తారు.

మనం ఎలాంటి వాళ్ళమైనా 'వారు' మన వారేనని భావించాలి. శ్రీ బాబూజీ మహరాజ్, "నేను అభ్యాసీలో తక్కువతనాన్ని చూడను, అతడిని అనంతం వద్దకు తీసుకొని వెళ్ళడానికే వచ్చాను" అని అంటారు. ఎంత మహత్తర మూర్తిమత్వమో! ఎంతటి మహిమాన్వితమైనదో 'వారి' చర్య.

**ప్రశ్న: బెహెన్‌జీ! నిరాడంబరత (సింప్లిసిటీ) అనేది దివ్యమూర్తిమత్వానికి అంటే శ్రీ బాబూజీ మహరాజ్‌కు ఒక ఆచ్ఛాదన (కవరింగ్) అయి ఉన్నదా?**

**జవాబు:** ఆ భావన తప్పు. దివ్యమూర్తిమత్వం ఎటువంటి ఆచ్ఛాదనతో రావడం జరుగదు. మన సంస్కారాలన్నిటిని ఛేదించడానికి ఆ 'సంకల్పం'తో వచ్చిన శ్రీ బాబూజీ మహరాజ్ నిరాడంబరత అనే ఆచ్ఛాదనతో వచ్చారని ఎలా అనుకోగలం. ఒక స్విచ్ బెజ్జంలో కరంట్ ప్రవహించేటప్పుడు వేలు పెడితే ఏమి అవుతుంది? దానిలో చూడడానికి కరంట్ కనబడదు. కాని కరంట్ ఉన్నది అనేది నిజం. ఇక్కడ కరంట్ అంటే శక్తి అనేది శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో కనిపిస్తుంది. వీరిని మనం చూడవచ్చు, తాకవచ్చు. నిరాడంబరత అనేది ఆచ్ఛాదన అనడం సరైనది కాదు. అది ప్రకృతి ధర్మం. శ్రీ బాబూజీ మహరాజ్, "చాలా మంది నన్ను చూడడానికి వస్తారు కాని నన్ను చూడకుండానే వెళ్ళతారు" అని అంటారు. దీని అర్థం– ప్రకృతి ధర్మంగా 'వారి'ని అంటే ఆ సత్యత్వాన్ని మనం

చూడలేము. కాని మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందితే చూడగలం. నేను ఇప్పుడు 'వారి'ని అంటే సత్యతత్వాన్ని చూడగలుగుతున్నట్లు ఆ స్థితికి ఎదిగిన వారెవరైనా చూడగలరు. ఇది 'ఇలా' అని చెప్పడానికి వీలుపడదు. కనుక నిరాడంబరత అనేది కవరింగ్ కాదు. అదే ఒరిజినల్. దానిని 'సుందరత' అంటారు. అదే దివ్య సౌందర్యం (డివైన్ బ్యూటి) సరైనది.

ఈ నిరాడంబరత మన ముందుకొస్తుంది. అదే "సత్యస్థితి" (రియాలిటీ). అది శ్రీ బాబూజీ మహరాజ్‌లో దాగి ఉన్నది. మనం చూడవచ్చు. నేను చాలాసార్లు శ్రీ బాబూజీ మహరాజ్ గారిని చూసాను. 'వారి' దగ్గరకు వెళ్ళడం జరిగింది. 'వారి'లో దాగిన లేదా 'వారి' రూపంలో ఉన్న ఆ దివ్య సౌందర్యం చూసాను.

సెల్ఫ్ రియలైజేషన్ అంటే ఆత్మ సాక్షాత్కారం. 'నేను' –ఈ శరీరం కాని స్థితి వచ్చినప్పుడు లేదా పొందినప్పుడు సెల్ఫ్ రియలైజేషన్ (ఆత్మ సాక్షాత్కారం) అంటాము. సహజంగా ఈ సెల్ఫ్ అనేది దైవానికి అర్పితం కాబడుతుంది. అంటే అమ్మివేయబడుతుంది. ఆ దశలో సెల్ఫ్ అనేది ఆ స్థితితో అనుబంధం కలిగి ఉంటుంది. ఇవన్నీ పుస్తకంలో వ్రాయబడ్డాయి.

**కృపను ఎలా అనుభూతి చెందుతాము?** శ్రీ బాబూజీ దివ్యాశీస్సులు మనకు ఒక ధారగా, దివ్య ప్రాణాహుతి ధారగా మనలోకి రావడం అనుభూతిగా మనం గమనింపవచ్చు.

**ప్రశ్న: శ్రీ బాబూజీ మహరాజ్ సర్వవ్యాపి అని ఎలా చెప్పగలరు?**

**జవాబు:** మన సాధనలో తొలుత మరపుస్థితి వస్తుంది. "నేను ఎవరు?" అనే ప్రశ్న ఉదయిస్తుంది. సెల్ఫ్ కరిగిపోయి, శ్రీ బాబూజీ మహరాజ్ మనలో ఉన్నారన్న అనుభూతి కలుగుతుంది. మనం అనుభవంలో సమాధానం చెప్పాలి. భగవంతుని గూర్చిగాని, దివ్యత్వం గురించిగాని అనుభూతి మాత్రమే చెప్పగలదు. అందువల్లనే అనుభూతి వల్లనే 'వారు' అంతటా ఉన్నారని చెప్పవచ్చు. అందుకని **"అనుభూతి ఒక్కటే భగవంతుని భాష (Feeling is the language of the God)"** అని శ్రీ బాబూజీ మహరాజ్ అన్నారు.

ఒకసారి శ్రీ చారీజీ నన్ను శ్రీ బాబూజీ మహరాజ్ ఇచ్చిన ప్రిసెప్టర్ సర్టిఫికెట్ తనకు ఇవ్వమన్నారు. బదులుగా శ్రీ చారీజీ ఇంకొకటి ఇస్తానన్నారు. నేను అంగీకరించలేదు. ఎందుకంటే శ్రీ బాబూజీ మహరాజ్ నాకు శక్తిని ఇచ్చారు. దానిని తిరిగి ఇవ్వడం అంటే సర్టిఫికెట్ ఇవ్వడమనేది జరగని పని. అందుకని ఆయన అంటే శ్రీ చారీజీ ప్రిసెప్టర్‌గా నన్ను తీసేసారు. నేను ఇప్పుడు సర్వ స్వతంత్రురాలను. నేను స్వేచ్ఛగా అభ్యాసీల భక్తిలో, ప్రేమలో విహరిస్తాను.

శ్రీ బాబూజీ ఎల్లప్పుడు "మీకు ఎటువంటి బంధాలు, హద్దులు ఉండకూడదు, మీరు స్వతంత్రంగా ఉండాలి" అనేవారు.

నేను (కస్తూరి) టీచర్ని కాను, విద్యార్థినే. ఇప్పటికీ 'వారు' నాకు నేర్పిస్తూనే ఉన్నారు. నేను నేర్చుకుంటూనే ఉన్నాను. శ్రీ బాబూజీ మహరాజ్ ప్రతిదీ నాకు చూపిస్తున్నారు. పుస్తకంలో బొమ్మలు చూపించినట్లు చూపిస్తున్నారు.

అలా అనుభూతికి వస్తుంది. అప్పుడు వ్రాయడం జరుగుతుంది. చిన్న పిల్లలకు 'ఎ' అంటే ఆపిల్ అని బొమ్మల్లో ఆపిల్ వేసి చూపుతారు. పిల్లలు గ్రహిస్తారు. అలాగే నాకు కూడా శ్రీ బాబూజీ మహరాజ్ చెబుతూనే ఉన్నారు. నేను వ్రాస్తూనే ఉన్నాను.

శ్రీ బాబూజీ మహరాజ్ మనలను అంగీకరిస్తే అప్పుడు మనం శిష్యులమని అనుభూతి చెందుతాము. అంతేగాని సహజమార్గ విధానంలో శిష్యుడు అనేది ప్రత్యేకంగా లేదు. శిష్యుడు అవ్వడం చాలా కష్టం. అభ్యాసీ అవ్వడం చాలా తేలిక. మరపుస్థితిని పొందితే శ్రీ బాబూజీ మహరాజ్‌ని ఎవరైనా పిలిస్తే మనల్ని పిలిచారేమోనన్న అనుభూతి కలుగుతుంది. ఇది శిష్యుని స్థితి. గురువుగారిని పిలిస్తే, తలిస్తే నన్ను పిలిచినట్లు, తలచినట్లు అనుభూతి కలుగుతూ ఉండేది. ఈ విషయం నేను శ్రీ బాబూజీ మహరాజ్‌కు వ్రాసినప్పుడు "ఇది నిజమైన శిష్యుని స్థితి" అని జవాబు వ్రాశారు. ఇలా మరపు స్థితి ఉండి, ఈ అనుభూతి కలగటం అంటే గురువుకు శిష్యునికి భేదం లేదన్నమాట.

గురువు, శిష్యుడు వేరు వేరు. దివ్యత్వం గురువు కాదు. శిష్యుని దృష్టిలో అనుభూతి మాత్రమే ఉన్నప్పుడు 'వారి'ని అంగీకరించినట్లు అర్థం. చాలామంది గురువు అంటే ఎంతో పెద్దవారన్నట్లు, దూరం అన్నట్లు చెబుతారు. సహజమార్గంలో శ్రీ బాబూజీ మహరాజ్ దానిని అంగీకరించరు. 'వారు' తనతో చాలా స్వేచ్ఛగా, చనువుగా ఉండమని చెబుతారు. హెచ్చుతగ్గులు అనేవి తనకు లేవని చెబుతారు. ఇంకా 'వారి'కి మనకూ దూరం లేదని చెబుతారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! అంతిమ సాక్షాత్కారం మరియు భగవత్ సాక్షాత్కారం ఒక్కటి కాదా?**

**జవాబు:** కాదు. మన సహజమార్గంలో మన లక్ష్యం అంతిమ సాక్షాత్కారం. కాని మానవులకు గమ్యం భగవత్ సాక్షాత్కారం. అభ్యాసీ అహంకారపు 16 వలయాలను అధిగమించిన తరువాత శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసీని ఆ భగవంతుని శక్తిలో ముంచి పైకి తీస్తారు. అప్పుడు ఆ అహంకారపు (ఎగో) ఐడెంటిటీ (జాడ) అక్కడ ఉండిపోతుంది. అభ్యాసీ తాను (భగవత్ క్షేత్రంలో) గాడ్లీ రీజియన్‌లో ఉన్నానని అనుభూతి చెందుతాడు. తరువాత శ్రీ బాబూజీ మహరాజ్ మనలను అంతిమం వద్దకు చేరుస్తారు.

శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన విషయాలు 57 సంవత్సరాల నుండి వింటున్నాను. ఇప్పటికీ ఒక్కొక్క వాక్యం 'వారి'చేత అర్థం చెప్పబడినప్పుడే అర్థమవుతుంది, అనుభూతికి వస్తుంది.

అలా 'వారు' చెప్పినదే – నథింగ్‌నెస్, నెగేషన్ అనేవి ఒక్కటే అనే విధంగా అనిపిస్తాయి. ఇది పదాల మాయాజాలం. కాని ఒక్కటి కాదు. ఈ 'నెగేషన్'లో నీ అంతట నీవు అందులో ఏముందో దర్శించలేవు. ఈ విషయం నాకు 57 సంవత్సారాల తరువాత ఇప్పుడు ఈ కండిషన్ నాకు అర్థమయ్యింది. ఈ రెండు మాటలు ఒక్కటేనని అనుకుంటాము. కాని ఒక్కటి కాదు. నెగేషన్‌లో వైబ్రేషన్ (కంపనం) ఉంటుంది. కాని వైబ్రేషన్ ఉంటే 'నథింగ్‌నెస్' కాదు. ఈ వైబ్రేషన్స్ అనేవి శ్రీ బాబూజీ మహరాజ్‌లో లయమైపోయినప్పుడు 'నథింగెనెస్' అనే స్థితి వస్తుంది. ఇది ఈ రెండిటికి ఉన్న భేదం.

కేంద్ర మండలంలోని మూలబిందువును ఈ 'నథింగ్‌నెస్' అనేది స్పృశించినప్పుడు 'నెస్' అనేది దానిలో లయమైపోతుంది. ఇంక మిగిలింది 'నథింగ్' మాత్రమే. శ్రీ బాబూజీ మహరాజ్ 'టీచర్' కాబట్టే చెబుతారు. లేకపోతే ఇంకెవరు చెబుతారు!

శ్రీ బాబూజీ మహరాజ్ మనలను కేంద్రమండలములోని మూలానికి తీసుకొని వెళ్ళతారు. 'వారి' కృపతో ఆ మూలాన్ని తాకగానే ఆ 'నెస్' అనేది దానిలో లయమైపోతుంది. 'నథింగ్' అనేది మాత్రమే మిగులుతుంది. ఈ స్థితిలో 'జీరో' (శూన్యత) యొక్క అనుభూతి కలుగుతుంది. మనం 'జీరో' (శూన్యం) అయ్యాము కాబట్టి కదలలేము. మరి మనం అంతిమంలో కలిసేదెలా? కదలలేని మనం, జీరో అయిపోయిన మనం, నథింగ్‌గా మిగిలిన మనం, అనంతాన్ని దర్శించడం కాని, ఆ అనంతం వద్దకుగాని ఎలా చేరతామంటే ఆ దివ్య సౌందర్యం మనలను ఆకర్షించి అక్కడకు అంటే ఆ మూలానికి తీసుకొని వెళ్ళుతుంది. జీరో అనేది కదలలేదు. దీనిని పవర్‌లెస్ పవర్ (శక్తిలేని శక్తి) అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్. 'జీరో' అనే దానికి శక్తి లేదు. అప్పుడు అనుభూతి ఏమిటి? మీకు తెలిసిందా? అవును; శ్రీ బాబూజీ మహరాజ్ కోరుకుంటే మనం 'వారి'ని పట్టుకొని ఉన్నప్పుడు 'వారే' అంటే అనంతం నుండి వచ్చిన 'వారు' మనలను అక్కడకు చేరుస్తారన్న అనుభూతి కలిగింది. అభ్యాసీని అక్కడకు చేరుస్తారని తెలుస్తుంది. నీవు నిజంగా అభ్యాసీవి అయితే అనుభూతి కలుగుతుంది. 50, 60 సం॥ల తర్వాత నేను ఆనాటి స్థితులను ఎలా వ్రాయగలుగుతున్నాను. నేను వ్రాస్తున్నాను కదా! ఎలా అంటే, నా ముందు అద్దం ఉంచుతారు. ఒక స్థితి తరువాత మరొక స్థితిని దర్శింపచేసి మరల అనుభూతికి తెచ్చి వ్రాయించేది 'వారే' – శ్రీ బాబూజీ మహరాజ్‌గారే. ఇక్కడ దివ్యత్వపు సంకల్పం ఉన్నది– ఇది వ్రాయాలి, ఇలా వ్రాయాలి అని; కనుక వ్రాయబడుతుంది.

నేను అన్ని స్థితులను గురించి తెలుసుకున్నాను. కాని నేను గ్రహించలేనిది శ్రీ బాబూజీ మహరాజ్ గారిని మాత్రమే. ఒక్కటి మాత్రం తెలుస్తుంది. ఎంతటి దివ్య ప్రేమ మనలను తాకి ముందుకు తీసుకొని వెళు ్ళతున్నదో తెలుస్తున్నది. రాత్రి నేను నిద్రపోతున్నప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ నాకు సిట్టింగ్ ఇచ్చేవారు. నిద్ర నుండి లేచి నాలో ఏర్పడిన స్థితులను వ్రాసేదాన్ని. ఇది ఎలా అంటే దివ్య సంకల్పం వలన మాత్రమే.

ఆధ్యాత్మికతలో ఈ సహజమార్గం అనేది సంపూర్ణం. దీనిని ఇంకా అభివృద్ధి చేయగలమనేది ఏదీ లేదు. అంతా నిండి ఉంది. ఇంక పెంచేది ఏమీ లేదు. అభివృద్ధి చేయవచ్చనే ప్రశ్నే లేదు. అందుకని శ్రీ బాబూజీ మహరాజ్ "దివ్య శక్తి యొక్క ఒక్క చుక్క అనేదే సంపూర్ణం" అనేవారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! అనంతం భూమిపై అవతరించడం ఇదే మొదటిసారియా?**

**జవాబు:** అవును మొదటిసారి; మన కొరకు అనంతం నుండి భూమి మీదకు మొదటిసారిగా శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో అవతరించినది. బాధపడకుండి శ్రీ బాబూజీ ఉన్నారు మనలను దరిచేర్చడానికి. అంతే కాకుండా ఈ విధానాన్ని రాబోయే తరాలవారు బాగా అర్థం చేసుకుంటారు. ప్రేమ, భక్తి వారిలో వేగంగా పెరిగి సహజమార్గ విధానంలో అభివృద్ధి చెందుతారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఎంతో వేగంగా ఇస్తున్నారు. మబ్బులు, మెరుపులు లేకుండా వర్షం కురుస్తున్నట్లుగా ప్రాణాహుతి ధార కురుస్తూ ఉంది. అభ్యాసీలు కూడా అంత వేగంగా అందుకోవాలి. మెలకువతో ఉండి గ్రహించాలి. అభ్యాసీలు వారి ఆలోచన లేదా ధ్యాస ఇతరత్రా సడలిపోనివ్వకుండా శ్రీ బాబూజీ మహరాజ్‌పైనే ఉండేలా మెలకువతో, అలర్ట్‌గా ఉండాలి.

'నెగేషన్' అంటే ఉన్నదేదో లేనిదైపోతుంది. 'నథింగ్‌నెస్'లో 'నెస్' పోతే ఉండేది 'నథింగ్'. అదే ఉత్తమోత్తమం. 'నథింగ్' అంటే జీరో అంటే శక్తి రహిత శక్తి (పవర్‌లెస్ పవర్). జీరోకు శక్తి ఉండదు. దీనిని ఏదైనా అంకెకు కుడి ప్రక్కన తగిలిస్తే పదింతలు అవుతుంది. కాని స్వయంగా జీరోకు విడిగా విలువలేదు.

కాని మనం మధ్యలో చూస్తే, శ్రీ బాబూజీ మహరాజ్ ఎక్కడ ప్రత్యక్షం అవుతారో అక్కడ మనం అప్రత్యక్షమైపోతాం. అప్పుడు చూస్తే 'వారి' సహాయంతోనే ముందుకు వెళ్ళుతున్నామని అనుభూతికి వస్తుంది. ఇది ఎలాంటి స్థితి అంటే, "ఉప్పదనం లేని ఉప్పుకల్లువంటి స్థితి." అక్కడకు చేరితో "రుచిలేని రుచి (టేస్ట్‌లెస్ టేస్ట్)" గోచరిస్తుంది. ఇక్కడ రుచి ఎవ్వరంటే శ్రీ బాబూజీ మహరాజ్‌యే. ఆ 'టేస్ట్' యొక్క ఆకర్షణతో మనం అక్కడకు అంటే మూలానికి చేరుకుంటాము.

భౌతికంగా మనం ధ్యానంలో ఉండకపోవచ్చు పనులలో ఉన్నప్పుడు. కాని ఆంతరికంగా ధ్యాన స్థితిలో ఉండండి. ఆంతరికంగా ఉన్న ఆ ధ్యానావస్థను వదలకుండా యోగి మాదిరిగా ఉన్నట్లయితే ఎంతో సఫలతను పొందవచ్చు. భౌతికమైన పనులు కూడా చాలా చక్కగా జరిగిపోతాయి. ధ్యానం చెయ్యండి కాదు ధ్యానంలో ఉండండి.

**ప్రశ్న: బెహెన్‌జీ! జీవుడు మరియు బ్రహ్మకు గల తేడా ఏమిటి?**

**జవాబు:** జీవుడు అనగా 'నేను'. ఈ 'నేను' అనేది బ్రహ్మస్థితికి చేరుకోవాలి. మైండ్ రీజియన్ దాటిన తర్వాత బ్రహ్మస్థితి వస్తుంది. బ్రహ్మ అంటే గాడ్ (భగవంతుడు) కాదు. బ్రహ్మ అంటే పరమాత్మతత్వం. ఆత్మ అనేది పరమాత్మ తత్వం (బ్రహ్మ)లో లయం అయిన తర్వాత అభ్యాసీ గాడ్లీ రిజియన్‌లో ప్రవేశిస్తాడు.

**ప్రశ్న: పురుషుడు మరియు స్త్రీ ఎక్కడ సృష్టించబడ్డారు?**

**జవాబు:** ఈ క్రియేషన్ (సృష్టి) అనేది మైండ్ రీజియన్ యొక్క ముఖ్య కేంద్రం అయిన హిరణ్యగర్భ నుండి జరిగినది. స్త్రీ, పురుషుడు కూడా హిరణ్యగర్భ నుండే సృష్టించబడ్డారు.

**ప్రశ్న: ప్రేమ, తపన, భక్తి మొదలైన వాటిని ఎలా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** ఆధ్యాత్మికతలో మీరు ఏవీ కూడా అభివృద్ధి చేసుకోలేరు. ఎందుకంటే డివైన్ (దైవం) అనేది సంపూర్ణం. దైవం మీ హృదయంలోనే ఉన్నాడు కాబట్టి ఆధ్యాత్మికతకు సంబంధించిన ప్రేమ, భక్తి, తపన అన్నీ కూడా మీ లోపలనే ఉన్నాయి. మీకు ఎప్పుడు ఏది అవసరమో అప్పుడు అది లభిస్తుంది.

"బాబూజీ నా వారు, నా హృదయంలోనే ఉన్నారు" అని మీరు ఆ ఫీలింగ్‌లో 'వారి' నిరంతర స్మరణలో మునిగిపోయినప్పుడు మీకు అవసరమైన ప్రేమ, భక్తి, తపన అన్నీ కూడా మీలో ప్రత్యక్షమవుతాయి. భౌతికమైన వస్తువులను తయారు చేయగలం. కాని ఆధ్యాత్మికతకు సంబంధించినవి అన్నీ మీ లోపలనే ఉన్నాయి. మీరు నిరంతర స్మరణను ఆలోచనతో అనగా మనస్సుతో చేస్తున్నారు. మీ మనస్సులోకి వేరే ఆలోచన రాగానే బాబూజీ యొక్క ఆలోచన ప్రక్కకు తొలగిపోతుంది. నిరంతర స్మరణను హృదయంతో చేయాలి; ప్రేమతో చేయాలి.

**ప్రశ్న: ఆనందం మరియు సంతోషం అనే దానికి తేడా ఏమిటి?**

**జవాబు:** సంతోషం అనేది మనస్సుతో కనెక్ట్ చేయబడినది. బాబూజీ ఫోటోను చూసినప్పుడు లేదా బాబూజీ రూపం జ్ఞాపకం రాగానే మీకు సంతోషం కలుగుతుంది. ఆనందం అనేది హృదయానికి సంబంధించినది. మీ హృదయం పూర్తిగా ప్రేమతో నిండిపోయినప్పుడు మీకు ఆనందం అనేది కలుగుతుంది.

ఒకసారి నేను బాబూజీ వద్ద కూర్చొని ఉన్నప్పుడు, ఒక అభ్యాసీ **గ్రేస్ అంటే ఏమిటి?** అని నన్ను అడిగాడు. అప్పుడు బాబూజీ యొక్క గ్రేస్ వలన బాబూజీ యొక్క ఆశీస్సుల వలన నేను, "పరీక్షలో ఎవరైనా విద్యార్థి ఫెయిల్ అయ్యినప్పుడు టీచర్ అతనికి కొన్ని గ్రేస్ మార్కులు కలిపి, పాస్ చేస్తారు. అలాగే బాబూజీ తమ అభ్యాసులు ఎవరు కూడా ఫెయిల్ అవ్వడానికి ఇష్టపడరు" అని ఆ అభ్యాసీకి జవాబు నిచ్చాను. గ్రేస్ అంటే బాబూజీ యొక్క కృప అని అర్థం. గ్రేస్ అనేది కేవలం ఆధ్యాత్మిక పురోగతి కోసమే ఉపయోగపడుతుంది. కాని ప్రాపంచిక విషయాలకు మాత్రం కాదు. గ్రేస్ (దైవ కృప) ఉంటే ఆధ్యాత్మికతలో ఫెయిల్ కావడం అనేది ఉండదు. 'డివైన్ గ్రేస్'లో 'గ్రేస్' అనే పదం డివైన్‌తో కనెక్ట్ చేయబడి ఉంది. డివైన్ ఎప్పుడు కూడా ఫెయిల్ కాదు, కాబట్టి మీరు డివైన్ (బాబూజీ)తో కనెక్షన్‌ను (అనుబంధం) ఏర్పరచుకుంటే మీరు ఎప్పుడు కూడా ఫెయిల్ కారు. బాబూజీతో కనెక్షన్ లేకపోతే మీరు ఆధ్యాత్మికతలో ఫెయిల్ అవుతారు. చాలామంది అభ్యాసులు ప్రాపంచికమైన సమస్యల పరిష్కారం కొరకు గ్రేస్ (దైవ కృప) కావాలని ప్రార్థిస్తారు. కాని గ్రేస్ అనేది కేవలం ఆధ్యాత్మిక పురోగతి కొరకే మీకు లభిస్తుంది. ప్రాపంచికమైన సమస్యలు కొరకు మీరు బాబూజీని ప్రార్థించవచ్చు. "బాబూజీ నా వారు" అని మీరు ఫీల్ అయినపుడు, మీ సమస్యలను బాబూజీకి కాకుండా ఇంకా ఎవరికి చెప్పుతారు!

"భగవంతుడు నీలో ఉన్నాడు. ఇప్పుడు నీవు ఆ భగవంతుని (గాడ్) లోపల ఉండాలి. దీని కొరకే ఈ సాధన" అని బాబూజీ చెప్పారు. "బాబూజీ నా వారు; నా హృదయంలోనే ఉన్నారు; నా ఎదురుగా ఉన్నారు" అని మీరు దృఢంగా అనుకోవాలి. ఆ ఫీలింగ్‌లో మునిగిపోవాలి. సాధన అంటే ఇదే.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను చాలా చెడ్డవాణ్ని, పాపిని. నేను మెడిటేషన్ చేయలేను" అని అనగానే బాబూజీ ఎంతో ప్రేమతో, "భాయీ! మంచి, చెడులన్నీ మరచిపో. 'నేను నీ వానిని' అనేది గుర్తుంచుకో, చాలు" అని అన్నారు. "బాబూజీ! నేను ఎలా ఉన్నా కాని నేను మీ వాడినే" అనేది గుర్తు పెట్టుకోవాలి. మిగిలినవి అన్నీ మరచిపోవాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఈ ప్రపంచంలో కొంత మందికి చాలా కష్టాలు, బాధలు కలుగుతాయి, ఎందుకు?**

**జవాబు:** ఈ ప్రపంచంలోకి వచ్చిన తరువాత మానవునికి బాధలు, దుఃఖాలు అనేవి తప్పనిసరి. రామాయణం, భారతం, గీతలో చూస్తే అవతార పురుషులు అయిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కూడా బాధలు, కష్టాలను అనుభవించారు. మానవులకు చెడు కర్మల ఫలితంగా దుఃఖం, బాధలు అనేవి అనుభవించవలసి వస్తుంది. మీరు మంచి, చెడులన్నీ మరచిపోండి. "బాబూజీ! నేను మీ వాడిని" అనేది గుర్తు పెట్టుకొని, 'వారి' మీదనే మీరు డిపెండ్ కావాలి (ఆధారపడాలి).

నిరంతర స్మరణ అనేది ప్రేమతో కూడియున్నప్పుడు, దాని ఫలితం చాలా గొప్పగా ఉంటుంది. "బాబూజీ! మీరు నా వారు; నేను మీ వాణ్ని" అనే ఫీలింగ్‌లో మునిగిపోవడమే నిరంతర స్మరణ.

అభ్యాసీ యొక్క క్రేవింగ్ (తపన)కు, ప్రిసెప్టర్ యొక్క క్రేవింగ్ తోడైనపుడు, సిట్టింగ్‌లో అభ్యాసీ రెట్టింపు ఫలితాన్ని పొందుతాడు.

బాబూజీ మొదటిసారి ఫారిన్ (విదేశాలకు) వెళ్ళి వచ్చిన తరువాత నా తల్లిగారితో వారు, "అమ్మా! నేను ఎక్కడికి వెళ్ళితే, అక్కడికి కస్తూరి నాతోపాటే టికెట్ లేకుండా వస్తుంది. నేను ఆమెను పట్టుకోమని పోలీసులకు చెప్తూతాను" అని నవ్వుతూ అన్నారు. అప్పుడు నేను, "బాబూజీ! పోలీసులు టికెట్ గురించి నన్ను అడిగినప్పుడు, వాళ్ళకు మిమ్మల్ని చూపించి, నా టికెట్ మీ దగ్గర ఉందని చెప్తూతాను" అని అనగానే 'వారు' ముసిముసి నవ్వులు నవ్వారు. దీని వలన నాకు అర్థం అయ్యినది ఏమిటంటే, ఎప్పుడైతే మనకు బాబూజీతో నిజమైన కనెక్షన్, దృఢమైన కనెక్షన్ ఏర్పడుతుందో, అప్పుడు ఎల్లవేళలా బాబూజీ మన ఎదుటనే ఉంటారు. మరల 'వారు' కూడా మన ప్రజెన్స్‌ను 'వారి' ఎదుట ఫీల్ అవుతారు. కాబట్టి మీరందరు కూడా బాబూజీతో అలాంటి కనెక్షన్‌ను ఏర్పరచుకోవడానికి ప్రయత్నించాలి. కనెక్షన్ అంటే, "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అనేది మీరు ఎల్లవేళలా గుర్తుపెట్టుకోవాలి. ఆ ఫీలింగ్‌లో మునిగిపోవాలి.

ఒకసారి "బాబూజీ! నేను ఎప్పుడు మిమ్మల్ని తలచుకున్నా సరే, నేను షాజహాన్‌పూర్‌లో మీ ఎదుటనే ఉన్నట్లుగా అనిపిస్తున్నది" అని 'వారి'కి ఉత్తరంలో వ్రాశాను. ఆ సమయంలో నేను ఢిల్లీకి దగ్గరలోనే ఉన్న మోడినగర్‌లో నా సోదరుని ఇంటిలో ఉండేదాన్ని. బాబూజీ నుండి నాకు ఉత్తరం వచ్చింది. "బిటియా! నేను నిన్ను ఎప్పుడు జ్ఞాపకం చేసుకున్నా సరే, నేను మోడీనగర్‌లో, నీ ఎదుటనే ఉన్నట్లుగా నాకు అనిస్తుంది" అని 'వారు' వ్రాశారు. ఈ విధంగా మనం డివైన్ పర్సనాలిటీ (బాబూజీ)తో ఆ నిజమైన కనెక్షన్‌ను అనుభూతి చెందగలం. మరల అదే ఉత్తరంలో వారు "ఇది సామీప్యతా స్థితి యొక్క చివరి అంకం" అని వ్రాశారు.

మీ స్థానంలో మీరు బాబూజీని ఫీల్ కావడం, మీ హృదయంలో కాదు, మీరు ఉండే స్థానంలో మీకు బదులుగా బాబూజీని అనుభూతి చెందడం అనేది సారూప్యతా స్థితి. "బాబూజీ! నేను ఎప్పుడు అద్దంలో చూసుకొన్నా, నాకు కేవలం మీ రూపమే కనబడుతున్నది" అని వ్రాసిన దానికి జవాబుగా వారు "బిటియా! నేను

ఎప్పుడు అద్దంలో చూసినా, నీవే కనబడుతున్నావు. నేను మోడీనగర్‌లో ఉన్నట్లుగా, నీవు షాజహాన్‌పూర్‌లో ఉన్నట్లుగా అనిపిస్తున్నది. ఇది సారూప్యతా స్థితి యొక్క అంతం" అని వ్రాశారు.

నిజమైన అభ్యాసీ యొక్క స్థితి, తనను తాను మరచిపోవడంతో ప్రారంభమవుతుంది. రియల్ అభ్యాసీ స్థితి యొక్క అంతం ఎప్పుడంటే, నీ స్థానంలో బాబూజీ ఉన్నట్లుగా, బాబూజీ స్థానంలో నీవు ఉన్నట్లుగా అనుభూతి చెందినప్పుడు.

**ప్రశ్న: ఒకవేళ ఇప్పుడు అల్టిమేట్ (భూమా)ను చేరుకోలేకపోతే, మేము మరల ఇంకొక జన్మను ఎత్తవలసినదేనా?**

**జవాబు:** లేదు. సమస్త మానవాళిని అల్టిమేట్ వద్దకు ఇప్పుడే, ఈ జన్మలోనే, తీసుకొని పోవాలనే సంకల్పంతో బాబూజీ వచ్చారు. ఎవరికైతే సహజమార్గ సిస్టమ్ మీద పూర్తి విశ్వాసం ఉందో, "బాబూజీ! నేను మీ వాణ్ని" అని ఎవరైతే బాబూజీ మీదనే ఆధారపడి జీవిస్తున్నారో, వాళ్ళకు పునర్జన్మ అనేది లేదు.

**ప్రశ్న: "నీ బాహ్య ప్రవర్తన, నడవడికను నీ ఆంతరిక స్థితికి అనుగుణంగా మార్చుకోవడం అనేది నీ బాధ్యత. ఆధ్యాత్మికంగా మీకు పురోగతిని ఇవ్వడం అనేది నా బాధ్యత" అని బాబూజీ అన్నారు కదా! కాని చాలామంది అభ్యాసులు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ వాళ్ళ బాహ్య ప్రవర్తన సరిగ్గా లేదు....ఏం చేయాలి?**

**జవాబు:** వాళ్ళు ఉన్నత స్థితిలో ఉన్నారని మీరు అనుకోవడం తప్పు. ఒకసారి బాబూజీ, "నేను అభ్యాసీని సెంట్రల్ రీజియన్‌కైనా తీసుకొని వెళ్ళతాను కాని అక్కడ స్థిరపడటం అనేది అభ్యాసీ వంతు" అని అన్నారు. బాబూజీ అభ్యాసీని సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళతారు. కాని అభ్యాసీ ఆ వాతావరణానికి అనుగుణంగా తనను తాను మార్చుకోవాలి. అభ్యాసీ సత్ప్రవర్తన, శీలం ఆ స్థాయికి తగినట్లుగా లేకపోతే అతడు పూర్వపు స్థితిలో ఇక్కడే ఉంటాడు. బాబూజీ కృపవలన మీకు ప్రసాదించబడిన ఆ సెంట్రల్ రీజియన్ స్థితి మీ కొరకు రిజర్వు చేయబడి ఉంటుంది. కాని ఆ స్థితికి అనుగుణంగా మీ జీవన విధానంలో మార్పులేదు. కాబట్టి, దాని కొరకు మరల జన్మించవలసే వస్తుంది.

సెంట్రల్ రీజియన్ స్థితికి అనుగుణంగా నిన్ను నీవు మార్చుకోలేకపోతే ఆ ఆనందాన్ని, బాబూజీ కృపను నీవు అనుభూతి చెందలేవు. అందువలన నీవు తప్పనిసరిగా ఆ స్థితికి తగిన విధంగా మార్పు చెందాలి. నీవు బాబూజీతో కనెక్షన్ పెట్టుకుంటే, ఆ డివైన్ పవర్ (దైవశక్తి)యే, నిన్ను ఆ సెంట్రల్ రీజియన్ స్థితికి అనుగుణంగా మార్చుతుంది.

"ధ్యానంలో ఏదైనా అనుభూతి కలిగితే, రోజంతా కూడా అదే స్థితిలో, ఆ ఫీలింగ్‌లోనే మునిగిపోయి ఉండడానికి మీరు ప్రయత్నించాలి. అందువలన మీ సిస్టమ్ అంతా కూడా ఆ స్థితికి అనుగుణంగా తయారు చేయబడుతుంది" అని బాబూజీ చెప్పారు. ఆ స్థితిలో నివసించడం అంటే ఇదే. అభ్యాసీ ఈ విధంగా ఆ స్థితిలో జీవించకపోతే, అతడు దాని కొరకు మరల జన్మించవలసి వస్తుంది.

బాబూజీ ఒక సీనియర్ ప్రిసెప్టర్‌ను సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళిన తరువాత, అతడు “బాబూజీ! ఇప్పుడు నేను స్వతంత్రుణ్ణి కదా!” అని అన్నాడు. అప్పుడు వారు “నీవు తెలివితక్కువ వాడివి. నేను నిన్ను అక్కడికి చేర్చాను. కాని నీ జీవన విధానం ఆ స్థితికి తగిన విధంగా మార్పు చెందకపోతే, నీవు అక్కడ నివసించలేవు. ఇక్కడే, పూర్వపు స్థితిలో ఉంటావు. దాని కొరకు నీవు మరల జన్మించవలసే ఉంటుంది” అని అన్నారు.

ఒక అభ్యాసీ అనారోగ్యంతో ఉంటే, బాబూజీ అతన్ని మంచం మీద పడుకునే ధ్యానం చేసుకోమని చెప్పారు. అప్పుడు చాలా ఆరోగ్యంగా ఉన్న ఒక అభ్యాసీ, “బాబూజీ! ఇది చాలా బాగుంది. నేను కూడా మంచం మీదనే పడుకుని ధ్యానం చేస్తాను” అని అనగానే, వారు “అవును; నీవు మంచం మీదనే పడుకొని భోజనం కూడ చెయ్యి. అన్ని పనులు నీవు కూర్చొని చేస్తావు. కాని అత్యున్నతమైన ఆ భగవంతుని పూజను మాత్రం పడుకొని చేస్తావా?” అని అన్నారు. మానవుడు చాలా విపరీతమైన తెలివిగలవాడు. ఏ పనీ చెయ్యాలని అనుకోడు. సోమరిగా ఉండాలని కోరుకుంటాడు.

సాయంత్రం సత్సంగ్ తరువాత క్లీనింగ్ చేసుకోవలసిన అవసరం లేదు. సత్సంగ్‌లో కలిగిన ఆ ఫీలింగ్‌లోనే మునిగిపోవడానికి ప్రయత్నించండి.

**ప్రశ్న: “భగవంతుడు Yes (ఉన్నది) మరియు No (లేదు) మధ్యన ఉన్నాడు” అని బాబూజీ అన్నారు కదా! దాని అర్థం ఏమిటి?**

**జవాబు:** భగవంతుడు సర్వవ్యాపి అని చెబుతారు. మీరు ఎలర్ట్ (సావధానం)గా ఉంటే భగవంతుని యొక్క ప్రజెన్స్ ఉన్నది (Yes) అని ఫీల్ అవుతారు. కాని మీరు ఈ ప్రాపంచికమైన పనులలో మునిగిపోతే, అప్పుడు భగవంతుని ప్రజెన్స్ లేదు (No). మన సహజమార్గ్ సాధన “భగవంతుడు నా హృదయంలో ఉన్నాడు” అనే దానితోనే ప్రారంభమవుతుంది. ఈ సాధన ఫలితం: గాడ్ – ఉన్నాడు (Yes), నీవు – లేవు (No).

మెడిటేషన్‌లో కుర్చొన్నప్పుడు బాబూజీ మహరాజ్ మీ ఎదురుగానే కుర్చొని మీకు ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నారని భావించాలి. మొత్తం సిస్టమ్ అంతా కూడా డివైన్ ట్రాన్స్‌మిషన్‌లో మునిగిపోయినదని అనుకోవాలి. “ఎప్పుడు నేను బాబూజీని చూస్తానా” అనే తపనతో, ఆ ప్రాణాహుతి శక్తిలో మునిగిపోవాలి. “నీవు గంగా నదిలో మునిగితే, కేవలం నీ శరీరం మాత్రమే తాజాగా ఉంటుంది. కాని నీవు డివైన్ ట్రాన్స్‌మిషన్‌లో మునిగిపోతే, నీలోని సెల్ఫ్ (నేను) అనేది మరియు నీ మొత్తం సిస్టమ్ అంతా కూడా ఆ దివ్యత్వంలో మునిగి శుద్ధి అవుతుంది” అని బాబూజీ చెప్పారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ ఎదుట హృదయాన్ని తెరచి ఉంచడం అంటే ఎలా?**

**జవాబు:** “ఓపెన్ యువర్ సెల్ఫ్” అంటే ఆత్మ నివేదన స్థితి. “బాబూజీ! నేను మీ వాణ్ణి” అనే ఫీలింగ్‌లో మునిగిపోయి పూర్తిగా ‘వారి’ మీదనే ఆధారపడి, మీ హృదయం ‘వారి’ చరణాల వద్ద ఉండడం. అప్పుడు మీరు ఎలర్ట్ (సావధానం)గా ఉంటే మీ హృదయం “ఇదే కాదు, మొత్తం హార్ట్ రీజియన్, మొత్తం ఈ విశ్వం అంతా కూడా మీ హృదయమే” అనే ఫీలింగ్ కలుగుతుంది.

ఒకసారి బాబూజీ, "బిటియా! ఈ సమయం చాలా విలువైనది, ఖరీదైనది. అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. అందరికీ జీతాలు కూడా పెరిగాయి. కాని నా జీతం మాత్రం పెరగలేదు. అభ్యాసీలు నా జీతాన్ని పెంచాలని నేను ఆశిస్తున్నాను. అది ఎలా అంటే మీరు రిమెంబరెన్స్ (స్మరణ)ను ఇంకా ఎక్కువ చేయాలి. నేను కోరేది అది ఒక్కటే" అని అన్నారు. నిరంతర స్మరణ ప్రేమతో చేయాలి.

**సబ్‌మిషన్:** అంటే ఆత్మ నివేదన. "బాబూజీ! నేను మీ వాణ్ణి" అనే అనుభూతితో మీ హృదయం మునిగిపోవడమే.

**సరెండర్:** అంటే ఆత్మ సమర్పణ (శరణాగతి). మీ సబ్‌మిషన్ (ఆత్మ నివేదన)ను బాబూజీ స్వీకరించటం వలన సరెండర్ (ఆత్మ సమర్పణ) మొదలవుతుంది. "బాబూజీ! నేను మీ వాణ్ణి" అని అనగానే, మీరు బాబూజీ ఒడిలో ఉన్నట్లుగా ఫీల్ కావడం.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! కంప్లీట్ సరెండర్ (సంపూర్ణ శరణాగతి) అంటే ఏమిటి?" అని అడిగాడు. దానికి బాబూజీ, "ఒక శవంలాగా జీవించడం. శవాన్ని అటు తిప్పినా, ఇటు తిప్పినా, దానికి ఎటువంటి అలంకారం చేసినా ఏమీ తెలియదు కదా!" అని అన్నారు.

**ప్రశ్న: 'ప్రేమ' యొక్క నిర్వచనం ఏమిటి?**

**జవాబు:** ప్రేమకు నిర్వచనం లేదు. ప్రేమను నిర్వచింపలేము. మీరు ప్రేమ యొక్క అనుభూతిని పొందవచ్చు. ప్రేమ మరియు సబ్‌మిషన్ (ఆత్మ నివేదన)ను ఎలా పెంపొందించుకోవాలి? ఆధ్యాత్మికతలో మీరు దేనిని కూడా అభివృద్ధి చేయలేరు. ఎందుకంటే ప్రేమ, సబ్‌మిషన్, క్రేవింగ్ (తపన) –ఇవి అన్నీ కూడా మీలోపలనే ఉన్నాయి. "బాబూజీ! నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌తో, మీరు బాబూజీతో అనుబంధాన్ని (ఎటాచ్‌మెంట్) అంటే కనెక్షన్‌ను ఏర్పరచుకుంటే, అప్పుడు అప్రయత్నంగానే ప్రేమ, సబ్‌మిషన్, క్రేవింగ్ అన్నీ మీకు ప్రత్యక్షమవుతాయి. భౌతికమైన వాటిని, కనపడేవాటిని తయారు చేయవచ్చు, అభివృద్ధి చేయవచ్చు. కాని ఆధ్యాత్మికతకు సంబంధించినవి అన్నీ కూడా మీలో మీలోపలే ఉన్నాయి.

**ప్రశ్న: మన మిషన్ ఎంబ్లమ్ (బ్యాడ్జీ)లో ఉన్న "ఓం తత్ సత్" అంటే ఏమిటి?**

**జవాబు:** 'ఓం' అనేది శక్తి. కాని ఇది సంపూర్ణ శక్తి కాదు. ప్రకృతిని నడిపించడానికి ఈ శక్తి మైండ్ రీజియన్ నుండి వస్తుంది. 'ఓం' ను తప్పుగా ఉచ్చరించినట్లయితే కొన్ని శారీరకమైన ఇబ్బందులు, మెదడు, నేత్రాలలో కొన్ని సమస్యలు వస్తాయి. అందువలన గైడ్ (మార్గదర్శి) సహాయం లేకుండా 'ఓం'ను ఎప్పుడు జపించరాదు. 'తత్ సత్' అంటే అందరూ డివైన్ (దైవం)తో కనెక్ట్ చేయబడ్డారని అర్థం.

**ప్రశ్న: స్వామి వివేకానంద, బాబూజీ మహరాజ్ వంటి గొప్ప ఆత్మలు భారతదేశంలోనే జన్మిస్తారు? ఎందుకని వేరే దేశాలలో జన్మించరు?**

**జవాబు:** ఇక్కడి వాతావరణంలోను, నేలలోను అటువంటి దివ్యాత్మలను ఆకర్షించే ఒక దివ్యాకర్షణ ఉంది. ఎక్కడైతే దైవ భక్తులు ఎక్కువగా ఉంటారో అక్కడే మహాత్ములు జన్మిస్తారు. ఈ భారతదేశంలో ఎంతోమంది సాధు

సంత్‌లు ఉన్నప్పటికీ, ఇక్కడ బాబూజీ మహరాజ్ యొక్క దివ్యాకర్షణ ఉంది కాబట్టి మీరు డెన్మార్క్ నుండి ఇక్కడకు వచ్చారు.

షాజహాన్‌పూర్‌ని విడదీసి చూస్తే ఇలా ఉంటుంది:

**షాజహాన్‌పూర్ = షాహ్ + జహా + పూర్**

**షాహ్ – మహారాజు; జహా – విశ్వం; పూర్ – నివసించే ప్రదేశం**

**షాహజహాన్‌పూర్ అంటే ఈ విశ్వానికే మహారాజు అయినటువంటి బాబూజీ నివసించే ప్రదేశం. షాజహాన్‌పూర్ అంటే ఈ చిన్న పట్టణమే కాదు; మొత్తం ప్రపంచం అంతా షాజహాన్‌పూరే! ఎందుకంటే, శ్రీ బాబూజీ మహరాజ్ ఈ విశ్వం అంతటా వ్యాపించి ఉన్నారు.**

మన లాలాజీ సాహెబ్ భూమా (అల్టిమేట్) నుండి బాబూజీ మహరాజ్ అనే దివ్య రత్నాన్ని తీసుకొని వచ్చారు. ఎప్పుడైతే నిన్ను నీవు మరచిపోతావో, నిన్ను నీవు కోల్పోతావో అప్పుడే ఆ డివైన్ పర్సనాలిటీని పొందగలవు అని లాలాజీ సాహెబ్ మనకు చెబుతున్నారు.

ఒకసారి మేము అందరం బాబూజీ మహరాజ్ ఎదుట నిశ్శబ్దంగా కూర్చొని ఉన్నాము. 'వారు' అకస్మాత్తుగా తమ ఎదురుగా కూర్చొని ఉన్న అభ్యాసీతో, "నీవు ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని అన్నారు. "లేదు; నేను ఎక్కడికి వెళ్ళడం లేదు. ఇక్కడే ఉన్నాను" అని అతడు బాబూజీతో అనగానే వారు "నీ శరీరం ఇక్కడ కూర్చొని ఉన్నది. కాని నీ మనస్సు ఇక్కడ లేదు. ఎక్కడో వేరేచోట ఉన్నది" అని అన్నారు.

సోదరి బర్తేహగార్ద్ దేశానికి చెందిన ప్రిసెప్టర్. ప్రిసెప్టర్‌గా ఆమె చేసిన కృషికి బాబూజీ ఆనందపడి, ఆమెకే కాకుండా మొత్తం డెన్మార్క్ దేశానికే బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు) ఇస్తూ, డెన్మార్క్ 'ఆధ్యాత్మిక నిలయం' అని ఆశీర్వదించారు. ప్రిసెప్టర్ అంటే గాడిదలాగా బరువును మోయవలసి వస్తుందని బాబూజీ నవ్వుతూ అనేవారు. కాని ప్రిసెప్టర్ బాబూజీతో నిజమైన కనెక్షన్ పెట్టుకొని బాబూజీలో మునిగిపోయి పనిచేస్తే ఆ భారం ఉండదు. అతడు చేయవలసిన పని సులభం అవుతుంది.

నేను ఈశ్వరీయ దేశంలో ప్రవేశించినపుడు కలిగిన అనుభూతిని "బాబూజీ! ఈశ్వరీయ దేశంలోకి నేను వెళ్ళలేదు. కాని ఎవరో అక్కడ నిలబడి, తన చేతితో నా చేయి పట్టుకొని, నన్ను భగవంతుని వద్దకు తీసుకొని వెళ్ళారు" అని వ్రాశాను. అప్పుడు బాబూజీ "అవును, నిజమే; స్వయంగా భగవంతుడే నీ వద్దకు వచ్చి, నిన్ను తనతోపాటుగా తీసుకొని వెళ్ళాడు" అని వ్రాసారు.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! నాకు భగవంతుని దగ్గరకు వెళ్ళడానికి దారి తెలియదు" అని అనగానే వారు "అలా అనడం సరియైనది కాదు. సహజమార్గ్ పద్ధతియే ఆ దారి; సహజమార్గ్ నిన్ను మొదట గాడ్ (భగవంతుని) వద్దకు, ఆ తరువాత అల్టిమేట్ (భూమా) వద్దకు తీసుకొని వెళ్ళుతుంది" అని అన్నారు.

సహజమార్గాన్ని అనుసరించడం అంటే ప్రతిరోజు ఒక గంట సమయం ధ్యానం చేయటం, క్లీనింగ్ మరియు ప్రార్థన మొదలైనవి సాధన చేయటం. కాని బాబూజీ మహరాజ్‌ను అనుసరించటం అంటే 'వారు' ఎంత మృదువుగా, ప్రేమతో మాట్లాడుతారో, ప్రాపంచికమైన పనులలో 'వారి' ప్రవర్తన ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో, అందరినీ ఎంత ప్రేమతో చూస్తారో అలా మీరు కూడా 'వారి' బాహ్య ప్రవర్తనను చూసి అదే విధంగా మీ జీవితంలో ఆచరించినట్లయితే, మీ జీవన విధానం, సెయింట్ జీవితంలాగా మారుతుంది. "నేను ఏ ఒక్కరి కొరకు రాలేదు. అందరి కొరకు వచ్చాను" అని బాబూజీ అనేవారు. 'వారు' అందరినీ ఎంత గాఢంగా ప్రేమించేవారో అనేది గుర్తుపెట్టుకొని దానిని మీరు ఆచరించాలి. మీ ప్రవర్తన, నడవడికను చూసి, "ఇతడు సహజమార్గ్ విధానం ఆచరిస్తున్నాడు. ఇతని మాస్టర్ డివైన్ (దైవం)" అని ఇతరులు తెలుసుకోవాలి.

**ప్రశ్న: డివోటీ (భక్తుడు) అంటే ఎవరు? డివోషన్ (భక్తి) అంటే ఏమిటి?**

**జవాబు:** బాబూజీ నిన్ను భక్తునిగా స్వీకరించినప్పుడు, నీలోని సెల్ఫ్ (నేను) అనేది 'వారి' డివైన్ గ్రేస్ (దివ్య కృప)లో మునిగిపోతుంది. నీలోని సెల్ఫ్ (నేను) అనే దానిని 'వారి' పాదాలకు సమర్పించినపుడు, ఆ శరణాగతి స్థితిలో, నీలోపల, బయట కూడా నీకు కేవలం 'వారు' ఒక్కరే కనిపిస్తారు. నీ దృష్టిలో 'మాస్టర్' మరియు 'నీవు' (అభ్యాసీ) ఇద్దరు ఉంటే అది భక్తుని యొక్క స్థితి కాదు. "నీవు లేవు, కేవలం బాబూజీయే ఉంటారు" –అది భక్తుని యొక్క స్థితి. డివోషన్ (భక్తి) అంటే ఆ దివ్యత్వమనే సముద్రంలో మునిగిపోవడం, మరల ఎప్పుడు బయటకు రాకుండ ఉండడం.

**ప్రశ్న: బెహెన్‌జీ! "నీవు 7 రోజులు నిరంతర స్మరణ చేస్తే, 8వ రోజున అది నిన్ను విడిచిపెట్టదు" అని బాబూజీ అన్నారు. ఎలా?**

**జవాబు:** మీ కుమారుడ్ని మీరు ఎలా గుర్తుపెట్టుకుంటారు. "బాబూజీ మా వారు" అని మీ హృదయం అంగీకరించినపుడు ఆ ఆంతరికమైన కనెక్షన్ అనేది ఏర్పడుతుంది. బాబూజీని ప్రేమించడానికి ప్రయత్నించండి. 7 రోజులు మీరు నిరంతర స్మరణను ప్రేమతో చేస్తే 8వ రోజు నుండి బాబూజీయే మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు. ఒక పాటలో నేను ఈ విధంగా వ్రాశాను: "బాబూజీని మరచిపోవాలని అనుకున్నా గాని మరచిపోలేకపోతున్నాను. మరచిపోవాలని ప్రయత్నించినాగాని, మరచిపోవాలి అనే ఆలోచననే మరచిపోతున్నాను" అని వ్రాసాను. దీని అర్థం ఏమిటంటే, బాబూజీయే నన్ను స్మరిస్తున్నారు అని. 'వారు' మనలను స్మరించినప్పుడు, మనం 'వారి'ని మరచిపోలేము.

శారీరక లోపంగలవారు అంటే వికలాంగులు ఎవరైనా మిషన్‌లో చేరాలని అనుకుంటే, స్వయంగా ప్రిసెప్టర్ వాళ్ళ ఇంటికి వెళ్ళి సిట్టింగ్స్ ఇస్తాడు. వాళ్ళు ఇంటి వద్దనే పూజలో కూర్చోవచ్చు.

**ప్రశ్న: నేను ధ్యానంలో కూర్చున్నప్పుడు బాబూజీకి సరెండర్ (సమర్పితం) అయిపోయాను అని మనస్సులో మరల మరల అనుకుంటాను. కాని ఇది హృదయంలో అనుభూతికి రావడం లేదు.**

**జవాబు:** మీరు మనస్సులో మరల మరల అనుకుంటున్నారు కాబట్టి ఆ ఫీలింగ్ రాదు. "బాబూజీ నా వారు" అని మీరు ఒకసారి మనస్సులో అనుకోగానే మీ దృష్టి హృదయంవైపు మరలాలి. అప్పుడు "బాబూజీ నా వారు" అనే

ఫీలింగ్ మీ హృదయంలో కలగాలి. "బాబూజీ నా వారు, బాబూజీ నా వారు" అని మరల మరల మనస్సులో అనుకోవడం కాదు. "బాబూజీ నా వారు" అని ఒక్కసారి అనుకోగానే హృదయం ఆ అనుభూతిలో మునిగిపోవాలి. సాధన అంటే ఇదే. ఎవరైనా రామ, రామ అని రామజపం చేస్తే, ఏం ప్రయోజనం? రామునికి ఎప్పుడు కూడా నీ పిలుపు వినపడదు. ఎందుకంటే రామునికి తన పేరు రాముడు అని తెలియదు. నీవు హృదయంతో పిలిస్తే, ఆ ఫీలింగ్ రామునికి తెలుస్తుంది. భక్త మీరాబాయి ఎప్పుడూ కూడా "ఓ కృష్ణా! కృష్ణా!" అని కృష్ణ జపం చేయలేదు. "కృష్ణుడు నా వాడు" అనే ఫీలింగ్‌లో మునిగిపోయింది. దాని ఫలితంగా ఆమె తనను తాను మరచిపోయి, భక్తి పారవశ్యంలో మునిగిపోయి, కృష్ణుని సాక్షాత్కారాన్ని పొందింది.

**ప్రశ్న: బాబూజీ భౌతికంగా ఉన్నప్పుడు, 'వారి' సన్నిధిలో ఉన్నవారు చాలా అదృష్టవంతులు. ఎందుకంటే, 'వారు' బాబూజీని స్వయంగా చూసి, 'వారి' దైవీయ గుణాలను నేర్చుకున్నారు. 'వారి'ని చూడలేకపోయిన ఇప్పటి అభ్యాసులు ఆ ప్రేమ, భక్తిని ఎలా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** బాబూజీ ఇప్పుడు లేరు అనే ఆలోచన మీ మనస్సులో ఉంటే, మీరు ఎప్పుడూ కూడా 'వారి'తో కనెక్షన్ ఏర్పరచుకోలేరు. బాబూజీ ఇంతకుపూర్వం ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు, ఎల్లప్పుడు ఉంటారు. 'వారు' శాశ్వతం. "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు; బాబూజీ నా వారు. బాబూజీ నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌తో 'వారి'తో కనెక్షన్ ఏర్పరచుకోండి.

**ప్రశ్న: ఏ కారణం లేకుండానే నేను చావు గురించి భయపడుతున్నాను. ఆ ఫీలింగ్ మరల మరల వస్తూ ఉన్నది.**

**జవాబు:** ఇది కేవలం పిరికితనం మాత్రమే. మీరు ఈ శరీరాన్ని చూసి భయపడుతున్నారు. ఈ శరీరాన్నే మీరు 'నేను' అని అనుకుంటున్నారు. జీవించేది ఈ శరీరం కాదు. శరీరం అనే కవరింగ్‌తో ఉన్న ఆత్మ జీవిస్తూన్నది. అందుకనే బాబూజీ "మొదట మీరు ఆత్మ సాక్షాత్కారాన్ని (సెల్ఫ్ రియలైజేషన్) పొందాలి" అని చెప్పారు. 'ఆత్మ' అనేది భగవంతునిలోనే నివసిస్తుంది. అందువల్లనే బాబూజీ "డివైన్ (దైవం) మీలోనే ఉంది" అని అన్నారు. కాబట్టి మీరు "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు, బాబూజీ నా వారు" అనే ఫీలింగ్‌తో బాబూజీలో జీవించండి. ఈ భౌతిక శరీరం మీద మీకు దృష్టి ఎందుకు? బాబూజీతో కనెక్షన్ ఏర్పరచుకోండి.

సిట్టింగ్‌కు వెళ్ళాలంటే చాలా దూరం వెళ్ళాలి. సమయం కూడా దొరకడం లేదు. ఎలా? అని ఒక డెన్మార్క్ సోదరి అడిగింది. దానికి జవాబుగా నేను ఇలా చెప్పాను: అవకాశం దొరికితే సిట్టింగ్‌కు వెళ్ళండి. సమయం దొరక్కపోతే సిట్టింగ్‌కు వెళ్ళవలసిన అవసరం లేదు. 'నేను మీ వాణ్ని' అని బాబూజీ మనతో అన్నారు. కాబట్టి బాబూజీ ఎల్లప్పుడూ మీతోనే ఉంటారు. 'బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు' అనేది ఎల్లవేళలా గుర్తుపెట్టుకుంటే, 24 గంటలూ బాబూజీ మీ స్వంతం. మేము సాధన ప్రారంభించినప్పుడు స్త్రీలు ప్రతి ఆదివారం తప్పకుండా సత్సంగ్, సిట్టింగ్‌కు వెళ్ళాలని బాబూజీ ఎప్పుడూ చెప్పలేదు. నెలకు ఒక్కసారి మాత్రం మేము ప్రిసెప్టర్ వద్దకు సిట్టింగ్‌కు వెళ్ళేవాళ్ళము. వీలయితే ప్రిసెప్టర్ దగ్గరకు వెళ్ళి సిట్టింగ్ తీసుకోండి. వీలుకాకపోతే విచారపడవలసిన అవసరం లేదు. 'బాబూజీ నేను మీ వాణ్ణి' అనే ఫీలింగ్‌తో, 'వారి'తో కలిసి సంతోషంతో జీవించండి.

**ప్రశ్న: బాబూజీ రూపంమీద ధ్యానం చేయవచ్చునా. నేను క్రొత్తగా మిషన్‌లో చేరిన అభ్యాసీని.**

**జవాబు:** ప్రజలు రాముడు, కృష్ణుని పటం, ఫోటోను దృష్టిలో ఉంచుకొని ధ్యానం చేస్తారు. పటం అనేది పటమే కాని అది నిజమైన రూపం కాదు; రాముడు కృష్ణుడిని స్వయంగా ఎవరూ చూడలేదు. ఎవరో ఊహించి గీచిన చిత్రం అది. అందువలన ఫోటో (అనగా రూపం) కన్నా, ప్రజెన్స్ (ప్రత్యక్షత) మీద ధ్యానం చేయడం అన్నిటికంటే మంచిది. భగవంతుడు సర్వవ్యాపి అనే దాన్ని మీరు ఒప్పుకుంటారు కదా! అదే విధంగా బాబూజీ మహరాజ్ కూడా అంతటా వ్యాపించి ఉన్నారు. బాబూజీ యొక్క ప్రజెన్స్ (ప్రత్యక్షత) మీద ధ్యానం చేయాలి. “బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు. ‘వారు’ నా ఎదుటనే ఉన్నారు. ‘వారే’ నాకు ప్రాణాహుతి శక్తిని ఇస్తున్నారు” అని భావించాలి. మీరు బాబూజీ మహరాజ్‌ను చూడలేదు కదా! నేను కూడా చూడలేదు. అవును; చూసాను. కాని ‘వారి’ శరీరాన్ని మాత్రమే చూసాను. దర్శనం అంటే ఏమిటి? ఆ శరీరం లోపల ఎటువంటి డివైన్ పర్సనాలిటీ ఉన్నారు – అనే ఆ డివైన్ ప్రజెన్స్ మీద మీరు ధ్యానం చేయాలి.

ఒకసారి ఉన్నట్లుండి నా నాలుక మీద నుండి ఒక పొర ఊడిపోయినట్లుగా అనిపించింది. అప్పటి నుండి నేను ఏది పలికినా అది నాకు ‘ట్రూత్’ (సత్యం) అని అనిపించేది. ఒకవేళ నేను కావాలని అసత్యం మాట్లాడినా అది కూడా సత్యమే అనే ఫీలింగ్ కలిగేది. దీనిని గురించి బాబూజీకి వ్రాసినప్పుడు వారు, “బిటియా! నీలో ఇప్పుడు ట్రూత్ (సత్యం) యొక్క స్థితి ఏర్పడినది. ఈ సత్య స్థితి (ట్రూత్ స్థితి) అనేది రియాలిటీ (వాస్తవికత)తో కనెక్షన్ కలిగి ఉన్నది. అందువలన నీవు ఏది మాట్లాడినా, అసత్యం పలికినా, అది నీకు సత్యం (ట్రూత్) అనే అనిపిస్తున్నది. నీలో ఆ రియాలిటీ (అసలీయత్) యొక్క స్థితి వికసించినది” అని వ్రాసారు.

ఒకసారి బాబూజీ చాలా అందోళనతో ఉన్నారు. అప్పుడు డా॥ కె. సి. వరదాచారిగారు “బాబూజీ! మీరు ఎందుకు అలా ఉన్నారు” అని అడిగారు. అప్పుడు బాబూజీ “డాక్టర్! నేను కస్తూరీ గురించి చాలా ఆందోళనతో ఉన్నాను. ఎందుకంటే, బ్రహ్మరంధ్రం అనేది ఆత్మ యొక్క ప్రవేశ ద్వారం మరియు వెలుపలికి పోయే ద్వారం కూడ. ఎవరైనా బ్రహ్మరంధ్రం బిందువు వద్దకు చేరుకోగానే, అతని ఆత్మ వెంటనే శరీరాన్ని విడిచిపెట్టి, దైవంలో కలిసిపోతుంది. నేను ఈ రోజు రాత్రి నిద్రపోతే, ఒకవేళ కస్తూరి ఒక్కసారిగా ఈ బిందువు (బ్రహ్మరంధ్రం) వద్దకు చేరుకున్నట్లయితే, ఆమె మరణించే ప్రమాదం ఉంది. అందువలన ఈ రోజు రాత్రి అంతా కూడా నేను మేల్కొనే ఉంటాను” అని అన్నారు.

బాబూజీ, డాక్టర్ వరదాచారిగారు సంభాషించుకుంటున్నప్పుడు నేను వేరే గదిలో ఉన్నాను. మరునాడు తెల్లవారకముందే బాబూజీ నా గదిలోనికి వచ్చి, “బిటియా! ఎలా ఉన్నావు, ఏమీ ఇబ్బంది లేదు కదా!” అని అడిగారు. “బాబూజీ! నేను బాగానే ఉన్నాను” అని అన్నాను. అప్పుడు బాబూజీ “రాత్రి నీకు ఏమైనా అనిపించినదా?” అని అడిగారు.

“బాబూజీ! రాత్రి నిద్రలో ఒక స్వప్నం చూసాను. నేను మీ ఎదుట కూర్చొని ఉన్నాను. ఇంతలో అకస్మాత్తుగా మీరు నన్ను మీ హృదయంలోకి తీసుకొని, ఒక్కసారిగా జంప్ చేసారు; ఏదో ఒక బిందువును

దాటించి మరొక ప్రదేశంలో మీ సంకల్ప శక్తితో నన్ను అక్కడ స్థిరంగా ఉంచారు" అని అన్నాను. అప్పుడు బాబూజీ "బిటియా! నేను చాలా సంతోషంగా ఉన్నాను. రాత్రి నీమీద ఒక ప్రత్యేకమైన పని చేశాను. లాలాజీ సాహెబ్‌కు నా కృతజ్ఞతలు. నీ అనుభవం చాలా కరెక్ట్. నీవు బ్రహ్మరంధ్రం బిందువును దాటావు" అని అన్నారు. మరల డాక్టర్ వరదాచారి గారితో మాట్లాడుతూ "స్వామి వివేకానందజీ ధ్యానం చేస్తున్నప్పుడు, ఈ బిందువు (బ్రహ్మరంధ్రం)ను చేరుకోగానే ఒక్కసారిగా అతని ఆత్మ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయింది. అందువలన అతడు మరణించాడు. బ్రహ్మరంధ్రమును దాటలేకపోవడం వలన అతడు 35 సంllలకే తక్కువ వయస్సులోనే మరణించాడు" అని బాబూజీ అన్నారు.

బాబూజీ మనలను ఎంతగా, ఎలా ప్రేమిస్తారు అని చెప్పడానికే నేను మీకు ఈ సంఘటన చెప్పాను. బాబూజీ మహరాజ్ స్మరణలో మీరు (అభ్యాసులు) నిద్రపోకుండా ఎన్ని రాత్రులు ఉన్నారో చెప్పగలరా? దీనికి మీరు జవాబు ఇవ్వలేరు. మన శ్రేయస్సు కొరకు ఎన్నో రాత్రులు 'వారు' నిద్రపోకుండా మన మీద పని చేసేవారు. కాబట్టి మీరు కూడా ఇది పగలు, ఇది రాత్రి అని మరచిపోయి, 24 గంటలూ 'వారి' స్మరణలో మునిగిపోవాలి. ఈ నేచర్ (ప్రకృతి) అనేది భగవంతుని మీద ఆధారపడి ఉన్నది. అదే విధంగా మీ నేచర్ (ప్రవర్తన, ప్రవృత్తి) కూడా భగవంతుని మీదనే ఆధారపడే విధంగా ఉండాలి.

ఒకసారి నేను "బాబూజీ! నాలో కోపం లేదు, సంతోషం లేదు, దుఃఖం లేదు, ఏదీ లేదు. ఎప్పుడైనా కోపం యొక్క అవసరం ఉంటే, అది నాలో ప్రవేశిస్తుంది. పిల్లవానిని మందలిస్తుంది. దాని పని కాగానే అది అదృశ్యమైపోతుంది. ఎప్పుడు ఏది అవసరమో అప్పుడు అది నాలో ప్రవేశించి, దాని పని పూర్తికాగానే, మరల అది మాయమైపోతుంది" అని వ్రాశాను. ఇప్పుడు నా నేచర్ (స్వభావం) యొక్క కమాండర్ బాబూజీ అని అర్థం. ఇప్పుడు నేను బాబూజీ మహరాజ్ యొక్క కంట్రోల్‌లో ఉన్నాను అని అర్థం. ఎవరైతే బాబూజీ మీదనే పూర్తిగా ఆధారపడి జీవిస్తారో, ఎవరికైతే బాబూజీయే కమాండర్‌గా, కంట్రోలర్‌గా ఉంటారో, అటువంటి అభ్యాసీకి దశాదేశాల గురించి ఏ అవసరం లేదు. అప్పుడు నీవు మంచిని గురించి ఆలోచించలేవు. చెడును గురించి కూడా ఆలోచించలేవు. నీకుగా ఏదీ ఆలోచించలేవు. కాని అన్ని పనులను, 'వారి' ఇష్ట ప్రకారం, అప్రయత్నంగానే చేస్తావు. ఇదే సహజమార్గ్ సిస్టమ్‌లోని దైవీయ సౌందర్యం అని చెప్పవచ్చు. మనం ఈ స్థితిని పొందిన తరువాతనే, బాబూజీ చెప్పిన ఈ వాక్యం ఎంత సత్యమైనదో అని, మనకు తెలుస్తుంది. "నేను నా లాలాజీ సాహెబ్ చేతిలో కీలుబొమ్మను" అని బాబూజీ అనేవారు. అదే విధంగా ఒకసారి లాలాజీ సాహెబ్ "నేను నీ చేతిలో కీలుబొమ్మను" అని బాబూజీతో అన్నారు. ఇది వారిద్దరి మధ్యనగల దివ్య ప్రేమను తెలుపుతుంది.

బాబూజీ ఆరు రోజుల దివ్య శిశువుగా ఉన్నప్పుడే లాలాజీ సాహెబ్ వారిలో మెర్జ్ (విలీనం) అయ్యారు. అందువలన శిశువుగా ఉన్నప్పటి నుండి కూడా బాబూజీ ఎప్పుడు తనను చూసుకొన్నా వారికి లాలాజీయే కనబడేవారు. అందుచేత బాబూజీకి తన గురించి తనకు ఎలా తెలుస్తుంది? ఆ దివ్య శిశువు (బాబూజీ) భూమా (అల్టిమేట్) నుండి అవతరించాడని లాలాజీకి తెలుసు. దివ్య శిశువు శరీరాన్ని రక్షించుటకొరకై, వెంటనే లాలాజీ

సాహెబ్ బాబూజీలో మెర్జ్ (విలీనం) అయ్యారు. ఆ క్షణం నుండి లాలాజీ సాహెబ్ ఎప్పుడు తనను చూసుకొన్నా వారికి బాబూజీయే కనబడేవారు. అందువలన లాలాజీ మరియు బాబూజీ, ఇద్దరు కూడా ఒక్కటే.

**క్లీనింగ్:** బాబూజీ మహరాజ్ నా ఎదరుగా కూర్చొని ఉన్నారు. 'వారి' డివైన్ పవర్ (దివ్య శక్తి) వలన, నాలోని అనవసరమైనవి అన్నీ బయటకు విసిరివేయబడుతున్నాయి అని భావించాలి. క్లీనింగ్ 10 ని॥ల కంటే ఎక్కువ అవసరం లేదు. క్లీనింగ్ చేస్తూన్నప్పుడు మధ్యలో మెడిటేషన్ (ధ్యానం) చేయాలి అనే ఫీలింగ్ కలిగితే, క్లీనింగ్ ఆపివేసి, ధ్యానంలో కూర్చోండి.

ఒకసారి నేను, "బాబూజీ! మీరు ఎప్పుడు కూడా నాకు ఇండివిద్యువల్ సిట్టింగ్ ఇవ్వలేదు" అని అన్నాను. 'వారు' ఏమి జవాబు చెప్పలేదు. నిశ్శబ్దంగా ఉన్నారు. ఇంతలో ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు ఒక ఇండివిద్యువల్ సిట్టింగ్ కావాలి" అని అడిగాడు. అప్పుడు వారు "భాయీ! నీ ఇండివిద్యువాలిటీ (వ్యక్తిత్వం)ని పోగొట్టుకోవడానికే నీవు ఈ శ్రీరామచంద్ర మిషన్‌లో చేరావు. ఇప్పుడేమో ఇండివిద్యువల్ సిట్టింగ్ కావాలని అడుగుతున్నావు" అని అన్నారు. **"ఎక్కువ సిట్టింగ్స్ తీసుకోవాలి అనే గ్రీడినెస్ (అత్యాశ) అభ్యాసీలో ఉండకూడదు" అని 'వారు' అనేవారు.** ఒకసారి ఒక ప్రిసెప్టర్ "నేను ఈ రోజు 19 సిట్టింగ్‌లు ఇచ్చాను. మీరు ఎన్ని సిట్టింగ్‌లు ఇచ్చారు" అని నన్ను అడిగాడు.

"నేను ఎప్పుడూ సిట్టింగ్ ఇవ్వలేదు. ఎప్పుడూ కూడా సిట్టింగ్ ఇవ్వను. నాకు ఎప్పుడు కూడా బాబూజీ నుండే సిట్టింగ్ వస్తుంది. నేను అభ్యాసులతో పూజ కొరకు కూర్చొన్నప్పుడు, బాబూజీయే ఈ పని అంతా చేస్తున్నారు అని అనుకుంటాను. కాబట్టి నేను సిట్టింగ్ ఇవ్వడం లేదు. బాబూజీయే సిట్టింగ్ ఇస్తున్నారు" అని అతనితో అన్నాను.

**ప్రశ్న: అభ్యాసీ మన సంస్థలో చేరేముందు ప్రిసెప్టర్ 3 సిట్టింగ్స్ ఇస్తారు. దీనికి వివరణ ఏమిటి? డివైన్ (దైవం) నీలో ఉంది అని అంటారు. కాని ఎంత ప్రయత్నించిన అది అనుభూతిలోకి రాలేదు. సిట్టింగ్ యొక్క అర్థం ఏమిటి?**

**జవాబు: "సిట్టింగ్" అంటే "సిట్-ఇన్-గాడ్" అనగా భగవంతుని ఒడిలో కూర్చోవడం.** ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇచ్చే సమయంలో ప్రార్థన ద్వారా డివైన్ (దైవం) మీ హృదయంలోని ఉన్నది అనే అనుభూతి కలిగే విధంగా చేస్తాడు. దాని కొరకే 1, 2, 3 సిట్టింగ్‌లు ఇస్తారు. 'డివైన్ నీలోనే ఉన్నది" అనేది మీరు ఫీల్ కావడానికే ఈ మూడు సిట్టింగ్స్. సిట్-ఇన్-గాడ్ అనగా భగవంతుని ఒడిలో కూర్చోవడమే పూజ.

ఒక్కొక్కసారి ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తాయి. చాలా డిస్టర్బ్‌గా ఉంటుంది; ఆలోచనలు చాలా వచ్చినప్పుడు వెంటనే కొన్ని సెకండ్లు కండ్లు తెరచి, ఎదురుగా కుర్చొని ఉన్న బాబూజీ మహరాజ్‌ను ఎంతో ప్రేమతో చూసి, మరల ధ్యానంలో కూర్చొవాలి. అపుడు ఆలోచనలు తగ్గిపోతాయి. బాబూజీ మహరాజ్ అంటే థాట్‌లెస్ పర్సనాలిటీ (ఆలోచనరహిత వ్యక్తిత్వం). అందువలన బాబూజీని చూడగానే మన ఆలోచనలు కూడ మాయమవుతాయి. కరెంట్ పోతే, ఫ్యూజ్ పోయిందా, ఏమిటి అని కంగారుపడతాము. కాని మన హృదయంలో

ఉండవలసిన డివైన్ కనెక్షన్ గురించి బాధపడ్డంలేదు. "బాబూజీ! మీరు నా హృదయంలోనే ఉన్నారు. బాబాజీ! నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌లో మునిగి ఉంటే 'వారి'తో కనెక్షన్ ఏర్పరచుకోవచ్చు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు అభ్యాసులకు డివైన్ (దైవం)ను గుర్తుపెట్టుకోండి, మిమ్మల్ని మీరు మరచిపోండి అని చెప్తుతారు కదా! ఈ పని కూడా మీరే చేస్తే బాగుంటుంది కదా! మీరే మమ్మల్ని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తే, మమ్మల్ని మేము త్వరగా మరచిపోతాం కదా!" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "భాయీ! దైవం నాలోనే ఉంది అని నీవు నిరంతరం గుర్తుపెట్టుకోవడం వలన నీలో స్థూలత్వం అనేది కరిగిపోవడం మొదలవుతుంది. డివైన్ (దైవం)లో స్థూలత్వం అనేది లేదు. అందువలన డివైన్ అనేది స్థూలత్వంతో కలవదు. కాబట్టి నీవే డివైన్‌ను గుర్తు పెట్టుకోవడానికి ప్రయత్నించాలి. నీవు స్మరణను మనస్సుతో కాకుండా, హృదయంతో చేసినట్లయితే, ఆ స్మరణ యొక్క వైబ్రేషన్స్ (ప్రకంపనలు) లేదా జర్క్ (కుదుపు) అనేది నన్ను స్పర్శిస్తుంది. అప్పుడు నేను నిన్ను గుర్తుపెట్టుకుంటాను" అని అన్నారు.

"ఆధ్యాత్మికంగా అనుభవాలు అనేవి అందరికి వస్తాయి" అని బాబూజీ చెప్పేవారు. కాని ధ్యానంలో మీ దృష్టి ఎక్కువగా ఆలోచనలవైపే ఉండడంవలన ఆలోచనలు వస్తున్నాయి అని అంటారు. ఆలోచనలు వచ్చినప్పుడు, నేను బాబూజీ మహరాజ్ యొక్క డివైన్ ట్రాన్స్‌మిషన్‌లో మునిగిపోయాను, అని అనుకొని ప్రాణాహుతి యొక్క ప్రవాహాన్ని ఫీల్ కావడానికి ప్రయత్నించాలి. ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయని తెలిసినపుడు దివ్యత్వం యొక్క అనుభూతి మీకు ఎందుకు తెలియదు!

ఉదయం ధ్యానం అయిన తర్వాత, మీరు మీ ఇంటి పనులు, ఆఫీస్ పనులు చేయవలసి ఉంటుంది. మెడిటేషన్ అయిన తర్వాత, ధ్యానం అయిపోయినది అని అనుకోకుండా, ధ్యానంలో పొందిన తేలికదనం లేదా అనుభూతిలోనే అనగా, ధ్యానంలో కలిగిన స్థితిలోనే నిరంతరం నివసించడానికి ప్రయత్నించాలి. ధ్యానంలో ఏ అనుభవం కలగకపోతే, బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ అయి, అనగా "బాబూజీ! మీరు నా హృదయంలోనే ఉన్నారు. బాబూజీ! నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌తో మీ ఇంటి పని, ఆఫీస్ పని చేసుకోండి. ఈ విధంగా చేయడంవలన సెన్సిటివిటీ (సూక్ష్మగ్రాహ్యత) పెరుగుతుంది. ధ్యానంలోకి లోతుగా వెళ్ళడంవలన ఈ సెన్సిటివిటీ పెరుగుతుంది. నిరంతర స్మరణలో మునిగిపోయి ఉంటే పవిత్రత అనేది ఏర్పడుతుంది.

## సహజమార్గ దర్పణంలో దివ్య-దేశ దర్శనం

**1. మైండ్ రీజియన్ –** దీని ముఖ్యకేంద్రం అయిన హిరణ్యగర్భ నుండియే సృష్టి ఏర్పడింది. (సృష్టి జరగాలి అనే సంకల్పం 'భూమా'లో ఏర్పడింది.)

**2. పరమాత్మ తత్వ్ –** ఆత్మ అనేది పరమాత్మ తత్వ్‌లో లయమైన తరువాతనే అభ్యాసీ గాడ్లీ రీజియన్‌లో ప్రవేశించగలడు.

**3. గాడ్లీ రీజియన్ –**దీని ముఖ్య కేంద్రం అయిన గాడ్ (భగవంతుని) యందు బాబూజీ అభ్యాసీని ఒక మునక వేయించి, పైకి విసిరి సత్యపద్‌వద్ద స్థిరంగా ఉంచుతారు. ఇక్కడితో అహం యొక్క 16 వలయాలు కరిగిపోయి కేవలం ఐడెంటిటీ మాత్రమే మిగిలి ఉంటుంది.

**4. సత్యపద్ –** సెంట్రల్ రీజియన్ యొక్క ప్రవేశ ద్వారం; పార్షద్ స్థితి, తురీయ స్థితి.

**5. సెంట్రల్ రీజియన్ –** బాబూజీ అభ్యాసీ యొక్క ఐడెంటిటీని తమ 'సంకల్పం' అనే నావలో ఉంచి, ఇక్కడ స్విమ్మింగ్ చేయిస్తారు. నెగేషన్ లేదా నథింగ్‌నెస్ అనే స్థితి.

**6. మహాపార్షద్ –** 'భూమా' 7 వలయాల యొక్క ప్రవేశ ద్వారం వద్దగల స్థితి. తురీయాతీత స్థితి.

**7. సెవెన్ రింగ్స్ –** ఐడెంటిటీ కెనాట్ ఐడెంటిఫై (ఐడెంటిటీ కూడా తనను తాను మరచిపోయింది) నెగేషన్ ఫ్రం నెగేషన్ లేదా నథింగ్ అనగా జీరోస్థితి (శూన్యతా స్థితి).

**8. భూమా (అల్టిమేట్) –** డివైన్ పర్సనాలిటీ (బాబూజీ) శాశ్వత స్థానం. పవర్‌లెస్ పవర్ అనగా అల్టిమేట్ (భూమా) యొక్క డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం) యొక్క దివ్య ఆకర్షణతో, జోరోను (అనగా అభ్యాసీని) బాబూజీ సెవెన్ రింగ్స్ నుండి 'భూమా' వద్దకు చేరుస్తారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మమ్మల్ని మేము పూర్తిగా మరచిపోతే, ఈ ప్రపంచంలో మేము ఎలా జీవిస్తాము. ఈ పనులన్ని ఎలా చేసుకోవాలి?" అని అడిగారు. బాబూజీ దానికి మంచి ఉదాహరణ నిచ్చారు. "నీవు నిద్రపోయినప్పుడు, నిన్ను దోమ కుట్టింది. అప్పుడు వెంటనే నీ చేయి అక్కడకి వెళ్ళుతుంది. నిద్రలో ఇది నీకు తెలియదు కదా! అదే విధంగా నీ చేయి లేదా నీ మనస్సు ద్వారా అన్ని పనులు వాటంతట అవే, నీకు తెలియకుండానే సక్రమంగా జరిగిపోతాయి" అని అన్నారు.

సహజమార్గ్ సాధనలో మునిగిపోవడం వలన 'ఐ యామ్' (నేను ఉన్నాను) అనే దానిలో 'యామ్' (ఉన్నాను) అనేది పూర్తిగా బలహీనమై చివరకు 'ఐ' (నేను) అనేది మాత్రమే మిగిలిపోతుంది. 'ఐ' (నేను) అనేది డివైన్ నియర్‌నెస్ (దైవీయ సామీప్యత) అనుభూతి వలన దైవీయ సంతోషాన్ని పొంది, సహజంగానే అభ్యాసీలోని 'ఐ' (నేను) అనేది 'సబ్ మిషన్' (ఆత్మ నివేదన)కు దారి తీస్తుంది. కాని అభ్యాసీ ఎల్లవేళలా "బాబూజీ! నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి.

ఒక అభ్యాసీ, "బాబూజీ! మరణించే సమయంలో భగవంతుడిని గుర్తు పెట్టుకోలేకపోతే, మరల జన్మించాలి కదా!" అని అనగానే, వారు, "భాయీ! మన సహజమార్గ్ సిస్టమ్‌లో పునర్జన్మ అనేది లేదు. మరణించే సమయంలో నీవు గుర్తు చేసుకోకపోయినా, నేను నిన్ను గుర్తు పెట్టుకుంటాను" అని అన్నారు. సమస్త మానవాళిని డివైన్ (దైవం) వద్దకు తీసుకొని వెళ్ళాలి అనేది బాబూజీ యొక్క దివ్య సంకల్పం. "బాబూజీ! నేను మీ వాణ్ణి" అనే ఫీలింగ్‌తో నిన్ను నీవు మరచిపోతే, 'వారు' నిన్ను గుర్తు పెట్టుకుంటారు. మరణం అనేది ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. అది కేవలం భగవంతునికి ఒక్కనికే తెలుసు.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీకి ఉత్తరం వ్రాసాడు. అందులో అతడు తన సమస్యలు, కష్టాలు అన్నింటిని కూడా వ్రాశాడు. ఎవరో ఒక అభ్యాసీ బాబూజీకి ఈ ఉత్తరాన్ని చదివి వినిపించాడు. అప్పుడు అక్కడ ఉన్న అభ్యాసులు కొందరు అంతా విన్న తరువాత, కోపం తెచ్చుకొని "ఇతడు అన్నీ తన ప్రాపంచిక సమస్యలను వ్రాశాడు. తన ప్రతి కష్టాన్ని గురించి వ్రాసి, బాబూజీకి బాధ కలిగిస్తున్నాడు" అని అన్నారు. వెంటనే బాబూజీ వాళ్ళతో, "భాయీ! ఇది చాలా తప్పు. పిల్లవాడు తన కష్టాలను, బాధలను తన తల్లితో చెప్పుకోకపోతే, మరి వాటిని ఎవరు వింటారు?" అని అన్నారు. ఈ మాటలను వినగానే నేను చాలా సంతోషపడ్డాను. "బాబూజీ నా వారు" అని మీరు అనుకొన్నప్పుడు, మీ బాధలను, దుఃఖాలను బాబూజీకి కాక ఇంక ఎవరికి చెప్పుకుంటారు! "బాబూజీ! నా సమస్య ఇది; దీనివలన బాధపడుతున్నాను. మీ సహాయం కావాలి" అని మీ సమస్యను 'వారి' చరణాలకు సమర్పించండి.

"నిజమైన భక్తుడు (డివోటీ) అంటే నాకు చాలా ఇష్టం. అతనికి నా వద్ద ఉన్నదంతా ఇచ్చి వేస్తాను" అని బాబూజీ అనేవారు. అందువలన బాబూజీ కోరిన విధంగా మీరందరు కూడా నిజమైన భక్తునిగా తయారు కావడానికి కృషి చేయాలి. ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయని మీరు అంటున్నారంటే, అక్కడ బాబూజీ లేరు, ఆ ఆలోచనలకే స్థానం ఉందని, అర్థం. "బాబూజీ! మీరు నా వారు" అనే ఫీలింగ్‌తో, హృదయంలో పూర్తి ప్రేమతో, ఆత్మ నివేదనతో 'వారి'లో మునిగిపోవడానికి ప్రయత్నించాలి.

**ప్రశ్న: అభ్యాసీ మరియు డివోటీ (భక్తుడు), వీరిద్దరి మధ్యగల తేడా ఏమిటి? మనం నిజమైన భక్తునిగా మారడానికి అభ్యాసం (సాధన) చేస్తున్నాము. అభ్యాసం అంటే ఏమిటి?**

**జవాబు:** "బాబూజీ! నేను మీ వాణ్ని" అనే ఫీలింగ్‌తో 'వారి'తో కనెక్షన్ ఏర్పరచుకోవడమే మీరు చేసే అభ్యాసం. బాబూజీతో కనెక్షన్ ఏర్పడినప్పుడే మీరు నిజమైన భక్తునిగా తయారవుతారు. ఎవరైతే ఒక్క క్షణం కూడా డివైన్ (బాబూజీ)ను మరచిపోకుండా, 'వారి' స్మరణలో మునిగిపోయి ఉంటారో, అతడే నిజమైన డివోటీ (భక్తుడు).

ధ్యానంలో కూర్చొని ప్రార్థన చేసినప్పుడు, కొన్నిసార్లు ప్రార్థన పూర్తి చేయకముందే, ప్రాణాహుతి రావడం మొదలవుతుంది.

ధ్యానం చేయడానికి ముందు మన మిషన్ ప్రార్థన చేయవలసిన అవసరం లేదు అని బాబూజీ చెప్పారు. మిషన్ ప్రార్థనను (ఓ ప్రభూ! నీవే మానవ జీవితానికి నిజమైన లక్ష్యం........) రాత్రి పడుకునే ముందు చేయాలి. దశాదేశాలలోని 2వ ఆదేశంలో ప్రార్థనను ప్రేమ, భక్తితో హృదయపూర్వకంగా చేయాలని ఉంది. "బాబూజీ! నేను ఎలా ఉన్నాకాని మీ వాడిని, మీరు నా వారు, మీ ఇష్ట ప్రకారమే నన్ను తయారు చేయండి" అని మీరు ఈ ప్రార్థనను చేసి, ధ్యానం చేయండి. దీనినే బాబూజీ 2వ ఆదేశంలో చెప్పారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీ దృష్టి (అటెన్షన్) పూర్తిగా బాబూజీ స్మరణలో మునిగిపోయి ఉండాలి. ఈ ఉద్దేశ్యం కొరకే ధ్యానం చేయాలి అని చెప్పబడింది. ధ్యానం అంటే మీ అటెన్షన్ (ఆంతరిక దృష్టి) అనేది బాబూజీ మహరాజ్‌తో కనెక్ట్ కావాలి.

ధ్యానం యొక్క ఉద్దేశ్యం నెరవేరిన తరువాత, మీరు ధ్యానంలో కూర్చోలేరు. ఎందుకంటే బాబూజీ మీలోనే ఉన్నట్లుగా మీరు ఎల్లవేళలా ఫీల్ అవుతారు.

**ప్రశ్న: సాయంత్రం సత్సంగ్ తరువాత క్లీనింగ్ చేసుకోవడం అవసరమా?**

**జవాబు:** అవసరం లేదు. క్లీనింగ్‌వైపు ఎక్కువగా మీ దృష్టిని పెట్టకండి. మీరు "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు. బాబూజీ నా వారు" అనే ఫీలింగ్‌తో నిరంతర స్మరణలో ఉంటే చెడు అనేది మీలో ఉండడానికి అవకాశం లేదు. నిరంతర స్మరణ అనేది చాలా ముఖ్యమైనది. "బాబూజీ! నేను మీ వాణ్ని" అని మీరు నిరంతర స్మరణలో మునిగి ఉంటే, ఆధ్యాత్మికతలో మీకు కావలసినవవి అన్నీ లభిస్తాయి. ధ్యానంలో కూడా క్లీనింగ్ జరుగుతుంది. సాయంత్రం క్లీనింగ్ తరువాత దాని ఫలితం అనేది ముఖ్యం. నేను ఇప్పుడు క్లీన్ అయ్యాను. నా హృదయం పవిత్రంగా ఉంది. నా బాబూజీ మహరాజ్‌ను నేను ఇప్పుడు నాలో చూస్తాను –అనే ఫీలింగ్ కావాలి.

ఎవరైతే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారో, వారి దృష్టి స్వతహాగానే బాబూజీ మీద నుండి తొలగిపోతుంది. అంటే బాబూజీ మీద నుండి మీ దృష్టి మరలిపోయి మీరు ఇతర విషయాలను గురించి మాట్లాడుతూ ఉంటారు. కాని ఎవ్వరైతే నిశ్శబ్దంగా ఉంటారో, వాళ్ళ దృష్టి బాబూజీ మీదనే నిలిచి ఉండి, వాళ్ళకు ట్రాన్స్‌మిషన్ (ఈశ్వరీయ ధార) లభిస్తూ ఉంటుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! సెయింట్ (యోగి) అంటే ఎవరు?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! ఎవరైతే నిన్ను ఒక్కసారి చూడగానే, నీ ఆధ్యాత్మిక పురోగతికి ఆటంకముగా ఉన్నటువంటి బలహీనతలను, ప్రతిబంధకాలను కనిపెట్టగలరో, వారే సెయింట్ (యోగి)" అని అన్నారు.

ఎవరైనా అభ్యాసీ నా ముందు నుండి వెళ్ళితే చాలు, ఆ అభ్యాసీ యొక్క ఆంతరిక స్థితి నాకు ఎక్స్-రే ఫిల్మ్‌లాగా కనబడుతుంది. అప్పుడు బాబూజీ నాకు ఏమి చేయమని చెప్పుతే దాని ప్రకారం ఆ అభ్యాసీ మీద పని చేస్తాను.

అన్ని ఆధ్యాత్మిక రోగాలకు, అన్ని సమస్యలకు కూడా ఒక్కటే మందు. అది ఏమిటంటే, "బాబూజీ! మీరు నా వారు. నేను మీ వాణ్ణి" అనే ఒక బలమైన సంకల్పాన్ని ఏర్పరచుకోవడమే.

నేను ఈ లోకం నుండి వెళ్ళిపోయిన తర్వాత, నా శరీరాన్ని దహనం చేసిన స్థలంలో ఒక చెట్టు పెరుగుతుంది. ఆ చెట్టు యొక్క ప్రతి ఆకు నుండి కూడా బాబూజీ! బాబూజీ! అనే తియ్యని పిలుపు వినబడుతుంది. ఆ చెట్టు యొక్క ఫలాన్ని (పండును) తిన్నవారి హృదయం బాబూజీపట్ల ప్రేమ, భక్తితో నిండిపోతుంది.

# లయావస్థ

లయావస్థలో మనం నాలుగు దశలు పొందగలుగుతాము. అయిదవది మాత్రం బాబూజీ సంకల్పానుసారంగా ఉంటుంది.

**1.** నీవు బాబూజీలో కలిసిపోయి మళ్ళీ బయటకు రానప్పుడు లయావస్థ ప్రారంభమవుతుంది. నీవు నిశితంగా చూసినట్లయితే, నీవు బాబూజీ నోటితోనే మాట్లాడుతున్నట్లుగా గ్రహిస్తావు.

**2.** నీ భౌతిక శరీరాన్ని గురించిన మరపుస్థితి అనుభవానికి వచ్చినప్పుడు, నీ వంక నీవు చూస్తున్నప్పటికీ నిన్ను నీవు దర్శించలేవు. నీ శరీరాన్ని స్పృశించలేవు. నీ శరీరాన్ని స్పర్శించినా కూడా స్పర్శించేది, దర్శించేది కూడా బాబూజీ శరీరాన్నే అవుతుంది. బాబూజీని నీవు చూడగలుగుతావు.

**3.** నీవు బాబూజీలో ఉన్నట్లుగా గాని, బాబూజీ నీలో ఉన్నట్లుగా గాని అనిపించదు. రెండూ కనుమరుగై (అంతర్ధానమై) పోతాయి. అయితే ఇరువురూ ఉన్న అనుభూతి మాత్రం ఉంటుంది.

**4.** బాబూజీ చెప్పిన దానినిబట్టి, మనం లక్ష్యాన్ని చేరటానికి పురోగమిస్తున్నప్పుడు, బాబూజీ ఉన్నారన్న అనుభూతి, మనం ఉన్న అనుభూతి రెండూ కూడా మన మనఃస్థితిలో ఒకదాని ప్రక్కన ఒకటి అంటే జంటగా నడుస్తూ ఉంటాయి. ఏదో ఒక రోజున ఇద్దరూ మమేకమైపోవడం జరుగుతుంది. అలా ఇద్దరూ ఏకమైపోయినప్పుడు మాత్రమే నీవు పూర్తిగా మునిగిపోయి మరణించటం లేదా అంతమైపోవడం జరుగుతుంది. అప్పుడింక అభ్యాసీని బాబూజీ తమ ఒడిలోకి చేర్చుకునే పని ప్రారంభమవుతుంది. ఈ దశలోనే ఆధ్యాత్మికత ముగిసి వాస్తవికత ప్రారంభమవుతున్నట్లుగా నీవు భావించుకోవచ్చు. ఇంక అప్పటి నుంచి నీవు బాబూజీ ఒడిలో ఉండి వారిలోనే (మునిగిపోయి) ఒదిగిపోయి ఉంటావు. నీవు క్రిందకు చూసినట్లయితే, బాబూజీ సర్వత్రా ఉన్నట్లు తెలుసుకుంటావు.

ఈ స్థితిని పొందేసరికి నీలో పెంపొందించుకున్న భక్తి, ప్రేమ, ధ్యానం అన్నీ కూడా నిన్ను విడిచిపెట్టి పోతాయి. అప్పుడు వీటిని నీవు అభ్యాసీ కొరకు ఉపయోగించగలవు. ఎందుకంటే, నీవు వాటి మీద ఆధిపత్యం పొందావు, ఈ స్థితిలో దైవాన్ని కూడా అధిగమించిపోయావు, కనుక వాటిని అభ్యాసులకు ప్రసారం చేయగలవు. అయితే బాబూజీ సంకల్పం (లేదా ఆదేశం) లేకుండా ప్రకృతి నియమం అటువంటి ప్రయోగం చేపట్టకుండా వారిస్తుంది. నీవు నీ స్థితిలో మునిగి ఉండి సిట్టింగ్ ఇస్తూ ఉన్నట్లయితే ఆ స్థితి యొక్క సౌరభం ప్రసారమవుతుంది. ఆ విధంగా లయ అవస్థ పొందినమీదట నీ కారణ శరీరం కరిగిపోయినట్లుగా చెప్పవచ్చు. అప్పుడు నీవు భూమిని తాకడం లేదన్నట్లుగా అనుభూతి చెందుతావు. లక్ష్యాన్ని సాధించాలనే తపన కూడా నీలో ఇప్పుడు ఉండదు.

**5.** 'వారు' ఆధ్యాత్మిక మరణాన్ని కల్పించిన తరువాత, వాస్తవికత (రియాలిటీ) పరిసమాప్తమైన మీదట, 'నీవు' అనే భావంగాని మరణానుభూతిగాని మిగలవు. (ఈ విధంగా అభ్యాసీ మునిగిపోయి మరణించినప్పుడు, ఆ స్థితి

నుంచి కాపాడటానికి బాబూజీ, రక్షణ నిమిత్తం, రావడం మూలంగా శరీరంతో ఉన్న అభ్యాసీ లేస్తాడు.) అప్పుడు నీవు ప్రకృతి సిద్ధంగా ఉన్న ప్రాణ వాయువుతో జీవిస్తున్నట్లు కాకుండా బాబూజీ యొక్క శ్వాసతో జీవిస్తున్నట్లుగా అనుభూతి చెందుతావు. నిన్ను అంతిమం చేర్చటానికి బాబూజీ యొక్క సంకల్పం అది. వలయాలు శక్తికి నిలయాలుగా నిలిస్తే, లయావస్థ అనేది 'స్వ' అనగా 'తాను' అంతర్లీనమైపోయి, సృష్టి రచన చేసే శక్తి యొక్క స్థాయిని కూడా దాటిపోవటాన్ని తెలియజేస్తుంది. ఇది లయావస్థ.

oooOooo

గత జన్మల సంస్కారాలను అనుభవించడానికే ఈ భూ ప్రపంచంలో జన్మ ఎత్తాం మనం. అందుచేత మనం కుటుంబ విషయాల్లో గాని, సామాజిక విషయాల్లో గాని మన విధిని నిర్వహించాలేగాని, ఆయా పనుల నిర్వహణలో ఏదీ ఆశించ కూడదు; ఏ సంతోషాన్నీ బదులుగా కోరుకోరాదు. ఆనందకరమైన ప్రశాంత జీవనాన్ని గడపడానికి ఇదే; ఇదే మనకు శక్తి నిస్తుంది. అవాంఛితంగా, అసహజంగా మనతో ప్రవర్తిస్తారు ఒకరు; ఎందుకని? దీనిలోని కారణాలను శోధించడానికి మనం ప్రయత్నిస్తూ ఉంటే మానసికంగా మనం బాగా బిగుసుకు పోవడానికే అది హేతువవుతుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి, ఆత్మ వికాసానికి అది పెద్ద అడ్డంకిగా, అవరోధంగా అవుతుంది. అందుచేత బాబూజీ మహరాజ్ బోధనలకు మనం కట్టుబడి, మన ఆరోగ్య సమస్యల్లో లేదా ఇతర సంబంధ బాంధవ్యాల్లోని ఆటంకాలను వేటినీ కూడా మనస్సులోకి పోనివ్వకుండా సంతోషంగానే ఉండాలి. అలాకాక వాటిలో, ఆ సమస్యల్లో కలిసి చిక్కుకుపోతే మన అంతర్ హృదయం ఆశాభంగం చెందడమే కాక ఈ పరమ శాంతిని, ఈ పరమానందాన్ని పొందడానికై ఈ మానవజాతి మళ్ళీ మళ్ళీ నరజన్మను పొందాల్సిందే!

మరచిపోరాని ఈ దివ్య సత్యాన్ని
మన జీవనంలో మరచియే పోతున్నాం.

- కస్తూరీ బెహెన్

